సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 176

మంగళవారం 16-9-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పారిశ్రామిక రంగానికి దీటుగా సేద్యరంగం ఎదగాలి. వ్యవసాయ ఫలాలు పదింతలు పెరగాలి'



వెల్‌డన్ వైశాలి

రెండోసారి గ్రాండ్ స్విస్ టోర్నీ టైటిల్ సొంతం. క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత -14లో



జీడీపీకి ఏఐ దన్ను

2035కల్లా 600 బిలియన్ డాలర్లు జత నీతి ఆయోగ్ నివేదిక వెల్లడి -15లో



దేశ భద్రతలో ఆత్మనిర్భరత

దేశ భద్రతలో మరింత స్వయంసమృద్ధి సాధించాల్సి ఉందని కంబైన్డ్ కమాండర్స్ కాన్ఫరెన్స్‌లో ప్రధాని మోదీ పేర్కొన్నారు.

- వివరాలు 6లో



చట్టవిరుద్ధమని తేలితే పక్కనపడేస్తాం

బిహార్‌లో ఓటర్ల జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ ప్రక్రియ చట్టవిరుద్ధంగా ఉందనిపిస్తే పక్కన పడేస్తామని సుప్రీంకోర్టు చెప్పింది.

- వివరాలు 6లో



ద.కొరియా దెబ్బకు దిగొచ్చిన ట్రంప్

అమెరికాలోని విదేశీ సంస్థలు విదేశీ వృత్తి నిపుణులను వెంట తెచ్చుకొనేందుకు అధ్యక్షుడు ట్రంప్ అంగీకరించారు.

- వివరాలు 6లో



పావు కి.మీ. గ్రహశకలం..

కుతుబ్ మినార్‌కన్నా పెద్దదైన ఓ భారీ గ్రహశకలం ఈ నెల 18న ఉదయం భూమికి అత్యంత సమీపం నుంచి వెళ్లనుంది.

- వివరాలు 6లో

'సాక్షి'పై కక్ష.. పత్రికా స్వేచ్ఛపై దాడే!



- పత్రిక సంపాదకవర్గంపై క్రిమినల్ చట్టాలను అసంబద్ధంగా, ఎంపిక చేసినట్లుగా ప్రయోగించారు
- ప్రెస్‌క్లబ్ ఆఫ్ ఇండియా ఆగ్రహం
- సాధారణ వార్తలు రాసినందుకే వేధింపులా?
- ఏపీ పోలీసుల తీరుపై తీవ్ర ఆందోళన
- ఇతర పత్రికలూ రాశాయి కదా? 'సాక్షి'నే లక్ష్యంగా చేసుకోవడం దారుణం
- సంపాదకీయ వివాదాలు సివిల్ అంశాలు
- క్రిమినల్ కేసులు నమోదు రాజ్యాంగ విరుద్ధం

- వివరాలు 3లో



కాలేజీల యాజమాన్యాలతో సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్ బాబు, సీఎస్ రామకృష్ణారావు



'ఫీజు' చర్చలు సఫలం

ఫీజు బకాయిల్లో రూ.600 కోట్లు వీలైనంత త్వరగా విడుదల చేస్తామన్న ప్రభుత్వం

మిగతా బకాయిలు భవిష్యత్తులో ఇస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి

- అంగీకరించిన కాలేజీల యాజమాన్యాలు..
- సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటన
- గత ప్రభుత్వం బకాయిలు చెల్లించలేదన్న సర్కారు
- రీయింబర్స్‌మెంట్ హేతుబద్ధీకరణకు కమిటీ

సాక్షి, హైదరాబాద్: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలనే డిమాండ్‌తో సమ్మెకు దిగిన ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలతో ప్రభుత్వం జరిపిన చర్చలు ఎట్టకేలకు ఫలప్రదమయ్యాయి. ఇప్పటికే టోకెన్లు విడుదల చేసిన మొత్తంలో రూ.600 కోట్లు వీలైనంత త్వరగా విడుదల చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. మిగిలిన బకాయిలను భవిష్యత్తులో చెల్లిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. కాగా సమ్మె విరమిస్తున్నట్టు ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల ప్రతినిధులు తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని ప్రైవేటు కాలేజీలు దాదాపు ఏడాదిగా ఆందోళన చేస్తున్నాయి. గత ఏడాది పరీక్షలు కూడా బహిష్కరిస్తామని హెచ్చరించాయి. అయితే అప్పట్లో అధికారులు నచ్చజెప్పారు. కానీ బకాయిలు విడుదల కాకపోవడంతో తాజాగా సోమవారం నుంచి అన్ని కాలేజీలను బంద్ చేస్తున్నట్టు యాజమాన్యాలు నోటీసు ఇచ్చాయి. దీంతో ప్రభుత్వం వారిని చర్చలకు ఆహ్వానించింది. ఆదివారం మొదలైన చర్చలు సోమవారం రాత్రి వరకు కొనసాగాయి. తర్జనభర్జనలు, వాదోపవాదాల తర్వాత ఎట్టకేలకు చర్చలు ఫలప్రదంగా ముగిశాయి. అనంతరం మంత్రులు, యాజమాన్య సంఘాల ప్రతినిధులతో కలిసి భట్టి విక్రమార్క విలేకరులతో మాట్లాడారు.

ఇది మాకెంతో ప్రాధాన్యతాంశం: డిప్యూటీ సీఎం

ఫీజు రీయింబర్స్‌మెంట్ కాంగ్రెస్ ప్రభుత్వానికి అత్యధిక ప్రాధాన్యత

మిగతా 3వ పేజీలో ▶

డిగ్రీ, పీజీ కాలేజీల అసంతృప్తి!

చర్చలపై ఇంజనీరింగ్ కాలేజీలు సంతృప్తి వ్యక్తం చేస్తే పీజీ, డిగ్రీ కాలేజీల యాజమాన్య ప్రతినిధులు మాత్రం అసంతృప్తితో ఉన్నట్టు సమాచారం. మీడియా సమావేశానికి కూడా వారు దూరంగా ఉన్నారు. తమ బకాయిల విషయంలో ప్రభుత్వం ఎలాంటి హామీ ఇవ్వలేదని, కాలేజీలు నడపాలా? సమ్మెకు వెళ్లాలా? అనే దానిపై మంగళవారం నిర్ణయం తీసుకుంటామని ఆయా కాలేజీల ప్రతినిధులు తెలిపారు. చర్చల్లో ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డితో పాటు విద్యాశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ నిర్వీర్యానికే..

- రాష్ట్రంలో జాతీయ విద్యావిధానం అమలుపై అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ధ్వజం
- పాఠశాల విద్యాశాఖలో అంగన్‌వాడీ కేంద్రాల విలీన నిర్ణయం ఉపసంహరణకు డిమాండ్
- సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసనలు

5లో



వీధి దీపాలకు సోలార్ పవర్

- సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో వీధి దీపాలు అనుసంధానం చేయాలి
- వీధి దీపాల నిర్వహణ, ఏర్పాటు అధికారం సర్పంచ్‌లకే ఇవ్వాలి
- అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి

12లో



ఆరోగ్యశ్రీ సేవలపై గందరగోళం



- నేటి అర్ధరాత్రి నుంచి సేవలు బంద్ చేస్తామన్న ఆస్పత్రులు
- బకాయిల్లో రూ.100 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- బంద్ కొనసాగింపుపై యాజమాన్యాల్లో భిన్నాభిప్రాయాలు
- సేవలు నిలిపివేస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడి ప్రకటన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ సేవలపై గందరగోళం నెలకొంది. బకాయిలు చెల్లించని కారణంగా మంగళవారం అర్ధరాత్రి నుంచి సేవలను నిలిపివేస్తున్నట్టు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ ప్రకటించింది. అయితే ఈ ప్రకటన వెలువడిన తర్వాత సోమవారం ప్రభుత్వం రూ.100 కోట్లు విడుదల చేయడంతో ఆస్పత్రుల యాజమాన్యాలు పునరాలోచనలో పడినట్లు తెలిసింది. కొన్ని యాజమాన్యాలు బంద్ కొనసాగించాలని భావిస్తుండగా, ప్రభుత్వంతో గొడవ ఎందుకు అనే ధోరణిలో మరికొన్ని యాజమాన్యాలు ఉన్నట్లు సమాచారం. అయితే అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాకేష్ మాత్రం మంగళవారం అర్ధరాత్రి నుంచి సేవలు నిలిపివేస్తామని తెలిపారు.

రూ.100 కోట్లు ఇస్తే ఎలా?: ఆరోగ్య శ్రీ బకాయిలు చెల్లించని ప్రభుత్వ వైఖరికి నిరసనగా సెప్టెంబర్ 1 నుంచి సేవలు నిలిపివేస్తున్నట్టు గత నెల 25న నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ ప్రకటించింది. అయితే ప్రభుత్వంపిలిపించి మాట్లాడడంతో పాటు బకాయిలు చెల్లిస్తామంటూ హామీ ఇవ్వడంతో సేవల నిలిపివేత నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. అయితే నెల మొదటి వారంలో ప్రభుత్వానికి సంబంధించిన ఇతర చెల్లింపుల నేపథ్యంలో ఆరోగ్యశ్రీ బకాయిల విడుదల కుదర్లేదు. దీంతో హాస్పిటల్స్ అసోసియేషన్ తాజాగా మరోసారి అల్టిమేటం ఇచ్చింది. అయితే ప్రభుత్వం రూ.100 కోట్లు విడుదల చేయడంతో ఏం చేయాలనే దానిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నట్టు సమాచారం. రూ.1,400 కోట్ల బకాయిలు ఉంటే రూ.100 కోట్లు ఇస్తే ఎలా అని డాక్టర్ రాకేష్ ప్రశ్నించారు.



150 మీటర్ల ఎత్తులో తుమ్మిడిహెట్టి!

- 2.75 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించే యోచన.. సీఎం ఆదేశాలతో నీటిపారుదల శాఖ కసరత్తు
- మొత్తం 80 టీఎంసీలు తరలించేలా కొత్త డీపీఆర్.. మహారాష్ట్ర సమ్మతి కోసం త్వరలో ఆ రాష్ట్రంతో సంప్రదింపులు

- వివరాలు 5లో

వక్ఫ్ చట్టంలో 'ఐదేళ్ల నిబంధన' కుదరదు

- వక్ఫ్‌కు ఆస్తి ఇవ్వాలంటే ఐదేళ్లు ఇస్లాంను పాటించాలనే నిబంధనపై సుప్రీంకోర్టు స్టే
- ఒక వ్యక్తి ఇస్లాంను అనుసరిస్తున్నట్లు నిర్ణయించేలా నిబంధనలు తయారు చేసే వరకు స్టే వర్తింపు
- వక్ఫ్ సవరణ చట్టం మొత్తాన్నీ నిలుపుదల చేయడం కుదరదన్న కోర్టు
- కొన్ని ప్రొవిజన్లకు రక్షణ ఉండాలని అభిప్రాయపడ్డ ధర్మాసనం
- స్వాగతించిన పలు ముస్లిం సంఘాలు

- వివరాలు 6లో

'వంతారా'కు సుప్రీంకోర్టు క్లీన్ చిట్



వంతారాపై గౌరవనీయ సుప్రీంకోర్టు చదివిన సిట్ నివేదికలోని ముఖ్యాంశాలు :

- ప్రత్యేక దర్యాప్తు బృందం నివేదిక ఆధారంగా వంతారాపై ఉన్న అన్ని ఆరోపణలను సుప్రీంకోర్టు ఈరోజు విచారించి కొట్టివేసింది.
- **సుప్రీంకోర్టు :** "మేము నివేదిక యొక్క సారాంశాన్ని పరిశీలించాము. ఇది నియంత్రణ సమ్మతిలో పాండిత్యాన్ని గమనించింది. వాటాదారులు కూడా అభిప్రాయాలను సమర్పించారని ఇది గమనించింది. నియంత్రణ సమ్మతి మొదలైన వాటిపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. మేము నివేదికను ఆర్డర్‌లో భాగంగా చేస్తాము."
- **సుప్రీంకోర్టు :** "ఇప్పుడు నిపుణుల సహాయం పొందిన స్వతంత్ర కమిటీ నివేదిక మన దగ్గర ఉంది. ఇప్పుడు అందరూ సిఫార్సుల ప్రకారం చర్యలు తీసుకోవడానికి స్వేచ్ఛగా ఉన్నారు. ఇప్పుడు మేము ఎవరినీ పదే పదే ప్రశ్నలు లేవనెత్తడానికి అనుమతించము. మేము 10 ప్రశ్నలు ఇచ్చాము, వాటికి కమిటీ కూడా సమాధానం ఇచ్చింది."
- 'కమిటీ అన్ని సమస్యలను వివరంగా పరిష్కరించింది' అని సుప్రీంకోర్టు కూడా ప్రస్తావించింది.
- వంతారాను ప్రస్తావిస్తూ, సుప్రీంకోర్టు ఇలా వ్యాఖ్యానించింది, "మన దేశానికి గర్వ కారణమైన కొన్ని విషయాలు ఉన్నాయి. మనం ఈ సమస్యలను లేవనెత్తలేము మరియు గందరగోళాన్ని సృష్టించలేము. దేశంలో కూడా కొన్ని మంచి విషయాలు జరగనివ్వండి. ఈ మంచి విషయాలన్నింటికీ మనం సంతోషంగా ఉండాలి."
- సుప్రీంకోర్టు ఇలా వ్యాఖ్యానించింది, "ఏనుగును స్వాధీనం చేసుకోవడం చట్టం ప్రకారం జరిగితే సమస్య ఏమిటి. అన్ని నిబంధనలను అనుసరించి దాన్ని పొందినట్లయితే.. సమస్య ఏమిటి. మీరు ఇలాంటి కొన్ని సాధారణ ప్రకటనలను ఆమోదించలేరు."
- వంతారా (గ్రీన్స్ జూలాజికల్ రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్ - రాధే కృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్ట్) వద్ద చట్టవిరుద్ధాలు మరియు అక్రమాలు జరిగాయని ఆరోపించిన రెండు రిట్ పిటిషన్లు.
- ఇంతకు ముందు (25.08.2025), కోర్టు ఎటువంటి ప్రోబేటివ్ మెటీరియల్‌ను కనుగొనలేదు కానీ, తీవ్రత దృష్ట్యా, నిజనిర్ధారణ విచారణ నిర్వహించడానికి రిటైర్డ్ న్యాయమూర్తులు మరియు సీనియర్ అధికారుల నేతృత్వంలో ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది.



సిట్ దర్యాప్తు

- సిట్ బహుళ భారతీయ మరియు విదేశీ అథారిటీస్‌తో (సీజడ్‌ఏ, సీబీఐ, ఈడీ, డీఆర్‌ఐ, కస్టమ్స్, సీఐటీఈఎస్ సంస్థలు మొదలైనవి) సమన్వయం చేసుకుంది.
- రికార్డులు, అఫిడవిట్లు, సైట్ సందర్శనలు, నిపుణుల అభిప్రాయాలు మరియు వ్యక్తిగత విచారణలను పరిశీలించింది.
- జంతువుల సముపార్జన, అక్రమ రవాణా, లాండరింగ్, సంక్షేమం, పరిరక్షణ, ఆర్థిక అక్రమాలు మరియు పర్యావరణ సమస్యలకు సంబంధించిన ఆరోపణలను దర్యాప్తు చేసింది.

కీలక ఫలితాలు

1. చట్టపరమైన ఉల్లంఘనలు లేవు:

- వన్యప్రాణుల (రక్షణ) చట్టం, 1972, జూ నియమాలు, సీజడ్ఏ మార్గదర్శకాలు, కస్టమ్స్ చట్టం, ఎఫ్ఈఎంఏ, పీఎంఎల్ఏ లేదా సీఐటీఈఎస్ ఉల్లంఘన కనుగొనబడలేదు.
- అన్ని సముపార్జనలు మరియు దిగుమతులు సక్రమంగా అనుమతించబడ్డాయి మరియు డాక్యుమెంట్ చేయబడ్డాయి.

2. జంతు సంక్షేమం – సౌకర్యాలు :

- వంతారా సౌకర్యాలు సంక్షేమం, పశుసంవర్ధకం మరియు పశువైద్య సంరక్షణ యొక్క నిర్దేశించిన ప్రమాణాలను మించిపోయాయి.
- మరణాల రేట్లు ప్రపంచ జంతుశాస్త్ర సగటులతో సమలేఖనం చేయబడ్డాయి.
- "గ్లోబల్ హ్యూమన్ సర్టిఫైడ్™ ఆమోద ముద్ర"తో గ్లోబల్ హ్యూమన్ సొసైటీచే ధృవీకరించబడింది.

3. ఆర్థిక ఆరోపణలు :

- కార్బన్ క్రెడిట్‌లు, నీరు లేదా మనీలాండరింగ్ దుర్వినియోగం యొక్క వాదనలు నిరాధారమైనవిగా గుర్తించబడ్డాయి.
- నిధుల క్రమరహిత ప్రవాహాలు లేదా స్మగ్లింగ్ లింకులు కనుగొనబడలేదు.

4. పునరావృత ఫిర్యాదులు :

- వంతారా పదే పదే ఇలాంటి ఆరోపణలను ఎదుర్కొందని కోర్టు గుర్తించింది, అన్నీ అర్హత లేకుండా కనుగొనబడ్డాయి.
- అటువంటి ఊహాజనిత పిటిషన్లను కొనసాగించడం ప్రక్రియ దుర్వినియోగంగా పేర్కొనబడింది.

కోర్టు ఆదేశాలు

- సిట్ నివేదిక సీలు చేయబడింది; అంతర్గత ఉపయోగం కోసం వంతారాకు పూర్తి కాపీ.
- సిట్ నివేదిక యొక్క సారాంశం గోప్యంగా లేదు మరియు కోర్టు ఆదేశంలో భాగం.
- షెడ్యూల్ ఎ లో పేర్కొన్న అన్ని ఫిర్యాదులు / పిటిషన్లు మూసివేయబడ్డాయి.
- ఇదే ఆరోపణలపై తదుపరి ఫిర్యాదులు ఏ ఫోరమ్‌లోనూ స్వీకరించబడవు.
- వంతారా మరియు అధికారులు సిట్ సూచించిన చర్యలను అమలు చేయాలి.
- వంతారా పరువు నష్టం కలిగించే ప్రచురణలకు వ్యతిరేకంగా పరిష్కారాలను అనుసరించవచ్చు.
- సిట్ సభ్యులు (సేవలో ఉన్న ఐఆర్ఎస్ అధికారి తప్ప) వారి పనికి గౌరవ వేతనం పొందారు.


ముగింపు :

సుప్రీం కోర్టు సిట్ యొక్క ఫలితాలను పూర్తిగా అంగీకరించింది, కేసులను ముగించింది మరియు అదే అంశాలపై పునరావృత వ్యాజ్యాలను నిషేధించింది. ఇది వంతారా యొక్క సంక్షేమ ప్రమాణాలు మరియు పరిరక్షణ ప్రయత్నాలను కూడా ప్రశంసించింది, అదే సమయంలో ఆధారం లేని ఆరోపణలకు వ్యతిరేకంగా హెచ్చరించింది.










గొప్ప ప్రారంభోత్సవం
MEDICOVER
HOSPITALS
SECUNDERABAD
తేది: 16 సెప్టెంబరు 2025
సమయం: సా. 5గం॥లకు
24X7 EMERGENCY
24X7 ఎమర్జెన్సీ
MEDICOVER HOSPITALS
ముఖ్య అతిథి
గౌరవ అతిథులు
గౌ॥ శ్రీ. జి. కిషన్ రెడ్డి గారు
కేంద్ర బొగ్గు & గనుల శాఖామాత్యులు
భారత ప్రభుత్వం
గౌ॥ శ్రీ బండి సంజయ్ కుమార్ గారు
కేంద్ర హోంశాఖ సహాయక మంత్రివర్యులు,
భారత ప్రభుత్వం
గౌ॥ శ్రీ దామోదర రాజనరసింహ గారు
తెలంగాణ రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ,
సైన్స్ & టెక్నాలజీ శాఖామాత్యులు
గౌ॥ శ్రీ పొన్నం ప్రభాకర్ గారు
తెలంగాణ రాష్ట్ర రవాణా &
బి సి సంక్షేమ శాఖామాత్యులు
ప్రత్యేక అతిథులు
గౌ॥ శ్రీమతి గద్వాల్ విజయలక్ష్మి గారు
మేయరు - హైదరాబాద్ మహానగర పాలక సంస్థ,
(జి. హెచ్.ఎం. సి)
గౌ॥ శ్రీ గణేష్ గారు
ఎమ్మెల్యే - సికింద్రాబాద్ కంటోన్మెంట్
గౌ॥ శ్రీ టి పద్మారావు గౌడ్ గారు
ఎమ్మెల్యే - సికింద్రాబాద్
గౌ॥ శ్రీమతి కుర్మా హేమలత గారు
కార్పొరేటర్ -బన్సీలాల్ పేట్
జి హెచ్ ఎం సి - 147 డివిజన్
గౌ॥ శ్రీమతి కొంతం దీపిక గారు
కార్పొరేటర్ - మోండా మార్కెట్
జి హెచ్ ఎం సి - 150 డివిజన్
గౌ॥ శ్రీమతి చీర సుచిత్ర శ్రీకాంత్ గారు
కార్పొరేటర్ - రామ్ గోపాల్ పేట్
జి హెచ్ ఎం సి - 148 డివిజన్
ఆహ్వానించువారు
డా. జి అనిల్ కృష్ణ
చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ - మెడికవర్ హాస్పిటల్స్
డా. ఎ. శరత్ రెడ్డి
ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ - మెడికవర్ హాస్పిటల్స్
మెడికవర్ సికింద్రాబాద్ ప్రత్యేకతలు
50 కి పైగా కన్సల్టేషన్ రూమ్స్
40 మందికి పైగా ఎక్స్‌పర్ట్ డాక్టర్స్
300 బెడ్స్ 150 ఐసియు బెడ్స్
30 కి పైగా స్పెషాల్టీ వైద్యసేవలు
8 ఆపరేషన్ థియేటర్స్
ప్రపంచస్థాయి క్యాత్ ల్యాబ్
బెస్ట్ టెక్నాలజీ MRI & CT స్కాన్
మరెన్నో ప్రత్యేకతలు
మెడికవర్ ఇండియా ప్రత్యేకతలు
23 హాస్పిటల్స్
16 నగరాలు
5500 బెడ్స్
1636+ ఐసియు బెడ్స్
150+ ఆపరేషన్ థియేటర్స్
23+ క్యాత్ ల్యాబ్
1 కోటి మందికి పైగా వైద్యం
1200+ డాక్టర్స్
13000+ ఎంప్లాయిస్
మెడికవర్ ఇండియా హాస్పిటల్స్ నెట్‌వర్క్: తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మహారాష్ట్ర | కర్ణాటక | మరియు యూరప్‌లోని 12 దేశాలలో వైద్యసేవలు



నలుగురిలో ఒకరు ట్యూషన్‌కు!

మార్కుల వేటలో తల్లిదండ్రులు

నగరాల్లోనే ఈ ధోరణి అధికం ● ప్రైవేటు విద్యకే ఎక్కువగా మొగ్గు ● కోచింగ్‌కు రెండింతల వ్యయం

పాఠశాల విద్యార్థుల్లో దాదాపు నలుగురిలో ఒకరు ఇప్పుడు ట్యూషన్లు లేదా ప్రైవేట్ కోచింగ్ మీద ఆధారపడుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఈ ధోరణి మరింత ఎక్కువగా ఉంది. ట్యూషన్ల కోసం ఏటా ప్రతి విద్యార్థిపై చేస్తున్న సగటు వ్యయం గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతాల్లో దాదాపు రెండింతలు అధికంగా ఉండడం గమనార్హం. - సాక్షి, స్పెషల్ డెస్క్

ఒక్కో విద్యార్థికి ఏటా అయ్యే సగటు వ్యయం (రూ.లలో)

ప్రాంతం	కోర్సు ఫీజు	ప్రైవేట్ కోచింగ్	రవాణా	యూనిఫాం	పుస్తకాలు	ఇతర ఖర్చులు
గ్రామీణం	3,989	1,793	1,359	887	1,664	494
పట్టణాలు	15,143	3,988	3,082	1,540	2,867	838
దేశవ్యాప్తంగా	7,111	2,409	1,842	1,070	2,002	590

జాతీయ నమూనా సర్వే (ఎన్‌ఎస్‌ఎస్) 80వ రౌండ్ కింద కేంద్ర ప్రభుత్వం 2025 ఏప్రిల్–జూన్ మధ్య విద్యపై సమగ్ర సర్వే చేపట్టింది. అడ్మిషన్ల విషయంలో గ్రామీణ భారతంలో ప్రభుత్వ పాఠశాలలదే పైచేయిగా ఉందని సర్వే తేల్చింది. పట్టణ ప్రాంత కుటుంబాలు తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్లలో చేర్పించేందుకే మొగ్గు చూపుతున్నాయి అంతేకాదు మార్కుల వేటలో భాగంగా తమ పిల్లలను ట్యూషన్లకూ పంపిస్తున్నాయి.

పట్టణాల్లో ప్రైవేట్ విద్యకు..

గ్రామీణ ప్రాంతాల్లో మూడింట రెండొంతుల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. 33.9% మంది ప్రైవేట్, ఇతర సంస్థలలో చదువుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో కేవలం 30.1% మంది విద్యార్థులు మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారు. దాదాపు 70% మంది ప్రైవేట్ విద్యా సంస్థల్లో చదువుకుంటున్నారు. మొత్తంగా దేశ సగటు చూస్తే.. అడ్మిషన్లలో 55.9% వాటా ప్రభుత్వ పాఠశాలలదేనని సర్వే పేర్కొంది.

ట్యూషన్ల కోసం వ్యయం

ప్రస్తుత విద్యా సంవత్సరంలో దేశంలో 27 శాతం మంది విద్యార్థులు ప్రైవేట్ కోచింగ్ తీసుకుంటున్నారు. ప్రాంతాలవారీగా చూస్తే పట్టణాల్లో 30.7%, గ్రామీణ భారత్‌లో 25.5% మంది ప్రైవేట్ కోచింగ్‌పై ఆధారపడ్డారు. దేశంలో సగటున ఒక్కో విద్యార్థి ట్యూషన్ కోసం రూ.2,409 వెచ్చిస్తున్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో కోచింగ్ కోసం సగటు ఖర్చు రూ.1,793 కాగా, పట్టణాల్లో రూ.3,988 అవుతున్నట్టు అంచనా. ఇంటర్ స్థాయిలో పట్టణ కుటుంబాలు కోచింగ్ కోసం ఒక్కో విద్యార్థికి రూ.9,950 ఖర్చు చేస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఇది రూ.4,548.

పట్టణ ప్రాంతాల్లో అధికం

ప్రభుత్వ పాఠశాలల్లో ఫీజులు ఉండవు. కానీ, ట్యూషన్లు, రవాణా, స్టేషనరీ, ఇతర ఖర్చులు పెరిగాయి. ప్రైవేటులో అయితే వీటికి ఫీజు, యూనిఫాం వంటివి అదనంగా చేరతాయి. దీంతో ప్రతి విద్యార్థికి అవుతున్న వార్షిక వ్యయం రూ.23,470గా సర్వే అంచనా వేసింది. గ్రామీణ ప్రాంతాల్లో ఇది రూ.8,382గా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో అయితే.. పట్టణ ప్రాంత విద్యార్థికి రూ.4,128, గ్రామీణ ప్రాంతాల్లో రూ.2,639 ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వేతర పాఠశాలల విషయంలో ఇది.. పట్టణప్రాంతాల్లో రూ.31,782, గ్రామీణ ప్రాంతాల్లో 19,554గా ఉంది. పట్టణ ప్రాంతాల్లో ఫీజుల కోసం చేస్తున్న సగటు వార్షిక వ్యయం రూ.15,143 కాగా, గ్రామీణ ప్రాంతాల్లో ఇది రూ.3,979.

- ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థుల విషయంలో దేశంలో 37% మంది ప్రైవేట్ కోచింగ్‌కు సై అంటున్నారు. పట్టణాల్లోని ఇంటర్ స్టూడెంట్స్‌లో 44.6 మంది ట్యూషన్లకు వెళ్తున్నారు.
- ప్రైవేట్ ట్యూషన్ కోసం దేశంలో ఇంటర్మీడియెట్ విద్యార్థులు సగటున ఏటా రూ.6,384 ఖర్చు పెడుతున్నారు.
- కోచింగ్ సంస్థలు చెల్లించిన వస్తు, సేవల పన్ను 2019-20లో రూ.2,240 కోట్లు. 2023-24కి వచ్చేసరికి ఇది రూ.5,517 కోట్లకు చేరింది.
- కోచింగ్ కోసం అమ్మాయిల కంటే అబ్బాయిలు కొంచెం ఎక్కువగా ఖర్చు చేస్తున్నారు. సగటున ఏటా అమ్మాయిలు రూ.2,227, అబ్బాయిలు రూ.2,572 వ్యయం చేస్తున్నట్టు సర్వే పేర్కొంది.

మీడియాపై కక్ష సాధింపు

సరైంది కాదు

నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి



నల్లగొండ: ఏపీలో కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే ప్రజల నుంచి తిరస్కరణకు గురికాక తప్పదని నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి అన్నారు. పాలన సక్రమంగా సాగిస్తే నాలుగు కాలాల పాటు నిలబడగలుగుతారని పేర్కొన్నారు. జర్నలిస్టులపై కక్ష సాధింపు చర్యలనేవి సరైనవి కాదన్నారు.

‘సాక్షి’పై కక్ష... పత్రికా స్వేచ్ఛపై దాడే!

PRESS CLUB OF INDIA

పత్రిక సంపాదకవర్గంపై క్రిమినల్ చట్టాలను అసంబద్ధంగా, ఎంపిక చేసినట్లుగా ప్రయోగించారు

ప్రెస్‌క్లబ్ ఆఫ్ ఇండియా ఆగ్రహం

సాక్షి, న్యూఢిల్లీ: ‘సాక్షి’ దినపత్రికపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని, ఈ ధోరణి పత్రికా స్వేచ్ఛపై దాడి అని ప్రెస్‌క్లబ్ ఆఫ్ ఇండియా తీవ్రంగా ఖండించింది. రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్య హక్కును అణచివేయడానికి ఏపీ ప్రభుత్వం క్రిమినల్ చట్టాలను ఆయుధంగా వాడుకుంటోందనేందుకు ఇది ఒక నిలువెత్తు నిదర్శనం అని అభిప్రాయపడింది. అధికారంలో ఉన్నవారికి అసౌకర్యం కలిగించే వార్తలు రాసినందుకు దేశవ్యాప్తంగా జర్నలిస్టులపై ఒకటికి రెండు కేసులు నమోదు చేసే ఆందోళనకర సంస్కృతి కొనసాగుతోందని పేర్కొంది. ‘సాక్షి’ ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, పాత్రికేయులపై కేసుల నమోదు కూడా ఇందులో భాగమేనని వ్యాఖ్యానించింది. ఈ మేరకు ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు గౌతమ్ లహిరి, ప్రధాన కార్యదర్శి నీరజ్ ఠాకూర్ సోమవారం ఢిల్లీలో ప్రకటన విడుదల చేశారు. ‘‘సాధారణ వార్తలు రాసినందుకే ‘సాక్షి’ ఎడిటర్, జర్నలిస్టులపై కేసులు బనాయించి, వ్యవస్థాగతంగా వేధిస్తున్నారు. ఏపీలోని వేర్వేరు జిల్లాల్లో భారతీయ న్యాయ సంహిత కింద నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ప్రతిపక్ష పార్టీ నేత నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్ వార్తను ప్రచురించినందుకే రెండు వేర్వేరు స్టేషన్లలో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. అదే వార్తను ఇతర పత్రికలు, మీడియా సంస్థలు సైతం ఇచ్చాయి. కేవలం ‘సాక్షి’ని మాత్రమే లక్ష్యంగా చేసుకుని వేధించడం కక్షసాధింపు అని స్పష్టంగా కనిపిస్తోంది. ఎఫ్ఐఆర్‌లను పరిశీలించిన తర్వాత, పత్రిక సంపాదకవర్గంపై క్రిమినల్ చట్టాలను అసంబద్ధంగా, ఎంపిక చేసినట్లుగా ప్రయోగించారని అర్థమవుతోంది’’ అని తెలిపారు.

- ప్రభుత్వం నమోదు చేసిన కేసుల్లో ‘సాక్షి’ జర్నలిస్టులకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మధ్యంతర రక్షణ కల్పించడాన్ని గమనించామని పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా వార్తలు రాసిన జర్నలిస్టులను వేధించకుండా... పోలీసులను కట్టడి చేయాలని ఏపీ సీఎం చంద్రబాబుకు ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా విజ్ఞప్తి చేసింది. సంపాదకీయపరమైన వివాదాలను సివిల్ చట్టాల ద్వారా పరిష్కరించుకోవాలి కానీ, క్రిమినల్ చట్టాల ద్వారా కాదని తాము విశ్వసిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ విషయంలో సీఎం చంద్రబాబు తగిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నట్లు ప్రకటనలో పేర్కొంది.

పర్యావరణ మార్పులపై

18, 19న జాతీయ సదస్సు

ఉద్యాన వర్సిటీ వీసీ దండ రాజిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఉద్యానరంగంపై పర్యావరణ మార్పులు, ప్రభావాలు, అనుసరణ, ఉపశమన వ్యూహాలు అనే అంశంపై జాతీయ సదస్సును ఈ నెల 18, 19 తేదీల్లో సిద్దిపేట జిల్లా ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో నిర్వహిస్తున్నట్లు వైస్ చాన్స్‌లర్ దండ రాజిరెడ్డి తెలిపారు. యూనివర్సిటీతో పాటు తెలంగాణ ఉద్యాన శాఖ, బిహార్‌లోని రాజేంద్ర ప్రసాద్ సెంట్రల్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ, నాబార్డ్, భూ శాస్త్రాల మంత్రిత్వ శాఖ సంయుక్తంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సదస్సులో ప్రధానంగా ‘వాతావరణ మార్పు, తీవ్రతలు: ఉద్యాన పంటలు, వాటి పరాగ సంపర్కాలపై ప్రభావాలు, పంట నమూనాతో సహా ప్రభావ అంచనా కోసం పద్ధతులు: బహుళ వాతావరణ ప్రమాదాలను ఎదుర్కోవడానికి రైతులకు సూచనలు’అనే అంశాలపై చర్చలు జరగనున్నట్లు డాక్టర్ రాజిరెడ్డి తెలిపారు.

ఇదండీ సంగతి



‘మీడియా ముందుకు రావొద్దన్నారు మావాళ్లు!

ఆర్టీసీ స్థలాల్లో భారీ వాణిజ్య, నివాస హర్మ్యాలు

- ప్రాజెక్టు నిర్వహణ బాధ్యత నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్‌కు..
- త్వరలో కేంద్రప్రభుత్వ రంగ సంస్థతో ఆర్టీసీ ఒప్పందం... మియాపూర్ బస్‌బాడీ యూనిట్ స్థలంలో తొలి ప్రాజెక్టు



సాక్షి, హైదరాబాద్: సొంత స్థలాల్లో భారీ వాణిజ్య, నివాస సముదాయాల నిర్మాణానికి ఆర్టీసీ కసరత్తు చేస్తోంది. దేశవ్యాప్తంగా పలు భారీ నిర్మాణాలు చేపట్టిన కేంద్రప్రభుత్వ అనుబంధ సంస్థ నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ (ఎన్‌బీసీసీ)కి నిర్మాణ, పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించనుంది. ఇందుకోసం ఆ సంస్థతో సంప్రదింపులు జరుపుతోంది. ఇందులో భాగంగా, ఇటీవల నగరానికి వచ్చిన ఆ సంస్థ ప్రతినిధులు ఆర్టీసీకి సంబంధించిన పలు స్థలాలను పరిశీలించారు. మియాపూర్‌లో ప్రస్తుతం ఉన్న బస్‌బాడీ తయారీ యూనిట్ స్థలాన్ని దాదాపు ఎంపిక చేశారు. ఇందులో ఉన్న బస్‌బాడీ యూనిట్‌ను ఉప్పల్ వర్క్‌షాప్‌నకు తరలించి ఆ స్థలాన్ని ఎన్‌బీసీసీకి అప్పగించనున్నారు. త్వరలో రెండు సంస్థల మధ్య ఒప్పందం కుదరనుంది.

తెలంగాణలో ఇదే తొలిసారి!

ఢిల్లీలో రూ.2700 కోట్ల వ్యయంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన భరతనాట్య మండపం సహా నోయిడా, గుర్గావ్, ఇతర నగరాల్లో భారీ వాణిజ్య, నివాస గృహ సముదాయాలను ఎన్‌బీసీసీ నిర్మించింది. ఇప్పటికీ దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో భారీ ప్రాజెక్టులు చేపట్టి కొనసాగిస్తోంది. తెలంగాణలో మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి ప్రాజెక్టులు చేపట్టలేదు. ఈ నేపథ్యంలో, ఆర్టీసీ తన స్థలాలను వాణిజ్య పరంగా అభివృద్ధి చేసి ఆదాయాన్ని పొందే క్రమంలో.. నమ్మకమైన సంస్థగా ఎన్‌బీసీసీకి బాధ్యత అప్పగించాలని నిర్ణయించింది. ఆర్టీసీ బస్‌భవన్ పక్కనే ఉన్న విశాలమైన స్థలంతోపాటు, మియాపూర్, కూకట్‌పల్లి, రాజేంద్రనగర్ తదితర ప్రాంతాల్లోని కొన్ని స్థలాలను ఎంపిక చేసింది. సమీప భవిష్యత్తులో నగరంలో అన్ని ఎలక్ట్రిక్ బస్సులే తిప్పాలని నిర్ణయించిన నేపథ్యంలో, మియాపూర్‌లోని బస్‌బాడీ యూనిట్ అవసరం అంతగా ఉండదని గుర్తించి దానిని ఉప్పల్‌లోని వర్క్‌షాప్, కరీంనగర్‌లోని వర్క్‌షాపుల్లో విలీనం చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఆయా స్థలాలను పరిశీలించిన ఎన్‌బీసీసీ ప్రతినిధులు, మియాపూర్ బస్‌బాడీ యూనిట్ స్థలాన్ని ఎంపిక చేశారు. ఆర్టీసీ ఎండీ ఆఫీసు పక్కనున్న స్థలం ఉపయుక్తమైనదే అయినప్పటికీ, ఇటీవల దాని ముందునుంచి స్టీల్ బ్రిడ్జి నిర్మించినందున.. వాణిజ్యపరంగా ఆ స్థలాన్ని తీసుకునేందుకు సంస్థలు ముందుకు రావని ఆ సంస్థ నివేదించింది.

మియాపూర్‌లో..

మియాపూర్ బస్‌బాడీ వర్క్‌షాపు ప్రాంగణం 20 ఎకరాల్లో విస్తరించి ఉంది. అందులో రెండు డిపోలున్నందున, వాటి స్థలాన్ని అలాగే ఉంచి.. మిగతా 18 ఎకరాల స్థలాన్ని వాణిజ్య అవసరాలకు వాడాలని తాజాగా నిర్ణయించారు. చర్చల్లో భాగంగా ఎన్‌బీసీసీ ఆ స్థలాన్ని 90 ఏళ్ల లీజుకు అడిగింది. ఆర్టీసీ మాత్రం 40 ఏళ్లకుమించి లీజుకు ఇవ్వబోనని పేర్కొంది. ప్రస్తుతం ఆ విషయంలో చర్చలు కొనసాగుతున్నాయి. ఆ స్థలంలో భారీ ఆకాశహర్మ్యాలను నిర్మిస్తారు. అందులో కొంత భాగాన్ని వాణిజ్య వినియోగానికి వీలుగా నిర్మించి, వాటి పైభాగాన్ని నివాస గృహ సముదాయాలుగా నిర్మిస్తారు. అన్నింటినీ అద్దె ప్రాతిపదికనే కేటాయిస్తారు. ఈ మొత్తం ప్రక్రియ పూర్తి చేసినందుకు ప్రాజెక్టు వ్యయంలో 10 శాతాన్ని కమీషన్‌గా తీసుకుంటుంది. లీజు, అద్దె ఆదాయాన్ని ఆర్టీసీ పొందుతుంది. నెలకు రూ.50 కోట్ల ఆదాయం వచ్చే ప్రణాళికలను ఎన్‌బీసీసీ ప్రతిపాదిస్తున్నట్టు తెలిసింది. ఏకాభిప్రాయం వచ్చాక ఒప్పందం చేసుకుని వెంటనే ప్రాజెక్టును కార్యరూపంలోకి తెచ్చేందుకు ఎన్‌బీసీసీ చర్యలు తీసుకుంటోందని సమాచారం. తొలి దశలో రూ.వేయి కోట్ల వ్యయం కాగల ప్రాజెక్టులను చేపట్టే యోచనలో ఉన్నట్టు సమాచారం.

చిరుత చిక్కింది..



మహబూబ్‌నగర్ న్యూటౌన్: మహబూబ్‌నగర్ పట్టణ ప్రజలను రెండున్నర నెలలపాటు భయభ్రాంతులకు గురిచేసిన చిరుత ఎట్టకేలకు బోనుకు చిక్కింది. సోమవారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో జిల్లా కేంద్రంలోని తిర్మల్‌దేవుని గుట్ట వద్ద ఏర్పాటు చేసిన బోనులో మేకపిల్లను తినేందుకు వచ్చి దొరికిపోయింది. తిర్మల్‌దేవునిగుట్ట, వీరన్నగట్టు, డంపింగ్ యార్డు ప్రాంతాల్లో సంచరిస్తూ మూడు, నాలుగు రోజులకోసారి ఎక్కడో ఒకచోట గుట్టపైన ఉన్న గుండ్లపై తిరుగుతూ కనిపించడంతో దాన్ని పట్టుకునేందుకు అటవీ, పోలీసు, మున్సిపల్ శాఖలు ఎంతో శ్రమించాయి. సోమవారం అటవీ సిబ్బంది బోనులో చిరుతను గమనించారు. చిరుతను హైదరాబాద్‌లోని జూ పార్కుకు తరలించారు. అది ఆడ చిరుత అని, 18 నెలల వయసు ఉండవచ్చని అధికారులు తెలిపారు.

‘ఫీజు’ చర్చలు సఫలం

▶ మొదటి పేజీ తరువాయి

కలిగిన అంశమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. పేద వర్గాల విద్యకు చేయూతనిచ్చే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చిందని, దీన్ని తాము కొనసాగిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం ఈ పథకాన్ని ఛిన్నాభిన్నం చేసిందని, బకాయిలు చెల్లించలేదని విమర్శించారు. వారు వారసత్వంగా ఇచ్చిన బకాయిలు తమకు భారంగా మారాయన్నారు. అయితే విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కాలేజీల యాజమాన్యాలతో సంప్రదింపులు జరిపామని, చర్చలు సానుకూలంగా ముగిసాయని తెలిపారు. ప్రభుత్వానికి సహకరించి సమ్మె విరమించిన ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలకు డిప్యూటీ సీఎం కృతజ్ఞతలు తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను హేతుబద్ధీకరించాలని ప్రభుత్వం భావిస్తోందని, దీన్ని పరిశీలించేందుకు ప్రత్యేకంగా ఓ కమిటీని వేస్తున్నట్టు ప్రకటించారు. ఇప్పటికే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించామని, త్వరలోనే ఆదేశాలు వెలువడతాయని వెల్లడించారు. హేతుబద్ధీకరణలో యాజమాన్యాలు, మేధావుల ఆలోచనలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు.

రెండు రోజుల హైడ్రామా

- ఫీజు బకాయిలపై దారికి తెచ్చేందుకు సర్కార్ యత్నం
- తగ్గేదిలేదన్న ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు... ఎట్టకేలకు రెండోరోజు కుదిరిన ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వాలంటూ ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు చేపట్టిన సమ్మె, కళాశాలల బంద్, ప్రభుత్వం చర్చల నేపథ్యంలో రెండురోజులు పలు నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ప్రభుత్వం చివరి వరకు తన వాదన విన్పించేందుకే ప్రయత్నించింది. కాలేజీ యాజమాన్యాలు సైతం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వాల్సిందేనని పట్టుబట్టాయి. సమ్మె విరమించాలని ప్రభుత్వం పదేపదే కోరింది. యాజమాన్యాలు అంగీకరించేలా అందుబాటులో ఉన్న అన్ని అస్త్రాలు ప్రయోగించేందుకు సిద్ధపడింది. అయితే యాజమాన్యాలు కూడా గట్టి పట్టే పట్టాయి. సమ్మెకు దిగిన యాజమాన్యాలతో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు ఆదివారం అర్ధరాత్రి వరకు చర్చలు జరిపారు. కానీ ఎలాంటి ఫలితం లేకుండానే ముగిసాయి. సోమవారం తిరిగి కొనసాగించేందుకు ఇరు పక్షాలు అంగీకరించాయి.

రెండోరోజు ఏం జరిగింది?

సోమవారం ప్రజాభవన్‌లో చర్చలు ఆలస్యంగా ప్రారంభం అయ్యాయి. భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబుతో పాటు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చర్చల్లో పాల్గొన్నారు. అంతకుముందు ముఖ్యమంత్రికి డిప్యూటీ సీఎం చర్చల సారాంశాన్ని ఫోన్‌లో వివరించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే అధికారులు కూడా అనేక అంశాలను సీఎం ముందుకు తీసుకొచ్చినట్టు తెలిసింది. దీంతో చర్చల వ్యవహారం పక్కదారి పట్టింది. గత ప్రభుత్వ హయాంలో కాలేజీల నాణ్యతపై వేసిన టాస్క్‌ఫోర్స్ కమిటీ ఇచ్చిన నివేదికను పరిశీలించాలని ముఖ్యమంత్రి కార్యాలయం భావిస్తున్నట్టుగా ప్రభుత్వ వర్గాల నుంచి సంకేతాలు వచ్చాయి. నాణ్యత పాటించని కాలేజీలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందనే వార్తలు వెలువడ్డాయి. ప్రైవేటు కాలేజీలను దారికి తెచ్చేందుకే ప్రభుత్వం ఈ అస్త్రం ప్రయోగిస్తున్నట్టు ప్రచారం జరిగింది. దీనిపై కాలేజీల యాజమాన్యాలు నిరసన వ్యక్తం చేశాయి. ఫీజుల బకాయిలు ఇవ్వమంటే ఇలా బెదిరించడం ఏమిటి? అనే అభిప్రాయం వ్యక్తమైంది. ఇది గమనించిన ప్రభుత్వం కొంత తగ్గినట్టు తెలిసింది. బకాయిలు మొత్తం ఒక్కసారే ఇవ్వలేమని చెప్పింది. రూ.1,200 కోట్లు దశల వారీగా ఇస్తామని నచ్చజెప్పింది. రూ.1,200 కోట్లు తక్షణమే ఇవ్వాలని యాజమాన్యాలు పట్టుబట్టినా, చివరకు వెంటనే రూ.600 కోట్లు, మిగతా రూ.600 కోట్లు తర్వాత ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. మిగిలిన బకాయిలు ఎప్పుడిస్తారో చెప్పాలని డిమాండ్ చేశాయి. కాగా చర్చల పురోగతిని ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రికి డిప్యూటీ సీఎం ఫోన్‌లో వివరించినట్టు తెలిసింది.

న్యాయాధికారుల తొలగింపులో

జోక్యం చేసుకోలేం

- ప్రభుత్వానికి విస్తృతాధికారాలు ఉంటాయి
- సుప్రీంకోర్టు కీలక తీర్పు



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో ప్రభుత్వ ప్లీడర్ల (జీపీ) తొలగింపు వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ప్రభుత్వానికి, న్యాయవాదులకు మధ్య సంబంధం విశ్వాసం మీద ఆధారపడి ఉంటుందంటూ న్యాయాధికారుల తొలగింపు విషయంలో జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. హైకోర్టు సింగిల్ బెంచ్, డివిజన్ బెంచ్‌ల తీర్పును సుప్రీం ధర్మాసనం సమర్థించింది. అయితే వారు పనిచేసిన కాలానికి రావాల్సిన గౌరవ వేతన బకాయిలను రెండు నెలల్లోగా చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టితో కూడిన ధర్మాసనం సోమవారం తీర్పు వెలువరించింది.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జిల్లా న్యాయస్థానాల్లో గవర్నమెంట్ ప్లీడర్లు, స్పెషల్ గవర్నమెంట్ ప్లీడర్లు, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్లు, అడిషనల్ గవర్నమెంట్ ప్లీడర్లు నియమితులయ్యారు. అయితే కొందరు న్యాయాధికారుల నియామకం నిబంధనల ప్రకారం జరగలేదని భావించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వారిని తొలగిస్తూ జీవో 354 జారీ చేసింది. దీనిపై పలువురు జీపీలు హైకోర్టును ఆశ్రయించారు. తొలుత సింగిల్ బెంచ్, ఆ తర్వాత డివిజన్ బెంచ్ ప్రభుత్వ ఉత్తర్వును సమర్థించాయి. అయితే ప్రభుత్వం మారిన తర్వాత తమను తొలగించడం అన్యాయమంటూ యాండాల ప్రదీప్ సహా మరికొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై సుప్రీం ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది.



నైపుణ్యం అనేది హఠాత్తుగా వచ్చేది కాదు. అది సమున్నత సంకల్పం, నిజాయతీతో కూడిన ప్రయత్నం, సమర్థంగా అమలు చేయటం, అడ్డంకులను అవకాశాలుగా చూడగలగడం... వీటన్నిటి ద్వారా సాధించవలసినది.

– ఎం.ఎస్. సుబ్బులక్ష్మి

సాక్షి

మంగళవారం, 16 సెప్టెంబర్ 2025

మణిపూర్‌కు సాంత్వన!

మానవీయ స్పర్శ లేశమాత్రం లేని మానవాకార మృగాలు రోజుల తరబడి సృష్టించిన బీభత్సం పర్యవసానంగా అయినవారినీ, ఆవాసాలనూ మాత్రమే కాదు... జీవిక కోల్పోయి చెట్టుకొకరు పుట్టకొకరై 28 నెలల నుంచి అనాథలుగా బతుకీడుస్తున్న మణిపూర్ పౌరులకు ఆలస్యంగానైనా సాంత్వన లభించింది. ప్రధాని నరేంద్ర మోదీ శనివారం తొలుత చురాచాంద్‌పూర్ బహిరంగ సభలో బాధితులనుద్దేశించి మాట్లాడాక, రాజధాని ఇంఫాల్‌లో ఉన్న కాంగ్లా ఫోర్ట్ వద్ద జరిగిన సభలో పాల్గొన్నారు. సాధారణ పరిస్థితుల్ని పునరుద్ధరించటానికి చేయాల్సిందంతా చేస్తామని ఆయన హామీ ఇవ్వటంతో పాటు వేలాది కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన పలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్ని ప్రారంభించటం, మరికొన్నిటికి శంకుస్థాపన చేయటం హర్షించదగ్గవి. ఇవన్నీ రాగల కాలంలో సామరస్య వాతావరణానికి దోహదపడే అవకాశం ఉన్న మాట నిజమే అయినా, చేయాల్సింది ఇంకా చాలా ఉంది.

మెజారిటీగా ఉన్న మెయితీలకూ, కుకీ–జో తెగలకూ మధ్య తలెత్తిన ఘర్షణల పర్యవసానంగా మొత్తం 260 మంది ప్రాణాలు కోల్పోగా, 60,000 మంది నిరాశ్రయులయ్యారు. ఆ తెగల మధ్య పరస్పర అవిశ్వాసం, ఘర్షణలు ఈనాటివి కాదు. వీటిని చక్కదిద్దటానికి ఏ ప్రభుత్వమూ పెద్దగా ప్రయత్నించింది లేదు. బీరేన్‌సింగ్ నేతృత్వంలోని బీజేపీ కూటమి ప్రభుత్వమైతే మెయితీల అనుకూలమన్న ముద్ర పడేలా వ్యవహరించి ఆ ఘర్షణ వాతావరణాన్ని పెంచింది. 2023 మే 3 మొదలుకొని సాగిన దారుణాలు సిగ్గు చేటైనవి. రాష్ట్రంలో మెజారిటీగా ఉన్న మెయితీలకూ, కుకీ–జో తెగలకూ తలెత్తిన ఘర్షణల్లో మహిళలపై గుంపులు దాడిచేసి వారిని వివస్త్రలను చేయటం, నగ్నంగా ఊరేగించి అత్యాచారాలకు తెగబడటం వంటివి చోటుచేసుకున్నాయి.

చురాచాంద్‌పూర్‌లో కుకీ–జో తెగలవారికి సహాయక శిబిరాలు నెలకొల్పగా, మెయితీ బాధితులు ఇంఫాల్ రక్షణ శిబిరాల్లో ఉంటున్నారు. దురదృష్టమేమంటే కుకీ–జో తెగలవారు ఇంఫాల్‌లో అడుగుపెట్టలేరు. మెయితీలు కొండప్రాంత జిల్లాలకు పోలేరు. ఇదంతా ఇప్పట్లో చక్కబడే అవకాశం లేదు. కుకీ–జో తెగల మండలి ప్రధానికి సమర్పించిన వినతిపత్రంలో తమకు ప్రత్యేక పాలనాధికార వ్యవస్థ కావాలని కోరింది. అటు మెయితీలకు ప్రాతినిధ్యం వహించే మణిపూర్ సమగ్రతా సమన్వయ కమిటీ (కొకొమీ) అందుకు ససేమిరా అంటున్నది. ఆ వ్యవస్థ ఏర్పాటైతే రాష్ట్ర ప్రతిపత్తి దెబ్బతింటుందనీ, పౌరసత్వాన్ని తెగల వారీగా గుర్తించి, రాష్ట్రాన్ని విభజించినట్టవుతుందనీ దాని వాదన. 'చట్ట విరుద్ధ' వలసలను అరికట్టాలని డిమాండ్ చేస్తోంది. పైగా మెయితీలు ఏనాటి నుంచో ఎస్టీ ప్రతిపత్తి కోరుతున్నారు. ఇదే జరిగితే భూహక్కులు కోల్పోతామని కుకీ–జో తెగల భయం. ఈ వాదనలూ, భయాందోళనలూ వర్తమాన సంక్లిష్టతకు అద్దం పడతాయి.

రాష్ట్రాన్ని ఆవరించిన కల్లోలం 'మన పూర్వీకుల స్మృతికి కళంకం మాత్రమే కాదు... భవిష్యత్ తరాలకు అన్యాయం చేయటం కూడా' అని మోదీ సరిగానే అన్నారు. దీన్ని చక్కదిద్దటానికి ఇంఫాల్ లోయకూ, కొండ ప్రాంత జిల్లాలకూ మధ్య పటిష్ఠమైన వారధులు నిర్మించాల్సి ఉందన్న ఆయన అభిప్రాయం కూడా సబబైనదే. ఇది జరగాలంటే వైషమ్యాలను పెంచి పోషిస్తున్న వారిపట్ల కఠినంగా వ్యవహరించాలి. వదంతుల వ్యాప్తిని సహించకూడదు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తలను ప్రచారంలో పెట్టడంతోనే సమస్య మొదలైందనీ, ప్రధాన స్రవంతి మీడియా 'మెయితీ మీడియా'గా మారి వీటిని పెంచిపోషించిందనీ ఎడిటర్స్ గిల్డ్ నిజనిర్ధారణ కమిటీ గతంలో ఆరోపించింది. ఇందుకు నాటి మణిపూర్ ప్రభుత్వం ఆగ్రహించి కేసులు కూడా పెట్టింది.

మణిపూర్ తూర్పు, దక్షిణ ప్రాంతాల్లో మయన్మార్‌తో 352 కిలోమీటర్ల సరిహద్దు ఉంది. నిరవధిక ఉద్రిక్త వాతావరణం ఎంతమాత్రమూ మంచిది కాదు. బీరేన్‌సింగ్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయటంతో సహా చాలా విషయాల్లో ఎంతో జాప్యం జరిగింది. ఇప్పటికైనా నిర్దిష్ట కాల వ్యవధిలో అమలయ్యేలా చర్యలుండాలి. అభివృద్ధి జరిగేలా, ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా, జన జీవనం మళ్లీ పట్టాలెక్కేలా చూడాలి. ఒక వర్గానికి కొమ్ము కాస్తున్నారన్న అపవాదు కలగని రీతిలో పాలనను చక్కదిద్దాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** బ.దశమి రా.2.45 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** ఆరుద్ర ప.10.35 వరకు, తదుపరి పునర్వసు, **వర్జ్యం:** రా.10.07 నుండి 11.39 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.18 నుండి 9.07 వరకు, తదుపరి రా.10.46 నుండి 11.33 వరకు, **అమృత ఘడియలు:** తె.4.33 నుండి 6.02 వరకు (తెల్లవారితే బుధవారం)

సూర్యోదయం : 5.51
సూర్యాస్తమయం : 6.01
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

సోషల్ టాక్

చేతలు



ఒక వ్యవస్థాపకుడి ప్రయాణంలో, అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే ఆత్మవిశ్వాసం, ఆ విశ్వాసాన్ని వాస్తవంగా మార్చగల సామర్థ్యం. అందుకే నేను సాధారణంగా మాటలతో కాదు, చేతలతో మాత్రమే మాట్లాడాలని అనుకుంటాను.

– ముఖేశ్ అంబానీ, పారిశ్రామికవేత్త

ప్రాధాన్యం



ప్రస్తుతం ప్రపంచంలో సముద్ర శాస్త్రాలు, లోహశాస్త్రం, సివిల్ ఇంజినీరింగ్ అత్యధిక ఉపాధి అవకాశాలను కలిగి ఉన్నాయి. అయితే కంప్యూటర్ సైన్స్ క్రేజ్‌లో చిక్కుకున్న మెజారిటీ విద్యార్థుల ప్రాధాన్య జాబితాలో ఈ సబ్జెక్టులు అట్టడుగున ఉన్నాయి.

– వి. కామకోటి, 'మద్రాస్ ఐఐటీ' డైరెక్టర్

ఈత



మీరు ఒక చేప అయితే, మీరు ఈత కొడుతున్న నీటి గురించి మీకు తెలీదు. ఆ నీటిని అర్థం చేసుకోవడానికి, వివిధ సీజన్లలో వేర్వేరు నీళ్లలో ఈదిన ఇతర చేపలతో మాట్లాడటం ఉత్తమం. ఏడేళ్లలో 25 స్టార్టప్‌లలో ఇన్వెస్ట్ చేసినా ఇప్పటికీ నేను నేర్చుకుంటూనే ఉన్నాను.

– టోనీ చెన్, ఆఫ్రికన్ ఆంట్రప్రెన్యూర్

సీఈవో



నా దగ్గరికి వచ్చే చాలా మంది యువకులు నన్ను, "నేను సీఈవో కావాలంటే ఎలా?" అని అడుగుతారు. నిజానికి సరైన ప్రశ్న ఏమిటంటే – "నేను ఏం చేయాలి?" అన్నది. మీరు ఉత్సాహంగా చేసే పనిలో నైపుణ్యాన్ని సాధిస్తే, అదే మిమ్మల్ని సీఈవోను చేస్తుంది.

– క్రిస్టోఫ్ ఫౌకెట్, 'ఏ.ఎస్.ఎం.ఎల్' సీఈవో

ఒంటరిగానా!



ఇప్పుడే కెరీర్ ప్రారంభించిన వారికి నేనొకటే చెబుతాను. మొదట మీకో గురువును ఎంపిక చేసుకోండి. వారి అనుభవాన్ని మీ ప్రణాళికలో భాగం చేసుకోండి. మీ విజయానికి అదే తొలిమెట్టు. విజయాన్ని ఒంటరిగా సాధించలేం.

– సంజయ్ మెహ్రోత్రా, 'మైక్రాన్' సీఈవో

మూడో వ్యక్తి



వన్ ప్లస్ వన్ అంటే సాధారణంగా రెండే కానీ, సిలికాన్ వ్యాలీలో మాత్రం అది మూడుకు సమానం. మీరు మీ జ్ఞానాన్ని వేరొకరితో పంచుకున్నప్పుడు, ఇద్దరూ కలిసి ఒక కొత్త ఆలోచన చేస్తారు. అది మూడో వ్యక్తిగా మీకు తోడవుతుంది.

– వివేక్ వాధ్వా, ఎన్నారై పారిశ్రామికవేత్త

వాదనల కన్నా పని మిన్న!

విశ్వ గురు

హలో టులేన్! ఇక్కడి అన్ని విభాగాల సిబ్బందికీ అభివాదాలు. మీలో చాలా మంది మాదిరిగానే మా ఆపిల్ సంస్థలోని కొందరికి కూడా న్యూ ఓర్లీన్స్‌తో సన్నిహిత అనుబంధం ఉంది. 'టులేన్ విశ్వవిద్యాలయ జట్టు'కు అభినందనలు అని అందరూ ముక్త కంఠంతో చెబుతూంటే ఒళ్ళు పులకరిస్తుంది.

ఇక్కడున్న వారితోపాటు మరో ముఖ్యమైన వర్గం ఉంది. కుటుంబ సభ్యులు, స్నేహితులు ఆ వర్గంలోకి వస్తారు. మిగిలిన వారందరికన్నా కూడా వారు మిమ్మల్ని ఎక్కువ ప్రేమించి, అండదండలను అందించి ఉంటారు. మీరు ఈ స్థితికి చేరడంలో వారు చాలా త్యాగాలను కూడా చేసి ఉంటారు. వారిని కూడా మన హర్షధ్వానాలతో అభినందిద్దాం. ఇదే నేనిచ్చే మొదటి సలహా. వారు ఈ క్షణాల కోసం వేయి కళ్లతో ఎంతగా ఎదురుచూశారో గ్రహించి, ప్రశంసించేందుకు, మీకు జీవితంలో ఇంకా చాలా కాలం పట్టవచ్చు. వారు మీపట్ల బాధ్యతతో, ప్రేమతో వ్యవహరించిన తీరు, మీ మధ్యనున్న అనుబంధం మిగిలినవాటన్నింటి కన్నా ఎక్కువ ప్రాధాన్యం కలిగినవని మీకు తదనంతర కాలంలో తెలిసిరావచ్చు.

పది మందితో మెసలండి!


నిజానికి, నేను ఈ రోజు దాని గురించే మాట్లాడదలచుకున్నాను. స్వీయ జీవితాలను నమోదు చేసుకోవడంలో, అవీ ఇవీ పోస్ట్ చేయడంలో తలమునకలై ఉన్న ప్రపంచంలో, మనలో చాలా మందిమి ఒకరి పట్ల ఒకరికి ఉండవలసిన బాధ్యత పైన మాత్రం తగినంత శ్రద్ధను కనబరచడం లేదు.

> కలసికట్టుగా మరింత ఎక్కువ సాధించగలమని గుర్తించడంతోనే మానవ నాగరకత ప్రారంభమైంది. మన సమస్యలకు పరిష్కారాలు మానవ సంబంధాల నుంచే లభిస్తాయి.

ఇది తల్లితండ్రులతో మరింత టచ్‌లో ఉండటం గురించి చెబుతున్నది మాత్రమే కాదు. మీరు వారితో నెరిపే సంబంధాలు వారిని మరింత సంతోష పరుస్తాయి.

అసలు, కలసికట్టుగా మనం మరింత ఎక్కువ సాధించగలమని గుర్తించడంతోనే మానవ నాగరకత ప్రారంభమైంది. మనం మరింత కలసికట్టుగా వ్యవహరిస్తే మనకెదురవుతున్న ముప్పులు, ఆపదలను నివారించుకోవచ్చు. మనం పంచుకుంటున్న కొన్ని సత్యాలను గుర్తించి సమష్టిగా పనిచేసినపుడు ఈ లోకంలో మరింత సంపద, సౌందర్యం, విజ్ఞత, మెరుగైన జీవితాలను సృష్టించగలుగుతాం.

ఈ పని సాధ్యం కాకపోవచ్చుననే సందర్భాలు జీవితంలో చాలాసార్లు ఎదురవుతాయి. కానీ, ప్రయత్నించి చూడటం కన్నా మరింత అందమైన, అర్థవంతమైన పని మరొకటి లేదని ఈ విశ్వవిద్యాలయం చాటుతుంది. ముఖ్యంగా సొంతానికన్నా నలుగురి మేలు కోసం ఆ పని చేయడంలో గొప్పదనం ఉందంటుంది.



న్యూ ఓర్లీన్స్‌లోని టులేన్ విశ్వవిద్యాలయ పట్టభద్రులను ఉద్దేశించి 'ఆపిల్' సంస్థ సీఈవో టిమ్ కుక్ చేసిన స్ఫూర్తిదాయక ప్రసంగ సంక్షిప్త పాఠం:

నా మటుకు నన్ను... ఆ ఉన్నత పరమార్థ అన్వేషణే ఆపిల్ కంపెనీకి తీసుకొచ్చింది. క్యాంపాక్ అనే కంపెనీలో అప్పుడు కుదురైన ఉద్యోగం చేసుకుంటున్నాను. అప్పట్లో ఎప్పటికీ ఆ సంస్థే అగ్ర స్థానంలో ఉంటుందనిపించింది. అప్పటికింకా మీరు కుర్రాళ్ళు కనుక, బహుశా ఆ సంస్థ పేరు కూడా గుర్తుండకపోయి ఉండవచ్చు. కానీ, క్యాంపాక్‌ను విడిచిపెట్టి, దివాళా తీసే స్థితిలో ఉన్న కంపెనీలో చేరవలసిందిగా స్టీవ్ జాబ్స్ 1998లో నాకు నచ్చజెప్పాడు. అది కంప్యూటర్లు తయారు చేస్తోంది. అప్పటికి, వాటిని కొనాలనే ఆసక్తి ప్రజల్లో లేదనే చెప్పాలి. పరిస్థితుల్లో మార్పు తెచ్చేందుకు స్టీవ్ దగ్గరో ఆలోచన ఉంది. నేనూ అందులో భాగం అయ్యాను.

ఐమ్యాక్, ఐపాడ్ లేదా ఆ తర్వాత వచ్చిన అలాంటి వస్తువుల గురించి కాదు చెప్పుకోవాల్సింది. జీవితంలోకి ఆ ఆవిష్కరణలు తేవడం వెనుకనున్న విలువల గురించి ముచ్చటించుకోవాలి. సాధారణ ప్రజానీకం చేతిలో శక్తిమంతమైన సాధనాలను ఉంచాలనే ఆలోచన సృజనాత్మకత వెల్లివిరియడానికీ, మానవాళిని ముందుకు నడిపించడానికీ తోడ్పడింది.

చిక్కుముడులు విప్పండి!

ఇష్టమైన పని చేస్తూంటే అలుపనేదే తెలియదు అని సాధారణంగా చెబుతూంటారు. కానీ, ఆ మాటల్లో సారం లేదని 'ఆపిల్'లో గ్రహించాను. అంతలా పనిచేయడం సాధ్యమేనని మీరు ఎన్నడూ ఊహించనంతగా, శ్రమపడి పని చేయాల్సి ఉంటుంది. ఎటొచ్చీ ఇష్టంతో పనిచేస్తే, మీ చేతుల్లోని ఉపకరణాలు తేలికవుతాయి, అంతే!

ప్రపంచంలోకి అడుగుపెట్టబోతున్నారు కనుక ఓ సంగతి చెబుతా. పరిష్కారాన్ని కనుగొన్న సమస్యలపైన మీ సమయాన్ని వృథా చేయకండి. ఇది ఆచరణసాధ్యమని ఇతరులు చెప్పిన దానికే పరిమితం అయిపోకండి. అల్లకల్లోలంగా ఉన్న సముద్రంలోకే మీ నౌకను నడిపించండి. ఇతరులకు మరీ పెద్దవిగా కనిపించే, వారు మనకెందుకులే అనుకొనే చిక్కుముడులను విప్పేందుకూ, జటిలమైన పరిస్థితుల్లో పనిచేసేందుకూ మొగ్గు చూపండి. మీ జీవిత పరమార్థాన్ని అటువంటి చోటే కనుగొనగలుగుతారు. మీ సేవలను అక్కడే ఎక్కువ అందించగలుగుతారు.

'అతి జాగ్రత్త'కు పోకండి!

ఏ పని చేసినా 'అతి జాగ్రత్త'తో చేయాలనుకోవడం కూడా పొరపాటే! ఉన్నదున్నట్లుగా చేస్తూ పోతే, మీ కాలి కింద భూమి కదలకుండా ఉంటుందనుకోకండి. యథాతథ స్థితి కలకాలం ఉండదు. ఏదైనా మెరుగైన దాన్ని నిర్మించడంపై పనిచేయండి. కొన్ని ముఖ్యమైన అంశాలకు సంబంధించి మా తరం మిమ్మల్ని తప్పుదోవ పట్టించింది. పనుల్లోకి దిగకుండా చర్చలతోనే మేం చాలా సమయాన్ని గడిపేశాం. ప్రగతిపై కాక పోరాటంపై ఎక్కువ దృష్టిని కేంద్రీకరించాం. మా వైఫల్యాన్ని ఎత్తి చూపేందుకు మీరు ఎక్కువ వెతకాల్సిన పని లేదు. గత 100 ఏళ్ళలో చూడని ప్రకృతి వైపరీత్యాలతో వేలాది మంది నిరాశ్రయులు అవడాన్ని మనం చూస్తున్నాం. వాతావరణ మార్పు గురించి మాట్లాడుకోకుండా, వ్యక్తులుగా మనం ఒకరి పట్ల ఒకరం ఎలా బాధ్యతతో మెలగవలసి ఉందో మాట్లాడుకోగలమని నేను అనుకోవడం లేదు.

> ఈ పని సాధ్యం కాకపోవచ్చుననే సందర్భాలు జీవితంలో చాలాసార్లు ఎదురవుతాయి. కానీ, ప్రయత్నించి చూడటం కన్నా మరింత అర్థవంతమైన పని మరొకటి లేదు.

మీతో విభేదించేవారిని నేలమట్టం చేయడం ద్వారానే మీరు బలవంతులు అనిపించుకోగలుగుతారని లేదా అసలు వారికి మాట్లాడే అవకాశమే ఇవ్వవద్దని నమ్మబలికేవారు కొందరుంటారు. వారి మాయలో పడకండి. అవి కొత్త ఆలోచనలు పుట్టనివ్వవు. కొత్త దారులు వెతకనివ్వవు. మాటవరుసకు వినడం కాకుండా, చెవి కెక్కించుకునే విధంగా ఆలకించడాన్ని అలవరచుకోండి. కేవలం పని చేయడం కాదు, కలసిమెలసి పనిచేసే తత్వాన్ని ప్రదర్శించండి.

మన సమస్యలకు పరిష్కారాలు మానవ సంబంధాల నుంచే లభిస్తాయి. సంకల్ప శక్తితో దేన్నైనా ప్రయత్నించి చూడండి. మీరు సఫలమూ కావచ్చు. విఫలమూ కావచ్చు. కానీ, ప్రపంచాన్ని నిర్మించడమే మీ జీవిత లక్ష్యంగా పెట్టుకోండి. మానవాళికి మెరుగైన వాటిని విడిచిపెట్టడం కోసం పనిచేయడం కన్నా మరింత అందమైనది ఏదీ లేదు. ◆

కరెంట్ ఇంటెలిజెన్స్

ఇటీవల 'యుద్ధ్ అభ్యాస్' ఎక్కడ నిర్వహించారు?

1. గ్లోబల్ పీస్ ఇండెక్స్–2025లో భారత ర్యాంకు?
2. 2025లో ప్రతిష్ఠాత్మక రామన్ మెగసెసే అవార్డు పొందిన భారతీయ ఎన్జీవో?
3. 25వ 'షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీవో)' వార్షిక సదస్సు ఇటీవల ఎక్కడ జరిగింది?
4. 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా' (ఎఫ్ఎస్ఎస్ఏఐ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(సీఈవో)గా ఇటీవల ఎవరు బాధ్యతలు స్వీకరించారు?
5. భారత్–అమెరికాల సంయుక్త సైనిక విన్యాసాలు 'యుద్ధ్ అభ్యాస్' ఇటీవల ఎక్కడ నిర్వహించారు?
6. బ్యాడ్మింటన్ వరల్డ్ చాంపియన్‌షిప్‌ను భారత్‌లో 17 ఏళ్ల తర్వాత నిర్వహించనున్నారు? అది ఎప్పుడు, ఎక్కడ జరగనుంది?
7. థాయ్‌లాండ్ కొత్త ప్రధాన మంత్రిగా ఇటీవల ఎవరు నియమితులయ్యారు?



8



7 11 12

8. విశ్వం ఆవిర్భావం గురించి అధ్యయనం చేసేందుకు బెంగళూరులోని 'రామన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్', 'ఇస్రో' సంయుక్తంగా అభివృద్ధి చేసిన లూనార్ ఆర్బిట్ రేడియో మీటర్ పేరు?
9. భారత్ స్వదేశీ పరిజ్ఞానంతో తొలిసారిగా రూపొందించిన 32 బిట్స్ మైక్రో ప్రాసెసర్‌ను ఇటీవల నిర్వహించిన 'సెమికాన్ ఇండియా – 2025' సదస్సులో ప్రదర్శించారు. ఈ మైక్రో ప్రాసెసర్ పేరేమిటి?
10. జీఎస్టీ 2.0 (రెండు శ్లాబులు: 5 శాతం, 18 శాతం) ఎప్పటి నుంచి అమల్లోకి వస్తుంది?
11. 'మదర్ మేరీ కమ్స్ టు మి' పుస్తక రచయిత పేరు?
12. 'ఫుజాయిరా ప్రపంచ సూపర్ స్టార్స్ చెస్ టోర్నమెంట్– 2025' విజేత ఎవరు?
13. మహిళా క్రికెట్‌ను ప్రోత్సహించేందుకు 'ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్' (ఐసీసీ) ఇటీవల ఎవరితో చేతులు కలిపింది?
14. క్యాన్సర్ చికిత్సలో కీలకమైన ముందడుగుగా భావిస్తున్న ఎం–ఆర్ఎన్ఏ ఆధారిత రష్యన్ వ్యాక్సిన్ పేరు?
15. ఆఫ్రికా ఖండంలో అతిపెద్ద హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టును ఈ నెల (సెప్టెంబర్) 9న ఇథియోపియా అధికారికంగా ప్రారంభించింది. ఆ ప్రాజెక్టు పేరు?

జవాబులు :

1. మొత్తం 163 దేశాలలో 115వ ర్యాంకు
2. ఎడ్యుకేట్ గర్ల్స్
3. తియాన్‌జిన్(చైనా)
4. రజిత్ పున్హా
5. అలాస్కా
6. 2026 ఆగస్టు, న్యూఢిల్లీ
7. అనుతిన్ చరన్ విరాకుల్
8. ప్రత్యూష్(పీఆర్ఏటీయుఎస్‌హెచ్–ప్రోబింగ్ రియోనైజేషన్ ఆఫ్ ది యూనివర్స్ యూజింగ్ సిగ్నల్ ఫ్రమ్ హైడ్రోజన్)
9. విక్రమ్ 3201
10. 2025 సెప్టెంబర్ 22
11. అరుంధతీ రాయ్
12. ప్రణవ్ వెంకటేశ్
13. గూగుల్
14. ఎంటరో మిక్స్
15. గ్రాండ్ ఇథియోపియన్ రినైసెన్స్ డ్యామ్


కూర్పు: 'భవిత'

భూ రక్షణ కవచాన్ని కాపాడాలి!

ఇన్ బాక్స్

భూగోళానికి రక్షణ కవచంగా ఉంటున్న ఓజోన్ పొర పరిరక్షణ కోసం ఐక్యరాజ్యసమితి ఆదేశానుసారం ప్రపంచ దేశాలు 'అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం' ప్రతి సంవత్సరం 'సెప్టెంబరు 16న నిర్వహిస్తున్నాయి. ఓజోన్ పొర అక్కడక్కడ పల్చబడి రంధ్రాలు ఏర్పడటం, రంధ్రాల కారణంగా కలిగే అనర్థాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఐక్యరాజ్యసమితి ఈ దినోత్సవాన్ని జరపాలని నిర్ణయించింది.

ఓజోన్ అనేది మూడు ఆక్సిజన్ పరమాణువులతో ఏర్పడిన సహజ వాయువు. ఈ పొర ప్రధానంగా స్ట్రాటో ఆవరణం దిగువ భాగంలో కనిపిస్తుంది. భూమి ఉపరితలం నుండి సుమారు 15 నుండి 35 కిలోమీటర్ల ఎత్తులో ఉంటుంది. అయితే దాని మందం కాలానుగుణంగా మారుతుంది. సూర్యుని నుంచి వెలువడే కిరణాలు భూమిపై నేరుగా పడకుండా అందులో ఉండే అతి నీలలోహిత కిరణాలను ఓజోన్ పొర ఫిల్టర్ చేసి, ప్రాణకోటికి వాటిల్లే ముప్పు నుంచి కాపాడుతుంది.



పరిశ్రమలు వదిలే కాలుష్యాలు, మోటారు వాహనాలు విడుదల చేసే కాలుష్య వాయువులైన కార్బన్ మోనాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్‌లు, జెట్ ప్లేన్ నుండి విడుదయ్యే ఏరోసోల్స్; ఏసీల నుండి, రిఫ్రిజిరేటర్ల నుండి విడుదలయ్యే క్లోరోఫ్లోరో కార్బన్‌లలో ఉండే క్లోరిన్, బ్రోమిన్ వంటి రసాయనాలు స్ట్రాటో ఆవరణంలోకి చేరి, అక్కడ ఉండే ఓజోన్ అణువుతో చర్యలు జరిపి దాన్ని కొద్ది కొద్దిగా క్షీణింపజేస్తున్నాయి. ఫలితంగా ఆ పొర పల్చబడటం కానీ, రంధ్రాలు ఏర్పడటం కానీ జరుగుతోంది.

ఓజోన్ పొర క్షీణించడం వల్ల అతి నీలలోహిత రేడియేషన్ పెరిగి చర్మ క్యాన్సర్, కంటి శుక్లం వంటి ఆరోగ్య సమస్యలు సంభవిస్తాయి. ఈ ఆవరణ పర్యావరణ పరంగా చూస్తే మొక్కల్లో కిరణజన్య సంయోగక్రియ మీద తీవ్రమైన ప్రభావం పడి, సముద్ర జీవులు ప్రభావితమవుతాయి. అద్భుత ఆవాసాలు, ఆవరణ వ్యవస్థలు దెబ్బతింటాయి. పరిస్థితి మరింత క్షీణించకుండా ప్రభుత్వంతో పాటు ప్రజా సంఘాలు ప్రకృతిలో జరుగుతున్న వ్యత్యాసాల మార్పులపై, ఓజోన్ పొర క్షీణతపై ప్రజలకు అవగాహన కల్పించాలి. అడవుల నరికివేతను పూర్తిగా నిలిపివేసి మొక్కలను విరివిగా పెంచడం లాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల మనల్ని మనం కాపాడుకోవచ్చు.


– బి. ప్రభాకర్ రెడ్డి, సైన్స్ ఉపాధ్యాయుడు

(నేడు 'అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం')

చదువు పెరిగె... పిల్లలు తగ్గె...

డేటా పాయింట్

మనదేశంలో చదువు పెరిగేకొద్దీ జననాల రేటు (ఒక మహిళకు ఉండే పిల్లలు) తగ్గుతోందని కేంద్ర ప్రభుత్వ శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (ఎస్ఆర్ఎస్) – 2023 గణాంకాలు చెబుతున్నాయి.



ధర్మాచరణ సమీక్ష

జ్యోతిర్మయం

నారాయణ మహర్షిని నారదుడు 'ఏ ఏ సదాచారాలు పాటిస్తే అమ్మవారి అనుగ్రహం లభిస్తుంది?' అని 'దేవీ భాగవతం'లో అడుగుతాడు. అప్పుడు మహర్షి, జీవితంలో ధర్మాచరణ ప్రాధాన్యాన్ని చెబుతాడు. ప్రతి మనిషీ రాత్రి పడుకోబోయే ముందు ఆ రోజంతా తాను చేసిన పనులూ, ఇతరుల చేత చేయించిన పనులూ; తాను ఇతరులను అన్న మాటలూ అనిపించిన మాటలూ; ఇతరులకు తాను ఇచ్చినవీ, ఇప్పించినవీ ఏమిటని సమీక్షించుకోవాలి. తను చేసిన పనులన్నీ ధర్మ బద్ధంగా ఉన్నాయా లేదా అని పరిశీలించుకోవాలి. ఈ పరిశీలనలో నిజాయితీ ప్రస్ఫుటంగా ఉండాలి. ఇది ఎవరి కోసమో, ఎవరి మెప్పు కోసమో కాదు. తన ఆధ్యాత్మిక వికాసం కోసం!

తాను చేసిన పనులలో ధర్మబద్ధం కానివి ఉంటే అలాంటి వాటిని మరుసటి రోజు నుంచే పరిత్యజించాలి. నిత్యమూ తెల్లవారుజామున లేచి భగవద్ధ్యానం చేయాలి. ఆ సమయంలో ఇంద్రియాలను నిగ్రహించాలి. హృదయ దీపంలో తన ఇష్ట దైవాన్ని ధ్యానించాలి. మనిషి చివరి దాకా నిలిచేదీ, తదనంతరం తనను నిలబెట్టేదీ ధర్మమే. తల్లిదండ్రులు, జీవిత భాగస్వామి, తోబుట్టువులు, సంతానం ఎవరూ నిలవరు. తను ప్రతి రోజూ ఆచరించిన ధర్మమే ఎల్లవేళలా సహాయకారిగా నిలుస్తుంది. మహాభారతంలో కూడా ధర్మరాజుకు నారదుడు రాజనీతిని గురించి వివరిస్తూ, ధర్మార్థ కామాలను ఒకదానిని ఒకటి బాధించకుండా ఆచరించాలని చెబుతాడు. అంటే ధర్మ బద్ధంగా అర్థ, కామాలను సాధించాలన్నమాట! మనిషి చేసే సత్కర్మలతోనే దేవి ప్రసన్నురాలవుతుంది. అందుకే ప్రతిరోజూ ప్రతి వ్యక్తీ తను చేసే పనులను సమీక్షించుకోవాలి. ఆత్మ విమర్శ చేసుకోవాలి. ఇది లౌకికంగానూ, ఆధ్యాత్మికంగానూ వ్యక్తి వికాసానికి దోహదం చేస్తుంది.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

క్లుప్తంగా...

యాదగిరి క్షేత్రంలో కణ్ణన్ తిరునక్షత్ర ఉత్సవాలు



ఉత్సవ మూర్తులకు నవకలశ స్నపన పూజ నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవాలయంతో పాటు అనుబంధ పాత గుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోనూ సోమవారం కణ్ణన్ తిరునక్షత్ర వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో విష్వక్సేన పూజ, పుణ్యాహ వచనం, నవకలశ స్నపనం చేసి విశేష పూజలు చేశారు. అనంతరం లక్ష్మీనరసింహ, మహాలక్ష్మి, సుదర్శన, వాసుదేవ మూలమంత్ర హవనం పూజను జరిపించారు. సాయంత్రం వేళ అద్దాల మండపంలో శ్రీస్వామిని అధిష్ఠించి తిరునక్షత్ర పూజలు జరిపించి, వేద పఠనం చేపట్టారు.

శ్రీశైలం, సాగర్ గేట్ల మూసివేత

నాగార్జునసాగర్/దోమలపెంట: ఎగువ నుంచి వచ్చే వరద తగ్గడంతో నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల గేట్లను సోమవారం మూసివేశారు. ప్రస్తుతం సాగర్ ఎగువనగల శ్రీశైలం జలాశయం నుంచి జలవిద్యుత్పాదన ద్వారా సాగర్ జలాశయంలోకి 49,125 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. సాగర్ జలాశయం గరిష్ట నీటిమట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 587.60 అడుగుల (305.8626 టీఎంసీలు) నీరు ఉంది. కాగా, ఆదివారం రాత్రి వరకు శ్రీశైలం ఆనకట్ట నాలుగు గేట్లు తెరిచి దిగువకు నీటిని వదిలిన అధికారులు.. సోమవారం ఉదయం 11 గంటలకు అన్ని గేట్లను మూసివేశారు. జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 45,704, సుంకేసుల నుంచి 26,874, హంద్రీ నుంచి 3,750 మొత్తం 76,328 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయానికి వస్తోంది. దీంతో శ్రీశైలం భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 66,234 క్యూసెక్కుల నీటిని దిగువన నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 883.7 అడుగుల వద్ద 208.2841 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

ప్రముఖ కవి జ్వాలాముఖి సతీమణి సీతాదేవి కన్నుమూత




అంబర్‌పేట (హైదరాబాద్): ప్రముఖ కవి జ్వాలాముఖి సతీమణి సీతాదేవి (85) అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. సోమవారం అంబర్‌పేట తిరుమలనగర్‌లోని వారి నివాసంలో తీవ్ర జ్వరంతో బాధపడుతూ కన్నుమూశారు. సంప్రదాయ కుటుంబం నుంచి వచ్చిన సీతాదేవి విప్లవ కవి జ్వాలాముఖితో సహధర్మచారిణిగా తన జీవన ప్రయాణాన్ని సాగించారు. వీరికి ముగ్గురు కుమారులు సంపత్, శ్రీధర్, వాసు కాగా.. శ్రీధర్ కొద్ది కాలం కిందట మృతి చెందాడు. 2008 లో జ్వాలాముఖి మరణానంతరం సీతాదేవి కుమారుల వద్దే ఉంటోంది. ఆమె సోదరుడు ప్రముఖ వైద్యులు పీఎల్ చారి. సోమవారం సాయంత్రం అంబర్‌పేట శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలకు పలువురు సాహితీవేత్తలు, బంధువులు పెద్ద సంఖ్యలో హాజరై తుదివీడ్కోలు పలికారు.

150 మీటర్ల ఎత్తులో తుమ్మిడిహెట్టి!

2.75 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించే యోచన

- సీఎం ఆదేశాలతో నీటిపారుదల శాఖ కసరత్తు
- మొత్తం 80 టీఎంసీలు తరలించేలా కొత్త డీపీఆర్
- మహారాష్ట్ర సమ్మతి కోసం త్వరలో ఆ రాష్ట్రంతో సంప్రదింపులు



(ఫైల్)

త్వరలో మహారాష్ట్రకు రాష్ట్ర బృందం!

సాక్షి, హైదరాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా 150 మీటర్ల ఎత్తులో తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మాణానికి మహారాష్ట్ర సమ్మతి పొందడానికి వీలుగా ఆ రాష్ట్ర ప్రభుత్వంతో మళ్లీ సంప్రదింపులు ప్రారంభించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. వాస్తవానికి ఇక్కడ 152 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మించి 165 టీఎంసీల గోదావరి జలాలను తరలించడానికి గతంలో దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం డీపీఆర్ సిద్ధం చేసింది. అయితే దీనివల్ల మహారాష్ట్రలో ముంపు ఏర్పడుతుందని అక్కడి ప్రభుత్వం అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో అది కాస్తా ఆగిపోయింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నాటి మహారాష్ట్ర సీఎం దేవంద్ర ఫడ్నవీస్‌తో నేరుగా చర్చలు జరిపి బరాజ్ ఎత్తును 148 మీటర్లకు తగ్గించుకుని నిర్మించుకోవడానికి 2016 మార్చి 8న ఒప్పందం చేసుకుంది. ఆ తర్వాత తుమ్మిడిహెట్టికి బదులు గత బీఆర్‌ఎస్ సర్కారు నిర్మించిన మేడిగడ్డ బరాజ్ కుంగిపోవడం, ఆ తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం వంటి పరిణామాల నేపథ్యంలో మళ్లీ తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మాణం తెరపైకి వచ్చింది.

తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మిస్తే ఆశించిన విధంగా ప్రయోజనాలుండవని, 150 మీటర్లకు పెంచి నిర్మిస్తేనే రాష్ట్ర అవసరాలు పూర్తిగా తీరుతాయని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. ఆ మేరకు బరాజ్ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించడానికి చర్యలు తీసుకోవాలని గత శనివారం నిర్వహించిన సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించడంతో, నీటిపారుదల శాఖ కసరత్తును ప్రారంభించింది. తొలుత రాష్ట్ర అధికారుల బృందం మహారాష్ట్రకు వెళ్లి అక్కడి అధికారులతో చర్చలు జరపనున్నట్టు తెలిసింది. ఆ తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డిలు కూడా వెళ్లి ఆ రాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో సంప్రదింపులు జరిపే అవకాశం ఉందని తెలుస్తోంది.

మళ్లీ కొత్త డీపీఆర్..!

కాళేశ్వరం ప్రాజెక్టుతో సంబంధం లేకుండానే తుమ్మిడిహెట్టి బరాజ్ డీపీఆర్‌ను సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో 160 టీఎంసీల గోదావరి జలాల తరలింపునకు ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు డీపీఆర్‌ను సిద్ధం చేసి కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) అనుమతులు పొందారు. మారిన పరిస్థితుల నేపథ్యంలో దీనిని 80 టీఎంసీలకు తగ్గించి కొత్త డీపీఆర్‌ను తయారు చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. 2.75 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో 150 మీటర్ల ఎత్తులో తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మిస్తామని డీపీఆర్‌లో ప్రతిపాదించే అవకాశాలున్నాయి. అక్కడి నుంచి నేరుగా ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీళ్లను తరలించాలంటే ఒక దశలో ఎత్తిపోసేందుకు కొత్త పంప్‌హౌస్‌ను నిర్మించాల్సి ఉంటుంది. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టు 116 కి.మీ.ల దూరంలో ఉండగా, మధ్యలో 71.5 కి.మీ.ల వద్ద ఉన్న మైలారం గ్రామం వరకు నీళ్ల గ్రావిటీతో రానున్నాయి. దివంగత వైఎస్ ప్రభుత్వం చేపట్టిన గ్రావిటీ కాల్వల నిర్మాణం పనులు దాదాపుగా పూర్తై ఉండడంతో ప్రభుత్వానికి ఖర్చు తగ్గనుంది.

నీటి కేటాయింపులు ఎలా?

గోదావరి జలాల్లో వాటా మేరకు తెలంగాణకు 968, ఏపీకి 531.9 టీఎంసీలను సీడబ్ల్యూసీ కేటాయించగా, వాటిపై ఆధారపడే రెండు రాష్ట్రాలు ప్రాజెక్టులను కట్టుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే 190 టీఎంసీల గోదావరి జలాలు తరలించుకుంటామని కాళేశ్వరం ప్రాజెక్టుకు ప్రభుత్వం అనుమతులు పొందింది. ఈ నేపథ్యంలో కుంగిన మేడిగడ్డ బరాజ్‌కు ప్రత్యామ్నాయంగా తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మించుకోవడానికి అనుమతులు కోరేందుకు అవకాశం ఉన్నా, భవిష్యత్తులో ఇతర సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు కేటాయించిన 190 టీఎంసీల జోలికి వెళ్లకుండానే తుమ్మిడిహెట్టి బరాజ్ డీపీఆర్‌ను సిద్ధం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. గతంలో 160 టీఎంసీలను తరలించుకోవడానికి సీడబ్ల్యూసీ అనుమతి ఇవ్వగా, అందులో వాడుకోని జలాలు 20 టీఎంసీలు ఉన్నాయి. అలాగే రాష్ట్రం ఏ విధంగా వాడుకోని మరో 27 టీఎంసీలు మిగిలి ఉన్నాయి. వీటికి మరో 37 టీఎంసీల ఇతర జలాలను జత చేసి మొత్తం 80 టీఎంసీలను తుమ్మిడిహెట్టి వద్ద నుంచి తరలించుకోవడానికి కొత్త డీపీఆర్‌ను సమర్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. తుమ్మిడిహెట్టి వద్ద సగటున 462 టీఎంసీలు, 75 శాతం లభ్యత ఆధారంగా 165 టీఎంసీల లభ్యత ఉంటుందని గతంలో సీడబ్ల్యూసీ నిర్ధారించిన నేపథ్యంలో అనుమతులకు ఇబ్బందులు ఉండవని ప్రభుత్వం భావిస్తోంది.

ఏఐపై విద్యార్థులు దృష్టి పెట్టాలి

- మహాత్మాగాంధీ వర్సిటీని జాతీయ స్థాయికి చేర్చాలి
- వర్సిటీ 4వ స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపు



విద్యార్థినికి గోల్డ్‌మెడల్, పట్టా అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చిత్రంలో ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్ మూర్తి

నల్లగొండ టూటౌన్: విద్యార్థులను కొత్త సాంకేతిక ఆవిష్కరణల వైపు మళ్లించాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు. ముఖ్యంగా పరిశ్రమలు, విద్య, ఉపాధిని పునర్నిర్మించడానికి సిద్ధంగా ఉన్న కృత్రిమ మేధను ఆకలింపు చేసుకునేందుకు సిద్ధం చేయాలని సూచించారు. యూనివర్సిటీలు యువ మనస్సులను సృజనాత్మకత, కొత్త ఆవిష్కరణల వైపు నడిపించాలని అన్నారు. సోమవారం నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ 4వ స్నాతకోత్సవంలో ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్ మూర్తితో కలిసి గవర్నర్ పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం భారతదేశం బహుళ రంగాలలో రాణిస్తోందని తెలిపారు. గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో భారత్ 2015లో 81వ స్థానంలో ఉండగా, ఇటీవల 39వ స్థానానికి చేరుకుందని గుర్తుచేశారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్న మహాత్మాగాంధీ యూనివర్సిటీ విద్యార్థుల మనస్సు గెలుచుకుని పరిశోధనల్లో పురోగతి సాధించిందని ప్రశంసించారు. దీనిని జాతీయ స్థాయి యూనివర్సిటీగా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం పీహెచ్‌డీ పూర్తి చేసిన 22 మందికి పట్టాలు అందజేశారు. 57 మంది విద్యార్థులకు బంగారు పతకాలు బహూకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులు, ముఖ్యులతో ముఖాముఖి నిర్వహించారు. నల్లగొండ జిల్లాను టీబీ రహిత, మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గవర్నర్ సూచించారు. కవులు, కళాకారులు, రచయితలు నాటకాలు, నాటికలు, పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించాలని కోరారు.

19న ఛత్తీస్‌గఢ్‌కు మంత్రి ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఈ నెల 19న ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర రాజధాని న్యూ రాయ్‌పూర్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన సీఎం విష్ణుదేవ్‌సాయితో సమావేశం అవుతారు. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకి అనుమతుల విషయంలో ఈ నెల 23న కేంద్ర జలసంఘం కీలక సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో ఆలోగా ప్రాజెక్టుకి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) జారీ చేయాలని ఛత్తీస్‌గఢ్ సీఎంకు ఉత్తమ్ విజ్ఞప్తి చేయనున్నారు. ములుగు జిల్లాలో గోదావరిపై నిర్మిస్తున్న సమ్మక్కసాగర్ పనులు 95 శాతం పూర్తయ్యాయి. బరాజ్‌లో పూర్తిస్థాయి నిల్వ మట్టం 83 మీటర్ల మేర నీళ్లను నిల్వ చేస్తే, పొరుగున ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో ముంపునకు గురికానున్న భూములకు పరిహారం చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు ఆ ప్రభుత్వానికి లేఖలు రాసింది.

అరుదైన ఖనిజాల కోసం సింగరేణితో ఇస్రో జట్టు

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్రంలో అరుదైన ఖనిజాల అన్వేషణ, వెలికితీత కోసం సింగరేణి సంస్థతో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఖమ్మం జిల్లా సత్తుపల్లి బొగ్గు గనుల్లో స్కాండియం, స్ట్రాటియం, నియోడయోనియం తదితర అరుదైన ఖనిజాలు ఉన్నట్లు ఇస్రో శాస్త్రవేత్తలు గుర్తించారు. వీటిని వెలికితీసేందుకు సింగరేణితో ఎంఓయూ కుదుర్చుకున్నారు. అందులో భాగంగా ఈ ఖనిజాల అన్వేషణ కోసం సింగరేణి సంస్థ రూ.15 కోట్లు కేటాయించింది. ఈ ఖనిజాల అన్వేషణ కోసం కొత్తగూడెంలోని పాత కలెక్టరేట్ భవనంలో రీసెర్చ్ సెంటర్‌ను కూడా త్వరలో ఏర్పాటు చేయనున్నారు. సత్తుపల్లిలో లభించే ఈ ఖనిజాలు ఇస్రోకు ఉపయోగపడేలా ఉంటే అక్కడ భవిష్యత్‌లో పరిశ్రమ ఏర్పాటు చేసే అవకాశం ఉందని సింగరేణి అధికారులు చెబుతున్నారు.

సత్తుపల్లిలో అరుదైన ఖనిజాలు..

సత్తుపల్లిలో ప్రస్తుతం ఓపెన్ కాస్ట్ మైనింగ్ నడుస్తోంది. బొగ్గుతోపాటు బాక్సైట్, సిలికా, ఐరన్ వంటి ఖనిజాలు లభ్యమవుతున్నాయి. అటవీ ప్రాంతం కూడా ఎక్కువగా ఉండడంతో డోలమైట్, బారైట్ వంటివి కూడా అందుబాటులో ఉన్నాయి. ఇంకా ఇస్రోకు ఉపయోగపడే స్కాండియం, స్ట్రాటియం, నియోడయోనియం వంటి వాటిని కూడా గుర్తించారు. టైటానియం, లిథియం, సిలికాన్, నికెల్ వంటి వాటి కోసం అన్వేషిస్తున్నారు. ఉపగ్రహాలు, రాకెట్లు, అంతరిక్ష సాంకేతిక పరికరాల తయారీలో అధిక బలం, తక్కువ బరువు, అధిక తాపన నిరోధకత కలిగిన ఖనిజాలను వినియోగిస్తారు. టైటానియం, స్కాండియం, స్ట్రాటియం, నియోడయోనియం ఇందులో కీలకపాత్ర పోషిస్తాయి. స్కాండియంను స్పేస్ మెషీన్లలో శక్తి ఉత్పత్తికి ఉపయోగిస్తారు. స్ట్రాటియంను రేడియో థర్మోఎలక్ట్రిక్ జనరేటర్లలో శక్తి ఉత్పత్తికి, లేజర్ల తయారీకి, ప్లాస్మా డిస్ప్లేల తయారీ, అంతరిక్షంలో దీర్ఘకాలిక శక్తి ఉత్పత్తి కోసం దీనిని ఉపయోగిస్తారు. నియోడయోనియం ఎలక్ట్రిక్ మోటార్లు, స్టెపర్ మోటార్ల తయారీకి, కమ్యూనికేషన్ ఉపగ్రహాల్లో లేజర్ ఆధారిత వ్యవస్థల తయారీకి ఉపయోగపడుతుంది.

మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ

- జార్ఖండ్ ఎన్‌కౌంటర్‌లో కేంద్ర కమిటీ సభ్యుడు పర్వేశ్ మృతి
- మరో ఇద్దరు కీలక మావోయిస్టులు కూడా...



బిర్సేన్



హేమాంబ్రం



పర్వేశ్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. జార్ఖండ్‌లో సోమవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు సహదేవ్ అలియాస్ పర్వేశ్‌తోపాటు రఘునాథ్ హేమాంబ్రం (స్పెషల్ ఏరియా కమిటీ సభ్యుడు), బిర్సేన్‌గంజు (సబ్‌జోనల్ కమిటీ మెంబర్) మృతి చెందారు. వీరిలో సహదేవ్‌పై రూ.కోటి రివార్డు ఉండగా, హేమాంబ్రంపై రూ.25 లక్షలు, బిర్సేన్‌పై రూ.10 లక్షల రివార్డు ఉంది.

తెల్లవారుజామున 4:20 గంటలకు

జార్ఖండ్ రాష్ట్రం హజీర్‌బాగ్ జిల్లా పాంటిత్రీ పంచాయతీ సమీపాన ఉన్న ఆదివాసీ గ్రామమైన కర్హండిలో ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఎనిమిది నుంచి పది గుడిసెలు ఉన్న గ్రామంలోని ఓ ఇంట్లో మావోయిస్టులు తలదాచుకున్నారు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో ఆదివారం రాత్రి సీఆర్‌పీఎఫ్ కోబ్రా దళాలు, జిల్లా పోలీసులు కూంబింగ్ చేపట్టారు. సోమవారం తెల్లవారుజామున 4:20 గంటలకు ఇరువర్గాల మధ్య కాల్పులు మొదలై 5 గంటల వరకు జరిగాయి. ఉదయం 6 గంటల సమయంలో సోదా చేయగా గ్రామంలో మావోయిస్టుల మృతదేహాలు కనిపించాయి. వీరి నుంచి 3 ఏకే 47 తుపాకులు స్వాధీనం చేసుకున్నట్టు హజీరాబాద్ ఎస్పీ అంజనీఅంజన్ తెలిపారు. ఈ ఘటనలో జవాన్లు అజయ్ భౌతిక్, సుబ్రతో బిశ్వాస్ గాయపడ్డారు.

ఏనుగులు వచ్చాయనుకున్నాం

ఉదయం వేళ కాల్పుల శబ్దం వినిపిస్తుండటంతో గ్రామంలోకి ఏనుగులు వచ్చి ఉంటాయని, వాటిని బెదరగొట్టేందుకు ఎవరో టపాకాయలు కాలుస్తున్నారని భావించామని ఎన్‌కౌంటర్ జరిగిన పాంటిత్రి, సమీప గ్రామాల ప్రజలు తెలిపారు. తెల్లవారక తమ గ్రామంలోకి భారీగా పోలీసు వాహనాలు వస్తుండడంతో ఎన్‌కౌంటర్ జరిగినట్టు అర్థమైందన్నారు. ఈ ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా స్పందిస్తూ 'తాజా ఎన్‌కౌంటర్‌తో జార్ఖండ్ నార్త్ రీజియన్, బొకారో ప్రాంతంలో మావోయిస్టులు తుడిచిపెట్టుకుపోయారు. అతి త్వరలోనే దేశవ్యాప్తంగా ఇదే జరుగుతుంది' అని ప్రకటించారు.

ఏడుకు చేరిన కేంద్ర కమిటీ మృతులు

ఈ ఎన్‌కౌంటర్‌తో ఈ ఏడాది మావోయిస్టు పార్టీ ఏడుగురు కేంద్ర కమిటీ సభ్యులను కోల్పోయింది. జనవరి నుంచి ఇప్పటివరకు జరిగిన వరుస ఎన్‌కౌంటర్లలో చలపతి, ప్రయాగ్‌మాంఝీ, నంబాల కేశవరావు, తెంటు లక్ష్మీనరసింహాచలం, గాజర్ల రవి, మోడెం బాలకృష్ణ.. ఇప్పుడు సహదేవ్ మొత్తం ఏడుగురు మరణించారు.

ప్రియుడితో కలిసి భర్తపై హత్యాయత్నం

- కత్తితో గొంతు కోసేందుకు ప్రయత్నం
- బాధితుడి భార్యను, ప్రియుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



తీవ్రగాయాలైన ప్రసాద్

మహబూబాబాద్ రూరల్: ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసేందుకు ఓ భార్య యత్నించగా.. తీవ్ర గాయాలతో భర్త తప్పించుకున్నాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా గడ్డిగూడెం గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మేడ ప్రసాద్‌కు జిల్లాలోని కొత్తగూడ మండలం గోవిందాపురం గ్రామానికి చెందిన రష్మితో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. కుమారుడు పుట్టినప్పటి నుంచి దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గంగారం మండలం మద్రిగూడెం గ్రామానికి చెందిన మద్దెల అనిల్‌తో రష్మికు పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా వివాహేతర సంబంధానికి దారితీసింది. దీంతో భర్త ప్రసాద్‌ను అడ్డు తొలగించుకోవాలని భావించింది. ఈ క్రమంలో ముందస్తు ప్రణాళిక ప్రకారం ఆదివారం అర్ధరాత్రి ప్రియుడు అనిల్‌ను రష్మి ఫోన్ చేసి పిలిపించింది. నిద్రిస్తున్న ప్రసాద్‌ను రష్మి వెనుక నుంచి అదిమి పట్టుకోగా అనిల్ తన వెంట తెచ్చుకున్న కత్తితో గొంతు కోసి చంపేందుకు ప్రయత్నించాడు. తప్పించుకునే ప్రయత్నంలో ప్రసాద్‌కు ఎడమ చెవి, ఎడమ చేయి, ఛాతిపై తీవ్ర గాయాలయ్యాయి. ప్రసాద్ కేకలు విన్న చుట్టుపక్కల వాళ్లు, తండ్రి పాపయ్య అక్కడికి చేరుకుని అనిల్‌ను పట్టుకుని చెట్టుకు కట్టేసి దేహశుద్ధి చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అనిల్, రష్మిని అదుపులోకి తీసుకుని మహబూబాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రసాద్‌ను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

'పాలమూరు-రంగారెడ్డి' పై ఒత్తిడి తేవాలి

- ఉమ్మడి పాలమూరు బీఆర్‌ఎస్ నేతల భేటీలో నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ నివాసంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్ కీలక నేతలు సోమవారం రాత్రి భేటీ అయ్యారు. ఈ సమావేశంలో మాజీమంత్రులు నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, అంజయ్యయాదవ్, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఐపీఎస్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, హనుమంతునాయుడు, కేశవులు తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పురోగతిపై చర్చించారు. ప్రాజెక్టు 85 శాతం పూర్తయిందని, ఐదు రిజర్వాయర్ల నిర్మాణ పనులు కూడా 85 శాతం పూర్తయ్యాయని నేతలు చెప్పారు. ప్రాజెక్టు పూర్తయితే మహబూబ్‌నగర్ జిల్లాలో 15 లక్షల ఎకరాలకు సాగునీరు అందించవచ్చని, వలసలను నిరోధించవచ్చని నాయకులు అభిప్రాయపడ్డారు. కొత్తగా అధికారంలోకి కాంగ్రెస్ వచ్చిన ప్రభుత్వానికి సమయం ఇచ్చామని, ఇప్పుడు ప్రాజెక్టు పూర్తి కోసం ఒత్తిడి తీసుకొచ్చేందుకు అన్ని పార్టీల నాయకులతో కలసి త్వరలో కార్యాచరణ రూపొందిస్తామని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసేందుకే జాతీయ విద్యావిధానం

- అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్



కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

సాక్షి, హైదరాబాద్/హనుమకొండ/కొడంగల్/కొడంగల్ రూరల్: జాతీయ విద్యావిధానం అమలుతో ఐసీడీఎస్ (సమగ్ర శిశు అభివృద్ధి పథకం) పూర్తిగా నిర్వీర్యమై పోతుందని సీఐటీయూకు అనుబంధంగా ఉన్న అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆందోళన వ్యక్తం చేసింది. పూర్వ ప్రాథమిక విద్య పేరిట అంగన్‌వాడీ కేంద్రాలను పాఠశాల విద్యాశాఖలో విలీనం చేయడం అత్యంత ప్రమాదకరమని మండిపడింది. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించింది. రాష్ట్రంలోని పలు జిల్లా కేంద్రాలు, తాలూకా, మండల కేంద్రాల్లో కూడా నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

సీఎం ఇంటి ముట్టడికి యత్నం

వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని లాహోటీ కాలనీలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడికి అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది సోమవారం యత్నించారు. ఆందోళనకారులను పోలీసులు అడ్డుకోవడంతో పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా, బస్టాండు ప్రాంగణం తదితర చోట్ల నిరసన తెలిపారు. ధర్నాకు అంగన్‌వాడీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్వీర్యం చేయడం కోసం కొత్తగా జాతీయ విద్యా చట్టం తెచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రీ ప్రైమరీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే నిర్వహించి టీచర్లకు అదనంగా రూ.8 వేలు, హెల్పర్లకు రూ.6 వేల వేతనం పెంచాలని డిమాండ్ చేశారు.

మంత్రి సురేఖ ఇంటి వద్ద ఉద్రిక్తత

హనుమకొండ రాంనగర్‌లోని మంత్రి కొండా సురేఖ ఇంటికి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ర్యాలీగా బయలుదేరారు. ప్రధాన రోడ్డు నుంచి మంత్రి ఇంటికి వెళ్లే రాంనగర్ కూడలిలో పోలీసులు ర్యాలీని అడ్డుకున్నారు. అయితే పోలీసులను తోసుకుంటూ ర్యాలీ ముందుకు సాగింది. మంత్రి ఇంటి వైపునకు వెళ్లే దారికి బారికేడ్లు అడ్డుగా పెట్టి పోలీసులు మరోసారి అడ్డుకున్నారు. పోలీసులను ప్రతిఘటిస్తూ వారంతా మంత్రి కొండా సురేఖ ఇంటి ముందుకు చేరుకున్నారు. అంగన్‌వాడీలు మంత్రి ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా వారించడంతో ఇంటి ముందు బైఠాయించి మూడు గంటల పాటు ధర్నా చేశారు. చివరకు పోలీసులు వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.



భారీ గ్రహశకలం పలకరించే వేళ..

- సైజ్‌లో కుతుబ్‌మినార్ కంటే పెద్దది
- భూమికి సమీపంగా వెళ్లనున్న ఆస్టరాయిడ్
- నిశితంగా గమనించనున్న ఖగోళ శాస్త్రవేత్తలు

వాషింగ్టన్: మరో ఖగోళ అద్భుతానికి అంతరిక్షం వేదికకానుంది. ఈ నెలలోనే త్వరలో ఒక గ్రహశకలం సమీపంగా వచ్చి మన పుడమిని పలకరించి వెళ్లనుంది. 2025 ఎఫ్ఏ22 పేరున్న ఈ గ్రహశకలం పథాన్ని అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా 'నియర్ ఎర్త్ ఆబ్జెక్ట్ స్టడీస్' కేంద్రం నుంచి పరిశీలిస్తోంది. దీంతోపాటు అమెరికాలోని క్రిసెంటీ వ్యాలీలోని జెట్ ప్రొపల్షన్ ల్యాబొరేటరీ నుంచీ సైతం దీని గమనాన్ని ఖగోళ శాస్త్రవేత్తలు నిశితంగా గమనిస్తున్నారు. సెప్టెంబర్ 18వ తేదీ ఉదయం 8.33 గంటలకు భూమికి అత్యంత చేరువగా ఇది పయనించనుందని శాస్త్రవేత్తలు చెప్పారు. ఆ సమయంలో ఇది కేవలం 8,41,988 కిలోమీటర్ల దూరం నుంచి దూసుకు పోనుంది. భూమికి ఇంత దగ్గరగా వెళ్తుండటంతో ఖగోళ శాస్త్రవేత్తలు, అంతరిక్ష ఔత్సాహికుల్లో ఆసక్తి రెట్టింపైంది. అత్యంత శక్తివంతమైన రాడార్లు, ఆప్టికల్ టెలిస్కోప్‌ల సాయంతో దీనిని వీక్షించేందుకు ఉబలాటపడుతున్నారు. ఈ గ్రహ శకలం చుట్టుకొలత 163.88 మీటర్లు. పొడవు 280 మీటర్లు. అంటే ఇది ఢిల్లీలోని ప్రఖ్యాత కుతుబ్ మినార్ కంటే పెద్దది. ఇది 1.85 సంవత్సరాల్లో మన సూర్యుడిని ఒక చుట్టు చుట్టేస్తోంది. భూమికి అత్యంత సమీపంగా దూసుకుపోతున్నప్పటికీ గురుత్వాకర్షణ ప్రభావ పరిధిలో ఇది లేదు. ఈ గ్రహశకలాన్ని ఈ ఏడాది తొలి నాళ్లలో తొలిసారిగా గుర్తించింది. హవాయిలోని పనోరమిక్ సర్వే టెలిస్కోప్, ర్యాపిడ్ రెస్పాన్స్ సిస్టమ్(పాన్-స్టార్2) ఈ గ్రహశకలాన్ని మార్చి 29వ తేదీన గుర్తించింది. 2173 సెప్టెంబర్ 21వ తేదీన ఇది భూమికి అత్యంత చేరువగా వచ్చే ప్రమాదముంది.

ఐదేళ్ల నిబంధన కుదరదు

వక్ఫ్ సవరణ చట్టంలోని కీలక సెక్షన్లపై స్టే విధింపు

- వక్ఫ్‌కు ఆస్తి ఇవ్వాలంటే ఐదేళ్లుగా ఇస్లాంను పాటించాలనే నిబంధనపై సుప్రీంకోర్టు స్టే
- వక్ఫ్ ఆస్తుల ఖరారులో కలెక్టర్ విచక్షణాధికారాల నిలుపుదల
- వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతర సభ్యుల సంఖ్యకు పరిమితి విధింపు
- వక్ఫ్ సవరణ చట్టం మొత్తాన్నీ నిలుపుదలచేయడం కుదరదన్న కోర్టు
- కొన్ని ప్రొవిజన్లకు రక్షణ ఉండాలని అభిప్రాయపడ్డ ధర్మాసనం
- కోర్టు నిర్ణయాన్ని స్వాగతించిన పలు ముస్లిం సంఘాలు

న్యూఢిల్లీ: అత్యంత వివాదాస్పదంగా తయారైన వక్ఫ్(సవరణ) చట్టం-2025 విషయంలో సర్వోన్నత న్యాయస్థానం సోమవారం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. చట్టంలోని ఒక ముఖ్యమైన నిబంధనపై స్టే విధిస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్‌ల ధర్మాసనం 128 పేజీల మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఒక వ్యక్తి తన ఆస్తిని వక్ఫ్ కోసం దానంగా ఇవ్వడం వంటికి చేయాలంటే కనీసం గత ఐదేళ్లుగా ఇస్లాంను ఆచరిస్తూ ఉండాలన్న నిబంధనపై అభ్యంతరం వ్యక్తంచేసింది. ఈ మేరకు వక్ఫ్(సవరణ) చట్టంలోని సంబంధిత నిబంధనపై స్టే విధించింది. '' ఐదేళ్లుగా ఇస్లామ్‌ను పాటించాలి అనే నిబంధనలో స్పష్టత కరువైంది. సంపూర్ణ నిర్వచనంతో, సమగ్రస్థాయిలో ఈ అంశంపై స్పష్టత వచ్చేలా నిబంధనలు తయారుచేసేవరకు ఈ ప్రొవిజన్ అమలును నిలిపేస్తున్నాం. ఏదైనా చట్టం రాజ్యాంగబద్ధంగా ఉందనే భావిస్తాం. కేవలం అరుదైన కేసుల్లో అత్యంత అరుదైన సందర్భాల్లో మాత్రమే జోక్యం చేసుకోవడం సబబు. వక్ఫ్ చట్టంలోని అన్ని నిబంధనల అమలుపై స్టే విధించాలన్న వాదనల్లో పసలేదు. అందుకే మొత్తం చట్టంపై స్టే విధించట్లేము. అయితే ఇరుపక్షాల వాదనలు విన్నాక రెండువైపులా సమతుల న్యాయం దక్కాలని చూస్తున్నాం. అందుకే వక్ఫ్ ఆస్తుల స్థితిని కలెక్టర్ మార్చే అధికారం అమలుకాకుండా స్టే విధిస్తున్నాం. అలాగే వక్ఫ్ బోర్డ్‌లలో ముస్లిమేతర సభ్యుల అంశంపై కలెక్టర్ నిర్ణయాలు తీసుకోకుండా స్టే విధిస్తున్నాం'' అని ధర్మాసనం పేర్కొంది. మరోవైపు, ''చాన్నాళ్లుగా వక్ఫ్ భూమిగా చెలామణి అయినంతమాత్రాన అది వక్ఫ్ భూమి కాబోదు. ప్రభుత్వ భూమి అయినాకూడా వక్ఫ్ ఆస్తిగా చెలామణిలో ఉన్నంత మాత్రాన అది వక్ఫ్ ఆస్తికాబోదు. వక్ఫ్ బై యూజర్ నిబంధన తొలగింపు సబబే'' అని ధర్మాసనం మోదీ సర్కార్ చర్యను సమర్థించడం గమనార్హం.

నాలుగు.. మూడుకు మించకూడదు

'' కేంద్ర వక్ఫ్ మండలిలో ముస్లిమేతర సభ్యుల సంఖ్య నాలుగుకు మించకూడదు. మొత్తం సభ్యుల సంఖ్య 20 దాటకూడదు. అలాగే రాష్ట్రాల్లో వక్ఫ్ బోర్డ్‌లలో ముస్లిమేతర సభ్యుల సంఖ్య మూడుకు మించకూడదు. మొత్తం సభ్యుల సంఖ్య 11 దాటకూడదు. కనీసం ఐదేళ్లుగా ఒక వ్యక్తి ఇస్లాంను ఆచరిస్తున్నట్లు నిర్ధారించే కచ్చితమైన నిబంధనావళిని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించేదాకా 'వక్ఫ్‌కు ఆస్తి ఇవ్వాలంటే ఐదేళ్లుగా ఇస్లాంను పాటించాలి' అనే సెక్షన్3 లోని (ℾ) క్లాజుపై స్టే విధిస్తున్నాం. సంబంధిత అధికారి తన నివేదికను సమర్పించేదాకా ఏదైనా ఆస్తి 'వక్ఫ్ ఆస్తి' అని కొత్తగా ప్రకటించడానికి వీల్లేదు. ఏదైనా ఆస్తి ఒకవేళ ప్రభుత్వ ఆస్తి అయి ఉండవచ్చని ఆ అధికారి భావిస్తే ఆ మేరకు రెవిన్యూ రికార్డుల్లో సవరణ చేయొచ్చు, ఈ అంశాన్ని ఆ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాలి అనే నిబంధనలపైనా స్టే విధిస్తున్నాం'' అని ధర్మాసనం పేర్కొంది. ''వక్ఫ్ చట్టంలోని సెక్షన్ 3సీ కింద వక్ఫ్ ఆస్తిగా ప్రకటించని సందర్భంలో, ట్రిబ్యునల్ ఆదేశంతో సవరణ చట్టంలోని సెక్షన్ 83ని అమలుచేసి సందర్భంలో, హైకోర్టు తదుపరి ఆదేశం కోసం వేచి ఉన్న సందర్భాల్లో అలాంటి ఆస్తులను ఇక వక్ఫ్ ఆస్తులుగా ప్రకటించకూడదు, రెవెన్యూ రికార్డుల్లో నమోదుచేయకూడదు'' అని నిబంధనలపైనా స్టే విధిస్తున్నాం''అని కోర్టు స్పష్టంచేసింది. వివాదాస్పద ఆస్తి ఎవరికి చెందుతుంది అనేది ట్రిబ్యునళ్లు, హైకోర్టుల్లో తేలేదాకా ఆ ఆస్తులపై మూడో పక్షానికి హక్కులు దఖలుపర్చకూడదు అని కోర్టు ఆదేశించింది. ముస్లింల వర్గానికి ఎక్స్-అఫీషియో కార్యదర్శిగా సేవలందించే చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నియామానికి బాటలు వేసే సెక్షన్ 23పై కోర్టు ఎలాంటి స్టే విధించలేదు. చట్టంలో పేర్కొన్న ప్రకారం వక్ఫ్ అనేది ముస్లింలు ఇచ్చే విరాళం, దానం. తమ భూములు, స్థిరాస్తులను దాతృత్వ, మత సంబంధ కార్యక్రమాల కోసం దానం(వక్ఫ్)గా ఇవ్వొచ్చు. ఈ భూముల్లో మసీదులు, పాఠశాలలు, ఆస్పత్రులు, ప్రజాసంస్థలు ఏర్పాటుచేసుకోవచ్చు. వక్ఫ్‌గా మారిన ఆస్తిని ఇతరులకు విక్రయించకూడదు, ఇంకొకరికి బహుమతిగా ఇవ్వకూడదు, వారసత్వంగా పొందకూడదు, ఆక్రమించకూడదు.

వక్ఫ్ బై యూజర్ తొలగింపులో వివాదం లేదు


'' పెద్ద మొత్తంలో ప్రభుత్వభూములు ఆక్రమణకు గురై చాన్నాళ్లుగా వక్ఫ్ వినియోగంలో ఉన్నాయి. నిరాటంకంగా వక్ఫ్ అధీనంలో ఉంటే అవి వక్ఫ్ బై యూజర్ నిబంధన ప్రకారం వక్ఫ్ ఆస్తులుగా మారుతున్నాయి. ఇది తప్పు అని భావించి ఈ నిబంధనను ప్రభుత్వం తొలగించింది. ఈ తొలగింపులో ఎలాంటి వివాదం లేదు'' అని సీజేఐ జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు.

స్వాగతించిన కాంగ్రెస్

''కీలక సెక్షన్లను నిలుపుదల చేస్తూ కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నాం. ఈ ఉత్తర్వు రాజ్యాంగ విలువలైన న్యాయం, సమానత్వ, సౌభ్రాతృత్వం గెలుపునకు నిదర్శనం. వాస్తవిక వక్ఫ్ చట్టాన్ని కాలరాస్తూ మోదీ సర్కార్ తీసుకొచ్చిన తప్పుడు సవరణలను తొలగించేలా తుది తీర్పు వెలువడుతుందని ఆశిస్తున్నాం'' అని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే 'ఎక్స్'లో ఒక పోస్ట్‌చేశారు. '' భారత్‌లో ఎప్పుడూ సద్దుమణిగిన అంశాలను మోదీ సర్కార్ ఎగదోస్తోంది. విద్వేషాలను పెంచేందుకు ఈ విభజన చట్టాన్ని బుల్డోజర్‌లా తీసుకొచ్చింది'' అని అన్నారు.

చాలావరకు ఆమోదించినట్లే: బీజేపీ

''మేం తెచ్చిన సవరణలను కోర్టు ఆమోదించింది. మొత్తం చట్టంపై స్టే విధించాల్సిన అవసరం లేదని కోర్టు స్పష్టంచేసింది. అంటే మెజారిటీ చట్టం చట్టబద్ధంగా ఉందని కోర్టే స్పష్టం చేసినట్లయింది. వక్ఫ్ బై యూజర్ మాటున ఇకపై వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూముల ఆక్రమణ అనేది ఇకపై ఆగుతుంది. కోర్టు నిర్ణయాలను మేం కూడా స్వాగతిస్తున్నాం'' అని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి నళిన్ కోహ్లీ చెప్పారు.



మధ్యంతర ఉత్తర్వులోని కీలకాంశాలు

- ఐదేళ్లుగా ఇస్లాంను పాటిస్తున్న వ్యక్తి మాత్రమే వక్ఫ్(దానం) ఇవ్వాలన్న సెక్షన్ 3(1)(ℾ)ను నిలుపుదల చేసింది
- ఐదేళ్లుగా ఇస్లాంలో కొనసాగుతున్నారో లేదో తేల్చే నిబంధనలు రూపొందేదాకా సెక్షన్ 3(1)(ℾ)పై స్టే అమలు
- సంబంధిత ఆఫీసర్ నివేదించాడన్న ఒకే ఒక్క కారణంగా వక్ఫ్ ఆస్తిని వక్ఫ్‌కాని ఆస్తిగా పరిగణించకూడదు
- అలాంటి నివేదికలను ఆధారంగా చేసుకుని వక్ఫ్ రికార్డులతోపాటు ప్రభుత్వ రెవెన్యూ రికార్డుల్లో సవరణలు చేయకూడదు
- హైకోర్టు ఆదేశాల మేరకు వివాదాస్పద ఆస్తులపై సెక్షన్ 83 కింద వక్ఫ్ ట్రిబ్యునళ్లు ఇచ్చే నిర్ణయాలు అమలయ్యేలోపు వక్ఫ్ బోర్డ్‌లు ఎలాంటి ఆస్తులను తమ ఆస్తులుగా, తమవికాని ఆస్తులుగా ప్రకటించకూడదు
- సీఈవోగా నియమించబోయే వ్యక్తిని వీలైనంత వరకు ముస్లిం వర్గం నుంచే ఎంపికచేయాలి
- ఇవన్నీ మధ్యంతర ఉత్తర్వులే. ఈ ఉత్తర్వులు ఇచ్చినంత మాత్రాన సవరణ చట్టం చట్టబద్ధతపై తమ తమ వాదనలను ఇరుపక్షాలు వాదించే అవకాశం లేదని భావించకూడదు.

ముస్లిం సంస్థల హర్షం

వక్ఫ్ సవరణచట్టంలో ముస్లింలకు వ్యతిరేకంగా ఉన్న కీలక నిబంధనల అమలుపై కోర్టు స్టే విధంచడంతో ముస్లిం సంఘాలు ఆనందం వ్యక్తంచేశాయి. తుది తీర్పు సైతం ముస్లింలకు అనుకూలంగా రావాలని ఆశాభావం వ్యక్తంచేశాయి. '' ఈ మధ్యంతర ఉత్తర్వులను స్వాగతిస్తున్నాం'' అని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్(ఏఐఎంపీఎల్‌బీ) ఒక ప్రకటనలో పేర్కొంది. కొన్ని నిబంధనలకు బదులు మొత్తం సవరణ చట్టాన్నే రద్దుచేయాలని ఆలిండియా షియా పర్సనల్ లా బోర్డ్(ఏఐఎస్‌పీఎల్‌బీ) ఆశాభావం వ్యక్తంచేసింది. ''ఐదేళ్లుగా ఇస్లాంను పాటిస్తేనే వక్ఫ్ అనే నిబంధనపై స్టే విధించడం పెద్ద ఊరట. ఇక వక్ఫ్ బోర్డ్‌లో ముస్లిమేతర సభ్యుని అంశం అలాగే ఉండిపోయింది''అని ఏఐఎంపీఎల్‌బీ కార్యనిర్వాహక సభ్యుడు ఖలీద్ రషీద్ ఫరాంగీ మహాలీ అన్నారు.

చట్టవిరుద్ధం అని తేలితే పక్కన పడేస్తాం

బిహార్‌లో ఓటర్ల జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ అంశంలో ఈసీని హెచ్చరించిన సుప్రీం

న్యూఢిల్లీ: బిహార్‌లో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియ ఏమాత్రం చట్టవిరుద్ధంగా అనిపించినా మొత్తం ప్రక్రియను పక్కన పడేస్తామని సర్వోన్నత న్యాయస్థానం హెచ్చరించింది. ఎస్ఐఆర్ చట్టవిరుద్ధంగా చేపడుతున్నారంటూ దాఖలైన పిటిషన్లపై సోమవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీల ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘాన్ని హెచ్చరించింది. '' రాజ్యాంగబద్ధ సంస్థగా ఎలక్షన్ కమిషన్ ప్రతి పనినీ చట్టప్రకారమే నిర్వర్తిస్తుందని మేం మొదట్నుంచీ భావిస్తున్నాం. అయితే కొత్తగా చేపట్టిన ఎస్ఐఆర్ ఏ దశలోనైనా చట్టవిరుద్ధమని తేలితే మొత్తం విధానాన్ని రద్దుచేస్తాం. ఇప్పటికిప్పుడే ఎస్ఐఆర్‌పై తుది నిర్ణయానికి రాబోం. కేసులో చివరి వాదోపవాదనలను అక్టోబర్ ఏడోతేదీన ఆలకిస్తాం. ఈ కేసులో మేం ఇచ్చే తుది తీర్పు బిహార్‌కు మాత్రమేకాదు యావత్‌భారతదేశానికి వర్తిస్తుంది. ప్రస్తుతానికి ఎస్ఐఆర్‌లాంటి ప్రక్రియను ఇతర రాష్ట్రాల్లో ఈసీ చేపట్టినా మేం అడ్డుచెప్పబోం. దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ అమలుపై అభ్యంతరాలు ఉంటే పిటిషనర్లు తమ వాదనలను అక్టోబర్ ఏడో తేదీన వినిపించుకోవచ్చు. అక్టోబర్ ఏడున కేసు విచారణ ఉండబోతోంది ఆలోపే అంటే సెప్టెంబర్ 30వ తేదీన బిహార్ ఓటర్ల తుది జాబితా ముద్రణ ఉండబోతోంది. ఈ తేదీకి కేసు విచారణకు ఎలాంటి సంబంధం లేదు. ఆ తుది జాబితాలో ఏవైనా చట్టవిరుద్ధత కనిపిస్తే ఎస్ఐఆర్ ప్రక్రియను అప్పుడైనా రద్దుచేస్తాం'' అని కోర్టు స్పష్టంచేసింది. ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేది, పిటిషన్ వేసిన అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్(ఏడీఆర్) తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ వాదించారు. ఇతర రాష్ట్రాల్లోనూ ఎస్ఐఆర్ చేపట్టేందుకు ఈసీ సన్నాహాలు చేస్తోందని, ఈ విషయంలో ఈసీని అడ్డుకోవాలని న్యాయవాది గోపాల్ వాదించారు. '' అసలు ఈ విధానంలో చట్టబద్ధతను ఇంకా తేల్చాల్సి ఉంది. రాజ్యాంగంలో ఇలాంటి విధానం నియమనిబంధనలను పరిశీలించాల్సి ఉంది. ఆలోపే ఇతర రాష్ట్రాల్లో ప్రక్రియను ఆపాలని ఈసీకి ఆదేశాలు ఇవ్వలేం'' అని ధర్మాసనం స్పష్టంచేసింది. దేశవ్యాప్త ఎస్ఐఆర్‌పై ఈసీ మరింత ముందుకు వెళ్లేలోపే ఈసీని నిలువరించాలని కాంగ్రెస్‌సహా పలు విపక్ష పార్టీల తరఫున సీనియర్ న్యాయవాది కపిల్‌సిబల్ కోర్టును కోరారు. చట్టాన్ని తుంగలోతొక్కి ఈసీ తన సొంత నిర్ణయాలను అమలుచేస్తోందని రాష్ట్రీయ జనతాదళ్ తరఫున సీనియర్ లాయర్ ప్రశాంత్ భూషణ్ వాదించారు. ''జాబితాలో తప్పులుంటే 24 గంటల్లోపు వెబ్‌సైట్‌లో అభ్యంతరాలను అప్‌లోడ్‌చేయాలని ఈసీ చెబుతోంది. ఇది చాలా కష్టమైన పని'' అని ఆయన వాదించారు.



దేశభద్రతలో ఆత్మనిర్భరత

- సైనిక దళాల్లో సంస్కరణలు వేగవంతం చేయాలి
- త్రివిధ దళాల మధ్య మరింత సమన్వయం రావాలి
- కంబైన్డ్ కమాండర్స్ కాన్ఫరెన్స్‌లో మోదీ

కోల్‌కతా: దేశ భద్రత విషయంలో మరింత స్వయం సమృద్ధి సాధించాల్సి ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. అందుకోసం సైనిక దళాల్లో సంస్కరణలను వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. సైన్యం, నేవీ, వైమానిక దళాల మధ్య సమన్వయం, సహకారం మరింత పెరగాలని సూచించారు. కోల్‌కతాలో సోమవారం ఆయన 16వ కంబైన్డ్ కమాండర్స్ కాన్ఫరెన్స్ (సీసీసీ)ను ప్రారంభించారు. రెండేళ్లకు ఒకసారి జరిగే ఈ కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్, రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్‌కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తు కోసం మార్పు: సీసీసీలో సైనిక దళాల్లో గత రెండు సంవత్సరాల్లో చేపట్టిన సంస్కరణలను ప్రధాని సమీక్షించారు. వచ్చే రెండు సంవత్సరాల్లో చేపట్టాల్సిన సంస్కరణలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్‌లో సైనిక దళాలు చూపిన తెగువను ప్రధాని ప్రశంసించారు. 'సంస్కరణల సంవత్సరం- భవిష్యత్తు కోసం మార్పు' అనే పేరుతో నిర్వహిస్తున్న ఈ సమావేశంలో సైనిక, ఆయుధ పరంగా స్వయంసమృద్ధి సాధించాల్సిన ఆవశ్యకతను ప్రధాని నొక్కిచెప్పారు. భారత త్రివిధ దళాలు జాతి నిర్మాణంతోపాటు కల్లోల ప్రాంతాల నుంచి భారతీయులను సురక్షితంగా తిరిగి తీసుకురావటంలో కీలకపాత్ర పోషిస్తున్నాయని కొనియాడారు. ప్రకృతి విపత్తుల సమయంలో దళాల సేవలు వెలకట్టలేనివని ప్రశంసించారు. భవిష్యత్తులో ఎదురయ్యే భద్రతా సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవాలంటే దళాల్లో సంస్కరణలను వేగవంతం చేయాలని, సైనిక పరంగా స్వయంసమృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు.

బిహార్‌ను బీడీతో పోలుస్తారా!

- ప్రతిపక్ష ఆర్జేడీ, కాంగ్రెస్‌లపై ప్రధాని మోదీ ధ్వజం
- అక్రమ వలసదారులకు రక్షణ కల్పిస్తున్నాయని ఆరోపణ
- బిహార్‌లో పలు అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభం



పుర్నియా: బిహార్ అభివృద్ధిబాటన సాగుతుండగా ప్రతిపక్ష కాంగ్రెస్, ఆర్జేడీలు ఓర్వలేని తనంతో చులకనగా మాట్లాడుతున్నాయని ప్రధాని మోదీ మండిపడ్డారు. అవమానించడమే ప్రతిపక్ష నాయకులు పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. మోదీ సోమవారం బిహార్‌లోని పుర్నియాలో పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించిన అనంతరం భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన బిహార్ అంటే బీడీ అంటూ ప్రతిపక్ష నాయకులు చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'బిహార్‌లో తయారైన రైలింజిన్లు ఆఫ్రికా దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఈ విషయం కాంగ్రెస్, ఆర్జేడీ నేతలకు నచ్చడం లేదు. బిహార్‌లో అభివృద్ధి ఛాయలు కనిపించినప్పుడల్లా ఈ నేతలు చెలరేగిపోతున్నారు. కాంగ్రెస్, ఆర్జేడీ నేతలు ఏకమై బిహార్‌ను బీడీతో పోలుస్తూ సోషల్ మీడియా వేదికలపై చెలరేగిపోతున్నారు'అని ఆయన అన్నారు. 'ఈ రెండు పార్టీల నేతలు సొంత కుటుంబసభ్యుల గురించే ఎప్పుడూ ఆందోళన చెందుతుంటారు. మీ కుటుంబం సంక్షేమం వారికి పట్టదు. కానీ, మోదీకి మీరందరూ కుటుంబ సభ్యులే. అందుకే సబ్ కా సాథ్, సబ్ కా వికాస్ అని మోదీ అంటున్నారు. మీ కుటుంబం, సంక్షేమం, మీ బాగోగుల గురించి శ్రద్ధ తీసుకుంటున్నారు'అని తెలిపారు. బిహార్, పశ్చిమబెంగాల్, అస్సాం వంటి రాష్ట్రాల్లో అక్రమ వలసదారులకు ప్రతిపక్షాలు అండగా నిలుస్తున్నాయని, వీటి తీరుతో ఆయా రాష్ట్రాల జనాభాలో తీరుతెన్నుల్లో తీవ్రమైన మార్పులు సంభవిస్తున్నాయని ఆయన హెచ్చరించారు. ఆయా రాష్ట్రాల్లోని వారు తమ తోబుట్టువులు, కుమార్తెల ఆత్మ గౌరవం గురించి ఆందోళన చెందుతున్నారని తెలిపారు.దేశ భద్రత, వనరులను ప్రతిపక్షాలు పణంగా పెడుతున్నాయని ప్రధాని మోదీ విమర్శించారు. విదేశాల నుంచి అందుతున్న మద్దతుతో వలసదారులకు మద్దతుగా యాత్రలు నిర్వహిస్తూ నినాదాలు చేస్తూ నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్నారంటూ కాంగ్రెస్ చేపట్టిన ఓటర్ అధికార యాత్రనుద్దేశిస్తూ నిప్పులు చెరిగారు. ప్రతి చొరబాటుదారునూ దేశం నుంచి వెళ్లగొట్టేందుకు ఎన్‌డీఏ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ రూ.40 వేల కోట్ల విలువైన వివిధ ప్రాజెక్టులను ప్రారంభించారు. పుర్నియా ఎయిర్‌పోర్టులో కొత్తగా అభివృద్ధి పర్చిన టెర్మినల్ భవన సముదాయాన్ని ప్రారంభించారు. పుర్నియా-కోల్‌కతా మార్గంలో మొదటి విమానాన్ని జెండా ఊపి ప్రారంభించారు. మఖానా రంగం అభివృద్ధికి నేషనల్ మఖానా బోర్డు ద్వారా రూ.475 కోట్లు వెచ్చిస్తామని ప్రకటించారు. భాగల్పూర్‌లో రూ.25 వేల కోట్లతో నిర్మించే థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుకు, రూ.2,680 కోట్ల కోసి-మెచి ఇంట్రా స్టేట్ రివర్ లింకు ప్రాజెక్టుకు శంకుస్థాపనలు చేశారు.

గీత దాటితే గట్టిగా బదులిస్తాం

రష్యాకు బ్రిటన్ వార్నింగ్

లండన్: నాటో సభ్యదేశాల జోలికి వస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని రష్యాను బ్రిటన్ హెచ్చరించింది. నాటో కూటమిలో సభ్యదేశాలైన పోలండ్, రొమేనియా గగనతలాల్లోకి రష్యా డ్రోన్లు ప్రవేశించటంపై ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ అంశంపై బ్రిటన్‌లో రష్యా రాయబారి ఆండ్రీ కెలిన్‌ను పిలిపించి బ్రిటన్ విదేశాంగ శాఖ నిరసన తెలిపింది. 'రష్యా దుందుడుకు చర్యలు నాటో సభ్యదేశాల మధ్య ఐక్యతను మరింత పెంచుతాయని, ఉక్రెయిన్‌కు మద్దతుగా మరింత బలంగా నిలబడతాయని రష్యా అర్థం చేసుకుంటే మంచిది. మరోసారి నాటో గగనతలాన్ని రష్యా ఉల్లంఘిస్తే మేము కూడా బలప్రయోగానికి దిగాల్సి ఉంటుంది. పోలండ్, రొమేనియా, ఉక్రెయిన్‌కు యూకే మద్దతుగా నిలుస్తుంది' అని ఆదేశ విదేశాంగశాఖ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టంచేసింది.

ఆ బెదిరింపులకు ప్రతి చర్య తప్పదు

టారిఫ్ ఒత్తిళ్లపై స్పందించిన చైనా

బీజింగ్: రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న చైనా, మరికొన్ని దేశాలపై టారిఫ్‌లు వేయాలంటూ అమెరికాలోని ట్రంప్ ప్రభుత్వం నాటో, జీ7 కూటములపై చేస్తున్న ఒత్తిళ్లపై చైనా గట్టిగా స్పందించింది. ఇటువంటి ఏకపక్ష బెదిరింపులకు, ఆర్థిక పరమైన ఘర్షణలకు తాము భయపడబోమని తేల్చి చెప్పింది. తాము కూడా ప్రతీకార చర్యలకు దిగుతామని హెచ్చరించింది. ఆర్థిక, వాణిజ్య అంశాలపై స్పెయిన్‌లో అమెరికా, చైనా ప్రతినిధులు రెండో విడత భేటీ అయిన నేపథ్యంలో అమెరికా చేసిన హెచ్చరికలను చైనా తోసిపుచ్చింది. రష్యా సహా ప్రపంచంలోని దేశాలతో తాము నెరిపే ఆర్థిక, ఇంధన సహకారం చట్ట బద్ధమని చైనా విదేశాంగ మంత్రి లిన్ జియాన్ పేర్కొన్నారు. అమెరికా చర్యల కారణంగా అంతర్జాతీయ వాణిజ్య నిబంధనల ఉల్లంఘన జరుగుతోందన్నారు.

నేడు భారత్, అమెరికా వాణిజ్యచర్చలు

వాషింగ్టన్: భారత్‌పై అమెరికా 50 శాతం టారిఫ్‌ల భారం మోపడంతో వాటిని తగ్గించుకునేందుకు భారత్ ప్రయత్నాలు ముమ్మరంచేసింది. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలో అమెరికా అత్యున్నత స్థాయి ప్రతినిధి బృందంతో వాణిజ్య చర్చలు జరపనుంది. ఈ వివరాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు వాణిజ్య సలహాదారు పీటర్ నవరో సోమవారం వెల్లడించారు. భారతీయ ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను భారీగా పెంచడంతో అమెరికాకు భారతీయ సరకుల ఎగుమతులు ఆగస్ట్‌లో తొమ్మిది నెలల కనిష్టానికి పడిపోయిన తరుణంలో ఈ కీలక వాణిజ్య చర్చలు మొదలుకానుండటం గమనార్హం. భారత్, అమెరికా వాణిజ్యచర్చల అంశాన్ని సీఎన్‌బీసీ ఇంటర్వ్యూలో నవరో వెల్లడించారు. భేటీ కచ్చితంగా జరగనుందని భారత్ తరఫున చర్చల్లో మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న దేశ వాణిజ్యమంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ సైతం చెప్పారు. అమెరికా మధ్య, దక్షిణాసియా వ్యవహారాల వాణిజ్య ప్రతినిధి బ్రెండన్ లించ్ సైతం ఈ చర్చల్లో పాల్గొననున్నారు. '' భారత్ ఎప్పటికైనా అమెరికాతో వాణిజ్య చర్చలపై తుది నిర్ణయం తీసుకోక తప్పదు. లేదంటే వాణిజ్యం అనేది సవ్యంగా సాగదు. టారిఫ్‌ల విషయంలో భారత్ మహారాజు వంటిదే. మా సరకులపై అత్యధిక సుంకాలు మోపుతుంది. ఉక్రెయిన్‌తో యుద్ధానికి ముందు వరకు రష్యా నుంచి భారత్ కొనుగోలుచేసిన ముడి చమురు పరిమాణం చాలా అత్యల్పం. కొన్ని చుక్కల ఆయిల్ మాత్రమే కొన్నదేమో. ఇప్పుడేమో భారీఎత్తున కొనగోలుచేస్తూ భారత్ లాభాలను కొల్లగొడుతోంది. రష్యా ఆయిల్ రిఫైనరీ సంస్థలు సైతం భారత్‌కు చమురు అమ్మేసి లాభాల పంట పండిస్తున్నారు. ఈ లాభాలతో ఉక్రెయిన్ యుద్ధాన్ని మరింత ఉధృతం చేస్తున్నారు. ఉక్రెయిన్‌కు సాయపడేందుకు అమెరికా పెద్ద ఎత్తున సొంత ఖజానా కరెన్సీని ఖర్చుచేస్తోంది. అలా అమెరికన్లు పన్నుల రూపంలో అమెరికా ప్రభుత్వానికి చెల్లించిన మొత్తాలన్నీ ఉక్రెయిన్ యుద్ధం కోసం వృథా అవుతున్నాయి'' అని భారత్‌ను పరోక్షంగా నవరో విమర్శించారు.

టిక్‌టాక్‌పై డీల్ కుదిరింది

పరోక్షంగా వెల్లడించిన ట్రంప్

వాషింగ్టన్: అమెరికాలో ప్రముఖ సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్ టిక్‌టాక్ భవితవ్యంపై డీల్ కుదిరినట్లు ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరోక్షంగా వెల్లడించారు. సోమవారం ఆయన తన సోషల్‌మీడియా ఖాతా లో దీనికి సంబంధించి సంస్థ పేరు చెప్పకుండా వివరాలు వెల్లడించారు. 'అమెరికా, చైనా అధికారుల మధ్య చర్చలు సానుకూలంగా సాగాయి. అమెరికా యువత అత్యధికంగా కోరుకుంటున్న ఒక కంపెనీ విషయంలో ఒప్పందం కుదిరింది. దీనిపై వచ్చే శుక్రవా రం చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో మాట్లాడుతా'అని ప్రకటించారు. ఆయన పేరు చెప్పకపోయినా ఆ కంపెనీ టిక్‌టాక్ అని భావిస్తున్నారు. చైనా కంపెనీ బైట్‌డ్యాన్స్ సృష్టించిన టిక్‌టాక్ యాప్ ప్రపంచవ్యాప్తంగా యువతలో ఎంతో పాపులర్ అయిన విషయం తెలిసిందే.

ద.కొరియా దెబ్బకు దిగొచ్చిన ట్రంప్

విదేశీ ఉద్యోగులూ ముఖ్యమేనని వ్యాఖ్య

న్యూయార్క్: టారిఫ్‌లతో పలు దేశాలను భయపెడుతున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను దక్షిణకొరియా తన దారికి తెచ్చుకుంటోంది. అమెరికాలో భారీ పెట్టుబడులపై ఆశ వదుకోక తప్పదని ద.కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ చేసిన పరోక్ష హెచ్చరికలకు ట్రంప్ మనసు మార్చుకున్నారు. విదేశీ ఉద్యోగులూ తమకు ముఖ్యమేనని వ్యాఖ్యానించారు. విదేశీ సంస్థలు విదేశీ వృత్తి నిపుణులను వెంట తీసుకురావొచ్చంటూ సమ్మతిని ప్రకటించారు. ఇటీవల జార్జియా రాష్ట్రంలో హ్యుందాయ్ బ్యాటరీ కర్మాగారంపై ఇమిగ్రేషన్ అధికారులు దాడి చేసి 300 మందికిపైగా కార్మికులను అదుపులోకి తీసుకుని ద.కొరియాకు పంపడం ఆ దేశ అధ్యక్షుడు మ్యూంగ్ ఆగ్రహానికి కారణమైంది. అమెరికాలో తమ కంపెనీల పెట్టుబడులపై పునరాలోచిస్తామని ఆయన కరాఖండీగా చెప్పడంతో ట్రంప్ దారికిరాక తప్పలేదు.

సాక్షి హైదరాబాద్

మంగళవారం । 16 । సెప్టెంబర్ । 2025

జూబ్లీహిల్స్‌తో 'బిహార్' మెలిక..!
అధికార కాంగ్రెస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలతో 'బిహార్ కూటమి'కి మెలిక పెట్టేందుకు ఎంఐఎం సిద్ధమవుతోంది. -8లో



కళలతో.. కళకళ..
నగరం వేదికగా కొనసాగుతున్న చేనేత, హస్తకళల ఉత్సవం 'ఛాప్' ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈతరం ఫ్యాషన్, ఇంటీరియర్ ఔత్సాహికులను విశేషంగా అలరిస్తోంది. - సిటీప్లస్‌లో..

గరిష్టం/కనిష్టం
29.0/22.0

వాతావరణం
నగరంలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్ష సూచన ఉంది. గరిష్టంగా 29, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చని సమాచారం.


అఫ్జల్‌సాగర్: రోదిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు


అర్జున్, రామ కొట్టుకునిపోయిన ప్రదేశం

వరద మిగిల్చిన విషాదం!

నాలాలో గల్లంతైన వారికోసం ముమ్మర గాలింపు

24 గంటలు గడిచినా కనిపించని జాడ
- అఫ్జల్‌సాగర్, వినోభానగర్‌లో విషాదఛాయలు
- తల్లడిల్లుతున్న ముగ్గురి కుటుంబ సభ్యులు

నాంపల్లి/ముషీరాబాద్: భారీ వర్షానికి వరద పోటెత్తడంతో ఆదివారం రాత్రి నాలాలో గల్లంతైన మాన్గార్ బస్తీకి చెందిన అర్జున్, రామాల జాడ ఇప్పటి వరకు లభించలేదు. ఆదివారం రాత్రి నుంచి డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ రెస్క్యూ టీమ్‌లు తీవ్రంగా గాలిస్తున్నా ఫలితం కన్పించలేదు. అఫ్జల్‌సాగర్ నుండి మూసీ నది వరకు అణువణువూ జల్లెడ పడుతున్నారు. మూసీ నదిలోనూ ముమ్మరంగా గాలింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఇద్దరు యువకులు నాలాలో కొట్టుకుని పోవడంతో అఫ్జల్‌సాగర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. బాధిత బంధువులు బోరున విలపిస్తున్నారు. అర్జున్‌కు భార్య, ముగ్గురు పిల్లలు, రామకు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు.

ఉన్నతాధికారుల సందర్శన

కాగా అఫ్జల్‌సాగర్‌ను హైడ్రా కమిషనర్ రంగనాథ్, కలెక్టర్ దాసరి హరిచందన సోమవారం ఉదయం సందర్శించారు. సంఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. రూ.5 లక్షల నష్టపరిహారాన్ని ఇస్తామని వెల్లడించారు. నాలాలను ఆక్రమించిన ఇండ్లను వెంటనే కూల్చివేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశించారు. ఇక ఆదివారం రాత్రి ఎంఐఎం ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ సంఘటనాస్థలాన్ని సందర్శించారు. సోమవారం ఉదయం కాంగ్రెస్ నేత మహ్మద్ ఫిరోజ్ ఖాన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, నాంపల్లి నియోజకవర్గం బీజేపీ ఇన్‌ఛార్జి రాహుల్ చంద్ర అఫ్జల్‌సాగర్‌ను సందర్శించి బాధితులకు అండగా ఉంటామని భరోసాను కల్పించారు.

ప్రమాదం ఎలా జరిగిందంటే...

ఆదివారం సాయంత్రం 7 గంటల సమయంలో భారీ నుంచి అతి భారీ వర్షం కురిసింది. ఏకధాటిగా గంట పాటు కురిసిన వర్షానికి వరద నీరు బస్తీలను ముంచెత్తింది. అఫ్జల్‌సాగర్, మాన్గార్‌బస్తీ ప్రాంతాలు లోతట్టులో ఉన్నాయి. ఒకప్పుడు అఫ్జల్‌సాగర్‌లో పెద్ద చెరువు ఉండేది. ఈ చెరువు బంజారాహిల్స్‌లోని గుండ్ల చెరువు, మాసబ్‌ట్యాంక్‌లోని మాసబ్‌ట్యాంక్ చెరువుకు అఫ్జల్‌సాగర్ చెరువు గొలుసుకట్టుగా ఉండేది. ఇప్పుడా చెరువులన్నీ కనుమరుగు అయ్యాయి. కనీసం వరద నీరు కూడా సాఫీగా కిందికి వెళ్లే మార్గం లేకుండా పోయింది. ప్రస్తుతం ఈ నాలాకు ఇరు వైపులా పేదలు ఇండ్లను నిర్మించుకున్నారు. మరికొందరు నాలా మీదనే వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. అఫ్జల్‌సాగర్‌లో కూడా నాలాను ఆక్రమించి ఇండ్లు నిర్మించారు. మాసబ్‌ట్యాంక్ నుండి హబీబ్‌నగర్ మీదుగా వెళ్లే నాలా, మెహిదీపట్నం, ఫిరోజ్‌గాంధీనగర్, ఘటాల మసీదు మీదుగా వెళ్లే నాలా, సీతారామ్‌భాగ్, దత్తాత్రేయ కాలనీ, ఆసిఫ్‌నగర్ కుమ్మర్‌వాడి, జెట్‌కేఫ్ మీదుగా ప్రవహించే ఈ మూడు నాలాలు అఫ్జల్‌సాగర్ కట్ట వద్ద త్రివేణి సంగమంలాగా కలుస్తాయి. ఈ ప్రాంతానికి చేరువలోనే పైభాగంలో అర్జున్, రామ ఇండ్లు ఉన్నాయి. ఆదివారం రాత్రి వరద వచ్చిన సమయంలోనే కూలి పనులకు వెళ్లి వచ్చిన ఇద్దరూ నడుము లోతు నీళ్లలో నడుచుకుంటూ వస్తున్నారు. వరద నీటిలో మునిగిన మంచాన్ని ఇంట్లోకి తీసుకెళ్లే క్రమంలో వరద ఉధృతికి నాలాలో కొట్టుకునిపోయారు. వీధిలో పోటెత్తిన వరద నీరే నిండు ప్రాణాలను బలితీసుకుందని స్థానికులు వాపోతున్నారు.

వినోభానగర్‌లోనూ ఇదే పరిస్థితి..


రోదిస్తున్న దినేష్ కుటుంబ సభ్యులు


వినోభానగర్ నాలాలో కొట్టుకు పోయిన దినేష్ (ఫైల్)

ముషీరాబాద్ పరిధి వినోభానగర్‌లో ఆదివారం రాత్రి నాలాలో కొట్టుకుపోయిన వ్యక్తి ఆచూకీ కూడా లభించలేదు. హైడ్రా, జీహెచ్ఎంసీ అధికారులు తమ సిబ్బందితో నాలాలో క్షుణ్ణంగా గాలించినా ఫలితం కన్పించలేదు. ఇక్కడ దినేష్ (సన్నీ) అనే యువకుడు గల్లంతైన విషయం విదితమే. కాగా దినేష్‌కు భార్య, మూడేళ్ల కుమారుడు ఉన్నారు. ఇతను పెస్ట్ కంట్రోలర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం రాత్రి భారీ వర్షం కురుస్తుండడంతో దినేష్ తన ద్విచక్రవాహనాన్ని నాలా ప్రహరీ పక్కన పార్కు చేస్తుండగా ఒక్కసారిగా వరద ఉధృతి పెరగడంతో ప్రహరీ కూలి..వాహనంతో సహా కొట్టుకుపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. కాగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం వరకు వినోభానగర్ నుంచి ప్రేయర్ పవర్ చర్చి, ఆశీర్వాద్ అపార్టుమెంట్, అడిక్‌మేట్ మీదుగా ముసారంబాగ్ వరకు వెతికినా ఆచూకీ లభించలేదు. ప్రేయర్ పవర్ చర్చి సమీపంలో ఉన్న నాలా పైకప్పు తెరిచి చూడగా దినేష్ ద్విచక్రవాహనం కనిపించింది. కాగా ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహా, కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్, ఈ ఘటనపై అధికారులతో మాట్లాడారు. జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్ తదితరులు నాలాలను సందర్శించి పరిశీలించారు.

నాలాల పూడికతీతపై దృష్టిసారించాలి: ఆర్.వి.కర్ణన్


అఫ్జల్‌సాగర్ నాలాను పరిశీలిస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్

మల్లేపల్లి నాలాలో పూడికతీత, పరిశుభ్రత పనులను వెంటనే చేపట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. సోమవారం మెహిదీపట్నం సర్కిల్–12 పరిధిలోని అఫ్జల్‌సాగర్ నాలాను పరిశీలించారు. నాలాలో పేరుకుపోయిన మట్టిని తొలగించే చర్యలను వేగవంతం చేయాలని సూచించారు.

పూడికతోనే సమస్య!

సిటీలో గో'దారులకు' ప్రధాన కారణం అదే

- ఇటీవల మైత్రివనం చౌరస్తాలో సిల్ట్ తొలగింపు
- ఫలితంగా అక్కడ తప్పిన ముంపు ముప్పు
- ఇలాంటివే మరో 40 ప్రాంతాలు గుర్తింపు
- ప్రాధాన్యత క్రమంలో హైడ్రా చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: మోక్షగుండం మార్కు ప్రణాళికలు కొరవడడం..నగర జనాభాకు అవసరమైన స్థాయిలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం... చెరువులు, నాలాలు కబ్జా... రాజధానిలోని రహదారులు గోదారులు కావడానికి ఇలాంటి కారణాలు ఎన్నో ఉన్నాయి. వీటన్నింటితో పాటు అందుబాటులో ఉన్న వనరుల్నీ సక్రమంగా వినియోగించుకోకపోవడం, నిర్వహణ లేమి సైతం వరద ముంపునకు కారణంగా మారుతున్నట్లు హైడ్రా గుర్తించింది. ఇటీవల మైత్రీవనం చౌరస్తా వద్ద చేపట్టిన చర్యలు ఫలితాలు ఇవ్వడంతో నగర వ్యాప్తంగా మరో 40 ప్రాంతాల్లో అమలు చేస్తున్నట్లు కమిషనర్ ఏవీ రంగనాథ్ సోమవారం 'సాక్షి'కి తెలిపారు.

ముఖ్యమంత్రి పర్యటనతో కదలిక...

నగరంలో వర్షం కురిసిన ప్రతి సందర్భంలోనూ తీవ్రంగా ప్రభావితం అవుతున్న ప్రాంతాల్లో అమీర్‌పేట, ఎస్సార్ నగర్ కూడా ఉన్నాయి. ఆ ప్రాంతంలో వరద, ముంపు ముప్పునకు కారణాలు తెలుసుకోవడానికి గత నెల 10న ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఆ సందర్భంలోనే ప్రత్యేకంగా ట్రంక్ లైన్ ఏర్పాటు చేయడంతో పాటు ఇతర చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి ప్రధానంగా మైత్రివనం చౌరస్తా వద్ద రహదారిని పరిశీలించి, అక్కడ నీరు నిలిచిపోవడానికి కారణాలపై దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. దీంతో రంగంలోకి దిగిన వివిధ విభాగాలు ఆ ప్రాంతంలో ఉన్న మురుగు కాలువల పరిస్థితిని అధ్యయనం చేశారు. అమీర్‌పేట మెట్రో స్టేషన్ వద్ద ఉన్న కాలువ పూడికతో నిండిపోయి దాని సామర్థ్యం 25 శాతానికి పడిపోయినట్లు తేల్చారు.


మైత్రీవనం వద్ద పనులు పర్యవేక్షిస్తున్న రంగనాథ్

రోబో టెక్నాలజీతో..

దీంతో పాటు అక్కడి మెట్రో స్టేషన్ కింద ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ లైన్లు కొన్ని పూర్తిగా బ్లాక్ అవ్వడం... మరి కొన్ని పాక్షికంగా మూసుకుపోవడాన్ని అధికారులు గమనించారు. తక్షణం స్పందించిన హైడ్రా, జీహెచ్ఎంసీ అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టారు. గత వారం ప్రత్యేకంగా రోబో టెక్నాలజీ వినియోగించి అక్కడ సిల్ట్‌ను తొలగించారు. దాదాపు 20 లారీల పూడిక తీసిన తర్వాత అక్కడి నాలా, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల సామర్థ్యం గణనీయంగా పెరిగింది. ఆదివారం సాయంత్రం నుంచి కురిసిన వర్షానికి నగరంలోని అనేక ప్రాంతాలు నీట మునిగిపోయి, రహదారులన్నీ జలమయం అయ్యాయి. అయితే కీలక వాటర్ లాగింగ్ ఏరియాగా రికార్డు ఉన్న మైత్రీవనం చౌరస్తాలో మాత్రం గతానికి భిన్నమైన పరిస్థితులు కనిపించాయి. అక్కడ నీరు నిలువకుండా కొద్దిసేపటిలో వెళ్లిపోవడంతో ఇబ్బందులు తప్పాయి.

మరికొన్ని ప్రాంతాలు గుర్తించిన హైడ్రా...

మైత్రీవనం చౌరస్తా వద్ద ఫలితమిచ్చిన ప్రయోగాన్ని నగరంలోని మరికొన్ని చోట్ల అమలు చేయాలని హైడ్రా కమిషనర్ నిర్ణయించారు. వర్షంతో వాటర్ లాగింగ్ కారణంగా వాహనచోదకులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న మరో 40 ప్రాంతాలను అధికారులు గుర్తించారు. అక్కడా చుట్టుపక్కల ఉన్న నాలాలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలను పరిశీలించి పూడికలున్నట్లు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన దాని తొలగింపు చేపట్టాలని హైడ్రా కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) బృందాలు హైడ్రాలోని ఎస్ఎఫ్ఓల ఆధీనంలో పని చేస్తాయి. ఈ నేపథ్యంలోనే ఆ 40 ప్రాంతాల్లో సిల్ట్ తొలగింపు పర్యవేక్షణ బాధ్యతల్ని ఎస్ఎఫ్ఓలకు అప్పగిస్తూ ఆయన ఆదేశాలు జారీ చేశారు. వర్షం కురిసినప్పుడు, ఇతర వైపరీత్యాల సమయంలో రెస్క్యూ ఆపరేషన్లు, మిగిలిన సమయంలో ఈ పూడిక తొలగింపును పర్యవేక్షించాల్సిందిగా రంగనాథ్ స్పష్టం చేశారు.

ఆక్రమణలతో దారి మళ్లుతున్న నాలాలు

ప్రధానంగా ఉన్న కబ్జాలను తొలగిస్తాం : రంగనాథ్

సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలో నాలాల ఆక్రమణలే ప్రమాదాలకు కారణం అవుతున్నాయని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. అనేక ప్రాంతాల్లో నాలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడమే కాకుండా వాటి ప్రవాహాన్ని అశాస్త్రీయంగా దారి మళ్లించడంతో వరద నీరు సాఫీగా ముందుకు సాగట్లేదని పేర్కొన్నారు. ఆదివారం నాటి వర్షానికి నాలాల్లో పడి గల్లంతైన ముగ్గురి ఆచూకీ కోసం హైడ్రా బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. క్యాచ్‌పిట్స్ అన్నీ తీసి వెతుకుతున్నాయి. ఆసిఫ్‌నగర్‌లోని అఫ్జల్‌సాగర్‌తో పాటు ముషీరాబాద్‌లోని వినోభానగర్ నాలాల్లో జరుగుతున్న ఈ గాలింపు చర్యల్ని సోమవారం రంగనాథ్ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. నగరంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్ని చక్కదిద్దడానికి వరద ప్రవాహానికి ప్రధాన అడ్డంకిగా ఉన్న ఒకటి రెండు కట్టడాలనే తొలగిస్తామని, మిగతా వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. నాలాల సమీపంలో పేదలే ఎక్కువ సంఖ్యలో నివసిస్తున్న అంశాన్ని దృష్టిలో పెట్టుకుంటామని, ఎక్కడైనా తప్పనిసరై కూల్చివేతలు చేపట్టాల్సి వస్తే వారికి ప్రత్యామ్నాయం చూపించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుదని పేర్కొన్నారు. పేదల పట్ల ప్రభుత్వానికి సానుభూతి ఉందని, హైడ్రా కూడా అదే పంథాలో పని చేస్తుందని స్పష్టం చేశారు. ప్రతి ఏటా వర్షాకాలంలో ఈ సమస్య తలెత్తుతోందని అఫ్జల్‌సాగర్ స్థానికులతో పాటు నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ కమిషనర్ రంగనాథ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయా సమస్యల మూలాలను అధ్యయనం చేసి పరిష్కరించాల్సి ఉందని అభిప్రాయపడిన రంగనాథ్ జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, రెవెన్యూ శాఖలతో కలిసి ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. పేదల నివాసాలు పెద్ద సంఖ్యలో ఉన్నందున అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ వర్షాకాలంలో ఇప్పటి వరకూ 2200 లారీల పూడిక తొలగించామని, ఇది నిరంతరాయంగా సాగుతుందని స్పష్టం చేశారు. ఇక్కడ హైడ్రా కార్యకలాపాలను గమనిస్తున్న పొరుగు రాష్ట్రాల ప్రజలు అక్కడ కూడా ఇలాంటి వ్యవస్థ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నట్టు వార్తలు వస్తున్న విషయం గమనించాలన్నారు.

అంకితభావంతో సేవలందించాలి

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

లక్డీకాపూల్: ప్రజలకు ఉత్తమ సేవలు అందించడం ద్వారా ఉద్యోగులు, సిబ్బంది జీహెచ్ఎంసీకి, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. కష్టపడి బాగా పనిచేయాలని నూతన ఉద్యోగులకు సూచించారు. జీహెచ్ఎంసీలోని వివిధ విభాగాల్లో పనిచేస్తూ..మృతి చెందిన ఉద్యోగుల వారసులు 32 మందికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించింది. వీరికి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నియామక పత్రాలను అందించారు. 32 మందిలో 10 మంది జూనియర్ అసిస్టెంట్లుగా, 17 మంది ఆఫీస్ సబార్డినేట్లుగా, ఐదుగురు పబ్లిక్ హెల్త్ వర్కర్లుగా వివిధ విభాగాల్లో పోస్టింగ్‌లు ఇచ్చారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ..మీకు మంచి భవిష్యత్తు ఉంది. సానుకూల దృక్పథంతో ఫిర్యాదులు లేకుండా ఉత్తమ పనితీరు కనబర్చాలన్నారు. విధి నిర్వహణలో సమయపాలన తప్పనిసరిగా పాటించాలని మేయర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.



ఏ ప్రాంతం ఏ జోన్‌లోనో..?



- మాస్టర్‌ప్లాన్ -2050లో జోన్‌లు మారితే కష్టమే..
- గతంలో అనుమతులిచ్చిన స్థలాలు కన్జర్వేషన్‌లోకి మార్పు
- మరోసారి అలాగే జరిగితే ఎలా అంటున్న నిర్మాణ సంస్థలు

ట్రిపుల్‌ఆర్ వరకు హెచ్‌ఎండీఏ అనుమతులపై గందరగోళం

సాక్షి, సిటీబ్యూరో: ట్రిపుల్‌ఆర్ వరకు భవన నిర్మాణాలు, లే అవుట్‌ల కోసం హెచ్‌ఎండీఏ అనుమతులను అందజేస్తోంది. కానీ ఈ అనుమతులపైన నిర్మాణసంస్థలు, 'రియల్' వర్గాలు సందేహాలను వ్యక్తం చేస్తున్నాయి.'మాస్టర్‌ప్లాన్-2050 'రూపొందించకుండానే ఇస్తున్న అనుమతుల్లో మార్పులు, చేర్పులు చోటుచేసుకుంటే ఆర్థికంగా భారీగా నష్టపోవలసి రావచ్చునని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం అందజేస్తున్న అనుమతులకు భవిష్యత్తులో ఎలాంటి ఆటంకాలు ఉండబోవని, కొత్తగా తయారుచేస్తున్న మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగానే అనుమతులను ఇస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.కానీ గత అనుభవాల దృష్ట్యా జోన్‌ల మార్పుపైన వివిధ వర్గాల నుంచి ఆందోళన వెల్లువెత్తుతోంది. అప్పటి మాస్టర్‌ప్లాన్ అమల్లోకి రావడానికి ముందే కొన్ని ప్రాంతాలను రెసిడెన్షియల్ జోన్‌లుగా భావించి అపార్ట్‌మెంట్‌లు, భవన నిర్మాణ లే అవుట్‌లకు అనుమతులను ఇచ్చారు.కానీ ఆ తరువాత వివిధ ప్రాంతాల్లోని నివాసిత స్థలాలు కన్జర్వేషన్ జోన్‌లోకి మారాయి. దీంతో సామాన్య, మధ్యతరగతి వర్గాలు మొదలుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారుల వరకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.అప్పటి మాస్టర్‌ప్లాన్ ప్రకారం నివాసిత మండలాల జాబితా లోంచి కన్జర్వేషన్ జోన్‌లోకి మారిన ప్రాంతాలను తిరిగి నివాసిత జోన్‌లోకి మార్చేందుకు రూ.లక్షల్లో ఫీజులు చెల్లించవలసి వచ్చిందని,ప్రస్తుతం మాస్టర్‌ప్లాన్-2050 అమల్లోకి రాకుండానే ఇప్పుడు ఇచ్చే అనుమతుల వల్ల మరోసారి అలాంటి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని నిర్మాణ రంగానికి చెందిన నిపుణులు పేర్కొంటున్నారు.

ఎందుకీ సమస్య..

మాస్టర్‌ప్లాన్-2050కి అనుగుణంగానే ప్రస్తుతం అనుమతులను అందజేస్తున్నట్లు అధికారులు భరోసాను ఇస్తున్నారు. కానీ వివిధ వర్గాలకు చెందిన ప్రజల నుంచి రకరకాల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఈ అంశంపైన కొంత గందరగోళం నెలకొంది. అప్పట్లో రంగారెడ్డి జిల్లా పులిమామిడి ప్రాంతంలో సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో ఓ బడా నిర్మాణ సంస్థ వేసిన లే అవుట్‌లకు హెచ్‌ఎండీఏ అనుమతులను అందజేసింది. కానీ ఆ తరువాత అమల్లోకి వచ్చిన మాస్టర్‌ప్లాన్ ప్రకారం ఆ ప్రాంతమంతా కన్జర్వేషన్ జోన్‌లోకి మారిపోయింది. దీంతో అక్కడ ప్లాట్‌లు కొనుగోలు చేసిన సామాన్యులు తీవ్రంగా నష్టపోయారు. కన్జర్వేషన్ నుంచి మరోసారి రెసిడెన్షియల్ జోన్‌లోకి మార్చుకొనేందుకు స్థలాల కొనుగోలుదార్లు రూ.లక్షల్లో ఫీజులు చెల్లించవలసి వచ్చింది. ఒక్క పులిమామిడి ప్రాంతంలోనే కాకుండా అనేక చోట్ల ఇలాంటి సమస్యలు తలెత్తాయి. చాలా ప్రాంతాల్లో అప్పటి మాస్టర్‌ప్లాన్‌లోని లోపాలపైన ఇప్పటికీ దిద్దుబాటు చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. చెరువులు, కుంటలు, తదితర జలవనరులకు సమీపంలో ఉన్న రెసిడెన్షియల్ జోన్‌లలోని స్థలాల మార్పు కోసం హెచ్‌ఎండీఏ అధికారులు దిద్దుబాటు చర్యలను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని చోట్ల జలవనరులు ఉన్న ప్రాంతాలు కూడా నివాసిత మండలాల జాబితాలోకి మారిపోతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో మాస్టర్‌ప్లాన్-2030 స్థానంలో కొత్తగా రానున్న మాస్టర్‌ప్లాన్-2050 నేపథ్యంలో హెచ్‌ఎండీఏ అనుమతులపైన గందరగోళం నెలకొంది.

అనుమతులు తారుమారైతే ఎలా..

'వచ్చే ఏడాది అందుబాటులోకి రానున్న కొత్త మాస్టర్‌ప్లాన్ ప్రకారమే ఇప్పుడు అనుమతులను ఇస్తున్నామని అధికారులు చెబుతున్నారు.కానీ ఈ అనుమతులు తారుమారైతే పరిష్కారమేంటనే దానిపైన మాత్రం స్పష్టత లేదు.' అని షాద్‌నగర్ ప్రాంతానికి చెందిన రియల్టర్ ఒకరు తెలిపారు. ఇటీవల తాము 10 ఎకరాల్లో లే అవుట్ అనుమతులు తీసుకున్నామని, భవిష్యత్తులో ఈ ప్రాంతం ఏ జోన్‌లోకి మారుతుందో తెలియడం లేదని పేర్కొన్నారు. ఒకవేళ ఈ ప్రాంతం ఆర్థిక మండలాల జాబితాలోకి, లేదా బ్లూగ్రీన్ జోన్‌లోకి మారినా తాము పెద్ద మొత్తంలో నష్టపోవలసి వస్తుందన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి కొత్త మాస్టర్‌ప్లాన్‌ను రూపొందిస్తున్నారు. అడవులు, జలవనరుల సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారు. 2050 నాటికి హైదరాబాద్ జనాభా 3.5 కోట్లు దాటే అవకాశం ఉంటుందనే అంచనాలతో ఈ విస్తరణ ప్రణాళికలు రూపుదిద్దుకుంటున్నాయి. ఈ క్రమంలో ఇప్పుడిస్తోన్న నిర్మాణరంగ అనుమతులపైన మరింత స్పష్టత రావలసి ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

మాస్టర్‌ప్లాన్ లక్ష్యం ఏంటి..

హైదరాబాద్ మహానగరాభివృద్ధి కోసం రాబోయే ఇరువై ఐదు సంవత్సరాలను లక్ష్యంగా చేసుకొని హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా (హెచ్ఎంఏ) కోసం మాస్టర్‌ప్లాన్-2050ను రూపొందిస్తున్నారు. హైదరాబాద్‌నగరాన్ని ప్రపంచంలోని 10 అగ్రగామి గ్లోబల్‌నగరాల పక్కన నిలిపే లక్ష్యంతో రీజనల్ రింగ్ రోడ్డు వరకు విస్తరించిన హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా అభివృద్ధికి అనుగుణంగా మెగామాస్టర్‌ప్లాన్‌కు కసరత్తు చేపట్టారు. హైదరాబాద్ మహానగర పరిధి 7,257 చదరపు కిలోమీటర్ల నుంచి 10,472.723 చదరపు కిలోమీటర్లకు పెరిగిన సంగతి తెలిసిందే.నగరం చుట్టూ సుమారు 354 కిలోమీటర్ల పరిధిలో నిర్మించనున్న రీజనల్‌రింగ్‌రోడ్డు వరకు అభివృద్ధి ప్రణాళికల కోసం హెచ్‌ఎండీఏ ఈ కసరత్తు చేపట్టింది. ఈ మెగామాస్టర్‌ప్లాన్ మూడు విభాగాలుగా ఉంటుంది. మొదటిది ఆర్థికమండళ్లు, పారిశ్రామిక ప్రాంతాలు, అంతర్జాతీయ బహుళ జాతి సంస్థల వ్యాపార కార్యకలాపాల విస్తరణ కోసం ఆర్థికాభివృద్ధి ప్రణాళిక (ఎకనమిక్ డెవలప్‌మెంట్ ప్లాన్) కాగా, రెండోది హైదరాబాద్ మెట్రో ఏరియా వరకు రహదారులు, మౌలిక సదుపాయలు, ప్రజారవాణా సదుపాయాల విస్తరణ కోసం కాంప్రహెన్సివ్ మొబిలిటీప్లాన్, జలనరులు, అర్బన్‌ఫారెస్టులు, పచ్చదనం అభివృద్ధి లక్ష్యంగా మూడో ప్రణాళిక బ్లూగ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లాన్ ఉంటుంది. ప్రస్తుతం ఈ మూడు వివిధ దశల్లో ఉన్నాయి.

నగరంలో నేడు

- బేగంపేటలోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు హెచ్‌సీఎల్ సైకిలోథాన్‌పై ప్రత్యేక కార్యక్రమం జరుగుతుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ డక్కన్‌లో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఆకృతి ఎలైట్ ఆధ్వర్యంలో లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ జరుగుతుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని కళింగ కల్చరల్ హాల్‌లో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన అందుబాటులో ఉంటుంది.
- గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్‌లో డిజైర్ ఎగ్జిబిషన్ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7.30గంటల వరకు పెన్సిల్ డ్రాయింగ్స్, స్కల్ప్చర్స్, స్టేకిడ్ స్టోరీస్ , టీప్ ఇంటీరియల్స్ చిత్ర ప్రదర్శనలు అందుబాటులో ఉంటాయి.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

జూబ్లీహిల్స్‌తో 'బిహార్' మెలిక..!

ఉప ఎన్నికలో పోటీపై సందిగ్ధత

- బిహార్ మహాకూటమిలో చేరేందుకు అసక్తి
- రాష్ట్రంలో కాంగ్రెస్‌తో మజ్లిస్ సత్సంబంధాలు

సాక్షి,సిటీ బ్యూరో: రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలతో 'బిహార్ కూటమి'కి మెలిక పెట్టేందుకు ఆల్ ఇండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్(ఏఐఎంఐఎం) సిద్ధమవుతోంది. జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ముస్లిం ఓటర్లు ఎక్కువగా ఉండటంతో మజ్లిస్ గత మూడు పర్యాయాలుగా అక్కడ పాగా వేసేందుకు ప్రయత్నిస్తూనే ఉంది. ప్రస్తుతం తెలంగాణలో అధికార కాంగ్రెస్‌కు మిత్ర పక్షం కానప్పటికీ... ప్రభుత్వ నిర్ణయాలకు సహకరిస్తూ వస్తోంది. అయితే తాజాగా బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అక్కడ కాంగ్రెస్, ఆర్‌జేడీ సారథ్యంలోని మహా కూటమి(ఇండియా)లో చేరేందుకు అసక్తి చూపుతున్నా....కూటమి నుంచి సానుకూల స్పందన రాక పోవడాన్ని మజ్లిస్ తీవ్రంగా పరిగణిస్తోంది. దీంతో కాంగ్రెస్ పాలిత ప్రాంతమైన తెలంగాణలో జూబ్లీహిల్స్ ఉపఎన్నికలను సాకుగా చూపించి మహా కూటమిపై ఒత్తిడి తెచ్చేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఒకవేళ అక్కడ కూటమిలో అవకాశం దక్కని పక్షంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేసి కాంగ్రెస్‌కు గుణ పాఠం చెప్పాలా..? లేక స్థానిక అవసరాల కోసం సహకరించాలా? అని సందిగ్ధంలో పడినట్లు కనిపిస్తోంది. మజ్లిస్ పార్టీ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల బరిలో దిగితే అధికార కాంగ్రెస్‌కు గెలుపు అంత సులువు కాదని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు.

ముస్లిం ఓటర్లు అధికం..

గత మూడు పర్యాయాలుగా జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో పాగా వేసేందుకు మజ్లిస్ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఈ అసెంబ్లీ సెగ్మెంట్‌లో సగానికి పైగా ముస్లిం ఓటర్లు ఉన్నారు. తొలిసారిగా 2014లో జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బరిలో దిగి ఢీ.. అంటీ ఢీ అనే విధంగా పోటీ పడి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలైన మజ్లిస్... ఆ తర్వాత 2018లో జరిగిన ఎన్నికల్లో అప్పటి అధికార పక్షం బీఆర్ఎస్ దోస్తీ కోసం బరిలో దిగకుండా సిట్టింగ్ ఎమ్మెల్యేకు మద్దతు ప్రకటించింది. కాగా 2023లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చి జూబ్లీహిల్స్ మాత్రం సిట్టింగ్ ఎమ్మెల్యేపై స్నేహపూర్వక పోటీకి దిగి పరాజయం పాలైంది. రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు అధికారం చేజారగా, కాంగ్రెస్ గద్దెనెక్కింది. అ తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలతో అధికార కాంగ్రెస్‌తో మజ్లిస్ స్నేహం కుదిరింది. తాజాగా సిట్టింగ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మృతి చెందడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది.

ఆ దిశగా ప్రయత్నాలు

త్వరలో జరుగనున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఎన్‌డీఏ కూటమిని ఓడించేందుకు కాంగ్రెస్, ఆర్‌జేడీ సారథ్యంలోని మహా కూటమి(మహా ఘట్బంధన్) లో చేరేందుకు ఏఐఎంఐఎం శత విధాల ప్రయత్నిస్తోంది. సంస్థాగతంగా బలంగా ఉన్న సీమాంచల్‌లో ఆరు స్థానాలు కేటాయిస్తే కలిసి వస్తామని ఇప్పటికే ప్రకటించింది. మహా కూటమి తమతో కలిసిరాని పక్షంలో బిహార్‌లోని అన్ని నియోజకవర్గాల్లో మజ్లిస్ అభ్యర్థులను బరిలోకి దింపుతామని ఆ పార్టీ అధినేత ఒవైసీ ఇప్పటికే స్పష్టం చేశారు. వాస్తవంగా తెలంగాణ, మహారాష్ట్ర తర్వాత బిహార్‌ను పార్టీ విస్తరణకు అనుకూలంగా మజ్లిస్ భావిస్తోంది. తొలిసారిగా 2015 అసెంబ్లీ ఎన్నికల్లో సీమాంచల్‌లోని ఆరు స్థానాల్లో తొలిసారి పోటీ చేసి విజయం సాధించలేక పోయినప్పటికి 2020 అసెంబ్లీ ఎన్నికల్లో 20 సీట్లలో పోటీ చేసి ఐదు సీట్లను దక్కించుకుంది. ఐదుగురు శాసనసభ్యుల్లో నలుగురు పార్టీని వీడి రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ)లో చేరారు. గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఎనిమిది స్థానాల్లో పోటీ చేసినా.. ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. ఇటీవల మహాకూటమిలో చేరేందుకు అసక్తి కనబరుస్తూ ఇటీవల సాక్షాత్తు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అఖ్తరుల్ ఇమాన్స్ ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు లేఖ రాశారు. రాబోయే ఎన్నికల్లో లౌకిక ఓట్లు చీలిపోయి మతతత్వ శక్తులు అధికారంలోకి వచ్చే అవకాశం ఇవ్వకూడదనే కూటమిలో చేరేందుకు ముందుకు వస్తున్నట్లు , గత అసెంబ్లీ లోక్‌సభ ఎన్నికల సమయంలో మహా కూటమిలో చేరాలనే ఆసక్తి కనబర్చామని కానీ తమ ప్రయత్నాలు ఫలించలేదు' అని లేఖలో పేర్కొన్నారు అయితే మహా కూటమి నుంచి మాత్రం ఎలాంటి స్పందన లేకపోవడంతో కాంగ్రెస్ అధిష్టానం వైపు నుంచి ఒత్తిడి తెచ్చేందుకు మజ్లిస్ సిద్ధమైనట్లు సమాచారం.

మా పిల్లల భవిష్యత్తు ఏంటి?

మేధా స్కూల్ ఎదుట విద్యార్థుల తల్లిదండ్రుల అందోళన



ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: మత్తు పదార్థాలు తయారు చేస్తున్నట్లు తేలడంతో మేధా స్కూల్‌ను విద్యాశాఖ అధికారులు సీజ్ చేశారు. దీంతో తమ పిల్లల భవిష్యత్తు ఏమిటని విద్యార్థుల తల్లిదండ్రులు స్కూల్ ఎదుట సోమవారం ఆందోళన చేపట్టడంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. రోజు మాదిరిగానే విద్యార్థులు స్కూల్‌కు రాగా పాఠశాల గేట్‌కు తాళాలు వేసి ఉన్నాయి. దీంతో వారు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న వారు స్కూల్ ఎదుట అందోళనకు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న బాలానగర్ మండల విద్యాశాఖ అధికారులు అక్కడికి వచ్చి స్కూల్ టీచర్లను పిలిపించి స్కూల్‌లో ఉన్న విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకుని దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించి మీ పిల్లలను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సమీప పాఠశాలలో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ పాఠశాలతో పాటు అందుబాటులో ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తామని విద్యా సంవత్సరం నష్టపోనివ్వమని హామీ ఇచ్చారు. అనంతరం ఎంఈఓ హరిచంద్ర మాట్లాడుతూ మేధా స్కూల్‌కు 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు మాత్రమే అనుమతులు ఉన్నాయని 63 మంది విద్యార్థులు చదువుకుంటున్నట్లు తెలిపారు. గత పదేళ్లుగా పాఠశాల నడుస్తుందని పాఠశాల గుర్తింపును రద్దు చేసే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు స్కూల్ సీజ్ అయిన విషయం తెలియదని పరీక్షల నేపథ్యంలో విద్యార్థులను తీసుకుని స్కూల్‌కు రావడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొందన్నారు. స్కూల్ టీచర్లు, అధికారులు నచ్చచెప్పడంతో వారు అందోళన విరమించారు.

ఔటర్‌పై కారు బోల్తా..

- దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా ఘటన
- యువతి మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు
- నలుగురికి స్వల్ప గాయాలు



ఔటర్‌పై బోల్తాపడిన కారు



సౌమ్యారెడ్డి (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: స్నేహితులంతా కలిసి దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా వారు ప్రయాణిస్తున్న కారు ఔటర్ రింగ్‌రోడ్డుపై అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఓ యువతి మృతి చెందగా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా, వావిలాల గ్రామానికి చెందిన రాళ్లకత్వ వెంకటేశ్వర్ రెడ్డి కుమార్తె సౌమ్యారెడ్డి (25) నగరంలోని ఇన్ఫోసిస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తోంది. తన స్నేహితులైన నందకిషోర్, వీరేంద్ర, ప్రణీష్, సాగర్, అరవింద్, ఝాన్సీ, శృతితో కలిసి ఆదివారం కారులో రాచకొండ సమీపంలోని సరళ మైసమ్మ దేవాలయానికి వెళ్లారు. రాత్రి ఇంటికి తిరిగి వస్తున్న వారు బొంగ్లూర్ వద్ద ఔటర్‌పై నుంచి ఘట్‌కేసర్ వైపు వెళ్తుండగా బలిజగూడ సమీపంలో భారీ వర్షం కారణంగా వీరు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో సౌమ్యారెడ్డితో పాటు పలువురికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వారికి చికిత్స నిమిత్తం వివిధ ఆస్పత్రులకు తరలించారు. సౌమ్యారెడ్డి చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతిచెందింది. మరో ముగ్గురు తీవ్రగాయాలతో చికిత్స పొందుతుండగా, మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరి నుంచి రూ.49.4 లక్షలు స్వాహా

- టెలిగ్రామ్ యాప్ కేంద్రంగా వ్యవహారం
- సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో కేసు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: సోషల్‌మీడియా యాప్ టెలిగ్రామ్ ద్వారా ఇద్దరు నగర వాసులకు ఎర వేసిన సైబర్ నేరగాళ్లు రూ.49.4 లక్షలు కాజేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు సోమవారం కేసులు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మెహదీపట్నం ప్రాంతానికి చెందిన ఓ వ్యాపారి కొన్నేళ్లుగా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌తో పాటు ఆన్‌లైన్‌లో హోల్‌సేల్‌గా వస్తువులు కొనుగోలు చేస్తుంటారు. ఈ ఏడాది మే 13న తక్కువ ధరకు బల్క్‌లో వస్తువుల విక్రయం పేరుతో ఉన్న ఓ టెలిగ్రామ్ గ్రూపు ఆయన దృష్టికి వచ్చింది. అందులో ప్రవేశించిన అతను రూ.30 లక్షల విలువైనవి ఆర్డర్ చేసి... రూ.9,99,990 అడ్వాన్స్‌గా చెల్లించారు. ఆపై అతడిని సంప్రదించిన నేరగాళ్లు డెలివరీ సమస్య ఉందంటూ నమ్మించి మరో రూ.3 లక్షలు డిమాండ్ చేయడంతో ఆ మొత్తం కూడా చెల్లించారు. ఇలా పదేపదే అతడిని సంప్రదించి పలు దఫాలుగా మొత్తం రూ.39,74,989 బదిలీ చేయించుకున్నారు. ఆపై వారి నుంచి స్పందన లేకపోవడం, సదరు గ్రూపుతో పాటు వారి ఫోన్లు పని చేయడకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. మరో ఉదంతంలో ఇన్‌స్టాగామ్‌లో ట్రేడింగ్ పేరుతో వచ్చిన ఓ రీల్ చూసిన ఆకర్షితుడైన లక్డీకాపూల్ వాసి వర్చువల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని, పెట్టుబడులు పెట్టి భారీగా నష్టపోయాడు. బాధితుడు ఆగస్టు 19న ఇన్‌స్టాగామ్‌లో బ్రౌజ్ చేస్తుండగా కనిపించిన రీల్ ఆధారంగా నోమురా అనే వర్చువల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నాడు. ఆపై అతడిని ఓ వాట్సాప్ గ్రూపులో చేర్చిన సైబర్ నేరగాళ్లు ఇన్వెస్ట్‌మెంట్స్ పేరుతో ఎర వేశారు. నేహా అయ్యర్ అని చెప్పుకున్న మహిళ ఆ యాప్ ద్వారా పెట్టుబడి పెట్టమంటూ అతడికి సూచించింది. తొలుత అతగాడు వర్చువల్ యాప్‌కు రూ.9,65,400 బదిలీ చేశారు. లాభాలతో కలిపి ఆ యాప్‌లో రూ.27,51,400 బ్యాలెన్స్ చూపించింది. ఆ మొత్తం విత్‌డ్రా చేసుకోవాలని ప్రయత్నిస్తే సాధ్యం కాలేదు. ఆ డబ్బు తిరిగి తీసుకోవాలంటే మరో రూ.18 లక్షలు సైబర్ నేరగాళ్లు డిమాండ్ చేశారు. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు సైబర్ ఠాణాను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పెద్దమంగళారంలో హార్టికల్చర్ వర్సిటీ!

- భూసేకరణకు ప్రభుత్వం సన్నాహాలు
- 373 ఎకరాల లావణి, సర్కార్ భూముల గుర్తింపు
- భూసేకరణపై తాజాగా రైతులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ చంద్రకళ

మొయినాబాద్: ప్రభుత్వ, లావణి భూములను స్వాధీనం చేసుకునేందుకు సర్కార్ రంగం సిద్ధం చేస్తోంది. మొయినాబాద్ ప్రాంతంలో గోశాల ఏర్పాటుకు వంద ఎకరాలు కేటాయించిన ప్రభుత్వం మరో 373 ఎకరాల్లో హార్టికల్చర్ యూనివర్సిటీ ఏర్పాటుకు సన్నాహాలు మొదలు పెట్టింది. ఇప్పటికే భూములను సర్వే చేసిన చేసిన రెవెన్యూ అధికారులు సోమవారం భూ సేకరణపై రైతులతో సమావేశం నిర్వహించారు.

ఇప్పటికే పూర్తయిన సర్వే

మున్సిపల్ పరిధిలోని పెద్దమంగళారం రెవెన్యూలో హార్టికల్చర్ వర్సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రయత్నాలు మొదలు పెట్టింది. అందుకోసం ప్రభుత్వ, లావణి భూములను ఎంచుకుంది. సర్వే నంబర్ 218లో 227.35 ఎకరాలు, సర్వేనంబర్ 149లో 155.12 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించింది. ఆయా సర్వే నంబర్లలోని భూములపై ఇప్పటికే రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. 218 సర్వేనంబర్‌లో అప్పట్లోనే 52 ఎకరాల భూమిని 16 మంది రైతులకు కేటాయించి లావణి పట్టాలు ఇచ్చారు. సదరు భూములను రైతులు ఇతరులకు విక్రయించడంతో చేతులు మారాయి. ప్రస్తుతం ఈ భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్నాయి. ఇదే సర్వే నంబర్‌లోని పది ఎకరాల్లో ప్రభుత్వ బాలుర వసతి గృహం, పల్లె ప్రకృతి వనం, ప్రార్థనా మందిరాలు నిర్మించారు. 149 సర్వే నంబర్‌లోని 155.12 ఎకరాల ప్రభుత్వ భూమిలో కొందరు రైతులు పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ భూములను సర్కార్ స్వాధీనం చేసుకునేందుకు రైతులతో చర్చలు మొదలు పెట్టింది. రాజేంద్రనగర్‌లో ఉన్న హార్టికల్చర్ వర్సిటీని ఇక్కడ ఏర్పాటు చేసేందుకే భూసేకరణ జరుగుతున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది.

ప్రభుత్వ అవసరాలకే భూసేకరణ

ప్రభుత్వ అవసరాల కోసమే పెద్దమంగళారంలో భూసేకరణ జరుగుతోందని చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ అన్నారు. సోమవారం పెద్దమంగళారం వార్డు కార్యాలయం వద్ద రైతులు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధిలో భాగంగా సర్కారు ఇక్కడి భూములను తీసుకోవడం జరుగుతోందన్నారు. అసైన్డ్ పట్టా ఉన్న రైతులకు ఎకరాకు 800 గజాల స్థలం, పట్టా లేకుండా ప్రభుత్వ భూమిని సాగుచేసుకుంటున్న రైతులకు ఎకరాకు 300 గజాల చొప్పున పరిహారం ఇస్తామన్నారు. హెచ్ఎండీఏ నిబంధనల ప్రకారం లేఅవుట్ చేసి రైతులకు పరిహారం ఉంటుందన్నారు. త్వరలోనే మరోసారి సమావేశం నిర్వహిస్తామని, అప్పటిలోగా రైతులు తమ నిర్ణయాన్ని తెలియజేయాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ గౌతమ్‌కుమార్, ఆర్ఐ రాజేష్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొంపల్లి అనంతరెడ్డి, మాజీ సర్పంచ్ కోట్ల నరోత్తంరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ డప్పు రాజు, నాయకులు సంజీవరావు, మోహన్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి పిలిచి చావబాదారు

సనత్‌నగర్: స్నేహితుడిని తన ఇంట్లో జరిగే పార్టీకి ఆహ్వానించి చావబాదిన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సనత్‌నగర్ ఎస్సార్టీ కాలనీలోని జీహెచ్‌ఎంసీ గ్రౌండ్ సమీపంలో నివాసం ఉంటున్న కన్నల్ ముదిరాజ్ తాను కొత్తగా దుకాణం ప్రారంభించినందుకు గాను ఇంట్లో జరిగే వేడుకకు ఎస్సార్‌నగర్ స్వామి టాకీస్ దేవేందర్ మేనియోకు చెందిన తన స్నేహితుడు మోర్ల కార్తీక్‌ను ఆహ్వానించాడు. దీంతో అతను కన్నల్‌ముదిరాజ్ ఇంటికి వెళ్లాడు. అప్పటికే అక్కడ మద్యం మత్తులో ఉన్న సన్నీ, గుడ్డు, మణికంఠ కార్తీక్‌ను చూడగానే ఎందుకువచ్చావంటూ నిలదీశారు. కన్నల్‌ముదిరాజ్ పిలిస్తే వచ్చానని చెబుతుండగానే అతడిని దుర్భాషలాడుతూ భౌతిక దాడికి పాల్పడ్డారు. వారితో పాటు కన్నల్‌ముదిరాజ్ కూడా కార్తీక్‌పై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన కార్తీక్ వారి నుంచి తప్పించుకుని సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి శిశువుకు పోలియో చుక్కలు వేయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు

ఇబ్రహీంపట్నం రూరల్: పుట్టిన ప్రతి శిశువుకు పోలియో చుక్కలు వేయించాలని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం జిల్లాస్థాయి పల్స్ పోలియో టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. జిల్లాలో ఐదేళ్ల లోపు 4.90 లక్షల మంది పిల్లలు ఉన్నట్లు గుర్తించామన్నారు. అక్టోబర్ 12న పోలియో బూత్‌ల్లో, 13 నుంచి 15వ తేదీ వరకు ఇంటింటికీ వెళ్లి ఆశ వర్కర్లు, అంగన్వాడీ వర్కర్లు పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. పాఠశాలల పిల్లలు, ఇతర ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేసి మహమ్మారిని తరిమికొట్టాలన్నారు. సమావేశంలో వైద్యాధికారులు పాల్గొన్నారు.

రేణు అగర్వాల్ హత్య కేసులో నిందితుల రిమాండ్



మూసాపేట: కూకట్‌పల్లి స్వాన్‌లేక్ గేటెడ్ అపార్టుమెంట్‌లో జరిగిన రేణు అగర్వాల్ హత్య కేసులో నిందితులను సోమవారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రేణు అగర్వాల్ ఇంట్లో పని చేసే ఝార్ఖండ్ రాష్ట్రం, రాంచీకి చెందిన హర్ష్ కుమార్, వారి బంధువుల ఇంట్లో పని చేస్తున్న రోషన్ సింగ్‌తో పాటు హత్యకు సహకరించిన రాజ్‌కుమార్ అలియాస్ రాజువర్మలను కోర్టులో హాజరు పరిచారు. నిందితులు ముగ్గురూ చిన్ననాటి స్నేహితులు. ఈ నెల 13న రాంచీలో వారిని అదుపులోకి తీసుకున్న కూకట్‌పల్లి పోలీసులు అక్కడి కోర్టులో హాజరు పరిచి ట్రాన్సిట్ వారెంట్‌పై సోమవారం నగరానికి తీసుకువచ్చారు. వారిని కూకట్‌పల్లి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి 16 వాచీలు, 2 సెల్‌ఫోన్లు, రోల్డ్ గోల్డ్ జ్యువెలరీ, నగదు స్వాధీనం చేసుకున్నారు.

జేఐసీ నూతన కార్యవర్గం ఏర్పాటు..



డాక్టర్ సీహెచ్. వసంతకుమార్ | ప్రద్యుమ్న కుమార్‌రెడ్డి | సీహెచ్. జగ్గారావు | ఎం. జనార్దన్‌రెడ్డి

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ (జేఐసీ) అధ్యక్షుడిగా డాక్టర్ సీహెచ్.వసంతకుమార్ ఎన్నికయ్యారు. సోమవారం 2025–27కు గాను జేఐఎస్ గవర్నింగ్ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా వసంతకుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా టి.ప్రద్యుమ్న కుమార్‌రెడ్డి, సెక్రటరీగా సీహెచ్.జగ్గారావు, జాయింట్ సెక్రటరీగా ఎం.జనార్దన్‌రెడ్డి, గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్లుగా ఎస్‌వీ రవీంద్రనాథ్, అట్లూరి సుబ్బారావు, కే జ్యోతిప్రసాద్, ఎం.ప్రభాకర్‌రావు, పోతినేని కోటేశ్వరరావు, ఎస్.విద్యాసాగర్, బీఎస్‌వీ ప్రకాశరావు, డీవీ శివప్రసాద్, ఎస్.శివప్రసాద్, బి.రాజశేఖర్, ఏ.సురేష్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. ఎన్నికలకు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్‌గా కొల్లి రమేష్‌చౌదరి వ్యవహరించారు. ఎన్నికల అనంతరం కమిటీ మొదటి సమావేశం జరిగింది.

తండ్రి మృతిని తట్టుకోలేక.. కుమారుడి ఆత్మహత్య

శంషాబాద్ రూరల్: తండ్రి మృతిని జీర్ణించుకోలేక కుమారుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా, నిడదవోలు మండలం, సెట్టిపేటకు చెందిన రోళ్ల వెంకట సుబ్బయ్య(57), రోళ్ల లక్ష్మీ దంపతులు ఆరు నెలల క్రితం ఉపాధి కోసం వలస వచ్చారు. బుర్జుగడ్డతండా శివారులోని దీప్‌రాజ్ సింగ్ బైస్ ఫాంహౌజ్‌లో పని చేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. సుబ్బయ్య తండ్రి కోటయ్య మూడు నెలల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి సుబ్బయ్య మానసికంగా బాధ పడుతుండేవాడు. సోమవారం ఉదయం సుబ్బయ్య తోటలో పనికి వెళ్లాడు. ఆరు గంటల సమయంలో టీ తాగడానికి లక్ష్మీ భర్తకు ఫోన్ చేయగా.. సమాధానం రాలేదు. దీంతో ఆమె అతని గాలించగా తోటలో మామిడి చెట్టుకు కేబుల్ వైరుతో ఉరి వేసుకుని కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



రాందాస్ మృతదేహం

శంషాబాద్ రూరల్: పొలానికి యూరియా చల్లేందుకు వెళ్లిన రైతు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సంఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని పెద్దతూప్ర తండాకు చెందిన కేతావత్ రాందాస్(43) వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేస్తుంటాడు. ఆదివారం సాయంత్రం అతను పొలంలో యూరియా చల్లేందుకు వెళ్లాడు. రాత్రి అవుతున్నా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి పొలం వద్ద చూడగా అతను పొలంలో బోర్లా పడి ఉన్నాడు. బోరు మోటారు ఆన్ చేసే క్రమంలో కరెంట్ షాక్ తగిలి మృతి చెందినట్లు గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫంక్షన్ హాల్ గోడ కూలి కార్మికుడి మృతి



గగన్‌కుమార్ మృతదేహం

కుత్బుల్లాపూర్: కార్మికుల షెడ్డుపై ఓ ఫంక్షన్ హాల్ గోడ కూలడంతో ఓ కార్మికుడు మృతి చెందగా మరో ఆరుగురికి తీవ్రగాయాలయ్యాయి. పేట్‌బషీరాబాద్ సీఐ విజయవర్ధన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అపర్ణ రెడీమిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ ఆవరణలోని షెడ్డులో కార్మికులు నివాసం ఉంటున్నారు. మంగళవారం తెల్లవారుజామున వీ కన్వెన్షన్ హాల్ ప్రహరీ షెడ్డుపై కూలింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఒడిశాకు చెందిన గగన్‌కుమార్ బిస్వాల్(56) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఆరుగురు కార్మికులు రాజన్‌కుమార్, ప్రకాష్, కర్మసింగ్, సుధ, చందన్‌కుమార్, ప్రశాంత్‌లకు గాయాలు కాగా వారిని సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు అపర్ణ రెడీమిక్స్, వీ కన్వెన్షన్ యాజమాన్యాలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఫిలింనగర్‌లో సేవాపక్షం కార్యక్రమం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చింతల

ఫిలింనగర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 15 రోజుల సేవాపక్షంలో భాగంగా అగర్వాల్ సమాజ్ ఆధ్వర్యంలో సోమవారం ఫిలింనగర్‌లోని రౌండ్‌టేబుల్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, అగర్వాల్ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వండి

లక్డీకాపూల్: రాష్ట్రంలో పోలీసు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగ పోలీస్ జేఏసీ డిమాండ్ చేసింది. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ 2022 తర్వాత ఇంతవరకు నోటిఫికేషన్ రాలేదన్నారు. పోలీస్ నోటిఫికేషన్ రాకపోవడంతో చాలా మంది అభ్యర్థులు ఆర్థిక, మానసిక, వయోభారంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో 20 వేల పోస్టులతో భారీ నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా ఉండేందుకు పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ తొలగించాలన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

సనత్‌నగర్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని బేగంపేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు.. బేగంపేట హర్ష టిఫిన్ సెంటర్ సమీపంలోని డీటీడీసీ కొరియర్ సర్వీసు కార్యాలయం పక్కన ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు 108 అంబులెన్స్ సిబ్బందితో అక్కడికి చేరుకుని సదరు వ్యక్తిని పరిశీలించారు. అయితే అప్పటికే అతను మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. మృతదేహాన్ని గాంధీమార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వరద ముంచెత్తింది!

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–75లో ఆదివారం సాయంత్రం కురిసిన కుండపోత వర్షానికి రోడ్డంతా నీట మునిగి వరద ఇళ్లను ముంచెత్తింది. జీహెచ్ఎంసీ సర్కిల్–18 జూబ్లీహిల్స్ డివిజన్ అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ దుస్థితి నెలకొందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ సీసీ రోడ్డు వేసేందుకు రెండు నెలల క్రితం రూ.24 లక్షలు మంజూరయ్యాయి. రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు రెండు వారాల క్రితం ప్లాట్‌నెంబర్–182 ముందు నుంచి తవ్వి కాంట్రాక్టర్ జారుకోగా ఏఈ పట్టించుకోలేదు. దీంతో కుంభవృష్టికి ఆదివారం రాత్రి ఈ రోడ్డు నీట మునిగి వరద ఇళ్లను ముంచెత్తింది. ఇళ్లలోకి వరద రాకుండా స్థానికులు రోడ్ల మీదకు వచ్చి అడ్డుగా సిమెంట్ దిమ్మెలు, మట్టి పోసుకోవాల్సి వచ్చింది. ఏఈతో పాటు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహించారని ఫిర్యాదు చేసేందుకు స్థానికులు సిద్ధం అవుతున్నట్లు సమాచారం.


ఓ ఇంట్లోకి వెళ్తున్న వరద నీరు


అర్ధంతరంగా వదిలేసిన సీసీ రోడ్డు పనులు


జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–75లో..

58 కులాలకు న్యాయం చేయాలి


మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం ఇజేస్తున్న వివిధ సంఘాల నేతలు

బంజారాహిల్స్: జీవో నెం.99తో ఎస్సీలలోని 58 కులాలకు అన్యాయం జరుగుతుందంటూ ప్రభుత్వం కల్పించుకొని న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ మందల భాస్కర్, తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు చెరుకు రాంచందర్‌తో పాటు పలువురు సంఘాల నేతలు మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉప సంఘం సభ్యుడు అయిన మంత్రి శ్రీధర్‌బాబును సంఘాల నేతలు సోమవారం బంజారాహిల్స్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీల కోసం అధ్యయనం చేయడానికి వేసిన జస్టిస్ షమీమ్ అక్తర్ రిపోర్ట్‌ను అసెంబ్లీలో అందరు సభ్యులకు ఇవ్వకుండా చేశారని, ఏకపక్షంగా వర్గీకరణ పేరుతో ఎస్సీలలోని మాల కులాలతో పాటు 58 కులాల్లోని విద్యార్థులకు, ఉద్యోగులకు ఉద్యోగాలలో ప్రమోషన్ రాకుండా విద్యార్థులు ఉన్నత చదువులకు అడ్మిషన్లు రాకుండా అన్యాయం చేస్తున్నారని తెలిపారు. వెంటనే సీఎం రేవంత్ రెడ్డి కల్పించుకొని మంత్రివర్గ ఉప సంఘంతో మాల ప్రజాప్రతినిధులతో చర్చించి ఎస్సీలలోని 58 కులాలకు న్యాయం చేయాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో కనకరాజు, బేర బాల కిషన్, నర్సింహాయ్య, రాహుల్‌రావు, నర్సింగ్‌రావు, సామ తిరుపతయ్య, పండుగ భాను తేజ పాల్గొన్నారు.

సీఎంకు ఆహ్వానం


సీఎంకు ఆహ్వానం అందజేసున్న దృశ్యం

హిమాయత్‌నగర్: ఈ నెల 22న శంషాబాద్‌లోని క్లాసిక్ కన్వెన్షన్–3లో మహారాజా అగ్రసేన్ 5149వ జయంతి వేడుకలకు హాజరు కావాలని తెలంగాణ అగర్వాల్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు అనిరుధ్ గుప్తా ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం సోమవారం సీఎం రేవంత్ రెడ్డిని కలిసి ఆహ్వానించారు. అగర్వాల్ సమాజ్ తెలంగాణ చేపట్టిన వివిధ కార్యక్రమాలను ఎసలహాదారులు బద్రి విశాల్ బన్సాల్, హరీష్ గుప్తా, సంజయ్ గుప్తా, యస్వావిలతో కలిసి సీఎంకు వివరించారు.

వడ్డెరలకు రాజకీయ అవకాశాలు కల్పించాలి

బంజారాహిల్స్: రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ఉన్న వడ్డెరలకు రాజకీయ అవకాశాలు కల్పించకపోవడంతో వెనుకబాటుకు గురవుతున్నారని వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అయిలమల్లు అన్నారు. సోమవారం వడ్డెర సంఘం నేతలు తెలంగాణ వడ్డెర సంఘం చారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర కార్యదర్శి సంపంగి రామకృష్ణ నేతృత్వంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణ కేంద్రంలో అక్టోబర్ 10న వడ్డెర ఓబన్న విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. అదే విధంగా అదే రోజు నిర్వహించనున్న వడ్డెర సోదరుల బహిరంగ సభ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కూడా కలిసి ఆహ్వాన పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ.. వడ్డెరులకు అన్ని రాజకీయ పార్టీలు ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు పీట్ల మల్లేష్, ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఓర్సు వీరభద్రం, భువనగిరి జిల్లా అధ్యక్షుడు పల్లపు బాలయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లపు దుర్గయ్య, పరుశరాం, మక్కల వెంకన్న, దండ్ల వెంకటయ్య, బోదాసు మహేష్,ఆలంకుట రాజు పాల్గొన్నారు.


మంత్రి భట్టి విక్రమార్కను కలిసిన వడ్డెర సంఘం నేతలు

'నిమ్స్' సేవలు అమోఘం

బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్

లక్డీకాపూల్ : చిన్నాల గుండె ఆపరేషన్ల విషయంలో నిజాం ఇనిస్టిట్యూట్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) ది గుప్పెడంత మనసని బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ ప్రశంసించారు. రెండు రోజులుగా నిమ్స్‌లో ప్రముఖ బ్రిటన్ వైద్యులు దన్నపనేని రమణ, నిమ్స్ కార్డియోథొరాసిక్ విభాగాధిపతి డాక్టర్ మాలెంపాటి అమరేశ్వరరావుల సారథ్యంలో చిన్నాలకు గుండె ఆపరేషన్లను ఉచితంగా నిర్వహిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న బ్రిటిష్ హై కమిషనర్ సోమవారం నిమ్స్‌ను సందర్శించి అక్కడి మిలినియమ్ బ్లాక్‌లోని పీడియాట్రిక్ గుండె విభాగాన్ని పరిశీలించారు. అక్కడ చిన్నారులకు అందుతున్న వైద్యం పట్ల ఆరా తీశారు. పుట్టుకతోనే గుండె సమస్యలతో బాధపడుతున్న చిన్నారుల బంగారు భవిష్యత్ కోసం ప్రభుత్వ సహకారంతో ఉచితంగా వైద్యం అందించి వారికీ కొత్త జీవితాలను ప్రసాదిస్తున్నారని ప్రశంసించారు. నిమ్స్ వైద్యులు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొంటూ ఇందులో బ్రిటన్ వైద్యులు పాలుపంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సొంత గడ్డకు సేవ చేస్తున్న డాక్టర్ రమణ దన్నపనేని సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో శ్రీనగర్‌లోని ఆర్మీ 92 బేస్ హాస్పిటల్ ఇన్‌చార్జి ఆర్మీ ఆఫీసర్ డాక్టర్ నిఖిల్ తివారి, నిమ్స్ వైద్యులు ప్రవీణ్, గోపాల్ పాల్గొన్నారు.


వైద్యులతో మాట్లాడుతున్న బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పెద్దపీట

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పెద్దపీట వేస్తుందని, ఎస్సీల సంక్షేమానికి కృషిచేస్తున్నామని, ఎస్సీలంతా సంఘటితమై కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు. సోమవారం ఎల్లారెడ్డిగూడలోని పీజేఆర్ కమ్యూనిటీహాల్లో కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎస్సీసెల్ చైర్మన్ బోడ రాంచందర్ అధ్యక్షతన నియోజకవర్గ ఎస్సీసెల్ ముఖ్య నేతలు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అంజన్ కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. రానున్న ఉప ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో హస్తం జెండా రెపరెపలాడాలని, ఎస్సీలంతా మద్దతివ్వాలన్నారు. కోట్లాది రూపాయలతో నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని, కార్యకర్తలు, బూత్ స్థాయి కమిటీలు సమష్టిగా పనిచేయాలన్నారు. ఎస్సీసెల్ చైర్మన్‌గా నియామకమైన బోడ రాంచందర్‌ని అంజన్‌కుమార్‌యాదవ్, మాజీ ఎంపీ అజారుద్దీన్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వనం సంగీత, మాజీ కార్పొరేటర్ సంజయ్‌గౌడ్, వనం శ్రీనివాసయాదవ్, కిరణ్‌యాదవ్, మనోజ్‌యాదవ్, చిన్నా ముదిరాజ్, ప్రసాద్‌యాదవ్ పాల్గొన్నారు.


కార్యకర్తల సమావేశంలో అంజన్‌కుమార్‌యాదవ్

ఠాణాలో బీభత్సం

ఆరుగురి రిమాండ్

ఫిలింనగర్: రాంగ్‌రూట్‌లో వచ్చి కారును ఢీకొట్టడమే కాకుండా అదుపులోకి తీసుకున్న పోలీసులపై దాడికి యత్నించిన ఘటనలో ఆరుగురిని రిమాండ్‌కు తరలించారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్–14లోని నందినగర్‌లో నివసించే గుగులోత్ శ్రీనునాయక్ ఆటోడ్రైవర్. లోటస్‌పాండ్ రోడ్డులో రాంగ్‌రూట్‌లో వెళ్తూ ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టాడు. కారు ముందుభాగం నుజ్జునుజ్జు కాగా కారు నడిపిస్తున్న శ్రీధర్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిలింనగర్ పోలీసులు శ్రీనును అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. అయితే తన కొడుకును అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపిస్తూ శ్రీనునాయక్ తండ్రి బద్రూనాయక్, బానోతు నవీన్, గణేష్, నాగేంద్ర, మౌళిరెడ్డి తదితరులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి బీభత్సం సృష్టించారు. పోలీసులతో వాగ్వావాదానికి దిగి విధులకు ఆటంకం కలిగించారు. అక్కడ ఉన్న కుర్చీలను ధ్వంసం చేశారు. పోలీసులపై దాడికి యత్నించడంతో సోమవారం వారందరినీ రిమాండ్‌కు తరలించారు.

నిబంధనలు ఉల్లంఘించిన భవనాలు సీజ్


నిర్మాణాన్ని సీజ్ చేసిన అధికారులు

బంజారాహిల్స్: అనుమతులకు విరుద్ధంగా జరిపిన నిర్మాణాలను జీహెచ్ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్–18 టౌన్‌ప్లానింగ్ అధికారులు సోమవారం సీజ్ చేశారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్–5లో మహ్మద్ షాకీర్‌కు చెందిన నిర్మాణ అనుమతి రద్దు అయినప్పటికీ అనధికారిక నిర్మాణాన్ని చేపట్టగా అధికారులు ఆ నిర్మాణాన్ని సీజ్ చేశారు. అలాగే బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లో కావూరి రమేష్‌కు చెందిన స్టిల్ట్ ప్లస్ 2 అంతస్తుల నిర్మాణానికి అనుమతి ఉండగా, ఆయన స్టిల్ట్ ప్లస్ 5 అంతస్తులు నిర్మించారు. దీంతో సదరు నిర్మాణాన్ని కూడా సీజ్ చేశారు.

పెరిగిన ధరల ప్రకారం డీఏ ఇవ్వాలి


మాట్లాడుతున్న లక్ష్మణ్

హిమాయత్‌నగర్ : పెరిగిన ధరల ప్రకారం డీఏ ఇవ్వాలని కోల్ ఇండియా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కేంద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో సంఘం ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్ కల్వల లక్ష్మణ్, సర్వజిత్ కోదార్, మహేశ్వర్ మీడియాతో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా 1.20 లక్షల పైగా విశ్రాంత ఉద్యోగులు ఉన్నారని పెన్షన్ తక్కువ ఉండడంతో వైద్య సౌకర్యాలు లేక లక్ష మంది పైగా పెన్షన్ దారులు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం డీఏ పెంచినప్పుడల్లా ఈపీఎఫ్ పెన్షనర్స్‌కు పెరుగుతుందని, కానీ సీఎంపీఎస్ పెన్షనర్స్‌కు పెరగడం లేదన్నారు. నెలకు కనీస పెన్షన్ పదివేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ విషయాలపై బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, బొగ్గు గనుల సీఎండీ ప్రసాద్‌కు పలుమార్లు కలిసి వినతి పత్రం అందజేసినా స్పందన లేదన్నారు. ఇప్పటికైనా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చొరవ చూపి సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో కేంద్ర మంత్రి క్యాంపు ఆఫీస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

కరాటేలో సత్తా

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని జ్ఞానీజైల్‌సింగ్‌నగర్‌లో నివసించే దండు మేఘన కరాటేలో సత్తా చాటుతుంది. చిన్న వయస్సులోనే ఎల్లో బెల్టు సాధించి ఔరా అనిపించుకుంటున్నది. జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్స్ పబ్లిక్ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న మేఘన చిన్ననాటి నుంచే కరాటేపై మక్కువ పెంచుకుంది. మహిళల ఆత్మ రక్షణకు కరాటే ఎంతగానో ఉపయోగపడుతుందని భావించిన ఈ చిన్నారి కరాటే శిక్షణలో రోజురోజుకు తన ప్రతిభను మెరుగుపరచుకుంటూ అవార్డులు సాధిస్తుంది. తాజాగా డ్రాగన్స్ కుంగ్‌ఫూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన పోటీల్లో మేఘన ఎల్లో బెల్టు సాధించింది. ఈ మేరకు ఆమెకు అకాడమీ ప్రెసిడెంట్ సీహెచ్. విష్ణు, శిక్షణ ఇస్తున్న మాస్టర్ అనీఫ్, వెంకటేశ్వరరావు తదితరులు ఎల్లో బెల్టును ప్రదానం చేశారు.

ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించండి

హిమాయత్‌నగర్: ఇంటి స్థలం కోసం తమ కుటుంబాన్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న జిలుకర శ్రీనివాస్, అతని అనుచరుల నుంచి తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని జనగాం జిల్లా, రఘునాథపల్లి మండలం, ఖిలాషాపురం గ్రామానికి చెందిన బాధిత వృద్ధురాలు ఎల్మకంటి అమృతమ్మ ఆరోపించింది. ఈ విషయంపై స్థానిక రఘునాథ్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికి పట్టించుకోవడం లేదని సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె కన్నీటి పర్యాంతమయ్యింది. కూతురు జిలుకర రేణుక, మనువడు రంజిత్, అల్లుడు కృష్ణాకర్, తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ అధ్యక్షుడు జి.రవికుమార్‌తో కలిసి అమృతమ్మ మీడియాతో మాట్లాడారు. స్థలం విషయంలో న్యాయం చేసి ప్రభుత్వం తమకు రక్షణ కల్పించాలని కోరింది.


మాట్లాడుతున్న అమృతమ్మ

సాక్షి సిటీ ప్లస్
10
హైదరాబాద్, మంగళవారం,
16, సెప్టెంబర్, 2025

18 నుంచి అనలిటికా ల్యాబ్ ఇండియా ప్రదర్శన

సాక్షి, సిటీబ్యూరో: లైఫ్ సైన్సెస్ ఫార్మాస్యూటికల్ తయారీ రంగాలకు సంబంధించిన అతిపెద్ద ప్రదర్శన 'అనలిటికా ల్యాబ్ ఇండియా అండ్ ఫార్మా ప్రో-ప్యాక్ 2025' నగరంలో ఏర్పాటు కానుంది. ఈ నెల 18 నుంచి నగరంలోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో కొలువుదీరే ఈ ప్రదర్శనలో సంబంధిత రంగాల్లో ఆధునిక సాంకేతికత, ప్రపంచ భాగస్వామ్యాలు, పరిశోధన, ఆవిష్కరణలు వంటివి ప్రధానంగా చోటుచేసుకోనున్నాయని నిర్వాహక సంస్థ ప్రతినిధులు తెలిపారు. 50,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో 650 మందికి పైగా ఎగ్జిబిటర్లు ఒకచోట చేరనున్నారని వివరించారు. భారత ఫార్మా హబ్‌కు అత్యాధునిక సాంకేతికతలను తీసుకొచ్చేలా ఈ ప్రదర్శన ఉండనుంది. మూడు రోజుల ప్రదర్శనలో సాఫ్ట్‌వేర్ పెవిలియన్, ఇన్నోవేషన్ లాంచ్‌ప్యాడ్, జర్మన్ పెవిలియన్లు తదితర విశేషాలెన్నో కొలువుదీరనున్నాయి.



విభిన్న సంస్కృతులు, సంప్రదాయాల సమ్మేళనం హైదరాబాద్. అలాంటి నగర వేదికగా కొనసాగుతున్న చేనేత, హస్తకళల ఉత్సవం 'ఛాప్' ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. మాదాపూర్ శిల్పారామంలో సాంస్కృతిక కళలకు ఆధునిక హంగులు జోడిస్తూ జరుగుతున్న ఈ అతిపెద్ద కళాత్మక కార్యక్రమం ఈ తరం ఫ్యాషన్, ఇంటీరియర్ ఔత్సాహికులను విశేషంగా అలరిస్తోంది. ఫ్యాషన్-టెక్నాలజీ వంటి అంశాలతో కేంద్ర టెక్స్‌టైల్ మినిస్ట్రీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్), తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ శాఖ భాగస్వామ్యంతో జరుగుతున్న ఈ 'ఛాప్' సరికొత్త కళను తీసుకొచ్చింది. ఈ నెల 17 వరకూ కొనసాగనున్న ఈ చేనేత, హస్తకళల సందడి.. సిటీ లైఫ్ స్టైల్‌లో మునిగిపోయిన నగరవాసులకు సరికొత్త అనుభూతిని అందిస్తోంది.

- సాక్షి, సిటీబ్యూరో/ మాదాపూర్

కళలతో.. కళకళ..

నగరంలో చేతివృత్తుల సందడి

ఛాప్ 2025లో భాగంగా భారతదేశపు చేనేత, హస్తకళల వారసత్వాన్ని ప్రదర్శించడంతో పాటు సమకాలీన డిజైన్ల ఆవిష్కరణ, వ్యవస్థాపకత ప్రాధాన్యతను తెలియజేసేలా ఏర్పాటు చేసిన విభిన్న కార్యక్రమాలు సందర్శకులను ఆద్యంతం ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని శిల్పారామం వేదికగా ఏర్పాటు చేసిన 100 స్టాల్స్‌లో తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన హస్తకళాకారులు, నిఫ్ట్ పూర్వ విద్యార్థులు, వ్యవస్థాపకులు, డిజైనర్లు, పరిశ్రమల ప్రముఖులు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. ఇందులోని లెదర్‌బ్యాగ్స్, వుడ్ కార్వింగ్, పెయింటింగ్స్ వంటి చేతి ఉత్పత్తులను నగరవాసులు కొనుగోలు చేస్తున్నారు. అంతేకాకుండా తెలంగాణ టూరిజం ప్రాధాన్యతను ప్రదర్శించేలా వినూత్న కార్యక్రమాలు, సాంస్కృతిక పునరుజ్జీవనానికి నాంది పలికేలా నిర్వహిస్తున్న మాస్టర్ క్లాసులు, ఫ్యాషన్ షోలు, విద్యార్థుల పరిశోధనాత్మక డాక్యుమెంటేషన్, అరుదైన కళలు తోలుబొమ్మలాట వంటివి.. 'ఛాప్'లో ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. రేపటితో ముగియనున్న ఈ 'ఛాప్' ప్రదర్శనను సందర్శించకుంటే ఒక తరం కళాత్మక వైభవాన్ని చూసే అవకాశం కోల్పోయినట్లే.

- 'ఛాప్-2025' పేరుతో శిల్పారామంలో ప్రదర్శన
- 100 స్టాల్స్‌లో వివిధ రాష్ట్రాల ఉత్పత్తులు
- ప్రత్యేక ఆకర్షణగా లెదర్ బ్యాగ్స్, వుడ్ కార్వింగ్
- అలరిస్తున్న ఫ్యాషన్, చేనేత కళాఖండాలు
- శిల్పారామంలో సందర్శకుల జోష్
- ఆకట్టుకుంటున్న పలు సాంస్కృతిక కార్యక్రమాలు



అప్‌స్కిల్లింగ్‌తోనే భవిష్యత్తు

తేల్చి చెప్పిన 'గ్రేట్ లెర్నింగ్' సర్వే

సాక్షి, సిటీబ్యూరో: సాంకేతిక రంగంలో వేగంగా చోటు చేసుకుంటున్న మార్పుల నేపథ్యంలో పోటీని తట్టుకోడానికి అస్త్రశస్త్రాలతో సిద్ధంగా ఉండక తప్పదని కార్పొరేట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇంజినీర్స్ డే పురస్కరించుకుని గ్లోబల్ ఎడ్ టెక్ కంపెనీ గ్రేట్ లెర్నింగ్ సోమవారం విడుదల చేసిన సర్వే ఫలితాలు దీనిని బలపరుస్తున్నాయి. నగరంతో పాటు దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ సర్వేలో 67% మంది ఇంజినీర్లు తమ ప్రస్తుత పాత్రలపై ఏఐ ప్రభావం తప్పదని భావిస్తున్నారని తేలింది. అలాగే వేగవంతమైన సాంకేతిక మార్పుల నుంచి తమ కెరీర్ కాపాడుకోడానికి అప్‌స్కిల్లింగ్ ముఖ్యమని 86% మంది ఇంజినీర్లు అంగీకరిస్తున్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్ అనలిటిక్స్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ వీరి ఎంపికలో ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

ఆకట్టుకున్న నృత్యార్పణం

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ శిక్షణాలయం నృత్య దీక్షాలయ సంస్థ ఆధ్వర్యంలో నృత్యార్పణం - 'ఏ డివైన్ ఆఫరింగ్' పేరిట నిర్వహించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కింగ్ కోఠిలోని భారతీయ విద్యాభవన్‌లో గణేశ కౌత్వం, జగదానందకారక, జతిస్వరమ్, శంకరి, శ్రీష పద్మనాభ వంటి పలు అంశాలపై చక్కటి హావభావాలతో సోమవారం ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనలు సమ్మోహనపరిచాయి. ప్రతి ప్రదర్శనలో భక్తి, క్రమశిక్షణతో కూచిపూడి శాశ్వత ప్రతిఫలం ప్రతిబింబించిందని కళారత్న డాక్టర్ సత్యప్రియ రమణ కొనియాడారు. మరింత మంది కూచిపూడి కళాకారులను తయారుచేస్తూ భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. కూచిపూడి నృత్య కళాకారిణి కాత్యాయని కనక్, సంస్థ వ్యవస్థాపకురాలు లక్ష్మీశంకర్ తదితరులు పాల్గొన్నారు.





మనసు దోచే.. తుస్సార్ సిల్క్..

ఈ వేదికలో ఒడిస్సాకు చెందిన తుస్సార్ సిల్క్ చీరలు, చున్నీలు, టవల్స్, దోతీలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ ఉత్పత్తుల ధర 8వేల నుంచి 26వేల వరకూ అందుబాటులో ఉన్నాయి.

రాజస్థాన్ ఫేమ్.. ఫ్రేమ్స్..

రాజస్థాన్‌కి చెందిన బికనీర్ కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులు ఈ తరం ఇంటీరియర్ వండర్‌గా నిలుస్తున్నాయి. చేతితో తయారు చేసిన ఫ్రేమ్స్, కళాత్మక ఉత్పత్తులు ట్రెండీ థింగ్స్‌ను మైమరిపిస్తున్నాయి. ఇందులోని 24 క్యారెట్ గోల్డ్, రాజస్థాన్ పెయింటింగ్‌తో తయారు చేసిన లెదర్‌ల్యాంప్ వావ్ అనిపిస్తోంది. దీని ధర రూ.35,000 చెబుతున్నారు!

వావ్.. వుడ్ కార్వింగ్..

పంజాబ్ కళాకారులు తయారు చేసిన వుడ్ కార్వింగ్ ఉత్పత్తులు కళ్లు చెదిరే కళతో కొనుగోలుదారులను ఆకర్షిస్తున్నాయి. వీటి ధరలు రూ.100 నుంచి 50వేల వరకు అందుబాటులో ఉన్నాయి. హోమ్‌డెకార్ ఉత్పత్తులు, క్యాండిల్ స్టాండ్, టేబుల్స్, డిజైనింగ్ పిల్లర్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

నీడిల్ క్రాఫ్ట్.. వెరీ స్పెషల్..

హిమాచల్ ప్రదేశ్, కాంగ్ర అనే ప్రాంతంలో ప్రత్యేకంగా పిన్ నీడిల్ క్రాఫ్ట్‌ను మహిళలు ప్రత్యేకంగా తయారు చేస్తున్నారు. వీటిని నగరవాసులు విరివిగా కొనుగోలు చేస్తున్నారు. వీటి ధర రూ.100 నుంచి 20వేల వరకూ అందుబాటులో ఉండటం విశేషం. పర్యావరణహిత ఉత్పత్తులు, స్టోరేజ్ బాక్సులు, పండ్ల బుట్టలు, టిష్యూ బాక్స్, చపాతీ బాక్స్, టేబుల్ మ్యాట్ వంటి అందమైన ఉత్పత్తులు వీరి ప్రత్యేకతను చాటుతున్నాయి.

ప్యూర్ లెదర్.. ఫరెవర్..

అస్సాంకు చెందిన నిఫ్ట్ డిజైనర్ రూపొందించిన ప్యూర్ లెదర్ ఉత్పత్తులకు ఈ స్టాల్స్‌లో మంచి ఆదరణ లభిస్తోంది. అస్సాంకు చెందిన డిజైనర్ తమ ఉత్తులకు మరింత మార్కెటింగ్ చేయనున్నట్లు తెలిపారు. వీటి ధర రూ.1000 నుంచి 10వేల వరకూ అందుబాటులో ఉన్నాయి. టిఫిన్ బ్యాగ్స్, కాలేజ్, ఆఫీస్ బ్యాగ్స్, మహిళల హ్యాండీ బ్యాగ్స్ అదుర్స్ అంటున్నారు సందర్శకులు.



గ్లోబల్ మార్కెటింగ్.. నా గోల్..



నిఫ్ట్‌లో ఫ్యాషన్ డిజైన్ నేర్చుకున్నా. సొంత బ్రాండ్‌తో ఉత్పత్తులు తయారు చేసి అమ్మకాలు జరుపుతున్నా. నగరవాసుల నుంచి మంచి ఆదరణ లభిస్తుంది. మరిన్ని ప్రత్యేక డిజైన్‌లతో వినూత్న ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకొచ్చి అంతర్జాతీయంగా మార్కెటింగ్ చేయాలని ప్లాన్ చేస్తున్నా.

- నిషిగంధ బారువా, నిఫ్ట్ లెదర్ ఫ్యాషన్ డిజైనర్, అస్సాం.



ఆలోచింపజేసే థీమ్‌తో అనేక పెయింటింగ్స్

అలరిస్తున్న సంగీత వాద్యాల సరిగమలు

కళల వేదిక ఆర్ట్ కనెక్ట్..

సాక్షి, సిటీబ్యూరో : ఫిల్మ్‌నగర్‌లో 'ఆర్ట్ కనెక్ట్' సోమవారం తొలి ప్రదర్శనకు తెర తీసింది. స్పిరిట్ కనెక్ట్ భవనంలోని మెయిన్ హాల్లోకి ప్రవేశించగానే ఆలోచింపజేసే థీమ్‌తో అనేక పెయింటింగ్స్ ఆకట్టుకుంటున్నాయి. విష్పర్స్ ఆఫ్ నేచర్ పేరుతో ఓనియమ్ దిలీప్ చిత్రించిన పెయింటింగ్ వీక్షకుల కళ్లను కట్టిపడేస్తోంది. ఈ నేపథ్యంలో సంగీత వాద్యాల సరిగమలు చెవుల్ని తాకుతున్నాయి. ఇద్దరు యువకులు ప్రపంచాన్ని మరిచిపోయి యజ్ఞం చేసినంత ఏకాగ్రతతో సంగీతవాదనలో మునిగిపోయారు. కళ్లు జిగేల్‌మనేట్లు వెండి కళాఖండాలు సందర్శకులను తమ వైపు తిప్పుకునే ప్రయత్నంలో ఉన్నాయి. ఆ పక్కనే ఒక గదిలో జిగ్నేష్ పంచాల్ చేతిలో రూపుదిద్దుకున్న గోల్డ్ లీఫ్ కళాకృతులు గోడ మీద క్రమశిక్షణతో ఒదిగిపోయాయి. ఆ పక్కనే వినోద్ దొరాజ్ చేసిన పింగాణీ కళాఖండాలు, మధ్యలో బంగారు ఆభరణాలు కళాత్మకతలో మేమే మేటి అన్నట్లు కొలువుదీరాయి. దేశంలోని వివిధ రాష్ట్రాల కళాకారులు, కళాఖండాలను హైదరాబాద్ తీసుకురావడం ఒక బహుళ ప్రయత్నం అంటున్నారు ఆర్ట్ కనెక్ట్ నిర్వాహకురాలు మిహిక బజాజ్ దగ్గుబాటి.

కళల విస్తరణ కోసం..

స్వయంగా చిత్రకారిణి అయిన మిహిక కళలు, కళాఖండాల వ్యాప్తిలోనే కెరీర్ ఎంచుకున్నారు. వ్యాపార కుటుంబంలో పుట్టిన తాను ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదగడానికి తనకు అభిరుచి ఉన్న రంగాన్నే ఎంచుకున్నానని చెప్పారు. దేశవ్యాప్తంగా ఉన్న గొప్ప చిత్రకారుల చిత్రాల కోసం ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారు. కళలనన్నింటినీ ఒక తాటిమీదకు తీసుకురావడం కోసమే తన ప్రయత్నమని, అందుకే దీనికి ఆర్ట్ కనెక్ట్ అనే పేరు పెట్టానన్నారు. ప్రముఖ డిజైనర్‌లు, ఆభరణాల బ్రాండ్ నిర్వాహకులు అమృత కిలాచంద్, హిమా ఒమర్ అబ్దుల్లా వంటి వారితో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆభరణాలు తయారు చేసే కారిగార్స్, ఇతర హస్తకళాకృతుల తయారీదారుల కోసం భవిష్యత్తులో ఇలాంటి ప్రదర్శనలు ఏర్పాటు చేయాలన్నదే తన ఆకాంక్షని అన్నారామె. తన ఆర్ట్ కనెక్ట్ ప్రదర్శనలను దేశవ్యాప్తంగా విస్తరించే ఆలోచన లేదంటూ, 'దేశవ్యాప్తంగా ఉన్న కళలు, కళారూపాలు, కళాకారులకు హైదరాబాద్‌ను పరిచయం చేయడంతోపాటు భాగ్యనగరానికి దేశవ్యాప్తంగా ఉన్న కళలను పరిచయం చేయడమే ప్రధాన ఉద్దేశం' అన్నారు మిహిక బజాజ్.



చేనేతకు గుర్తింపు దిశగా..

- స్వామి రామానందతీర్థలో ఆకట్టుకున్న చేనేత సంత
- 11 ఏళ్లుగా సంతల నిర్వహణతో వీవర్స్‌కు ప్రోత్సాహం





సనత్‌నగర్: చేనేతకు ఆదరణ కరువవుతున్న నేపథ్యంలో చేనేతకు గుర్తింపు తెచ్చేలా పలువురు కృషి చేస్తున్నారు. ఇందు కోసం 'చేనేత సంతలకు' ఆమె అంకురార్పణ చేశారు. నేత కళాకారుల కోసం 11 ఏళ్లుగా రెండు మూడు నెలలకోసారి ప్రత్యేక సంతను ఏర్పాటు చేసి వారిని ప్రోత్సహిస్తుంటారు. ఆమే నగరానికి చెందిన సరస్వతి. అమీర్‌పేట నాగార్జున కమ్యూనిటీ హాల్, సికింద్రాబాద్ ప్రాంతంలోని చౌరాహా ఆడిటోరియం ఈ సంతలకు వేదికలుగా నిలిచాయి. రెండు పర్యాయాలుగా బేగంపేట స్వామి రామానందతీర్థ మెమోరియల్ ప్రాంగణంలో పీవీ నరసింహారావు స్మారక భవన్‌లో వీటిని కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన సంత ఆదివారం ముగిసింది.

వివిధ రాష్ట్రాల ఉత్పత్తులు..

ఇందులో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన చేనేత కళాకారులు తయారుచేసిన వస్త్రాల ఉత్పత్తులను ప్రదర్శించారు. వరంగల్, గద్వాల్ ఖాదీ, గద్వాల్ పట్టుచీరలు, పోచంపల్లి, బంజారా క్రాఫ్ట్స్, కలంకారీ, ఎమ్మిగనూరు బెడ్‌షీట్స్, వావిలాల ఖాదీ, నారాయణపేట, వెంకటగిరి, గొల్లభామ.. ఇలా పేరెన్నికగన్న ప్రాంతాల నుంచి చీరలు, డ్రెస్ మెటీరియల్స్ అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో పాటు చందేరీ, ఒడిస్సా, వెస్ట్‌బెంగాల్, గుజరాతీ, కర్ణాటక రాష్ట్రాల కళాకారులు తమ ఉత్పత్తులను ప్రదర్శించారు.

లాభాపేక్ష లేకుండా..



కేవలం చేనేతను ప్రోత్సహించే లక్ష్యంతోనే హాల్స్‌కు ఎలాంటి రుసుమూ వసూలు చేయరు. కళాకారుల సేల్స్‌లో కేవలం 5 శాతం మెయింటెనెన్స్ వసూలు చేస్తారు. నేత కళాకారులకు కావాల్సిన మార్కెటింగ్ కల్పించి, వారి కష్టానికి తగ్గ ప్రతిఫలం అందేలా చేస్తున్నాం. ఎగ్జిబిషన్‌లో స్టాల్ అంటే వేలకు వేలు పెట్టాలి. కష్టం మొత్తం అద్దెలకే సరిపోతుంది. దీనికి ప్రత్యామ్నాయంగానే ఈ సంతల ఆలోచన చేశాం. నేరుగా వినియోగదారులకు చేరువ చేస్తున్నాం. బయట చాలా మంది హ్యాండ్‌లూమ్ పేరిట పవర్‌లూమ్ వస్త్రాలు అమ్మేస్తున్నారు. చేతి మగ్గాలకు, మరమగ్గాలకు తేడా ఉంటుంది.

- సరస్వతి, నిర్వాహకురాలు

గృహాలంకరణ ప్రత్యేకం..



వెస్ట్‌బెంగాల్ కళాకారులు స్పాంజ్ వుడ్‌వర్క్ ఉత్పత్తులను ప్రత్యేకంగా తయారు చేస్తారు. వీటిని నగరవాసులు విరివిగా కొనుగోలు చేస్తున్నారు. గృహాలంకరణకు ఇవి అత్యంత ఆకర్షణీయంగా ఉంటాయి. ఇంటి ముందు లాన్, పార్కులో కావాల్సిన ప్రత్యేక డిజైన్స్ తయారు చేసి ఇస్తాము. మా స్టాల్స్‌లో ఉత్పత్తులు రూ.2వేల నుంచి 8వేల వరకు అందుబాటులో ఉన్నాయి.

- సమీర్ కుమార్ షా, కళాకారుడు, వెస్ట్‌బెంగాల్.

ఒక్కో డిజైనింగ్‌కు నెలల సమయం..

పనిలో నైపుణ్యం కలిగివున్నప్పుడే వుడ్ కార్వింగ్ చేయగలం. కొనుగోలుదారులను ఆకర్షించేందుకు అద్భుతమైన డిజైన్‌లను అందిచాల్సి ఉంటుంది. ఒక్కో కార్వింగ్ ఫ్రేమ్, ఒక్కో డిజైన్ బట్టి కొన్ని నెలల సమయం పడుతుంది. అందంగా కార్వింగ్ చేసినప్పుడే అమ్మకాలు జోరందుకుంటాయి. ఆయా ఉత్పత్తులకు డిమాండ్ కూడా ఉంటుంది.

- కమల్‌జిత్ మాతరో, పంజాబ్ కళాకారుడు



క్లుప్తంగా...

విశ్వేశ్వరయ్య ఆదర్శాలు, విలువలు అనుసరణీయం

టీజీపీహెచ్‌సీ ఇంజనీర్స్ డే వేడుకలో ఐజీ రమేశ్‌రెడ్డి



విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న రమేశ్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: అన్ని ఇంజనీరింగ్ పనుల్లో మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆదర్శాలు, వృత్తి పరమైన విలువలు ఎప్పటికీ అనుసరణీయమని తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ (టీజీపీహెచ్‌సీ) డైరెక్టర్, ఐజీ రమేశ్‌రెడ్డి అన్నారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా సోమవారం టీజీపీహెచ్‌సీ కార్యాలయంలో నిర్వహించిన ఇంజనీర్స్ డే వేడుకల్లో పాల్గొన్న రమేశ్‌రెడ్డి.. విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. భవిష్యత్తులో విభిన్న రంగాల్లో టీజీపీహెచ్‌సీని అభివృద్ధి చేయడంతోపాటు బలోపేతం చేసేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీజీపీహెచ్‌సీ ఇంజనీర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీర్స్ డే



నవీన్ మిత్తల్‌ను సన్మానిస్తున్న ఇంజనీర్లు

సాక్షి, హైదరాబాద్: మోక్షగుండం విశ్వేశ్వరయ్య 165వ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ (టీజీపీఈఏ) జెన్‌కో ఆడిటోరియంలో సోమవారం ఇంజనీర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించింది. అసోసియేషన్ అధ్యక్షుడు రత్నాకర్ రావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు విశ్వేశ్వరయ్య సేవలను కొనియాడారు. కార్యక్రమానికి ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, టీజీ జెన్కో సీఎండీ హరీశ్, ఎస్పీడీసీఎల్ సీఎండీ అబ్దుల్ ఫారుఖీ, పలువురు ఇంజనీర్లు హాజరయ్యారు.

15 సెప్టెంబర్ 2023.. రాష్ట్ర ప్రజారోగ్య రంగంలో ఒక గొప్ప రోజు

- ముఖ్యమంత్రిగా పరిపాలన కాలంలో నాకు అత్యంత సంతృప్తిని ఇచ్చిన రోజు
- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- 1923 నుంచి 2019 వరకు రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీలు కేవలం 12
- మా హయాంలో ఒకేసారి ప్రభుత్వ రంగంలో 17 మెడికల్ కాలేజీ ఏర్పాటుకు సంకల్పించాం



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రజారోగ్య రంగంలో 2023 సెప్టెంబర్ 15వ తేదీ ఒక గొప్ప రోజు అని, ఒక ముఖ్యమంత్రిగా పరిపాలనా కాలంలో తనకు అత్యంత సంతృప్తిని మిగిల్చిన రోజు.. అని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తొలి విడతగా ఐదు మెడికల్ కాలేజీలను ప్రారంభించి సోమవారం నాటికి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'ఎక్స్' వేదికగా స్పందించారు. ''ఆంధ్రప్రదేశ్ ప్రజారోగ్య రంగంలో 15 సెప్టెంబర్, 2023 ఒక గొప్ప రోజు. ఒక ముఖ్యమంత్రిగా పరిపాలనా కాలంలో నాకు అత్యంత సంతృప్తిని మిగిల్చిన రోజు. నేను ఒక మంచి పని చేయగలిగానన్న తృప్తి నాకు లభించింది. 1923 నుంచి 2019 వరకు ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ రంగంలో కేవలం 12 మెడికల్ కాలేజీలు ఉంటే, ఒక్క మా హయాంలోనే ఒకేసారి 17 మెడికల్ కాలేజీల ఏర్పాటుకు సంకల్పించాం. ఇందులో భాగంగా 2023 సెప్టెంబర్ 15న విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల మెడికల్ కాలేజీలను ఒకేసారి ప్రారంభించి ప్రజల ఆరోగ్య పరిరక్షణలో గొప్ప అడుగు ముందుకేశాం. ఈ ఐదు కాలేజీల ద్వారా 750 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి తేవడం నాకు సంతోషాన్ని కలిగించింది. వీటితోపాటు పాడేరు, పులివెందుల కాలేజీలను కూడా అడ్మిషన్లకు సిద్ధం చేశాం. మిగిలిన కాలేజీల పనులను పూర్తి చేయాల్సిన ఈ ప్రభుత్వం ఆ 10 కాలేజీలను ప్రైవేటుకు కట్టబెట్టేలా నిర్ణయం తీసుకోవడం అత్యంత దారుణం. ప్రజలంతా దీన్ని వ్యతిరేకిస్తున్నారు. తక్షణం ఈ ప్రయత్నాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాం'' అంటూ వైఎస్ జగన్ తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు.

'గొర్రెల' కుంభకోణంలో ఈడీ దర్యాప్తు ముమ్మరం

- పల్నాడుకు చెందిన ముగ్గురు రైతుల వాంగ్మూలాల రికార్డు
- ఏపీ రైతులకు ఇవ్వాల్సిన డబ్బులు మధ్యవర్తులు రూ.2 కోట్లు ఎగవేసినట్టు గుర్తించిన అధికారులు
- తమ కేసులు దర్యాప్తు చేయాలంటూ ఈడీకి ఫిర్యాదు చేసిన మరికొందరు రైతులు



సాక్షి, హైదరాబాద్ : గొర్రెల పంపిణీ పథకం కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తు ముమ్మరం చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొనసాగిన ఈ పథకం కోసం ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల నుంచి గొర్రెలను సేకరించి వాటిని యూనిట్లుగా విభజించి రైతులకు పంపిణీ చేశారు. ఈ క్రమంలో తెలంగాణ పశుసంవర్ధకశాఖ అధికారులకు గొర్రె పిల్లలను విక్రయించి డబ్బులు అందక మోసపోయిన ఏపీకి చెందిన రైతుల స్టేట్‌మెంట్లను ఈడీ రికార్డు చేస్తున్నది. ఇందులో భాగంగా సోమవారం ముగ్గురు రైతులను బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయంలో అధికారులు పలు అంశాలపై విచారించారు. ఈ కేసులో సాక్షులుగా హాజరుకావాలని గత వారం ఈడీ సమన్లు జారీ చేసిన విషయం తెలిసిందే.

దాదాపు ఏడు గంటలకు పైగా....

పల్నాడు జిల్లా ఈపూరు మండలం అంగలూరు గ్రామానికి చెందిన సన్నెబోయిన ఏడుకొండలు, ఊడిచర్ల గ్రామానికి చెందిన రవీందర్‌తోపాటు మధ్యవర్తిగా వ్యవహరించిన ఒంగోలు కందుకూరుకు చెందిన మహేందర్ సోమవారం ఉదయం 11.30 గంటలకు బషీర్‌బాగ్‌లోని ఈడీ అధికారుల ముందు హాజరయ్యారు. రాత్రి 8 గంటల వరకు దాదాపు 7 గంటల పాటు ప్రశ్నించారు. ఎవరెవరికి గొర్రెలను విక్రయించారు? ఆ సమయంలో తెలంగాణ నుంచి ఎవరెవరు మిమ్మల్ని సంప్రదించారు? డబ్బుల చెల్లింపులు ఎలా చేసేవారు? మీ సొంత గొర్రెలనే విక్రయించారా? లేదంటే చుట్టుపక్కల గ్రామాల్లో మీరు సేకరించిన గొర్రెలను విక్రయించారా? గొర్రెలను విక్రయించే సమయంలో మీరు ఎందుకు డబ్బులు తీసుకోలేదు ? మీకు డబ్బు చెల్లింపులపై ఎవరు హామీ ఇచ్చారు అంటూ పలు అంశాలపై ప్రశ్నించిన ఈడీ అధికారులు సాక్షులుగా వారి స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. ఈ ముగ్గురితోపాటు మరో 10 మంది రైతులు ఈడీ కార్యాలయానికి వచ్చారు. అయితే ఏడుకొండలు, రవీందర్, మహేందర్‌లకు మాత్రమే సమన్లు ఇచ్చినందున ఈ ముగ్గురిని మాత్రమే ఈడీ అధికారులు లోపలికి అనుమతించారు. అయితే గొర్రె పిల్లలను కొనుగోలు చేయడంలో మహేందర్ కీలకంగా వ్యవహరించినట్టు బాధితులు ఈడీ అధికారులకు చెప్పినట్టు సమాచారం. ఈ మేరకు రైతులు, గొర్రెల కాంట్రాక్టర్ మొయిద్దీన్‌కు మహేందర్ మధ్యవర్తిగా వ్యవహరించినట్టు ఈడీ అధికారులు ఆధారాలు సేకరించారు. మొదట్లో ఒక్కో యూనిట్‌కు గాను రూ.1.58 లక్షల చొప్పున చెల్లించేవారని బాధిత రైతులు ఈడీకి వివరించారు. వీరితోపాటు మోసపోయిన మరికొందరు రైతుల స్టేట్‌మెంట్‌లను నమోదు చేసే యోచనలో ఈడీ అధికారులు ఉన్నట్టు తెలిసింది. అయితే ఈడీ విచారణపై సమన్లు అందుకున్న వారితోపాటు వచ్చిన ఇతరులు ఈడీకి ప్రత్యేకంగా ఫిర్యాదు చేశారు. తాము సైతం మోసపోయామని, ఇందుకు సంబంధించి దర్యాప్తు చేయాలని వారు ఈడీ అధికారులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే ఏపీ రైతులకు ఇవ్వాల్సిన డబ్బులు మధ్యవర్తులు రూ.2 కోట్లు ఎగవేసినట్టు ఈడీ అధికారులు గుర్తించినట్టు సమాచారం.

ఆరుసార్లు ఫెయిల్.. ఏడోసారి సక్సెస్..

- స్కూల్లో రోజుకు కిలో చొప్పున ఆల్ప్రాజోలం తయారీ
- మేధాస్కూల్ కరస్పాండెంట్ రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు

సాక్షి, హైదరాబాద్: ఆల్ప్రాజోలం తయారీకి ప్రయత్నించి ఆరుసార్లు ఫెయిలైనా.. ఏడోసారికి సక్సెస్ అయ్యాడు. రోజుకు కిలో చొప్పున ఆల్ప్రాజోలం తయారు చేసేవాడు. స్కూల్‌లో అయితే ఎవరికీ అనుమానం రాదని స్కెచ్ వేశాడు. తయారుచేసిన ఆల్ప్రాజోలంను సింపుల్‌గా స్కూటీపై తీసుకెళ్లి అమ్మేవాడు... పాఠశాలలోనే మత్తుపదార్థాల తయారీకి తెర తీసిన మేధాస్కూల్ కరస్పాండెంట్ జయప్రకాశ్‌గౌడ్ రిమాండ్ రిపోర్టులో ఈ కీలక విషయాలు వెలుగు చూశాయి. ఈ కేసులో మల్లేల జయప్రకాశ్‌గౌడ్‌తోపాటు మరో ఇద్దరిని ఈగల్ టీం అరెస్టు చేయగా.. కోర్టు 14 రోజుల రిమాండ్ విధించిన విషయం తెలిసిందే. రిమాండ్ రిపోర్టులోని అంశాలు విశ్వసనీయ సమాచారం ప్రకారం.. జయప్రకాశ్‌గౌడ్ సులువుగా డబ్బు సంపాదనే లక్ష్యంగా ఈ మత్తుదందాలోకి దిగాడు. తొలుత ఓల్డ్ బోయినపల్లిలో ఒక భవనాన్ని అద్దెకు తీసుకుని మేధా హైస్కూల్ ప్రారంభించాడు. ఆ తర్వాత క్రమంలో గురువారెడ్డి అనే ఆల్ప్రాజోలం తయారీదారుడి నుంచి ఫార్ములా కొనుక్కున్నాడు. తన స్కూల్‌లోనే మత్తుపదార్థాలు తయారు చేస్తే.. ఎవరికీ తెలియకుండా ఉంటుందని మాస్టర్ ప్లాన్ వేశాడు. అనుకున్నట్టుగానే అవసరమైన కెమికల్స్. ఇతర పదార్థాలను రాత్రి సమయాల్లో తెచ్చేవాడు. ఉదయం పాఠశాల నడిచే సమయంలో ఆ రెండు గదులకు తాళం వేసి ఉంచేవాడు. విద్యార్థులు, ఉపాధ్యాయులు అంతా వెళ్లిన తర్వాత ఆల్ప్రాజోలం తయారీ మొదలు పెట్టేవాడు. ఇలా ఆరుసార్లు ఫెయిలైనా.. ఏడోసారి సక్సెస్ సాధించానని, తాను తయారుచేసిన మత్తుమందుతో కిక్కు రావడంతో వినియోగారులు హ్యాపీగా ఫీలయ్యారని విచారణలో జయప్రకాశ్‌గౌడ్ చెప్పినట్టు తెలిసింది. రోజుకు కిలో చొప్పున ఆల్ప్రాజోలం తయారు చేసి స్కూటీపై తీసుకెళ్లి సప్లై చేసేవాడు. ఆల్ప్రాజోలం తాను ఒక్కడే తయారు చేసి విక్రయించేవాడినని జయప్రకాశ్‌గౌడ్ చెబుతున్నా...ఈ వ్యవహారం వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా..? అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

మరో భారీ ప్రాజెక్టు ఏపీ నుంచి ఔట్!

- నెల్లూరులో రూ.5,500 కోట్ల నాల్కో–మిధానీ యూనిట్ ప్యాకప్

సాక్షి, అమరావతి: అటు కేంద్రంలోనూ అధికారంలో కొనసాగుతూ కీలక భాగస్వామిగా ఉన్న టీడీపీ కూటమి.. ఏపీకి కొత్తగా ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రాజెక్టులను తీసుకురాకపోగా గత ప్రభుత్వ కృషితో వచ్చిన వాటిని సైతం వెళ్లగొట్టేలా వ్యవహరిస్తుండటంపై పారిశ్రామిక వర్గాల్లో విభ్రాంతి వ్యక్తమవుతోంది. నెల్లూరు జిల్లాలో కీలకమైన ప్రాజెక్టు మూతపడుతున్నా మొద్దు నిద్ర నటిస్తోంది. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో రాష్ట్రానికి వచ్చిన ఓ భారీ పీఎస్‌యూ ప్రాజెక్టు ఇప్పుడు చాప చుట్టేసే పనిలో ఉంది. కీలకమైన రెండు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు నాల్కో, మిధానీ కలసి నెల్లూరు జిల్లాలో రూ.5,500 కోట్ల పెట్టుబడి అంచనాతో ఏడాదికి 60,000 టన్నుల అల్యూమినియం ఉత్పత్తి సామర్థ్యంతో యూనిట్ స్థాపించేలా వైఎస్ జగన్ సమక్షంలో ఒప్పందం కుదిరింది. పలు కారణాల రీత్యా ఈ ప్రతిపాదనను ఉపసంహరించుకుంటూ త్వరలో తుది నిర్ణయం తీసుకోనున్నట్లు నాల్కో ప్రకటించింది. ఇక్కడ ఉత్పత్తి చేసే హైఎండ్ అల్యూమినియం వినియోగం చాలా తక్కువగా ఉందని.. రక్షణ, విమానయాన , ఆటోమొబైల్ కంపెనీలు తక్కువగా ఉండటం, తలసరి అల్యూమినియం వినియోగం తక్కువగా ఉన్నందున ప్రాజెక్టు ఉపసంహరణ వైపు మొగ్గు చూపుతున్నట్లు పేర్కొంది. కేంద్ర ప్రభుత్వంలో కీలకపాత్ర పోషిస్తున్న కూటమి నేతలు దీనిపై నోరు విప్పక పోవడం పట్ల ప్రభుత్వ, పారిశ్రామిక వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతోంది. ప్రైవేట్ కంపెనీలకు సొంత ఇనుప గనులను కేటాయించేందుకు ఢిల్లీకి పరుగులు తీస్తున్న రాష్ట్ర మంత్రులు కీలకమైన కేంద్ర ప్రాజెక్టు మూతపడుతున్నా పట్టించుకోక పోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సెప్టెంబర్ 17.. విమోచనకు ప్రతీక

మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు



పుస్తకావిష్కరణలో విద్యాసాగర్‌రావు, రాంచందర్‌రావు తదితరులు

సాక్షి, హైదరాబాద్: సెప్టెంబర్ 17 అనేది కేవలం జెండా వందనం, మిలిటరీ పరేడ్ మాత్రమే కాదని.. అది తెలంగాణ విమోచన, స్ఫూర్తికి ప్రతీక అని మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు అన్నారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా పార్టీలకు అతీతంగా అప్పటి ఉద్యమం గొప్పగా సాగిందని, అనేకమంది త్యాగాలు చేశారని అన్నారు. 1948 సెప్టెంబర్ 17న పోలీస్ యాక్షన్ ద్వారా హైదరాబాద్ స్టేట్‌కు విమోచన లభించిందన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలో జరిగిన పోలీస్ యాక్షన్‌ను సులభతరం చేయడానికి ప్రజలంతా నిజాం వ్యతిరేక పోరాటంలో పాల్గొన్నారని చెప్పారు. దీనిపై కొందరు కుహనా లౌకిక వాదుల వాదనలను అంగీకరించాల్సిన అవసరం లేదన్నారు. తెలంగాణ విమోచన ఘట్టానికి మన చరిత్రలో అత్యంత ప్రాముఖ్యం ఉందని, అలాంటి ఘటన మరుగున పడటం సమంజసం కాదని అన్నారు. సోమవారం బీజేపీ కార్యాలయంలో భాస్కర్ యోగి రచించిన 'సెప్టెంబర్ 17 – ముమ్మాటికీ విమోచనే'అనే పుస్తకాన్ని విద్యాసాగర్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1998లో సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవం కోసం ఉద్యమాన్ని ప్రారంభించామని గుర్తుచేసుకున్నారు. సెప్టెంబర్ 17 ప్రాముఖ్యతను, చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వాలు చరిత్రను వక్రీకరిస్తున్నందున ఈ పోరాటాన్ని భవిష్యత్తులోనూ కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నగర వార్తలు

కళాశాలల అభివృద్ధికి నిధులు: కలెక్టర్

గోల్కొండ: ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల అభివృద్ధికి నిధులు కేటాయించేందుకు నిర్ణయించిందని, అందుకే తాను కళాశాలలను సందర్శిస్తున్నానని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన అన్నారు. సోమవారం ఆమె గోల్కొండలోని బీజేఆర్ బాలిక జూనియర్ కళాశాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఈ రెండు కళాశాలలు ఒకే భవనంలో ఉండటం వల్ల విద్యార్థినులకు సరిపడా సౌకర్యాలు లేవన్న విషయం ఎమ్మెల్యే కౌసర్ తన దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. ప్రభుత్వ కళాశాలల్లో విద్యా బోధనను మెరుగు పరచడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని.. ఇందులో భాగంగానే కళాశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పనకు ప్రత్యేకంగా నిధులు కేటాయించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల కోసం సరైన స్థల సేకరణ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనికి గాను గతంలో కూడా ప్రభుత్వ స్థలాలను సర్వే జరిగిందని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచడానికి కృషి చేయాల్సిన అవసరముందని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్, కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హరూన్ ఫర్హాన్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీలక్ష్మి, బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.మాధవి తదితరులు పాల్గొన్నారు.

విజయాల ప్రతీకగా వీబీఎన్ ఏపెక్స్



సాక్షి, సిటీబ్యూరో: ''ది కన్వర్జెన్స్, ది విజన్, ది ఫ్యూచర్'' అనే థీమ్‌తో నగరంలోని నోవాటెల్ వేదికగా నిర్వహించిన వీబీఎన్ ఏపెక్స్–2025 కార్యక్రమం 'ఐక్యత, అభివృద్ధి'కి ప్రతీకగా నిలిచింది. వైశ్య బిజినెస్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఈ ఏపెక్స్‌లో ప్రేరణాత్మక ప్రయాణాన్ని, ప్రస్తుత విజయాలను, భవిష్యత్తు లక్ష్యాలను వెల్లడించింది. ఈ వేదిక 6 చాప్టర్లు, 350కుపైగా సభ్యులతో రూ.8,500 కోట్లకు పైగా వ్యాపారం జరిపిన నమ్మకమైన ఎకోసిస్టమ్‌గా మారిందని సంస్థ వ్యవస్థాపకుడు ఎమ్మిడి శివకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యాపారాలు, ప్రతిభను అనుసంధానించే జాబ్ ఫెయిర్ ఇన్సియేటివ్, క్రమబద్ధమైన వృద్ధి కోసం ఫ్రాంచైజీ విస్తరణ మోడల్, కొత్త ప్రాంతాల్లో వీబీఎన్‌ను పరిచయం చేసే అవేర్‌నెస్ కార్యక్రమాలు, విభిన్న దేశాల మధ్య బిజినెస్ సమ్మిట్స్– స్ట్రాటజిక్ ఎంగేజ్‌మెంట్స్ వంటి వ్యూహాత్మక ప్రణాళికలను ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. 2026లో దుబాయ్‌లో జరగనున్న 10వ వార్షికోత్సవాలకు సంబంధించిన నూతన ప్రకటనను చైర్మన్ అభిషేక్ చందా విడుదల చేశారు.

స్వరం లేనివారి గొంతుక మీడియా: శాంతికుమారి



బంజారాహిల్స్: జర్నలిజం కేవలం ఒక వృత్తి కాదని, అది స్వరం లేనివారి స్వరం అని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ వైస్ చైర్‌పర్సన్ అండ్ డైరెక్టర్ జనరల్ శాంతికుమారి అన్నారు. జూబ్లీహిల్స్‌లోని ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో మీడియా నిర్వహణపై ఈ నెల 27వ తేదీ వరకు జరిగే ఇండియన్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్(ఐటీఈసీ) శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. విదేశాంగ మంత్రిత్వ శాఖలోని ఐటీఈసీ విభాగం ఆధ్వర్యంలో జరిగే ఈ శిక్షణ కార్యక్రమానికి ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలోని 25 దేశాల నుంచి 30 మంది ప్రతినిధులు ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి నాల్గో స్తంభంగా ఉన్న మీడియా ప్రభుత్వాలకు, పౌరులకు మధ్య వారధిగా పనిచేస్తుందన్నారు. మీడియా ప్రతినిధులు నేడు వేగవంతమైన పరివర్తన యుగంలో ప్రయాణిస్తున్నారని పేర్కొన్నారు. ఏఐ ఆధారిత వాస్తవ తనిఖీ, మొబైల్ జర్నలిజం నుంచి మల్టీమీడియా, సోషల్ మీడియా ప్లాట్‌ఫాంల వరకు సాంకేతిక సమాచారాన్ని ఉత్పత్తి చేసే, వినియోగించే విధానాన్ని పునర్నిర్మిస్తోందన్నారు. ఈ సాధనాలు అపారమైన అవకాశాలను అందిస్తున్నప్పటికీ అవి తప్పుడు సమాచారం, క్షీణిస్తున్న ప్రజావిశ్వాసం, నైతిక సందిగ్ధతల వంటి క్లిష్టమైన సవాళ్లను కూడా లేవనెత్తుతున్నాయని అభిప్రాయపడ్డారు. జర్నలిజం బలం ఆవిష్కరణలో మాత్రమే కాకుండా సమగ్రతలో కూడా ఉందన్నారు. ఖచ్చితత్వం, న్యాయం వారి పనికి పునాదిగా నిలబెట్టాలని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో సెంటర్ ఫర్ లా అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ హెడ్, కోర్సు డైరెక్టర్ మాధవి రావుల పాటి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ యాత్రాదానం పథకం ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీసీ రంగారెడ్డి రీజియన్‌లో యాత్రాదానం పథకాన్ని ప్రారంభించారు. దాతలు అందజేసే విరాళాల ద్వారా వృద్ధులు, అనాథల కోసం ప్రత్యేకంగా యాత్రా స్పెషల్ బస్సులను ఏర్పాటు చేయనున్నారు. రంగారెడ్డి రీజినల్ మేనేజర్ జె.శ్రీలత సోమవారం ఎంజీబీఎస్‌లో ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాత్రదానం–గిఫ్ట్ ఎ బస్ ట్రావెల్ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని అన్ని డిపోల నుంచి అరుణాచలం, శ్రీశైలం, యాదగిరిగుట్ట/స్వర్ణగిరి, వరంగల్, కాళేశ్వరం, అనంతగిరి, కొమురవెల్లి, ద్వారకా తిరుమల, అన్నవరం, వేములవాడ వంటి పుణ్యక్షేత్రాలు, పర్యాటక కేంద్రాలకు బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు, స్మారకార్థం నిర్వహించే కార్యక్రమాల సందర్భంగా యాత్రా బస్సులను విరాళంగా అందజేయవచ్చన్నారు. కార్పొరేట్ సంస్థలు, ఎన్ఆర్ఐలు, ఎన్జీఓలు, విద్యాసంస్థలు, సంఘాలు, కుటుంబాలు, వ్యక్తులు ముందుకు వచ్చి తమ దాతృత్వాన్ని చాటుకోవాలని ఆమె కోరారు. 200 నుంచి 500 కిలోమీటర్ల పరిధిలో ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ, రాజధాని బస్సుల్లో రూ.26,707 నుంచి రూ.50,962 వరకు స్పాన్సర్‌షిప్ ఉంటుందన్నారు. యాత్రదానం పథకం ద్వారా సమాజానికి సేవ చేస్తూ ఆధ్యాత్మిక సంతృప్తిని పొందవచ్చని చెప్పారు.

హైడ్రా ప్రజావాణికి 26 ఫిర్యాదులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో నాలాల ఆక్రమణలపై హైడ్రాకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అదనపు కమిషనర్ ఎన్.అశోక్‌కుమార్ ప్రధాన కార్యాయలంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 26 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో అత్యధికం నాలాలు, ప్రభుత్వస్థలాల ఆక్రమణలకు సంబంధించినవే. కూకట్‌పల్లిలోని రామ్‌నరేష్ నగర్ కాలనీ నుంచి వరద కాలువ ద్వారా అలీతలాబ్ చెరువులోకి చేరేది. ఇది ఎక్కడికక్కడ కబ్జా కావడంతో నీరు జనావాసాలను ముంచెత్తుతోంది. దీనిపై రామ్‌నరేష్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఫిర్యాదు చేసింది. బాచుపల్లి మండలం రేణుక ఎల్లమ్మ కాలనీలో 1,600 గజాల పార్కు స్థలంతోపాటు ప్రజావసరాలకు ఉద్దేశించిన 800 గజాల స్థలం కబ్జా అయిందని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరారు.

అడ్రస్ మారుతున్న రెండు పీఎస్కేలు

- అమీర్ పేట్, టోలిచౌకి నుంచి ఎంజీబీఎస్, రాయదుర్గానికి..
- ఈ రెండింటిలోనూ అదనంగా ఏర్పాటు కానున్న కౌంటర్లు
- నేడు ప్రారంభించనున్న కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డి



ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్ పీఎస్కే

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌లో ఉన్న మూడు పాస్‌పోర్టు సేవా కేంద్రాల్లో (పీఎస్కే) రెండు అడ్రస్ మారనున్నాయి. ప్రస్తుతం అమీర్‌పేట, బేగంపేట, టోలిచౌకి కేంద్రంగా మూడు పనిచేస్తున్నాయి. వీటిలో అమీర్‌పేటలోని పీఎస్కే ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్ మొదటి అంతస్తులోకి, టోలీచౌకిలోనిది రాయదుర్గంలో ఉన్న సిరి బిల్డింగ్ మొదటి యూనిట్‌లోకి మారనుంది. వీటిని కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి మంగళవారం ప్రారంభించనున్నారు. నగరంలో పీఎస్కేల సంఖ్య పెంచాలని, తూర్పు భాగంలో ఒకటి ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఏళ్లుగా ఉంది. దరఖాస్తులకు తగ్గట్టు కేంద్రాలను విస్తరించాలని ఆర్పీఓ అధికారులు సైతం కసరత్తు చేశారు. కొత్త పీఎస్కేలు ఏర్పాటు చేయడం కంటే ఉన్న వాటిలోనే కౌంటర్ల సంఖ్యను పెంచితే ఉపయుక్తం అనే అభిప్రాయం వ్యక్తమైంది. అయితే అమీర్‌పేటలోని ఆదిత్య ట్రేడ్ సెంటర్, టోలిచౌకిలోని వినోభానగర్‌ల్లో ఉన్న పీఎస్కేల్లోని కౌంటర్ల సంఖ్య పెంచడానికి, వీటి వద్దకు వచ్చే దరఖాస్తుదారులు వేచి ఉండటానికీ సరైన వసతులు కల్పించడానికి అవకాశం లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకున్న ఉన్నతాధికారులు ఈ రెండు పీఎస్కేలను అనువైన ప్రాంతానికి మార్చాలని నిర్ణయించారు. దీంతో ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్, సిరి బిల్డింగ్‌ల్లోకి మారుస్తూ నిర్ణయం తీసుకున్నారు. కొన్ని రోజులుగా అక్కడ అభివృద్ధి పనులు చేపట్టిన ఆర్పీఓ వర్గాలు దరఖాస్తుదారులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం నుంచి ఈ రెండూ దరఖాస్తుదారులకు అందుబాటులోకి రానున్నాయి. తొలుత ఎంజీబీఎస్ మెట్రోలోని పీఎస్కే ప్రారంభించే కిషన్‌రెడ్డి అక్కడ నుంచి వెళ్లి రాయదుర్గంలోనిది ప్రారంభించనున్నారు. ఎంజీబీఎస్–రాయదుర్గం మధ్య ఆయన మెట్రో రైలులో ప్రయాణించనున్నారు. ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్‌లో పీఎస్కే ఏర్పాటుతో నగరం తూర్పు భాగం, పాతబస్తీలో నివసించే వారితోపాటు ఇతర చోట్ల నుంచి వచ్చే వారికీ రాకపోకలు సాగించడం తేలికవుతుందని అధికారులు చెప్పన్నారు.

పేదల ఇళ్లల్లోకి చొరబడటం సరికాదు

– సీఆర్‌పీఎఫ్‌కు స్పష్టం చేసిన హుస్సేన్ నాయక్



మాట్లాడుతున్న హుస్సేన్ నాయక్

మియాపూర్: సీఆర్‌పీఎఫ్ బలగాలు ముందుగా ప్రజలకు రక్షణ కల్పించాలని, తర్వాత ప్రభుత్వ స్థలాలను కాపాడాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాతో హుస్సేన్ నాయక్ అన్నారు. ప్రభుత్వ స్థలాల రక్షణ పేరుతో పేదల ఇళ్లల్లోకి చొరబడి తనిఖీ చేయడం, భయభ్రాంతులకు గురిచేయడం సరైన పద్ధతి కాదని స్పష్టం చేశారు. సోమవారం మియాపూర్ నడిగడ్డ తండాలో జిల్లా ఎస్టీ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాతో హుస్సేన్ నాయక్, పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, సీఆర్‌పీఎఫ్, కస్టోడియన్ అధికారులతో కలిసి హాజరయ్యారు. నడిగడ్డ తండాలో పర్యటించి స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. కాలనీలో గ్రేవ్‌యార్డ్, కమ్యూనిటీ హాల్, స్కూల్, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయడం, మౌలిక వసతులు కల్పించడంతోపాటు ఇళ్ల నిర్మాణాలకు అనుమతించేవిధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కమిషన్ సభ్యుడిని కోరారు. జాతో హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ సీఆర్‌పీఎఫ్ తప్పుచేస్తే కేంద్ర ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. నడిగడ్డతండా, ఓంకార్ నగర్ కాలనీలో 6 వేల మంది పేదలు 50 ఏళ్లుగా నివసిస్తున్నారని, వీరి ఇళ్ల స్థలాల వరకు హద్దులు ఏర్పాటు చేసి మిగిలిన స్థలానికి కంచె నిర్మించి కబ్జా కాకుండా పరిరక్షించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదంతో పక్కా ఇంటి నిర్మాణం నిమిత్తం రూ.6 లక్షల 50 వేలు అందించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కస్టోడియన్ ప్రాపర్టీ డిప్యూటీ సెక్రటరీ కమల్‌జిత్, ఎన్‌సీఎస్‌టీ డైరెక్టర్ కళ్యాణ్ రెడ్డి, సీఆర్‌పీఎఫ్ హైదరాబాద్ సెకండ్ కమాండెంట్ అమిత్ మిశ్రా, ట్రైబల్ వెల్ఫేర్ అధికారిణి రామేశ్వరిదేవి, అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి, రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్ రెడ్డి, శేరిలింగంపల్లి తహసీల్దార్ వెంకారెడ్డి, ఉప కమిషనర్ శశిరేఖ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

17న మెగా బ్లడ్ డొనేషన్ డ్రైవ్

హిమాయత్‌నగర్: అఖిల భారతీయ తేరాపంథ్ యువక్ పరిషత్ హైదరాబాద్ 61వ వ్యవస్థాపక దినోత్సవం, ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం రక్తదాన్ అమృత్ మహోత్సవం సందర్భంగా సందర్భంగా ఈ నెల 17న రాష్ట్రవ్యాప్తంగా మెగా బ్లడ్ డొనేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు క్యాంప్ కన్వీనర్ రాహుల్ జైన్ తెలిపారు. సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రక్తదాన శిబిరం బ్రోచర్‌ను ప్రతినిధులు రాహుల్, విశాల్ జైన్, షైనీ గోల్చాలతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రక్తదానంపై ప్రజల్లో విస్తృతమైన అవగాహన పెంపొందిస్తున్నామన్నారు. దేశంలో 10 వేలు, రాష్ట్ర వ్యాప్తంగా 200, గ్రేటర్ పరిధిలో 100 రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తలసేమియా బ్లడ్ బ్యాంక్, రెడ్‌క్రాస్, ప్రభుత్వ బ్లడ్ బ్యాంకులకు తాము సేకరించిన రక్తాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. రక్తం కొరత తీవ్రంగా ఉండటం వల్ల చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. కళాశాలల్లో కూడా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా 75 దేశాల్లో కూడా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఓపెన్ టెన్నిస్ చాంపియన్ మధుసూదన్



ముగిసిన హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్

లక్డీకాపూల్: హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ 22వ టోర్నమెంట్ విజేతగా మధుసూదన్ లింగా నిలిచారు. హైదరాబాద్‌లోని విజయ్ టెన్నిస్ అకాడమీలో సోమవారం జరిగిన మెన్స్ సింగిల్స్ (50+) ఫైనల్లో సాంబశివారెడ్డిపై 6-4, 6-4తో మధుసూదన్ లింగా గెలుపొందారు. వరుస సెట్లలో శివారెడ్డిపై పైచేయి సాధించిన మధుసూదన్ టైటిల్ సాధించాడు. మధు (30+), భరణి (35+), రాజ (40+), బోస్ కిరణ్ (45+), కెవీఎన్ మూర్తి(55+), రమేశ్(60+), సురేశ్(70+), రామ్ మోహన్ (75+) మెన్స్ సింగిల్ విభాగాల్లో విజేతలుగా నిలిచారు. డబుల్స్ విభాగంలో సౌరభ్, వాహీద్ (30+), రాజ, విజయ్‌కిరణ్ (35+), లగ్గాని శ్రీనివాస్, రాజ (40+), మధు, మనీశ్ (45+), జాకీర్, విక్రమ్ (50+), చంద్రశేఖర్ రెడ్డి, రియాజ్ (55+), ఆనంద్ స్వరూప్, మెహర్ ప్రకాశ్ (60+), గజపతి, ధనంజయులు(70+), సాయిరామ్‌బాబు, అశోక్ రెడ్డి (75+) జోడీలు టైటిల్స్ సాధించాయి. మల్టీజోన్ ఐజీ ఎస్ చంద్రశేఖర్‌రెడ్డి, ఐజీ (స్పోర్ట్స్) రమేశ్‌రెడ్డి, రిటైర్డ్ ఐజీ ఎస్ కాంతారావులతో కలిసి హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ అసోసియేషన్ (హెచ్ఓటీఏ) అధ్యక్షుడు నంద్యాల నరసింహారెడ్డి విజేతలకు బహుమతులు అందించారు.

కాంగ్రెస్ కమిటీలు కొలిక్కి!

రెండు మూడు రోజుల్లో జిల్లా కాంగ్రెస్ కమిటీల ప్రకటన

- స్థానిక నాయకత్వం ఆమోదంతో ఏఐసీసీ సూచనల మేరకు కూర్పు
- అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పదవులు పంపిణీ
- జిల్లా పార్టీ అధ్యక్షుల నియామకం మాత్రం ఇప్పట్లో లేనట్టే

సాక్షి, హైదరాబాద్: పీసీసీ అధ్యక్షుడి నియామకం జరిగిన సంవత్సరానికి కాంగ్రెస్ పార్టీలో పదవుల పందేరానికి ముహూర్తం కుదిరింది. ఎప్పుడెప్పుడా అని క్షేత్ర స్థాయి నాయకత్వం ఎదురుచూస్తున్న జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ)లను త్వరలోనే ప్రకటించనున్నట్టు తెలుస్తోంది. ఏఐసీసీ మార్గదర్శకాలకు అనుగుణంగా, పీసీసీ సూచనల మేరకు, స్థానిక నాయకత్వం ఆమోదంతో డీసీసీ ఎంపిక ప్రక్రియ పూర్తయిందని, రెండు లేదా మూడు రోజుల్లో ప్రకటిస్తామని గాంధీభవన్ వర్గాలు చెపుతున్నాయి.

కమిటీల కూర్పు ఇలా...

జిల్లా కాంగ్రెస్ కమిటీలో పోస్టులను అసెంబ్లీ నియోజకవర్గాల ప్రాతిపదికన పంపిణీ చేయనున్నారు. ప్రతి కమిటీలో జిల్లాకు ఒక కోశాధికారితో పాటు జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఉపాధ్యక్ష, అధికార ప్రతినిధులతోపాటు రెండు ప్రధాన కార్యదర్శి పదవులను ఇవ్వనున్నారు. అదేవిధంగా మండలానికి ఒక కార్యదర్శిని ఎంపిక చేయనున్నారు. అంటే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి జిల్లా కమిటీలో 8–10 వరకు పదవులు రానున్నాయి. అప్పటికీ అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నేతలు మిగిలిపోతే వారికి డీసీసీ సభ్యులుగా అవకాశం కల్పించనున్నట్టు తెలుస్తోంది.

చివరి దఫా చర్చలు

డీసీసీ కమిటీల కూర్పు కోసం ఉమ్మడి జిల్లాల వారీగా నియమించిన పార్టీ ఇన్‌చార్జులు, డీసీసీ అధ్యక్షులతో పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ సోమవారం భేటీ అయ్యారు. పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా తనను కలిసేందుకు పెద్దఎత్తున వచ్చిన వారి నుంచి అభినందలు స్వీకరించిన మహేశ్‌గౌడ్ ఉమ్మడి జిల్లాల వారీగా నేతలతో భేటీ అయ్యారు. అన్ని జిల్లా కమిటీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా వర్గాలకు సముచిత ప్రాధాన్యతతోపాటు కొత్తగా పార్టీలో చేరిన వారికి 20 శాతం



పదవులు తదితర అంశాలపై ఆయన పార్టీ నాయకత్వంతో చర్చించారు.

అధ్యక్షులు ఇప్పుడు కాదు...!

ప్రస్తుతానికి జిల్లా కమిటీలు ప్రకటిస్తారే కానీ జిల్లా కమిటీలకు అధ్యక్షులను నియమించబోరని గాంధీ భవన్ వర్గాలు చెబుతున్నాయి. డీసీసీ అధ్యక్షుడి ఎంపిక కోసం ఈసారి ఏఐసీసీ ప్రత్యేక నియమావళి రూపొందించిందని, దీనిమేరకు ఎంపిక జరుగుతుందని అంటున్నాయి. డీసీసీ అధ్యక్షులకు పార్టీలో సముచిత ప్రాధాన్యత ఇవ్వాలన్నది ఏఐసీసీ ఆలోచన అని, ఈసారి అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక కోసం నియమించే సెంట్రల్ ఎలక్షన్ కమిటీల్లోనూ డీసీసీ అధ్యక్షులకు స్థానం ఉంటుందని తెలుస్తోంది. ఈ మేరకు ఏకాభిప్రాయంతో డీసీసీ అధ్యక్ష నియామకాలుంటాయని సమాచారం. కాగా, రాష్ట్రానికి చెందిన యువనేత, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డిని దేశవ్యాప్తంగా ఈ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన నేతృత్వంలో ఇప్పటికి ఆరు రాష్ట్రాల్లో డీసీసీ అధ్యక్షుల నియామకాలు పూర్తయ్యాయి.

ఈ దఫాలోనే తెలంగాణలోనూ జరగాల్సి ఉన్నప్పటికీ స్థానిక ఎన్నికలు జరుగుతాయన్న అంచనాల నేపథ్యంలో ప్రస్తుతానికి వాయిదా పడ్డాయని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి. స్థానిక ఎన్నికల నిర్వహణ బట్టే డీసీసీలకు కొత్త అధ్యక్షులను నియమిస్తారని, అప్పటివరకు ప్రస్తుతమున్న వారే కొనసాగుతారని చెప్పాయి.

క్లుప్తంగా...

సినీ అనుమతులన్నీ ఒకే విండోతో...

- ప్రత్యేకంగా వెబ్‌సైట్ రూపొందిస్తున్నాం
- ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు



సాక్షి, హైదరాబాద్: సినీ రంగాభివృద్ధికి కావాల్సిన అనుమతులన్నీ ఒకే విండోద్వారా ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందిస్తోందని తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) చైర్మన్ దిల్ రాజు అన్నారు. రాష్ట్రంలో సినిమాల చిత్రీకరణకు కావాల్సిన వివిధ అనుమతులు, సినిమా థియేటర్ల నిర్వహణకు కావాల్సిన అనుమతులపై 'ఫిలిమ్స్ ఇన్ తెలంగాణ'పేరిట సోమవారం బేగంపేటలోని టూరిజం ప్లాజాలో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ప్రియాంక, టూరిజం కార్పొరేషన్ ఎండీ వల్లూరి క్రాంతి, పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దిల్ రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి అన్ని రకాల చేయూతనిస్తున్నారని, ఈ అవకాశాన్ని సినీ పరిశ్రమ పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలని అన్నారు. సినిమాల నిర్మాణానికి వివిధ శాఖల నుంచి కావాల్సిన అనుమతులు, సినీ నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక విభాగాలు, టెక్నీషియన్ల వివరాలు, హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని వివిధ నగరాల్లో అందుబాటులో ఉన్న హోటళ్లు.. ఇలా సంపూర్ణ సమాచారంతో ఈ వెబ్‌సైట్‌ను రూపొందిస్తున్నామన్నారు. దీంతోపాటు సినిమా థియేటర్ల నిర్వహణకు కావాల్సిన బీ–ఫామ్‌ను కూడా ఆన్‌లైన్ ద్వారా పొందే సదుపాయం కల్పిస్తున్నామని వెల్లడించారు. ఈ వెబ్ సైట్‌ను పూర్తి స్థాయిలో రూపొందించిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలతో ప్రారంభిస్తామని దిల్‌రాజు తెలిపారు.

వక్ఫ్ (సవరణ) చట్టం తుది తీర్పుపై ఆశాభావం: ఒవైసీ



సాక్షి, హైదరాబాద్: వక్ఫ్ (సవరణ) చట్టం –2025పై సుప్రీంకోర్టు తాత్కాలిక ఉత్తర్వు మాత్రమే జారీ చేసిందని, త్వరలోనే తుది తీర్పు వెలువరిస్తుందని ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో ఆయన హైదరాబాద్ దారుస్సలాంలో విలేకరులతో మాట్లాడారు. వక్ఫ్‌సవరణ చట్టం వక్ఫ్ ఆస్తులను రక్షించే బదులు బోర్డును బలహీనపర్చే విధంగా ఆక్రమణలను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ సంకీర్ణ ప్రభుత్వానికి దమ్ముంటే ఇస్లాం మతంలోకి మారిన తర్వాత తమ ఆస్తిని వక్ఫ్‌కు ఇచ్చిన వ్యక్తుల వివరాలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ముస్లిమేతరులను వక్ఫ్ బోర్డు సభ్యులుగా నియమించడం మతపరమైన వ్యవహారాలను నిర్వహించే స్వేచ్ఛ హరిస్తుందని, ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 26ను ఉల్లంఘిస్తుందని ఒవైసీ తెలిపారు. అత్యున్నత న్యాయస్థానం వక్ఫ్‌చట్టాన్ని రద్దు చేస్తుందని విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

డిపాజిట్ల కోసమే కేటీఆర్ పాట్లు

- జూబ్లీహిల్స్‌లో నాలుగో స్థానం కూడా రాదు: విప్ ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్‌కు డిపాజిట్ కూడా వచ్చే పరిస్థితి లేదని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అర్థమైందని, డిపాజిట్ రాకపోతే ఆయన వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టు ఊడిపోతుందని కూడా ఆయనకు తెలుసని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. ఇప్పుడు ఆ పదవి కోసం జూబ్లీహిల్స్‌లో డిపాజిట్ కావాలని, ఆ డిపాజిట్ కోసమే కేటీఆర్ పడరాని పాట్లు పడుతున్నారని ఎద్దేవా చేశారు. సోమవారం సీఎల్పీ కార్యాలయంలో శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్‌లో పదేళ్ల పాటు ఎన్నో చేశామని కేటీఆర్ చెప్పుకుంటున్నారని, మరి లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు డిపాజిట్లు కూడా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కంటోన్మెంట్ స్థానానికి ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్‌కు మూడో స్థానం వచ్చిందని, ఇప్పుడు జూబ్లీహిల్స్‌లో నాలుగో స్థానం కూడా రాదన్నారు. కేటీఆర్ బడాయి మాటలను హైదరాబాద్ ప్రజలు నమ్మే పరిస్థితి లేదని శ్రీనివాస్ తెలిపారు.

రేపటి నుంచి మహిళలకు ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు

సాక్షి, హైదరాబాద్: మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణ, పోషణ మెరుగుదలకు కేంద్రం రూపొందించిన స్వస్థ నారీ–శక్తివంతమైన కుటుంబం (ఎస్ఎన్ఎస్‌పీఏ–2025) కార్యక్రమాన్ని ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నారు. దీనిని ఒక ఉద్యమం తరహాలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 20,607 వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నారు. వీటితోపాటు ప్రతి జిల్లాలో ఒకటి చొప్పున 33 మెగా శిబిరాలు కూడా సెప్టెంబర్ 17న ఏర్పాటు చేస్తారు. జాతీయస్థాయిలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనుండగా, హైదరాబాద్‌లోని అమీర్‌పేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుడుతుంది. ఈ మెగా వైద్యశిబిరాల్లో మహిళలకు రక్తపోటు, మధుమేహం, నోరు, రొమ్ము, గర్భాశయ కేన్సర్ వంటి వ్యాధుల స్క్రీనింగ్ చేస్తారు.

వీధి దీపాలకు సోలార్ పవర్

- సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో వీధి దీపాలు అనుసంధానం చేయాలి
- వీధి దీపాల నిర్వహణ, ఏర్పాటు అధికారం సర్పంచ్‌లకే ఇవ్వాలి
- అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి



సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో వేం నరేందర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు

సాక్షి, హైదరాబాద్: విద్యుత్తు ఆదా చేసేందుకు వీధి దీపాలకు సోలార్ పవర్ వినియోగించడంలో ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలో వీధి దీపాలకు ప్రతి నెలా రూ.8 కోట్ల కరెంటు బిల్లు చెల్లించాల్సి వస్తోందని చెప్పారు. కోర్ అర్బన్ సిటీ ఏరియాతోపాటు ఔటర్ రింగు రోడ్డు వెలుపల ఉన్న మున్సిపాలిటీల్లోనూ ఎల్ఈడీ లైట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలతోపాటు కొన్ని మున్సిపాలిటీల్లో కొత్త గ్రామాల విలీనం, గ్రామాల మార్పులు చేర్పులు జరిగాయని చెప్పారు. వాటన్నింటిని పరిగణనలోకి తీసుకొని ఎల్ఈడీ లైట్ల అంచనా వేయాలని ఆదేశించారు. సోమవారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మున్సిపల్, పంచాయతీ రాజ్, జీహెచ్ఎంసీ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.

వీధి దీపాలపై పర్యవేక్షణ

అన్ని గ్రామాల్లో వీధి దీపాల ఏర్పాటు, వాటి నిర్వహణ బాధ్యతలను సర్పంచులకే అప్పగించాలని సీఎం రేవంత్ చెప్పారు. గ్రామాల్లో అవసరమైనన్ని ఎల్ఈడీ లైట్లను అమర్చటంతోపాటు వాటిని సమర్థంగా నిర్వహించే అధికారం గ్రామ పంచాయతీల పరిధిలోనే ఉండాలని స్పష్టం చేశారు. రాత్రి పూట ఎల్ఈడీ లైట్లు పని చేయటంతో పాటు పగటిపూట దుర్వినియోగం కాకుండా పర్యవేక్షణ ఉండాలని, అన్ని గ్రామాల ఎల్ఈడీ డ్యాష్ బోర్డు మండల స్థాయిలో ఎంపీడీవో పర్యవేక్షణలో ఉండాలని చెప్పారు. జిల్లాలో అడిషనల్ కలెక్టర్‌కు ఈ బాధ్యతలు అప్పగించాలన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాల పరిధిలో 16.16 లక్షల ఎల్ఈడీ లైట్లున్నాయని, వరంగల్, నల్లగొండ, జనగాం, నారాయణపేట జిల్లాల్లో ఎల్ఈడీ లైట్ల కాంట్రాక్టు ఏజెన్సీ ఆధ్వర్యంలో ఉందని అధికారులు సీఎంకు వివరించారు. సర్పంచులకే వీటిని అప్పగిస్తే విద్యుత్తు దుర్వినియోగం కాకుండా అడ్డుకట్ట పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం

రాష్ట్రంలో అన్ని ఎల్ఈడీ లైట్లను హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జీహెచ్ఎంసీ పరిధిలో 5.50 లక్షల ఎల్ఈడీ లైట్లు ఉన్నాయని, అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ సిటీని కూడా కలిపితే మొత్తం 7.50 లక్షల లైట్లు అవసరమవుతాయని మున్సిపల్ శాఖ సీఎంకు నివేదించింది. కొత్తగా ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు, నిర్వహణకు టెండర్లు పిలవాలని రేవంత్ నిర్దేశించారు. ఎల్ఈడీ లైట్ల తయారీలో పేరొందిన కంపెనీలను ఆహ్వానించాలని, ఏడేళ్లపాటు నిర్వహణ బాధ్యతలు కంపెనీలకు అప్పగించాలని సూచించారు. ఎల్ఈడీ లైట్లతోపాటు కంట్రోల్ బాక్స్‌ల ఏర్పాటు, నిరంతరం అవి పనిచేస్తున్నాయా లేదా, ఏయే ప్రాంతాల్లో ఇబ్బందులున్నాయో తెలుసుకునేందుకు ప్రత్యేకంగా వ్యవస్థ ఉండాలన్నారు. హైదరాబాద్ ఐఐటీలాంటి సంస్థలతో థర్డ్ పార్టీ ఆడిట్ చేయించాలని సీఎం సూచించారు. సమీక్షలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, పంచాయతీ రాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి ఎన్.శ్రీధర్, కోర్ అర్బన్ ఏరియా మున్సిపల్ సెక్రటరీ ఇలంబర్తి, మున్సిపల్ శాఖ కార్యదర్శి శ్రీదేవి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ శ్రీజన పాల్గొన్నారు.


జర్నలిస్టుల జీత భత్యాలపై కమిటీని పునరుద్ధరిస్తాం

- అక్రిడిటేషన్ల పాలసీపై యాక్షన్‌ప్లాన్ అమలు
- జర్నలిస్టులపై దాడులు జరగకుండా చర్యలు
- సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి



సాక్షి, హైదరాబాద్: జర్నలిస్టుల జీత భత్యాలకు సంబంధించి త్రైపాక్షిక కమిటీని పునరుద్ధరిస్తామని, అక్రిడిటేషన్ల పాలసీపై యాక్షన్‌ప్లాన్ అమలు చేయనున్నామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. జర్నలిస్టుల సమస్యలపై సోమవారం సచివాలయంలో హోంశాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రవి గుప్తా, ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, ఐపీఆర్ స్పెషల్ కమిషనర్ సీహెచ్. ప్రియాంక, సీపీఆర్‌వో జి.మల్సూర్‌తో కలసి మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అక్రిడిటేషన్ విధానం, జర్నలిస్టుల హెల్త్ పాలసీ, అవార్డులు, వారిపై దాడులను నిరోధించడం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందేలా విధి విధానాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. జర్నలిస్టుల హెల్త్ పాలసీపై సమగ్రంగా చర్చించాలని, వారికి ఏది ప్రయోజనకరంగా ఉంటుందనే విషయంపై ఆరోగ్యశ్రీ విభాగంతో కలసి లోతైన అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే జర్నలిస్టులకు అవార్డులను పునరుద్ధరించాలని ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి చేసిన విజ్ఞప్తికి మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్ కుమార్, కార్మిక శాఖ అడిషనల్ కమిషనర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం లాభం కోసమే ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పు: హరీశ్‌రావు



మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసిన సంగారెడ్డి జిల్లా రైతులు

సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగు రోడ్డు (ట్రిపుల్ ఆర్) అలైన్‌మెంట్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ఇష్టారీతిన మారుస్తూ పేద రైతుల పొట్ట కొడుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వ అనాలోచిత చర్యలతో రైతులు పంట భూములను కోల్పోతున్నారని అన్నారు. సంగారెడ్డి జిల్లా కొండాపురం మండలంలోని పలు గ్రామాల రైతులు సోమవారం హరీశ్‌రావును ఆయన నివాసంలో కలిసి ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చి ప్రభుత్వం తమ పొట్ట కొడుతోందని గోడు వెళ్లబోసుకున్నారు. ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగం అలైన్‌మెంట్ మార్పుతో కొండాపూర్ మండలంలోని గిర్మాపూర్, ఆలియాబాద్, మారేపల్లి, రాంపూర్ తండా, గోటీలగుట్ట తండా, శివన్నగూడెం, గంగారం గ్రామాల రైతులు తీవ్రంగా నష్టపోతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వం తొలుత గిర్మాపూర్ నుంచి ప్రతిపాదిస్తే.. సీఎం రేవంత్‌రెడ్డి తన సొంత లాభం కోసం వికారాబాద్, పరిగి, కొడంగల్ మీదుగా అష్ట వంకరలు తిప్పుతూ పచ్చని పొలాలను మాయం చేసే కుట్రకు తెరలేపారని విమర్శించారు. అలైన్‌మెంట్ మార్పుపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

మీరు దొరికిన దొంగలు.. తప్పించుకోలేరు

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి
- స్పీకర్ ఇచ్చిన నోటీసులకు బీఆర్ఎస్ రిజాయిండర్ సమర్పణ



అసెంబ్లీ సంయుక్త కార్యదర్శికి రిజాయిండర్ ఇస్తున్న జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యేలు వివేకానంద, చింతా ప్రభాకర్

సాక్షి, హైదరాబాద్ : బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు దొరికిన దొంగలని..అనర్హత వేటు నుంచి వారు తప్పించుకోలేరని బీఆర్ఎస్ ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం పార్టీ మారిన ఎమ్మెల్యేలు అనర్హత వేటు పడుతుందనే భయంతో అమాయకత్వం నటిస్తున్నారని మండిపడ్డారు. పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు ఇచ్చిన వివరణలను స్పీకర్ ప్రసాద్‌కుమార్ నాలుగు రోజుల క్రితం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు పంపిన విషయం తెలిసిందే. పార్టీ మారినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు ఇచ్చిన వివరణలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, కేపీ వివేకానంద, చింత ప్రభాకర్ సోమవారం అసెంబ్లీ సంయుక్త కార్యదర్శి ఉపేందర్‌రెడ్డికి తమ రిజాయిండర్ (ప్రతిస్పందన)ను అందజేశారు. అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద వివేకానంద, చింత ప్రభాకర్‌తో కలిసి జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. 'బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన పదిమంది ఎమ్మెల్యేలపై మూడు నెలల్లోగా చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో పార్టీ మారిన ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు ఇచ్చారు. అయితే తాము పార్టీ మారలేదని, కేసీఆర్ నాయకత్వంపై తమకు విశ్వాసం ఉందని స్పీకర్‌కు వివరణ ఇచ్చారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఇచ్చిన వివరణలను స్పీకర్ పంపి మూడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. స్పీకర్ ఇచ్చిన మూడు రోజుల గడువులో పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఇచ్చిన వివరణలపై రిజాయిండర్ ఇచ్చాం'అని జగదీశ్‌రెడ్డి వెల్లడించారు. 'అభివృద్ధి పనుల కోసం సీఎం వద్దకు వెళ్లామని చెబుతున్న ఫిరాయింపు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను ఎందుకు కలిశారు. పత్రికల్లో సీఎం, కాంగ్రెస్ నేతల ఫొటోలతో అడ్వర్టయిజ్‌మెంట్లు కూడా ఇచ్చారు. పది మంది ఎమ్మెల్యేలు ఎక్కడ తప్పించుకున్నా కోర్టు ముందు తప్పించుకోలేరు'అని జగదీశ్‌రెడ్డి విమర్శించారు.

గడువు కోరిన దానం, కడియం !

- స్పీకర్ నోటీసులకు సమాధానం ఇచ్చేందుకు తమకు మరికొంత గడువు కావాలని దానం నాగేందర్, కడియం శ్రీహరి కోరినట్టు తెలిసింది.
- ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాలే యాదయ్య, తెల్లం వెంకట్రావు, గూడెం మహిపాల్‌రెడ్డి, డాక్టర్ సంజయ్ ఇచ్చిన వివరణలపై బీఆర్ఎస్ తమ రిజాయిండర్లను అసెంబ్లీ సంయుక్త కార్యదర్శికి అందజేసింది.
- ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్ ఇచ్చిన వివరణలపై రిజాయిండర్ ఇచ్చేందుకు తాను విదేశీ పర్యటనలో ఉన్నందున తనకు కొంత గడువు కావాలని కోరుట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ స్పీకర్‌ను కోరినట్టు తెలిసింది. విదేశీ పర్యటన నుంచి వచ్చిన తర్వాత రిజాయిండర్లు సమర్పిస్తానని చెప్పినట్టు తెలిసింది.

రాష్ట్రానికి అదనపు యూరియా

- 40 వేల మెట్రిక్ టన్నులు కేటాయించిన కేంద్రం
- మంత్రి తుమ్మల వెల్లడి



కేంద్ర ఎరువులశాఖ కార్యదర్శి మిశ్రాతో మంత్రి తుమ్మల

సాక్షి, న్యూఢిల్లీ: యూరియా సరఫరాపై తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తికి కేంద్రం సానుకూలంగా స్పందించింది. ఈ వారంలో రాష్ట్రానికి అదనంగా 40 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసేందుకు అంగీకరించినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం కేంద్ర ఎరువుల శాఖ కార్యదర్శి రజత్‌కుమార్ మిశ్రాతో భేటీ అనంతరం తుమ్మల మాట్లాడారు. 'ప్రస్తుతం తెలంగాణలో సాగులో ఉన్న ప్రధాన పంటలు.. వరి, మొక్కజొన్న, పత్తికి యూరియా ఎంతో అవసరం. ఈ 10–15 రోజులు అత్యంత కీలకం. దీంతో రాష్ట్ర రైతుల అవసరాలకు తగ్గట్టుగా యూరియా సరఫరా చేయాలని కోరాం. అలాగే అంతకు ముందు నెలల్లో ఏర్పడిన యూరియా లోటును పూడ్చే విధంగా ఈ నెలలో 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కావాలని కోరాం. సెప్టెంబర్ నెలలో ఇప్పటివరకు లక్షా 4 వేల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి సరఫరా చేశారు. రానున్న 10 రోజుల్లో మరో లక్ష మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేయాలని కోరాం. అందుకు రజత్‌కుమార్ స్పందిస్తూ.. దేశీయ యూరియా ఉత్పత్తి ఆశించిన స్థాయిలో లేదని చెప్పారు. విదేశాల నుంచి దిగుమతయ్యే యూరియాలో తెలంగాణకు అధిక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. 40 వేల మెట్రిక్ టన్నుల యూరియాను తెలంగాణకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇచ్చిన ప్రణాళిక ప్రకారం ఈ వారంలో సరఫరా కానున్న 40 వేల మెట్రిక్ టన్నులకు ఇది అదనం..'అని మంత్రి వెల్లడించారు.


బండి సంజయ్‌పై కేటీఆర్ పరువు నష్టం దావా

- తనపై నిరాధార ఆరోపణలు చేశారని సిటీ సివిల్ కోర్టులో ఫిర్యాదు
- బహిరంగ క్షమాపణ చెప్పి, రూ.10 కోట్లు చెల్లించాలని డిమాండ్

సాక్షి, హైదరాబాద్: కేంద్ర మంత్రి బండి సంజయ్ నిరాధార ఆరోపణలతో తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో సోమవారం పరువు నష్టం దావా వేశారు. బండి సంజయ్‌తో పాటు కొన్ని మీడియా సంస్థలు, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లను కూడా ఆయన ఈ దావాలో చేర్చారు. బండి సంజయ్ తనకు బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పి, రూ.10 కోట్ల పరిహారం చెల్లించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఎస్ఐబీ (స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్) దుర్వినియోగం, ఫోన్ ట్యాపింగ్, ఆర్థిక అవకతవకలను తనకు ముడిపెడుతూ 2025 ఆగస్టు 8న బండి సంజయ్ వ్యాఖ్యలు చేశారన్నారు. ఏబీఎన్ తెలుగు, ఎన్టీవీ, టీవీ5, వీ6, ఏఎన్ఎన్ తెలుగు వంటి టీవీ చానళ్లు, అలాగే ఇండియా టుడే, ఎన్డీటీవీ, డెక్కన్ హెరాల్డ్, టైమ్స్ ఆఫ్ ఇండియా వంటి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, ఎక్స్, యూట్యూబ్, గూగుల్, మెటా (ఫేస్‌బుక్/ఇన్‌స్టాగామ్) వంటి సోషల్ మీడియా వేదికలపై ఈ వ్యాఖ్యలు విస్తృతంగా ప్రసారమయ్యాయని కేటీఆర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేందుకే బండి సంజయ్ ఈ వ్యాఖ్యలు చేశారన్నారు. 2025 ఆగస్టు 11న లీగల్ నోటీసు పంపినప్పటికీ, బండి సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పేందుకు నిరాకరించడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు పేర్కొన్నారు. తనకు బండి సంజయ్ బేషరతుగా, బహిరంగ క్షమాపణ చెప్పడంతో పాటు ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు, మీడియా పోర్టల్‌ల నుంచి తన పరువుకు నష్టం కలిగించే కథనాలు, వీడియోలు, పోస్టులను తక్షణమే తొలగించేలా ఆదేశించాలని కోరారు. భవిష్యత్తులో కూడా వీరు తన పరువుకు నష్టం కలిగించే రీతిలో వార్తలు ప్రచురించకుండా లేదా ప్రసారం చేయకుండా నిరోధించే ఉత్తర్వులు ఇవ్వాలని కేటీఆర్ న్యాయస్థానాన్ని కోరారు.

పరువునష్టం దావాతో కేటీఆర్ బెదిరింపులు

న్యాయపరంగా ఎదుర్కొంటాం: కేంద్రమంత్రి బండి సంజయ్



కరీంనగర్‌టౌన్: ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పరువునష్టం దావా వేసి తనను బెదిరించే ప్రయత్నం చేస్తున్నారని, దానిని న్యాయపరంగా ఎదుర్కొంటామని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. కరీంనగర్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, తాను తొమ్మిదిసార్లు జైలుకు వెళ్లివచ్చానని, తనపై ఇప్పటికే వందకుపైగా కేసులు ఉన్నాయని అన్నారు. కేటీఆర్ మాదిరిగా ఇజ్జత్ దావాలు వేయాలంటే తాము అనేక కేసులు వేయవచ్చని తెలిపారు. తాను రాజకీయంగా ఎదుర్కొంటానని, బెదిరించేందుకు ఇజ్జత్ దావా వేయనని ఎద్దేవా చేశారు. తాను లవంగం తింటే తంబాకు అన్నారని, దమ్ముంటే కుటుంబ సభ్యులతో దేవుడి సన్నిధికి రావాలని సవాల్ విసిరితే.. కేటీఆర్ ఎందుకు రావడం లేదని బండి ప్రశ్నించారు. 'అమెరికాలో ఎవరెవరికి ట్వీట్ చేశావో? నీ సంగతి ఏమిటో త్వరలోనే అన్నిఆధారాలతో బయటపెడతా'అని సంజయ్ అన్నారు. 'డ్రగ్స్ తీసుకోలేదని ముందుకు వచ్చే ధైర్యం నీకు ఉందా?'అని కేటీఆర్‌కు సవాల్ విసిరారు.

కమీషన్లు, కాంట్రాక్టులకే డబ్బులు ఉన్నాయా?

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుల్లో అలసత్వం
- రాష్ట్రంలో యూరియా కొరతకు కారణం కాంగ్రెస్సే...
- జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఆ పార్టీకి గుణపాఠం చెప్పాలి
- తెలంగాణభవన్‌లో జూబ్లీహిల్స్ కార్యకర్తలతో భేటీలో కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో రేవంత్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో 13 లక్షల మంది పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఉన్నతవిద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ప్రభుత్వ ఖజానాలో డబ్బులు లేవని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పడం.. కాంగ్రెస్ ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనంగా పేర్కొన్నారు. విద్యార్థుల ఫీజుల కోసం లేని డబ్బులు.. కమీషన్లు, కాంట్రాక్టులకు ఎక్కడి నుంచి వస్తున్నాయో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణభవన్‌లో సోమవారం జరిగిన జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే వెంగళరావునగర్ డివిజన్ స్థాయి బూత్ కమిటీ సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.20 వేల కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద చెల్లించామన్నారు.

కాంగ్రెస్ వల్లే యూరియా కొరత

రైతుల కోసం కేటాయించిన యూరియాను కాంగ్రెస్ నాయకులే బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకుంటున్నారని, యూరియా కొరతకు ఆ పార్టీనే కారణమని కేటీఆర్ ఆరోపించారు. మిర్యాలగూడ కాంగ్రెస్ ఎమ్మెల్యే గన్‌మన్ ఒక లారీ లోడ్ యూరియాను ఎత్తుకుపోవడం రాష్ట్రంలో కాంగ్రెస్ నేతల దోపిడీకి నిలువెత్తు నిదర్శనమన్నారు. ఒక గన్‌మన్ లారీలోడ్ యూరియా ఎత్తుకుపోతే.. ఇక కాంగ్రెస్ నాయకులు, మంత్రులు ఎంత దోచుకుంటున్నారో ప్రజలు అర్థం చేసుకోవాలని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ఒక్క హామీ కూడా అమలు చేయలేకపోయారని కేటీఆర్ విమర్శించారు.దివంగత నేత పి.జనార్దన్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ పోరాట స్ఫూర్తితో బీఆర్ఎస్ కార్యకర్తలు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పనిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే ఇళ్ల కూల్చివేతలకు అనుమతి ఇచ్చినట్టే అని రేవంత్ భావిస్తాడనే విషయాన్ని ప్రజలకు విడమరిచి చెప్పాలని కార్యకర్తలను ఆదేశించారు.

- వక్ఫ్ సవరణ చట్టం 2025పై సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను స్వాగతిస్తున్నట్టు కేటీఆర్ ప్రకటించారు. ఈ చట్టంలోని వివాదాస్పద నిబంధనలపై బీఆర్ఎస్ మొదటి నుంచి తన ఆందోళనలను గట్టిగా వినిపించిందన్నారు.

మానవతా కోణంలో నిర్ణయం తీసుకోవాలి

మెడికల్ ఎంట్రెన్స్ పరీక్షల్లో అర్హత సాధించినా, రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త స్థానికత జీవో కారణంగా ప్రవేశాలకు అనర్హులుగా మిగిలిపోతున్న తెలంగాణ విద్యార్థుల ఆవేదనపై కేటీఆర్ స్పందించారు. ఈ సమస్యను ఆయన దృష్టికి తీసుకురావడానికి తెలంగాణ భవన్‌కు వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కేటీఆర్ సమావేశమయ్యారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం స్థానికతకు సంబంధించి ఒక ఇబ్బందికరమైన జీవోను తీసుకువచ్చిందని విద్యార్థులు కేటీఆర్‌కు తెలిపారు. ఈ విషయంలో ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక ప్రతినిధి బృందం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలుస్తుందని తెలిపారు. ఈ అంశంలో మానవతా కోణంలో నిర్ణయం తీసుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పేరు పెట్టి.. కానుక ఇచ్చి..

భద్రాద్రి జిల్లా దంపతుల కుమారుడికి నామకరణం చేసిన కేటీఆర్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గానికి చెందిన లావణ్య, రాంబాబు దంపతులు తమ కుమారుడికి పేరు పెట్టాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వద్దకు తమ బిడ్డను తీసుకువచ్చారు. బాబుకు ఏ అక్షరంతో పేరు పెట్టాలని కేటీఆర్ అడిగినప్పుడు, 'సు'అనే అక్షరంతో పేరు పెట్టాలని బ్రాహ్మణులు సూచించిన విషయాన్ని ఆ దంపతులు కేటీఆర్‌కు తెలియజేశారు. దీంతో 'సూర్యాంశ్'అనే పేరును ఆ చిన్నారికి కేటీఆర్ పెట్టారు. తమ కుమారుడికి కేటీఆర్ పెట్టిన పేరు ఆయన కుమారుడు హిమాన్షు లాగా ధ్వనిస్తుండటంతో దంపతులు సంతోషించారు. తమ అభిమాన నేతతో గడిపిన ఈ క్షణాలను జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేమని వారు భావోద్వేగంతో చెప్పారు. ఈ సందర్భంగా కేటీఆర్ వారికి 'కేసీఆర్ కిట్'ను బహూకరించారు.


పనుల ఒత్తిడి వల్ల సరైన ఆహారం తీసుకోక బలహీన పడ్డ స్త్రీలు తరచూ నడుము నొప్పితో బాధపడుతుంటారు. అలాంటి వారు రోజూ ఏదో ఒక రూపేణా గుప్పెడు సెనగలు తీసుకుంటే సరి!

నడుము నొప్పిపై ప్రత్యేక కథనం సాక్షి హెల్త్ ప్లస్ ఈపేపర్‌లో..

న్యూస్‌మేకర్

ఒక మోడల్ ఆర్మీ ఆఫీసర్ కావడమంటే సౌందర్యం కంటే దేశం ముఖ్యం అనుకోవడమే. 2023లో 'మిస్ ఇంటర్నేషనల్ ఇండియా' కిరీటం గెలిచిన కషిష్ మెత్వాని 2024లో 'కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎంట్రన్స్'లో 2వ ర్యాంకు సాధించింది. ఏడాది పాటు చెన్నైలో శిక్షణ పొందాక తాజాగా ఆమె లెఫ్టినెంట్ హోదాలో ఆర్మీ ఆఫీసర్‌గా దేశసేవకై అడుగు ముందుకేసింది. అందాల కిరీటం కన్నా ఆర్మీ యూనిఫామ్ గొప్ప సంతృప్తిని ఇస్తుందంటున్న పూణె అమ్మాయి కషిష్ పరిచయం.



కషిష్ మెత్వాని

ఆర్మీ డ్యూటీ అసలు బ్యూటీ

'ముఝే సబ్‌కుఛ్ కర్నా హై'... (నాకు అన్నీ సాధించాలని ఉంది)... ఇదీ కషిష్ మెత్వాని తరచూ చెప్పేమాట. 'నాకు నచ్చిన పనులన్నీ చేస్తూ సంతోషాన్ని పొందడమే నాకు కావలసింది' అని కూడా ఆమె చెబుతూ ఉంటుంది.

పుణెకు చెందిన ఈ యువతి చిన్నప్పటి నుంచి సాధించినవి వింటే ఆశ్చర్యం వేస్తుంది. మోడల్‌గా, 'మిసెస్ ఇంటర్నేషనల్ ఇండియా' టైటిల్ విన్నర్‌గా గ్లామర్ రంగంలో రాణిస్తుందనుకుంటే ఏకంగా ఆర్మీ ఆఫీసర్‌గా ట్రెనింగ్ పూర్తి చేసుకుని సెప్టెంబర్ మొదటి వారంలో లెఫ్టినెంట్‌గా 'ఆర్మీ ఎయిర్ డిఫెన్స్'లో పని చేయడానికి సిద్ధమైంది. 'మా ఇంట్లో ఎవరూ ఆర్మీలో పని చేయలేదు. నేనే మొదటిదాన్ని. ఈ పని చాలా కష్టమని తెలుసు. కష్టమైనది సాధిస్తేనే కదా సంతోషం' అంటోంది.

న్యూరో సర్జన్ కాబోయి..

కషిష్ మెత్వానీది పుణె. ఆమె తండ్రి సైంటిస్ట్‌గా పని చేస్తుంటే తల్లి టీచరుగా ఆర్మీ స్కూల్‌లో పాఠాలు చెప్పేది. 'మా ఇంట్లో టీవీ ఉండేది. కాని ఏ రోజూ నేను దానిని చూసి టైమ్ వేస్ట్ చేసుకోలేదు. స్కూలు పుస్తకాలు చదవడం, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం చేసేదాన్ని. నేను ప్రతి పోటీలో పాల్గొని గెలవాలని కోరుకునేదాన్ని. అలాగే గెలిచేదాన్ని కూడా' అంది కషిష్. చదువులో విశేష ప్రతిభ చూపిన కషిష్ చిన్నప్పుడు న్యూరోసర్జన్ కావాలనుకుంది. కాని స్కూల్లో, ఇంటర్‌లో ఎన్.సి.సిలో చేరడంతో ఆమె ఆలోచనలు మారాయి. ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే వేడుకల్లో ఎన్.సి.సి కాడెట్‌గా పాల్గొనడం ఆమె మీద ప్రభావం చూపింది. ఆర్మీలో చేరాలన్న ఆలోచన అప్పుడే వచ్చింది. ఈలోపు చదువు కొనసాగించి ఎం.ఎస్‌సీ. చేశాక బెంగళూరులో న్యూరో సైన్స్‌లో థీసిస్ సమర్పించింది. ఆ సమయంలోనే హార్వర్డ్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేసే అవకాశం వచ్చినా తన జీవితం దేశసేవకే అంకితం అని కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎంట్రన్స్- 2024 రెండో ర్యాంక్ సాధించింది. చెన్నైలోని ఆఫీసర్స్ ట్రెనింగ్ అకాడెమీలో శిక్షణ పూర్తయ్యాక ఆఫీసర్‌గా పని చేయడానికి 'ఆర్మీ ఎయిర్ డిఫెన్స్' వింగ్‌ను ఎంచుకుంది.

బహుముఖ ప్రజ్ఞాశాలి

కషిష్ బహుముఖ ప్రజ్ఞాశాలి. చదువుతూనే పిస్టల్ షూటింగ్ నేర్చుకుంది. వాలీబాల్ ప్లేయర్‌గా ప్రతిభ చాటింది. తబలా నేర్చుకుంది. భరతనాట్యం సాధన చేసింది. అదేవిధంగా గ్లామర్ రంగంలో కూడా తన ఉనికి చాటుకోవడానికి మోడల్‌గా మారింది. అదే సమయంలో మిస్ ఇంటర్నేషనల్ ఇండియా టైటిల్ గెలుచుకుంది. ఇవన్నీ 24 ఏళ్లలో సాధించింది. ఆ తర్వాత ఆర్మీ ఆఫీసర్ అయ్యింది. 'ఇన్ని చేయడానికి కారణం నా తల్లిదండ్రులు నన్ను ప్రోత్సహించడమే. ఆర్మీ శిక్షణలో కూడా నేను ఎక్కడా తగ్గలేదు. శిక్షణా కాలంలో అనేక పోటీల్లో నేను ఫస్ట్ నిలిచాను' అంటుంది కషిష్.


తల్లితో కషిష్

హార్వర్డ్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేసే అవకాశం వచ్చినా తన జీవితం దేశసేవకే అంకితం అని కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎంట్రన్స్- 2024 రెండో ర్యాంక్ సాధించి, శిక్షణ పూర్తయ్యాక ఆఫీసర్‌గా 'ఆర్మీ ఎయిర్ డిఫెన్స్' వింగ్‌ను ఎంచుకుంది కషిష్.

సామాజిక సేవలో

ఇన్ని పనులు చేసిన కషిష్ సామాజిక సేవలో కూడా తనదైన కృషి సాగిస్తోంది. 'క్రిటికల్ కాజ్' అనే ఎన్.జి.ఓ.ను స్థాపించి అవసరమైన వారికి ప్లాస్మా, అవయవ దానం వంటి ప్రాణాధార సహాయం అందేలా చేస్తోంది. 'మన కోసం మనం కష్టపడుతూనే సమాజం కోసం కూడా కష్టపడాలి. అది ప్రతి ఒక్కరి బాధ్యత' అంటోంది కషిష్.

నిజంగానే ఆమె ఒక భిన్నమైన ప్రతిభాశాలి.

'సైంటిస్ట్ కావాలి' 'ఐపీఎస్ ఆఫీసర్ కావాలి'... ఇలా ఆ పిల్లలకు ఎన్నో కలలు ఉన్నాయి. అయితే ఆ కలలకు అడ్డుగోడ గణితంపై వారికి ఉండే భయం. 'పఢాయి విత్ ఏఐ' అనే ఏఐ సాంకేతిక కార్యక్రమంతో పిల్లల్లో గణితంపై ఉండే భయాన్ని పోగొట్టింది ఐఏఎస్ అధికారి సౌమ్య ఝా. 'పఢాయి విత్ ఏఐ' పుణ్యమా అని పిల్లలకు ఏఐ అంటే భయం పోయింది. నైపుణ్యం సొంతం అయింది.

మ్యాథ్స్ విత్ ఏఐ

పఢాయి... హాయి


సౌమ్య ఝా

రాజస్థాన్‌లోని టోంక్‌కు చెందిన అమన్ గుజర్ అనే విద్యార్థికి గణితం అంటే వణుకు. చాలా కష్టంగా, ఒత్తిడిగా అనిపించేది. గణితంలో ఎప్పుడూ బొటాబొటీ మార్కులు వచ్చేవి. అయితే అతడి భయానికి 'పఢాయి విత్ ఏఐ' ఫుల్‌స్టాప్ పెట్టింది. గణితం అంటే భయాన్ని పోగొట్టి, ఉత్సాహాన్ని పెంచింది.

'పఢాయి విత్ ఏఐ' అంటే?

అమన్ చదివే స్కూల్‌లో 'పఢాయి విత్ ఏఐ' పేరుతో ఏఐ ఆధారిత విద్యా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎంత క్లిష్టమైన గణిత సమస్యలనైనా సులభంగా అర్థమయ్యేలా విద్యార్థులకు వివరిస్తుంది. 'గణితం అంటే ఒకప్పుడు ఉండే భయం ఏమాత్రం లేదు. ఇప్పుడు నాకు గణితం అనేది ఒక సబ్జెక్ట్ కాదు. ఆట. గణితంలోనూ మంచి మార్కులు సాధించడం నాకు ఎంతో గర్వంగా ఉంది. నూటికి నూరు మార్కులు తెచ్చుకోవాలనే ఆత్మవిశ్వాసం వచ్చింది' అంటున్నాడు అమన్.

ఐఏఎస్ అధికారి సౌమ్య ఝా ఆలోచన నుంచి పుట్టిందే... పఢాయి విత్ ఏఐ.

ఆమె టోంక్ జిల్లాలోని ఒక ప్రభుత్వ పాఠశాలను సందర్శించినప్పుడు చాలామంది విద్యార్థులు గణితం, సైన్స్ సబ్జెక్ట్‌లలో వెనకబడి ఉన్నారనే విషయాన్ని అర్థం చేసుకుంది. చాలామంది విద్యార్థులు గణితంలో ఎందుకు వెనకబడిపోయారు? అనేది తెలుసుకోవడానికి ప్రయత్నించింది సౌమ్య. దీనికి చాలా కారణాలు ఉన్నాయి. ఎన్నికల డ్యూటీ, రకరకాల ప్రభుత్వ కార్యక్రమాలలో పాల్గొనడం వల్ల ఉపాధ్యాయులు ఎక్కువ రోజులు బడికి దూరంగా ఉంటున్నారు.

స్కూలు విద్యార్థులలో చాలామంది వ్యవసాయ కుటుంబానికి చెందిన వారు. వ్యవసాయ పనుల్లో తల్లిదండ్రులకు సహాయం అందించడానికి తరచు బడికి గైర్హాజరు అవుతుంటారు. గ్యాప్ రావడం వల్ల వారికి పాఠాలు అర్థం కావు. ఇలాంటి విషయాలను పరిగణనలోకి తీసుకొని సాంకేతికతకు మానవ ప్రయత్నాన్ని జోడిస్తే ఎలా ఉంటుంది అనే ఆలోచనతో 'పఢాయి విత్ ఏఐ' కార్యక్రమానికి రూపకల్పన చేసింది సౌమ్య.


'పఢాయి విత్ ఏఐ' క్లాస్ రూమ్

ఐఏఎస్ తొలిరోజులలో కొన్ని సబ్జెక్‌లకు సంబంధించి తాను ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సహాయం తీసుకునేది. ఆ విషయం గుర్తు తెచ్చుకొని, ఏ సబ్జెక్ట్ గురించి అయితే విద్యార్థులు భయపడుతున్నారో, ఆ భయాన్ని పోగొట్టడానికి 'ఏఐ'ని అస్త్రంలా వాడాలని నిర్ణయించుకుంది.

గత సంవత్సరం పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభమైన 'పఢాయి విత్ ఏఐ'ని సరికొత్త మార్పులు చేర్పులతో ఈ సంవత్సరం 'వెర్షన్-2'గా లాంచ్ చేశారు. ఈ అప్‌గ్రేడెడ్ వెర్షన్‌లో టీచింగ్ క్యాలెండర్, విద్యార్థుల ప్రతిభను మెరుగుపరిచే అత్యాధునిక సాంకేతిక పరికరాలు, ప్రతి వారం విద్యార్థులకు పరీక్షలు ఉంటాయి.

'పఢాయి విత్ ఏఐ'ని టోంక్ జిల్లాలోని 350కి పైగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్నారు. విద్యార్థులలో వచ్చిన మార్పు గురించి చాలా సంతోషంగా ఉన్న సౌమ్య ఝా – 'ఇదేమీ మాయాజాలం కాదు. మానవ ప్రయత్నానికి తోడైన సాంకేతిక అద్భుతం' అంటుంది.

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) సెప్టెంబర్ 15న ముగింపు ధరలలో

హైదరాబాద్		విజయవాడ		విశాఖపట్నం		రాజమండ్రి		ప్రొద్దుటూరు		చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,13,810	బంగారం (24 క్యారెట్లు)	1,13,080	బంగారం (24 క్యారెట్లు)	1,11,060	బంగారం (24 క్యారెట్లు)	1,11,600	బంగారం (24 క్యారెట్లు)	1,13,350	బంగారం (24 క్యారెట్లు)	1,11,380
బంగారం (22 క్యారెట్లు)	1,07,240	బంగారం (22 క్యారెట్లు)	1,01,800	బంగారం (22 క్యారెట్లు)	1,01,800	బంగారం (22 క్యారెట్లు)	1,01,800	బంగారం (22 క్యారెట్లు)	1,04,280	బంగారం (22 క్యారెట్లు)	1,02,100
వెండి	1,34,000	వెండి	1,32,900	వెండి	1,43,000	వెండి	1,28,270	వెండి	1,32,500	వెండి	1,43,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాగుబడి
ఉత్తర కార్తె: సెప్టెంబర్ 14 నుంచి



గడ్డి సాగుతోనే అధికాదాయం!

- పశువుల్ని పెంచే ప్రతి రైతూ కాస్త పొలంలోనైనా గడ్డి జాతి పంటలు సాగు చేసుకోవాలి
- ఇతర పంటల సాగుపై ఏడాదికి ఒకసారి వచ్చే ఆదాయం కన్నా పశువుల కోసం గడ్డి పెంచితే వచ్చే ఆదాయం ఎక్కువని రైతులు గుర్తించాలి



రైతు కుటుంబాలకు పంటలపై వచ్చే ఆదాయంతో పోల్చితే, పశుపోషణ ద్వారా సమకూరే నిరంతర ఆదాయం చాలా ఎక్కువ. చిన్న, సన్నకారు రైతులు తమ పశువులకు గడ్డిని, దాణాను సరిపడా అందించలేకపోతున్నారు. అందువల్లే మన దేశంలో పశువుల ఉత్పాదకత బాగా తక్కువగా ఉంది. పశువుల్ని పెంచే ప్రతి రైతూ కొన్ని సెంట్లు/కొన్ని కుంటల్లో అయినా గడ్డిని కూడా పెంచుకోవాలి. సైలేజి గడ్డి, దాణాలను తానే తయారు చేసుకొని పశువులను మేపుకుంటే పశుపోషకులకు అధికాదాయంతో పాటు, ప్రతిరోజూ ఆదాయం వస్తుందని గుర్తించాలని సూచిస్తున్నారు పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ (పీవీఎన్ఆర్‌టీవీయూ) వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ మంథా జ్ఞాన ప్రకాశ్. వాతావరణ మార్పుల నుంచి జన్యుపరమైన అభివృద్ధి వరకు అనేక కీలకాంశాలపై ఆయన ఇటీవల 'సాక్షి సాగుబడి'తో ముచ్చటించారు. ఇంటర్వ్యూలో ముఖ్యాంశాలు..

క్లైమేట్ ఛేంజ్ ప్రతికూల పరిస్థితులు పశుపోషణపై ఎటువంటి ప్రభావం చూపుతున్నాయి?

ప్రొ. జ్ఞాన ప్రకాశ్: క్లైమేట్ ఛేంజ్ సెగ ఇప్పుడు మనకు విపరీతంగా అనుభవంలోకి వస్తోంది. సాధారణ ప్రజలకు కూడా ఈ సమస్య ఇప్పుడు అర్థమవుతోంది. ఇక్కడ కుండపోత వర్షాలు, టెక్సాస్‌లో కరువు, మరోచోట అధిక ఉష్ణంతో మంచు కరిగిపోవటం ఇవన్నీ క్లైమేట్ ఛేంజ్ వల్ల జరుగుతున్నవే. పశువుకు గానీ.. మనిషికి గానీ.. ప్రతి ప్రాణికీ అనువైన ఉష్ణోగ్రత రేంజ్ ఒకటి ఉంటుంది. ఆ కంఫర్ట్ జోన్‌లోనే అది సరిగ్గా పనిచేయగలదు. పాలు, మాంసం వంటి ఉత్పత్తుల్ని సరిగ్గా ఇవ్వగలదు. కానీ, ఉష్ణోగ్రత అంతకన్నా పెరిగినప్పుడు దాని జీవక్రియలన్నీ ఇబ్బంది పడతాయి. రావలసినటువంటి ఉత్పత్తి రాదు. ఇంకొకటేమిటంటే.. పశుగ్రాసం కూడా పొలాల్లో సరిగ్గా పెరగదు. రోగకారక క్రిముల తీవ్రత పెరుగుతుంది. ఎప్పుడో పోయిన క్రిములు కూడా మళ్లీ సమస్య అయ్యే అవకాశం ఉంటుంది. క్లైమేట్ ఛేంజ్ నుంచి మన జీవరాశిని, గడ్డి జాతులను పరిరక్షించుకోవాల్సి ఉంటుంది.

భూతాపోన్నతి ప్రతికూలతల నుంచి పశు సంపదను ఎలా రక్షించుకోగలం?

ప్రొ. జ్ఞాన ప్రకాశ్: అధిక ఉష్ణోగ్రతను తట్టుకోవటానికి ఉపయోగపడే కొన్ని రకాల జన్యువులు ప్రతి ప్రాణిలో ఉంటాయి. ఆ జన్యువులపై పరిశోధనలు చేసి గుర్తించి, జన్యుపరంగా అభివృద్ధి చేయటం ద్వారా పెరిగిన ఉష్ణోగ్రతల్లోనూ అవి మంచి ఉత్పాదకతను ఇచ్చేలా మార్చుకోవచ్చు. 37 డిగ్రీల సెల్సియస్ దగ్గర కంఫర్టబుల్‌గా ఉండే జంతువును 39 డిగ్రీల దగ్గర కూడా కంఫర్టబుల్‌గా ఉండేలా జన్యుపరంగా అభివృద్ధితో చేసుకోవచ్చు.

అసాధారణ ఉష్ణోగ్రతలతో ఏయే పశుజాతులకు ఎక్కువ ఇబ్బంది?

ప్రొ. జ్ఞాన ప్రకాశ్: వాతావరణంలో ఉష్ణోగ్రతలు పెరగ్గానే ముందు గేదెలకు ఎక్కువ ప్రాబ్లం వస్తుంది. పునరుత్పత్తి సమస్యలు పెరుగుతాయి. దేశవాళీ ఆవుల కన్నా చల్లటి విదేశాల నుంచి తెచ్చిన జాతుల ఆవులకు పెరిగిన ఉష్ణోగ్రతల్లో మరీ ఇబ్బంది అవుతుంది. కాబట్టి, పెరుగుతున్న ఉష్ణోగ్రతల్లోనూ సజావుగా బతకగలిగేలా మన గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెల్లో జన్యుపరమైన సామర్థ్యం పెంపొందించుకోవాలి.

భూతాపోన్నతికి పశువులు కూడా కారణం అవుతున్నాయా?

ప్రొ. జ్ఞాన ప్రకాశ్: క్లైమేట్ ఛేంజ్ పెరగడానికి చాలా కారణాలు ఉన్నాయి. అందుకు పశువులు కూడా కారణం అవుతున్నాయి. ఆవులు, గేదెలు, గొర్రెలు.. వీటి కడుపులో సూక్ష్మజీవుల ద్వారా జరిగే జీర్ణప్రక్రియ (మైక్రోబియల్ ఫర్మంటేషన్) వల్ల మీథేన్ వాయువు వెలువడుతుంది. ఇది వాతావరణాన్ని అధికంగా వేడెక్కించే వాయువు. ఈ సమస్యను తగ్గించాలంటే.. పశువులకు పెట్టే దాణాను, గడ్డిని తక్కువ మీథేన్‌కు కారణమయ్యేలా మార్చాలి. దాణాలో, పశువు కడుపులోని సూక్ష్మ జీవరాశిని కూడా తక్కువ మీథేన్ ఉత్పత్తి చేసేలా మార్పు చేసుకోవాలి. తద్వారా భూతాపం పెరుగుదలను కొంత మేరకు తగ్గించుకోవచ్చు.


'సాక్షి సాగుబడి' ప్రత్యేక ఇంటర్వ్యూలో పీవీఎన్ఆర్‌టీవీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ మంథా జ్ఞాన ప్రకాశ్ స్పష్టీకరణ

పేడ నుంచి కూడా ఉద్గారాలు..?

ప్రొ. జ్ఞాన ప్రకాశ్: పశువుల పేడ వల్ల కూడా వాతావరణంలో మీథేన్ పెరుగుతోంది. దీన్ని కూడా అరికట్టాలి. 2–3 పశువులను పెంచుకునే చిన్న, సన్నకారు రైతులు కూడా మీథేన్‌ను తమ స్థాయిలో నియంత్రించగల పద్ధతులు ఉన్నాయి. పచ్చి పేడను ఆరుబయట వదిలేస్తేనే సమస్య. ఒక చిన్న గుంత తవ్వి అందులో రోజూ వేసి, గుంత నిండిన తర్వాత పైన కొన్ని ఎండు ఆకులు వేసి కప్పిపెట్టాలి. 60 రోజుల్లో మంచి కంపోస్టు ఎరువు తయారవుతుంది. వర్మీకంపోస్టు కూడా తయారు చేసుకోవచ్చు. ఇలా చేస్తే మీథేన్ చాలా వరకు తగ్గుతుంది.

ఈ దిశగా పరిశోధనలు జరుగుతున్నాయా..?

ప్రొ. జ్ఞాన ప్రకాశ్: వాతావరణ మార్పులకు అనుకూలంగా వ్యవసాయం చేయడానికి సంబంధించి 'నిక్ర' పేరుతో ఐసీఏఆర్ పరిశోధనా ప్రాజెక్టుల్ని చేపట్టింది. వ్యవసాయం, అనుబంధ రంగాలన్నిటికి సంబంధించి దేశవ్యాప్తంగా అనేక సంస్థల్లో చేపట్టిన పరిశోధన ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయి.

మన పశువుల ఉత్పాదకత తక్కువ ఎందుకని?

ప్రొ. జ్ఞాన ప్రకాశ్: మన దేశంలో పాడి పశువు సగటు పాల దిగుబడి ఒక ఈతలో 1,500–1,700 లీటర్లయితే, ప్రపంచ సగటు 2,700 లీటర్లు. నెదర్లాండ్స్, యూకే, యూఎస్‌లలో ఇంకా చాలా ఎక్కువ. ముఖ్యంగా మన దగ్గర రైతులు చాలా మంది చిన్న, సన్నకారు రైతులు. వీళ్లు తెలిసీ తెలియక, పశువులను సరిగ్గా మేపలేకపోతున్నారు. వాటికి పోషణ సరిగ్గా అందటం లేదు.

ఆ దేశాల్లో తక్కువ ఉష్ణోగ్రతలే కారణమా?

ప్రొ. జ్ఞాన ప్రకాశ్: ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండటం ఒక్కటే కారణం కాదు. అంతకన్నా ముఖ్యమైనది జెనెటిక్ ఇంప్రూవ్‌మెంట్. అక్కడి పశువులను వాళ్లు జన్యుపరంగా బాగా అభివృద్ధి చేసుకోగలిగారు. మనం చేసుకోలేకపోయాం.

జన్యుమార్పిడి(జీఎం) కూడా అవసరమా?

ప్రొ. జ్ఞాన ప్రకాశ్: జెనెటిక్ ఇంప్రూవ్‌మెంట్ చాలు. మామూలుగా మన పశువుల్లో ఉన్న మంచి గుణాలున్న జన్యువులనే పెంపొందిస్తాం ఆ జీవిలో. జెనెటిక్ మాడిఫికేషన్ అంటే జంతువుల్లోని జన్యువులను మార్చేస్తారు. ఒక జన్యువును తీయటం, వేరే దాన్ని పెట్టడం అనేది జెనెటిక్ మాడిఫికేషన్ అంటారు. అది రిస్క్‌తో కూడిన పని. అవసరం లేదు. జీన్ ఎడిటింగ్‌ను ఇప్పుడిప్పుడే వాడుతున్నారు. ఇవి చాలా వివాదాస్పద అంశాలు.

ప్రత్యేక బ్రీడ్ల అభివృద్ధికి కృషి జరుగుతోందా?

ప్రొ. జ్ఞాన ప్రకాశ్: అధిక ఉష్ణోగ్రతలను తట్టుకోవటంలో దేశీ పశువులు మెరుగ్గా ఉంటాయి. అధిక ఉత్పాదకత కోసం సంకరజాతి పశువులను రూపొందించుకున్నాం. హీట్ టాలరెంట్ జన్యువులను ఇప్పటికే శాస్త్రవేత్తలు గుర్తించారు. జెనెటిక్ ఇంప్రూవ్‌మెంట్‌పై పరిశోధనలు కొనసాగుతున్నాయి. పంటల్లో కొత్త వంగడాలు తయారు చేసినంత సులభంగా పశువుల్లో జన్యు అభివృద్ధి జరగదు. పంట కాలం ఆర్నెల్లయితే పశువు ఒక తరం 7–8 ఏళ్లు పడుతుంది.

సేంద్రియ పశుపోషణకు ప్రత్యేక బ్రీడ్స్ అవసరమా?

ప్రొ. జ్ఞాన ప్రకాశ్: పశువుల్లో ఆర్గానిక్ బ్రీడ్స్ అంటూ ఏమీ ఉండవు. కొత్త బ్రీడ్ సహజంగా ఎవాల్వ్ కావటానికి కనీసం వందేళ్లు (10–12 తరాలు) పడుతుంది. ఒంగోలు తదితర పశుజాతులన్నీ అనాదిగా ఆర్గానిక్‌గా ఎవాల్వ్ అయినవే. అయితే, పశువుల పెంపకమే ఈ కాలంలో సూక్ష్మ కుటుంబాలకు భారంగా మారింది. గ్రామాల్లో సేంద్రియ ఎరువుల లభ్యత కూడా అంత తేలిక కాదు. ప్రత్యేకంగా గడ్డి పెంపక క్షేత్రాలు నెలకొల్పినప్పుడే గడ్డి కొరత తీరి, పశుపోషణ సజావుగా కొనసాగుతుంది. అప్పుడే పెరిగే జనాభా అవసరాలకు తగిన పాలు, మాంసం లభిస్తాయి.




ఆర్గానిక్ పశు ఉత్పత్తులకు విదేశాల్లో గిరాకీ ఉంటుందా?

ప్రొ. జ్ఞాన ప్రకాశ్: అభివృద్ధి చెందిన దేశాల్లో నిబంధనలు కఠినంగా ఉంటాయి. యాంటీబయాటిక్ రెసిడ్యూస్, థెరప్యూటిక్ రెసిడ్యూస్ లేని ఆర్గానిక్ ఉత్పత్తుల ఎగుమతికి కొన్ని పద్ధతులున్నాయి. కొన్ని యాంటీబయాటిక్స్‌ను 2 నెలల ముందే ఆపెయ్యాలి. కొన్నిటిని ఒక రోజు ముందు వరకు ఇవ్వవచ్చు. ఒక్కో మందుకు ఒక్కొక్క టైమ్ ఉంటుంది.



పశువులు పెంచే రైతులకున్న ముఖ్యమైన సమస్య ఏమిటి?

ప్రొ. జ్ఞాన ప్రకాశ్: గడ్డి భూములు, అడవులు తగ్గిపోవటమే పెద్ద సమస్య. అందువల్ల పశువులను రోజంతా కట్టేసి పెంచాల్సి వస్తోంది. అందువల్ల దాణా, పచ్చి మేత మన పశువులకు సరిపోను అందటం లేదు. పశువుకు ఇచ్చే ఆహారంలో మూడింట రెండొంతులు పచ్చి గడ్డి, ఒక వంతు దాణా కలిపి ఇస్తే ఆరోగ్యం. అయితే, చిన్న, సన్నకారు రైతులు, భూమి లేని రైతులు దాణా, పచ్చిమేత చాలినంత పెట్టలేకపోతున్నారు. పశువుల ఉత్పాదకత తగ్గిపోతోంది.

పరిష్కారం ఏమిటి?

ప్రొ. జ్ఞాన ప్రకాశ్: రైతులు కొన్ని సెంట్లు/గుంటల్లో అయినా గడ్డి పెంచుకోవాలి. పాడిపై రైతులకు ఏడాది పొడవునా ఆదాయం వస్తుంది. ఉన్న కొద్దిపాటి పొలంలో ఈ పశువుల కోసం పచ్చి మేతను పండించుకుంటే వచ్చే ఆదాయం కన్నా.. ఆ పొలంలో ఇతర పంటలు వేస్తే వచ్చే ఆదాయం చాలా తక్కువని అధ్యయనాల్లో తేలింది. సైలేజీ గడ్డి, పంట వ్యర్థాలతో దాణాలను సొంతంగా తయారు చేసుకొని వాడుకోవాలి.

ఇంటర్వ్యూ: పంతంగి రాంబాబు
ఫొటో: ఎస్.ఎస్. ఠాకూర్




'ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ద మంత్'గా సిరాజ్

ఇంగ్లండ్‌తో గత నెలలో ఓవల్‌లో జరిగిన ఐదో టెస్టులో విశేషంగా రాణించిన భారత పేస్ బౌలర్, హైదరాబాద్ క్రికెటర్ మొహమ్మద్ సిరాజ్... అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) 'ప్లేయర్ ఆఫ్ ద మంత్'గా ఎంపికయ్యాడు. ఇంగ్లండ్‌తో ఆగస్టులో జరిగిన చివరి టెస్టులో సిరాజ్ తొమ్మిది వికెట్లు పడగొట్టి టీమిండియా విజయంలో ముఖ్యపాత్ర పోషించాడు. ఆఖరి టెస్టులో గెలిచిన భారత్ ఐదు టెస్టుల సిరీస్‌ను 2–2తో సమంగా ముగించింది. 'ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ద మంత్'గా ఎంపిక కావడం ఎంతో గౌరవంగా భావిస్తున్నాను. అండర్సన్–టెండూల్కర్ ట్రోఫీ టెస్టు సిరీస్ నా కెరీర్‌లో చిరస్మరణీయమైనది. హోరాహోరీగా జరిగిన ఆ సిరీస్‌లో నేనూ భాగస్వామి కావడం ఆనందంగా ఉంది' అని సిరాజ్ వ్యాఖ్యానించాడు. 2021లో ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డులను ప్రారంభించింది. ఇప్పటి వరకు భారత్ నుంచి రిషభ్ పంత్ (2021–జనవరి), రవిచంద్రన్ అశ్విన్ (2021–ఫిబ్రవరి), భువనేశ్వర్ కుమార్ (2021–మార్చి), శ్రేయస్ అయ్యర్ (2022–ఫిబ్రవరి; 2025–మార్చి), విరాట్ కోహ్లి (2022–అక్టోబర్), శుబ్‌మన్ గిల్ (2023–జనవరి ;2023–సెప్టెంబర్; 2025–ఫిబ్రవరి, 2025–జూలై), యశస్వి జైస్వాల్ (2024–ఫిబ్రవరి), జస్‌ప్రీత్ బుమ్రా (2024–జూన్; 2024–డిసెంబర్) ఈ అవార్డులు గెల్చుకున్నారు.

క్వాలిఫయింగ్‌లోనే...

లాంగ్‌జంపర్ శ్రీశంకర్ అవుట్



టోక్యో: ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో మూడో రోజు కూడా భారత క్రీడాకారులకు నిరాశే మిగిలింది. పురుషుల లాంగ్‌జంప్ ఈవెంట్‌లో శ్రీశంకర్ మురళీ క్వాలిఫయింగ్‌లోనే నిష్క్రమించాడు. 19మంది అథ్లెట్లు పోటీపడ్డ గ్రూప్ 'ఎ'లో శ్రీశంకర్ 14వ స్థానంలో నిలిచాడు. మూడు ప్రయత్నాల్లో శ్రీశంకర్ వరుసగా 7.78 మీటర్లు, 7.59 మీటర్లు, 7.70 మీటర్ల దూరం దూకాడు. కనీసం 8.15 మీటర్ల దూరం దూకిన వారికి ఫైనల్ బెర్త్ లభిస్తుంది. ఓవరాల్‌గా 36 మంది పోటీపడ్డ క్వాలిఫయింగ్‌లో శ్రీశంకర్ 25వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. మరోవైపు మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లో భారత క్రీడాకారిణులు పారుల్, అంకిత హీట్స్‌లోనే వెనుదిరిగారు. ఓవరాల్‌గా పారుల్ (9ని:22.24 సెకన్లు) 20వ స్థానంలో, అంకిత (10ని:03.22 సెకన్లు) 35వ స్థానంలో నిలిచారు. పురుషుల 110 మీటర్ల హర్డిల్స్‌లో తేజస్ షిర్సే (13.57 సెకన్లు) 29వ స్థానంతో సరిపెట్టుకున్నాడు.

వెల్‌డన్ వైశాలి



- వరుసగా రెండోసారి గ్రాండ్ స్విస్ టోర్నీ టైటిల్ సొంతం
- క్యాండిడేట్స్ టోర్నీకీ అర్హత పొందిన భారత గ్రాండ్‌మాస్టర్

సమర్‌కండ్ (ఉజ్బెకిస్తాన్): ఆద్యంతం నిలకడగా రాణించిన భారత మహిళా గ్రాండ్‌మాస్టర్ వైశాలి రమేశ్‌బాబు అనుకున్న ఫలితం సాధించింది. సోమవారం ముగిసిన గ్రాండ్ స్విస్ చెస్ టోర్నీ మహిళల విభాగంలో చాంపియన్‌గా నిలిచింది. నిర్ణీత 11 రౌండ్ల తర్వాత తమిళనాడు అమ్మాయి వైశాలి, కాటరీనా లాగ్నో (రష్యా) 8 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా... 24 ఏళ్ల వైశాలికి టైటిల్ ఖాయమైంది. కాటరీనా లాగ్నో రన్నరప్‌గా నిలిచింది. వరుసగా రెండోసారి గ్రాండ్ స్విస్ టోర్నీలో టైటిల్ నెగ్గిన వైశాలితోపాటు కాటరీనా లాగ్నో వచ్చే సంవత్సరం జరిగే క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత పొందారు. వైశాలికి 90 వేల డాలర్లు (రూ. 79 లక్షల 33 వేలు), కాటరీనా లాగ్నోకు 75 వేల డాలర్లు (రూ. 66 లక్షల 10 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

భారత్ నుంచి ముగ్గురు...

ఎనిమిది మంది మధ్య జరిగే క్యాండిడేట్స్ టోర్నీకి ఇప్పటికి ఏడుగురు అర్హత సాధించగా... అందులో ముగ్గురు భారత గ్రాండ్‌మాస్టర్లు (కోనేరు హంపి, దివ్య దేశ్‌ముఖ్, వైశాలి) ఉండటం విశేషం. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) 2024–2025 మహిళా ఈవెంట్స్ విజేతకు చివరిదైన ఎనిమిదో బెర్త్ ఖరారు అవుతుంది. క్యాండిడేట్స్ టోర్నీ విజేత ప్రస్తుత మహిళల ప్రపంచ చాంపియన్ జు వెన్‌జున్‌తో 2026 వరల్డ్ టైటిల్ కోసం తలపడుతుంది.

చివరి రౌండ్ గేమ్‌లు 'డ్రా'

గ్రాండ్ స్విస్ టోర్నీ చివరిదైన 11వ రౌండ్‌లో వైశాలి, కాటరీనా తమ ప్రత్యర్థులతో గేమ్‌లను 'డ్రా' చేసుకున్నారు. ప్రపంచ మాజీ చాంపియన్ టాన్ జోంగి (చైనా)తో జరిగిన గేమ్‌ను వైశాలి 43 ఎత్తుల్లో... ఉల్వియా (అజర్‌బైజాన్)తో గేమ్‌ను కాటరీనా లాగ్నో 30 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నారు. ఈ టోర్నీలో వైశాలి ఆరు గేముల్లో గెలిచి, నాలుగు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, ఒక గేమ్‌లో ఓడిపోగా... కాటరీనా లాగ్నో ఐదు గేముల్లో నెగ్గి, ఆరు గేమ్‌లను 'డ్రా'గా ముగించింది. భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక 6.5 పాయింట్లతో 14వ స్థానంలో నిలిచింది. మరోవైపు గ్రాండ్ స్విస్ టోర్నీ ఓపెన్ విభాగంలో అనీశ్ గిరి (నెదర్లాండ్స్–8 పాయింట్లు) విజేతగా... మథియాస్ బ్లూబామ్ (జర్మనీ–7.5 పాయింట్లు) రన్నరప్‌గా నిలిచి వచ్చే ఏడాది క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించారు. చాంపియన్ అనీశ్ గిరికి 90 వేల డాలర్లు (రూ. 79 లక్షల 33 వేలు), రన్నరప్ మథియాస్‌కు 75 వేల డాలర్లు (రూ. 66 లక్షల 10 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

శ్రమించి గెలిచిన శ్రీలంక

దుబాయ్: ఆసియా కప్ టి20 క్రికెట్ టోర్నీలో శ్రీలంక అనామక హాంకాంగ్ జట్టుపై గెలిచేందుకు శ్రమించింది. సోమవారం గ్రూప్ 'బి'లో జరిగిన ఈ మ్యాచ్‌లో శ్రీలంక నాలుగు వికెట్ల తేడాతో నెగ్గింది. ముందుగా హాంకాంగ్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 149 పరుగులు చేసింది. మిడిలార్డర్ బ్యాటర్ నిజాకత్ (38 బంతుల్లో 52 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), అన్షీ రాత్ (46 బంతుల్లో 48; 4 ఫోర్లు) రాణించారు. అనంతరం ఛేదనలో లంక ఇబ్బంది పడింది. హాంకాంగ్ నిర్ణీత ఓవర్ల కోటాలో కేవలం 4 వికెట్లను కోల్పోతే... శ్రీలంక 20 ఓవర్లయినా ఆడకముందే 6 వికెట్లను కోల్పోయింది. 18.5 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ నిసాంక (44 బంతుల్లో 68; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధసెంచరీతో అదరగొట్టాడు. 19వ ఓవర్లో హసరంగ (9 బంతుల్లో 20 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) వరుస బౌండరీలు బాది జట్టును గెలిపించాడు. మరో మ్యాచ్‌లో యూఏఈ 42 పరుగుల తేడాతో ఒమన్‌పై నెగ్గింది. నేడు జరిగే మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్‌తో బంగ్లాదేశ్ ఆడుతుంది.

'చేయి' కలపలేదని...

- పాకిస్తాన్ క్రికెట్ బోర్డు చిందులు
- పెను వివాదం రాజేస్తోన్న పీసీబీ
- టీమిండియాను సమర్థించిన బీసీసీఐ



దుబాయ్: ఆసియా కప్ టి20 క్రికెట్ టోర్నీలో భారత్, పాకిస్తాన్‌ల మధ్య మ్యాచ్ జరిగింది. ఫలితం ఏకపక్షంగా ముగిసింది. చెత్తగా ఆడిన పాకిస్తాన్ తమ ఆటతీరును విశ్లేషించు కోవాల్సిందిపోయి ఇరు జట్ల ఆటగాళ్లు 'షేక్ హ్యాండ్' ఇచ్చుకోలేదనే అంశంపై వివాదాన్ని రాజేస్తోంది. పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) దీనిపైనే దృష్టి పెట్టినట్లుంది. ఫిర్యాదులు, చర్యలు చేపట్టాలంటూ తెగ హడావుడి చేస్తోంది. కానీ కరచాలనం తిరస్కరణ కొత్తదేమీ కాదు. టెన్నిస్‌లో, ఫుట్‌బాల్‌లోనూ ఉద్రిక్తతలు, రాజకీయ వైరం కారణంగా ఆయా దేశాలకు చెందిన ప్లేయర్లు ఎన్నోసార్లు 'షేక్ హ్యాండ్' ఇచ్చుకోలేదు. దీనిపై టెన్నిస్ ఇంటిగ్రిటీ గానీ, ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా) గానీ పెద్దగా పట్టించుకోలేదు. కానీ పీసీబీ మాత్రం నానా యాగీ చేస్తోంది.

మ్యాచ్ రిఫరీని తొలగించండి

మ్యాచ్ ముగిసిన తర్వాత తమ జట్టు ఆటగాళ్లతో టీమిండియా క్రికెటర్లు పరస్పర కరచాలనం తిరస్కరించడంపై పీసీబీ అగ్గిమీద గుగ్గిలమవుతోంది. ఆదివారం నాటి లీగ్ మ్యాచ్‌కు రిఫరీగా వ్యవహరించిన ఆండీ పైక్రాఫ్ట్‌ను తక్షణమే తొలగించాలని ఆసియా క్రికెట్ మండలి (ఏసీసీ)కి ఫిర్యాదు చేసింది. దీనిపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) జోక్యం చేసుకుంటుందా లేదా అనేది వేచి చూడాలి. ఎందుకంటే ఏసీసీ చీఫ్‌గా పీసీబీ అధ్యక్షుడు మోసిన్ నఖ్వీ ఉంటే, ఐసీసీ చీఫ్‌గా భారత్‌కు చెందిన జై షా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈ వివాదంపై ఎవరెలా స్పందిస్తారోనన్నది, ఎలా ముగింపు పలుకుతారో అన్నది ఆసక్తికరంగా మారింది. 'మ్యాచ్ రిఫరీపై ఐసీసీకి ఫిర్యాదు చేశాం. ఐసీసీ నియమావళి, ఎంసీసీ చట్టాలు, క్రికెట్ స్ఫూర్తికి విరుద్ధంగా మ్యాచ్ రిఫరీ పైక్రాఫ్ట్ వ్యవహరించారు. దీన్ని తీవ్రంగా పరిగణించి వెంటనే ఆయన్ని ఆసియా కప్ నుంచి తొలగించాలని పీసీబీ డిమాండ్ చేస్తోంది' అని ఏసీసీ చీఫ్ కూడా అయిన నఖ్వీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. టాస్ వేసే సమయంలోనే భారత కెప్టెన్ సూర్యకుమార్‌తో షేక్‌హ్యాండ్ చేయొద్దని పాక్ కెప్టెన్ సల్మాన్ అగాతో రిఫరీ పైక్రాఫ్ట్ చెప్పారని పీసీబీ పేర్కొంది. టీమ్ షీట్ల మార్పిడి సజావుగా జరగలేదని పాకిస్తన్ జట్టు మేనేజర్ నవిద్ చిమా కూడా ఏసీసీకి ఫిర్యాదు చేశారు. షీమ్ షీట్లను ఇద్దరు కెప్టెన్లు మార్చుకోవడం సహజం. కానీ ఈ సారి టీమ్ షీట్లను కెప్టెన్ల నుంచి రిఫరీ తీసుకున్నారు.

తెలుసా... ఆతిథ్య హక్కులు దక్కవు!

పాక్‌తో క్రికెట్ మ్యాచ్‌లు ఆడొద్దు, ఇకపై జరగొద్దు అని భారత్‌లో చాలా మంది విమర్శలు చేస్తున్నారు. కానీ బహుళ జట్లు బరిలో ఉండే ఈవెంట్లలో తప్పుకుంటే ప్రతిష్టాత్మక మెగా ఈవెంట్ ఆతిథ్య హక్కులు పొందే అవకాశాలు రావు. ఎందుకంటే ప్రస్తుతం క్రికెట్ ఇప్పుడు ఒలింపిక్ చార్టర్‌లో భాగమైంది. లాస్ ఏంజెలిస్–2028 ఒలింపిక్స్‌లో నిర్వహణకు సిద్ధమైంది. ఇక భారత్ 2030 కామన్వెల్త్ క్రీడలు, 2036 ఒలింపిక్స్ ఆతిథ్యం కోసం పోటీపడాలనుకుంటుంది. ఇలాంటి సమయంలో పాక్‌తో ఆడం, మ్యాచ్‌లను బహిష్కరిస్తామంటే ఆతిథ్య ఆశలు, అవకాశాలు అడుగంటుతాయి.

గతంలో... టెన్నిస్‌లో...

ఇప్పుడు ఆసియా కప్ క్రికెట్‌లో షేక్‌హ్యాండ్ ఇవ్వకపోవడం వివాదాస్పదం చేస్తున్నారు కానీ... ఇలా జరగడం క్రీడల్లో ఇదేమీ మొదటిసారి కాదు. 2023లో ప్రతిష్టాత్మక వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో ఉక్రెయిన్‌కు చెందిన స్వితోలినా, బెలారస్ ప్లేయర్ విక్టోరియా అజరెంకా మ్యాచ్ అనంతరం షేక్‌హ్యాండ్ ఇచ్చుకోలేదు. వింబుల్డన్ నిర్వాహక కమిటీ స్వితోలినాపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ అంశాన్ని అసలు పట్టించుకోనేలేదు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధంలో బెలారస్ అండగా నిలవడమే ఈ వైఖరికి కారణం కాగా... ఇప్పటికీ కూడా పలువురు ఉక్రెయిన్ ప్లేయర్లతో... బెలారస్, రష్యా ప్లేయర్లు కరచాలనం చేయడం లేదు. అమెరికా, ఇరాన్ దేశాల వైరం కారణంగా ఫుట్‌బాల్‌లో ఇరుజట్లు తలపడినపుడు కూడా ఆటగాళ్ల మధ్య షేక్‌హ్యాండ్స్ కనిపించవు.

అదేమీ నిబంధన కాదు... రూల్ బుక్ చూస్కోండి

పహల్గాంలో పాక్ ఉగ్రమూకల ఊచకోతకు గురైన కుటుంబాలకు బాసటగా నిలిచేందుకు పాకిస్తానీ క్రికెటర్లతో పరస్పరం చేయి కలపకూడదని జట్టు మేనేజ్‌మెంట్ ఏకగ్రీవంగా నిర్ణయించింది. ఇది కోచ్ గంభీర్‌దో లేదంటే కెప్టెన్ సూర్యకుమార్ నిర్ణయం కానేకాదని జట్టు వర్గాలు స్పష్టం చేశాయి. దాయాది క్రికెటర్ల షేక్ హ్యాండ్ ఇవ్వకపోవడాన్ని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సమర్థించుకుంది. 'ప్రత్యర్థి ఆటగాళ్లతో కరచాలనం ఇవ్వాలనే నిబంధనేది రూల్ బుక్‌లో లేదు. ఇది పూర్తిగా గుడ్‌విల్‌తో ముడిపడిన స్నేహపూర్వక అంశమే! అంతేకానీ చట్టం అయితే కాదు. కాబట్టి కచ్చితంగా షేక్‌హ్యాండ్ ఇవ్వాల్సిన అవసరమైతే లేదు' అని బోర్డు సీనియర్ అధికారి ఒకరు స్పష్టత ఇచ్చారు.

డుప్లాంటిస్... ప్రపంచ రికార్డు నంబర్ 14
దులీప్ ట్రోఫీ విజేత సెంట్రల్ జోన్
మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

భద్రకాళి నిరుత్సాహ పరచదు - విజయ్ ఆంటోని




● అరుణ్, విజయ్, సురేష్‌బాబు, రామాంజనేయులు, తృప్తి

''భద్రకాళి' సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఈ సినిమా ఎవర్నీ నిరుత్సాహ పరచదని కచ్చితంగా చెప్పగలను'' అని విజయ్ ఆంటోని చెప్పారు. 'అరువి' ఫేమ్ అరుణ్ ప్రభు దర్శకత్వంలో విజయ్ ఆంటోని హీరోగా, తృప్తి రవీంద్ర, రియా హీరోయిన్లుగా నటించిన చిత్రం 'భద్రకాళి'. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పొరేషన్, మీరా విజయ్ ఆంటోని సమర్పణలో రామాంజనేయులు జవ్వాజీ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19న రిలీజ్ కానుంది. ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్, రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా కలిసి తెలుగులో విడుదల చేస్తున్నాయి. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సురేష్ బాబు మాట్లాడుతూ–''విజయ్‌గారి క్రమశిక్షణే ఆయన్ను గొప్పస్థాయికి తీసుకువెళ్తుంది'' అన్నారు. ''మంచి పొలిటికల్ థ్రిల్లర్ ఇది'' అని తెలిపారు అరుణ్ ప్రభు. ''ప్రేక్షకులకు నచ్చే సినిమా ఇది'' అన్నారు రామాంజనేయులు. ఈ వేడుకలో తృప్తి రవీంద్ర, రియా, రైటర్ భాష్యశ్రీ మాట్లాడారు.

బర్త్ డే స్పెషల్

హీరో రవితేజ తమ్ముడు, నటుడు రఘు కుమారుడు మాధవ్ హీరోగా నటిస్తున్న తొలి సినిమా 'మారెమ్మ'. దీపా బాలు హీరోయిన్‌గా నటిస్తున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో సాగే ఈ చిత్రానికి మంచాల నాగరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. మయూర్ రెడ్డి బండారు నిర్మిస్తున్నారు. సోమవారం మాధవ్ బర్త్ డే. ఈ సందర్భంగా 'మారెమ్మ' కొత్త గ్లింప్స్‌ను, ప్రత్యేక పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ సినిమాకు సంగీతం: ప్రశాంత్ ఆర్.విహారి.



● మాధవ్

ఇంతకాలం చూడలేని వింత!


''కొత్తగుంది పాతలోకమంతా... ఇంతకాలం చూడలేని వింత.. ఉరిమే చిమ్మచీకటింట వెలిగే వెన్నెలమ్మవంట..'' అంటూ సాగుతుంది 'ఇడ్లీ కొట్టు' చిత్రంలోని 'కొత్తగుంది' పాట. ధనుష్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన సినిమా 'ఇడ్లీ కొట్టు'. నిత్యామీనన్ హీరోయిన్‌గా నటించగా, అరుణ్ విజయ్, షాలినీ పాండే, సత్యరాజ్, రాజ్ కిరణ్ ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. డాన్ పిక్చర్స్, వండర్‌బార్ ఫిల్మ్స్‌పై ఆకాష్ భాస్కరన్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 1న రిలీజ్ కానుంది. ఈ సినిమాను తెలుగులో చింతపల్లి రామారావు విడుదల చేస్తున్నారు. తాజాగా ఈ మూవీలోని 'కొత్తగుంది..' పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు మేకర్స్. జీవీ ప్రకాష్‌కుమార్ సంగీతం అందించగా, సామ్రాట్ నాయుడు రాశారు. కృష్ణ తేజస్వి, శ్వేతా మోహన్ పాడారు.



● ధనుష్, నిత్యామీనన్

సరికొత్త లోకం

సుధీర్‌బాబు, సోనాక్షీ సిన్హా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ 'జటాధర'. దర్శక ద్వయం వెంకట్ కల్యాణ్– అభిషేక్ జైస్వాల్ తెరకెక్కిస్తున్న చిత్రం ఇది. శిల్పా శిరోద్కర్, దివ్య ఖోస్లా ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పణలో ఉమేష్ కుమార్ బన్సాల్, శివిన్ నారంగ్, అరుణ అగర్వాల్, శిల్పా సింఘాల్, నిఖిల్ నందా తెలుగు, హిందీ భాషల్లో నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని నవంబరు 7న విడుదల చేయనున్నట్లు సోమవారం అధికారికంగా వెల్లడించారు మేకర్స్. ''ఒక ఫోక్ టేల్ నుంచి పుట్టిన అద్భుతమైన కథే 'జటాధర'. స్టోరీ టెల్లింగ్, సినిమా స్కేల్, విజన్ పరంగా ఈ చిత్రం ప్రేక్షకులను ఓ సరికొత్త లోకంలోకి తీసుకువెళుతుంది.. అలాగే గొప్ప అనుభూతిని ఇస్తుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.



● సుధీర్‌బాబు

ఫోన్ కాల్స్ వస్తూనే ఉన్నాయి - హరి గౌర



''మిరాయ్' చిత్ర సంగీతం, నేపథ్య సంగీతానికి థియేటర్స్‌లో ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన రావడం చాలా సంతోషాన్నిచ్చింది. చిత్ర నిర్మాతలు టీజీ విశ్వ ప్రసాద్, కృతీ ప్రసాద్ కూడా చక్కని మ్యూజిక్ ఇచ్చానంటూ నన్ను అభినందించారు. సినిమా విడుదల తర్వాత చాలా ప్రశంసలు వచ్చాయి. నా ఫోన్‌కి కాల్స్ ఏకధాటిగా వస్తూనే ఉన్నాయి. చాలా మెసేజ్‌లు కూడా వచ్చాయి. అయితే ఆ సమయంలో నేను జ్వరంతో ఉండటం వల్ల ఎక్కువ కాల్స్ మాట్లాడలేకపోయాను'' అని సంగీత దర్శకుడు హరి గౌర చెప్పారు. తేజ సజ్జా, రితికా నాయక్ జంటగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించిన చిత్రం 'మిరాయ్'. టీజీ విశ్వ ప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదలైంది. ఈ సందర్భంగా చిత్ర సంగీత దర్శకుడు హరి గౌర విలేకరులతో మాట్లాడుతూ–''హనుమాన్, మిరాయ్' వంటి బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా హిట్స్ అందుకోవడం చాలా ఆనందంగా ఉంది. కార్తీక్‌గారు చాలా అద్భుతమైన సినిమా తీశారు. కీరవాణిగారు లాంటి లెజెండరీ కంపోజర్‌తో నన్ను పోల్చడం ఆనందాన్ని ఇచ్చినప్పటికీ.. అదే సమయంలో భయంగా, బాధ్యతగా అనిపిస్తోంది. ఈ సినిమా కోసం 'వైబ్ ఉంది బేబీ...' తో పాటు మరో స్పెషల్ సాంగ్‌ని చిత్రీకరించాం. అయితే ఎడిటింగ్‌లో చూసుకుంటే.. కథ ఫ్లోకి ఇబ్బంది కలిగిస్తుందేమో అనే ఫీలింగ్ కలిగింది.. దీంతో యూనిట్ అంతా కలిసి ఆ పాటలను తీసేయాలనే నిర్ణయం తీసుకున్నాం. అయితే ఓటీటీ స్ట్రీమింగ్‌లో మాత్రం 'వైబ్ ఉంది బేబీ...' సాంగ్ ఉంచాలనుకుంటున్నాం. ఇండస్ట్రీలో నాది పదేళ్ల ప్రయాణం. కన్నడలో 'చార్మినార్' వంటి హిట్ చిత్రం తర్వాత తెలుగులో నిరూపించుకోవాలని ఇక్కడికి వచ్చాను. 'తుంగభద్ర, డియర్ మేఘ, గాలివాన' వంటి సినిమాలు చేశాను. దర్శక-నిర్మాతల నమ్మకాన్ని బిల్డ్ చేసుకునే ప్రాసెస్‌లో చాలా టైమ్ పట్టింది'' అన్నారు.

పన్నెండేళ్ల నా కల వీర చంద్రహాస - రవి బస్రూర్



● రాధాకృష్ణ, రవి బస్రూర్, జేమ్స్

''వీర చంద్రహాస' సినిమా యక్షగాన సంస్కృతిని ప్రతిబింబించేలా ఉంటుంది. మన సంస్కృతిని కాపాడుకునేలా ఈ సినిమా ఉంటుంది. ఈ మూవీ నా పన్నెండేళ్ల కల'' అని ప్రముఖ సంగీత దర్శకుడు, డైరెక్టర్ రవి బస్రూర్ తెలిపారు. శివరాజ్ కుమార్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'వీర చంద్రహాస'. హోంబలే ఫిల్మ్స్ సమర్పణలో ఎన్ఎస్ రాజ్ కుమార్, ఎమ్‌వీ రాధాకృష్ణ, జేమ్స్ డబ్ల్యూ కొమ్ము నిర్మించారు. కన్నడలో ఘన విజయం సాధించిన ఈ చిత్రం కంచి కామాక్షి కోల్‌కతా కాళీ క్రియేషన్స్, ఎస్‌జేకే బ్యానర్‌పై ఈ నెల 19న తెలుగులో విడుదలవుతోంది. ఈ సందర్భంగా రవి బస్రూర్ మాట్లాడుతూ–''సంగీత దర్శకునిగా నాకు వచ్చే డబ్బును సరైన మార్గంలో ఉపయోగించాలనే ఉద్దేశంతో ఏడాదికి ఒక సినిమా దర్శక నిర్మాతగా చేయాలనుకునే లక్ష్యం పెట్టుకున్నాను. ఎన్టీఆర్–ప్రశాంత్ నీల్‌గార్ల కాంబినేషన్‌లో రూపొందుతోన్న 'ఎన్టీఆర్–నీల్' చిత్రానికి మంచి సంగీతం ఇవ్వడానికి శాయశక్తులా కృషి చేస్తున్నాను'' అని చెప్పారు. ''భారతీయ నాగరికత, సంస్కృతికి సంబంధించిన చిత్రమిది'' అని ఎమ్‌వీ రాధాకృష్ణ అన్నారు. ''మా చిత్రం అందర్నీ అలరిస్తుందని నమ్ముతున్నాం'' అని జేమ్స్ డబ్ల్యూ కొమ్ము పేర్కొన్నారు. ఈ వేడుకలో చిత్ర ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ సురేష్ పాల్గొన్నారు.

తెరపైకి డొక్కా సీతమ్మ జీవితం

అన్నపూర్ణగా చరిత్రలో నిలిచిపోయిన డొక్కా సీతమ్మ జీవితం 'అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ' పేరుతో వెండితెరకు రానుంది. అచ్చర్ల రాజుబాబు దర్శకత్వంలో వీఎస్ఆర్ ఫిలింస్ బ్యానర్‌పై ఎ.ఆర్.బి నిర్మించనున్న ఈ చిత్రం త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభంకానుంది.



''అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ' కోసం ప్రస్తుతం నటీనటులు, సాంకేతిక నిపుణుల ఎంపిక జరుగుతోంది. ఈ టైటిల్‌ని ఫిల్మ్ ఛాంబర్‌లో నమోదు చేయించాం. అయితే ఈ టైటిల్ ఇవ్వమని వేరే దర్శక-నిర్మాతలు మమ్మల్ని సంప్రదించగా, కుదరదని చెప్పాం. మా టైటిల్‌తో ఎవరైనా సినిమా తీస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం'' అని చిత్రయూనిట్ తెలిపింది.

గ్రామీణ నేపథ్యంలో...

శ్రీరామ్, మిథున ప్రియ జంటగా నటించిన చిత్రం 'యంగ్ అండ్ డైనమిక్'. కిషోర్ శ్రీ కృష్ణ దర్శకత్వంలో పి.రత్నమ్మ సమర్పణలో శ్రీరామ్ ప్రొడక్షన్స్‌పై శ్రీరామరాజు, లక్ష్మణ రావు నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి దర్శకులు వీర శంకర్, వీఎస్ ఆదిత్య, సముద్ర ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శ్రీరామ్ మాట్లాడుతూ–''ఒక ఊరిలో పేదవాడికి, రౌడీకి మధ్య జరిగే సంఘర్షణే 'యంగ్ అండ్ డైనమిక్' సినిమా'' అన్నారు. ''గ్రామీణ నేపథ్యంలో సాగే చిత్రం ఇది'' అన్నారు కిషోర్ శ్రీకృష్ణ. ''ఈ చిత్రంతో శ్రీరామ్ మంచి గుర్తింపు తెచ్చుకుంటాడు'' అని శ్రీరామ రాజు తెలిపారు. ''శ్రీరామ్‌తో మరో నాలుగు సినిమాలు నిర్మిస్తున్నాం'' అన్నారు లక్ష్మణరావు. ఈ వేడుకలో హీరోయిన్ మిథున ప్రియ మాట్లాడారు.



● శ్రీరామ్, మిథున ప్రియ

ఆ నమ్మకంతోనే అలా మాట్లాడారు - జె.ఎస్.ఎస్. వర్ధన్

''బ్యూటీ' సినిమా ఔట్‌పుట్ చాలా అద్భుతంగా వచ్చింది. ఆ నమ్మకంతోనే 'మా సినిమా నచ్చకపోతే జీరో రేటింగ్ ఇవ్వండి' అని అంకిత్ అన్నాడు. మారుతిగారికి కూడా సినిమా బాగా నచ్చింది కాబట్టే ఆయన కూడా అంత నమ్మకంగా మాట్లాడారు. మారుతి టీమ్ ప్రొడక్ట్స్ నుంచి వస్తోన్న మా సినిమాపై కొన్ని అంచనాలు ఉంటాయి.. ఆ అంచనాలను మించి మా చిత్రం ఉంటుంది'' అని డైరెక్టర్ జె.ఎస్.ఎస్. వర్ధన్ తెలిపారు. అంకిత్ కొయ్య, నీలఖి జంటగా నటించిన చిత్రం 'బ్యూటీ'. వానర సెల్యులాయిడ్, జీ స్టూడియోస్, మారుతి టీమ్ ప్రొడక్ట్స్‌పై అడిదల విజయపాల్ రెడ్డి, ఉమేష్ కుమార్ బన్సాల్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19న విడుదలవుతోంది. చిత్ర దర్శకుడు జె.ఎస్.ఎస్. వర్ధన్ మాట్లాడుతూ– ''మారుతిగారు పిలిచి.. జర్నలిస్ట్ సుబ్రహ్మణ్యం గారు రాసిన 'బ్యూటీ' కథని నాకు ఇచ్చారు. తోటి వారితో పోల్చుకునే ఒక మధ్యతరగతి అమ్మాయి జీవితాన్ని తెరపై చూపిస్తున్నా. ఈ చిత్రంలో ప్రేమ కథతో పాటు ఎమోషనల్ డ్రామా ఉంటుంది. ఔటర్ బ్యూటీ కంటే ఇన్నర్ బ్యూటీ ఇంపార్టెంట్ అని చెప్పడానికి 'బ్యూటీ' అనే టైటిల్ పెట్టాం. ఈ చిత్రం కోసం అంకిత్ చాలా కష్టపడ్డాడు. నీలఖిని చూస్తే మన పక్కింటి అమ్మాయిలాగా అనిపిస్తుంది. విజయ్ బుల్గానిన్ చక్కని సంగీతం, నేపథ్య సంగీతం ఇచ్చారు. ఈ సినిమా ప్రీమియర్ చూసిన ఓ డిస్ట్రిబ్యూటర్ భావోద్వేగంతో ఏడుస్తూ బయటకి వచ్చినప్పుడు..'నేను సాధించాను' అనిపించింది. నా తర్వాతి సినిమా కోసం ఒక మార్షల్ ఆర్ట్స్ కథ రాసుకున్నా. అమెజాన్‌తో ఓ ప్రాజెక్ట్‌కి చర్చలు జరుగుతున్నాయి'' అన్నారు.



స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽ 119	నిఫ్టీ ▽ 44
81,786	25,069

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	23,303	△	160
డోజోన్స్	45,816	▽	16
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,275	▽	9
డాక్స్	23,737	△	39
షాంఘై	3,861	▽	10
నికాయ్ (శుక్రవారం ముగింపు)	44,768	△	396

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భారమంతక	87.85	88.87
£	బ్రిటన్ పౌండ్	భారమంతక	118.40	121.35
€	యూరో	భారమంతక	102.30	105.05
¥	జపాన్ యెన్ (100)	భారమంతక	59.17	59.13
AU$	ఆస్ట్రేలియా డాలర్	భారమంతక	57.25	59.51
S$	సింగపూర్ డాలర్	భారమంతక	66.43	70.09
SAR	సౌదీ రియాల్	భారమంతక	22.63	24.13
UAE D	యూఏఈ దిర్హామ్	భారమంతక	23.13	24.38
¥	చైనా యువాన్	భారమంతక	11.51	13.34

మారుతీ విక్టోరిస్ @ రూ.10.5 లక్షలు

రూ. 19.99 లక్షల వరకు ధర శ్రేణి



జైపూర్: ఆటోమొబైల్ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా సరికొత్త ఎస్‌యూవీ విక్టోరిస్ ధర రూ. 10.5 లక్షల నుంచి రూ. 19.99 లక్షల వరకు (ఎక్స్‌షోరూం) ఉంటుంది. హైబ్రిడ్, ఫోర్ వీల్ డ్రైవ్, సీఎన్‌జీ, స్మార్ట్ హైబ్రిడ్ తదితర 21 వేరియంట్స్‌లో లభిస్తుంది. బుకింగ్స్ ప్రారంభమైనప్పటి నుంచి రోజుకు 1,000 చొప్పున వస్తున్నాయని కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ చెప్పారు. ఇప్పటి వరకు 10,000 బుకింగ్స్ వచ్చాయని వివరించారు. సెప్టెంబర్ 22 నుంచి విక్టోరిస్ అమ్మకాలు ప్రారంభమవుతాయని బెనర్జీ తెలిపారు. మిడ్-సైజ్ ఎస్‌యూవీ మార్కెట్లో అగ్రగామిగా నిలవాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు వివరించారు. 2025 ఆర్థిక సంవత్సరంలో మిడ్ సైజ్ ఎస్‌యూవీలు 10 లక్షలు అమ్ముడవగా, 1.94 లక్షల యూనిట్లతో హ్యుందాయ్ మోటార్ ఇండియా క్రెటా అగ్రగామిగా ఉంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఆగస్టులో ఎగుమతులు 6.7 శాతం జంప్ | 7 ఐపీవోలకు సెబీ గ్రీన్ సిగ్నల్

జీడీపీకి ఏఐ దన్ను!

2035 నాటికి 600 బిలియన్ డాలర్లు జత
- గ్లోబల్‌గా భారత్ కీలకపాత్ర
- నీతి ఆయోగ్ నివేదిక

న్యూఢిల్లీ: పరిశ్రమలవ్యాప్తంగా కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం వేగవంతమవుతున్న నేపథ్యంలో ఉత్పాదకత, సిబ్బంది పని సామర్థ్యాలు గణనీయంగా పెరుగుతున్నాయి. దీనితో 2035 నాటికి భారత స్థూల దేశీయోత్పత్తికి (జీడీపీ) 500–600 బిలియన్ డాలర్ల మేర విలువ జత కాగలదని నీతి ఆయోగ్ ఒక నివేదికలో తెలిపింది. వచ్చే దశాబ్ద కాలంలో వివిధ రంగాలవ్యాప్తంగా ఏఐ వినియోగంతో గ్లోబల్ ఎకానమీకి 17–26 ట్రిలియన్ (లక్షల కోట్ల) డాలర్ల విలువ జతవుతుందని పేర్కొంది. భారీ సంఖ్యలో స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్) నైపుణ్యాలున్న సిబ్బంది లభ్యత, పరిశోధన..అభివృద్ధి వ్యవస్థ విస్తరిస్తుండటం, డిజిటల్..సాంకేతిక సామర్థ్యాలు మెరుగుపడుతుండటం తదితర అంశాలు అంతర్జాతీయ ఎకానమీలో భారత్ కీలకపాత్ర పోషించేందుకు తోడ్పడగలవని నివేదిక తెలిపింది. గ్లోబల్ ఏఐ విలువలో భారత్ 10–15 శాతం



వాటాను దక్కించుకోవచ్చని వివరించింది.

ఆవిష్కరణలను ప్రోత్సహించాలి: నిర్మల

అందరికీ మేలు చేసే టెక్నాలజీ ఆవిష్కరణలను ప్రోత్సహించే విధంగా నియంత్రణలు ఉండాలే తప్ప వాటిని అణచివేసే విధంగా ఉండకూడదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యానించారు. ఏఐ టెక్నాలజీలను వినియోగించడమే కాకుండా వాటిని వివిధ రంగాలు బాధ్యతాయుతంగా ఉపయోగించుకునేలా చూడటంపై ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నీతి ఆయోగ్ నివేదికను విడుదల చేసిన సందర్భంగా ఆమె ఈ విషయాలు తెలిపారు. ఏఐ అనేక మార్పులకు లోనవుతూ, చాలా వేగంగా పురోగమిస్తోందని మంత్రి చెప్పారు. టెక్నాలజీ పరుగుకు అనుగుణంగా నియంత్రణలు కూడా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. వృద్ధి వేగం పుంజుకోవాలంటే ఉత్పాదకత పెరగాలని, ఇందుకోసం పరిశ్రమలు ఏఐని తప్పనిసరిగా వినియోగించుకోవాల్సి ఉంటుందని చెప్పారు. మరోవైపు, మన జీవన విధానాన్ని కృత్రిమ మేధ గణనీయంగా మార్చేయనున్న నేపథ్యంలో ఏఐ టెక్నాలజీలో భారత్ ముందుండాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.

నివేదికలో మరిన్ని విశేషాలు..

- నిర్ణయాలు తీసుకోవడం, వసూళ్లు, పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ రూపురేఖలను ఏఐ సిస్టమ్‌లు మార్చివేయగలవు. ప్రత్యామ్నాయ డేటా వనరులను ఉపయోగించి బ్యాంకులు రుణాలపై మరింత కచ్చితత్వంతో, పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడానికి వీలవుతుంది. వివిధ పరిశ్రమలవ్యాప్తంగా ఏఐ వినియోగం ద్వారా ఉత్పాదకత, సామర్థ్యాలకు సంబంధించిన సవాళ్లు సుమారు మూడో వంతు పరిష్కారం కాగలవు.
- టెక్నాలజీ సర్వీసుల్లో కొత్త ఆవిష్కరణలు.. అంతర్జాతీయ మార్కెట్లో భారత్ పోటీతత్వాన్ని మెరుగుపరుస్తాయి.
- ప్రస్తుత 5.7 శాతం వృద్ధి రేటు ప్రకారం 2035 నాటికి భారత జీడీపీ 6.6 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరుతుందనే అంచనాలు ఉన్నాయి. ఒకవేళ భారత్ ఆకాంక్షిస్తున్నట్లుగా 8 శాతం వృద్ధి సాధిస్తే మరో 1.7 ట్రిలియన్ డాలర్లు పెరిగి 8.3 ట్రిలియన్ డాలర్లకు చేరవచ్చు.
- ఏఐతో పెద్ద సంఖ్యలో కొత్త ఉద్యోగాలు రానున్నప్పటికీ, దీనితో ప్రస్తుతం ఉన్న అనేక ఉద్యోగాలు తగ్గుతాయి. ప్రధానంగా క్లరికల్, రొటీన్ పనులు, నైపుణ్యాలు అంతగా అవసరంలేని ఉద్యోగాలు ఈ జాబితాలో ఉంటాయి. ఆర్థిక సేవలు, తయారీ రంగాలపై ఏఐ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. 2035 నాటికి ఆయా రంగాల జీడీపీ విలువలో కృత్రిమ మేధ వాటా దాదాపు 20–25 శాతం వరకు ఉండొచ్చని అంచనా. ఏఐ ఆధారిత ఉత్పాదకత, సామర్థ్యాల మెరుగుదలతో ఫైనాన్షియల్ సర్వీసుల్లో 50–55 బిలియన్ డాలర్ల అవకాశాలు లభిస్తాయని రిపోర్ట్ వివరించింది.

ఐటీఆర్ దాఖలుకు మరొక రోజు గడువు

ఈ-ఫైలింగ్ పోర్టల్‌పై సాంకేతిక సమస్యలు
- గడువు పొడిగించాలన్న డిమాండ్
- 16వ తేదీ వరకు అవకాశమిచ్చిన సీబీడీటీ

న్యూఢిల్లీ: ఆదాయపన్ను రిటర్నుల (ఐటీఆర్‌లు) దాఖలుకు చివరి రోజు (సెప్టెంబర్ 15) అయిన సోమవారం ఈ-ఫైలింగ్ పోర్టల్‌పై భారీ రద్దీ కనిపించింది. దీంతో పన్ను చెల్లింపుదారులకు పలు సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. దీనిపై సోషల్ మీడియాలో ఏకరవు పెడుతూ, గడువు పొడిగించాలని డిమాండ్ చేశారు. తొలుత ఎలాంటి సమస్యల్లేవన్న ప్రత్యక్ష పన్నుల కేంద్ర మండలి (సీబీడీటీ).. సెప్టెంబర్ 16వ తేదీ వరకు (మరొక రోజు) గడువు పొడిగిస్తున్నట్లు రాత్రి 11 గంటల తర్వాత ఎక్స్ ప్లాట్‌ఫామ్‌పై ప్రకటించింది. ఐటీ పోర్టల్‌లో సమస్యలు ఎదురవుతున్నట్టు గత కొన్ని రోజులుగా వ్యక్తులు, చార్టర్డ్ అకౌంటెంట్లు సోషల్ మీడియా ద్వారా ఆదాయపన్ను శాఖ దృష్టికి తీసుకెళ్లారు. పన్ను చెల్లింపులు, వార్షిక సమాచార నివేదిక (ఏఐఎస్) డౌన్‌లోడ్‌లో సమస్యలు ఎదురవుతున్నట్టు పేర్కొంటూ, గడువు పొడిగించాలని కోరారు. ముఖ్యంగా ఇ-ఫైలింగ్ పోర్టల్‌పై లాగిన్ కాలేకపోయామంటూ పలువురు అసహనం వ్యక్తం చేయడం కనిపించింది.



పెద్ద సంఖ్యలో రిటర్నులు..

7 కోట్లకు పైగా ఐటీఆర్‌లు దాఖలైనట్టు సీబీడీటీ ప్రకటించింది. 2025–26 అసెస్‌మెంట్ సంవత్సరానికి (2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి) ఇంకా రిటర్నులు దాఖలు చేయని వారు వెంటనే ఆ పని పూర్తి చేయాలని సూచించింది. గత ఆర్థిక సంవత్సరానికి పెనాల్టీ లేకుండా వ్యక్తులు, హిందూ అవిభక్త కుటుంబాలు (హెచ్‌యూఎఫ్‌లు) రిటర్నుల సమర్పణకు జూలై 31 గడువు తేదీ కాగా, దీన్ని సెప్టెంబర్ 15 వరకు పొడిగించడం గమనార్హం. గతేడాది జూలై 31 నాటికి మొత్తం 7.28 కోట్ల ఐటీఆర్‌లు దాఖలయ్యాయి.

ఆటో, ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ

స్టాక్ సూచీల వరుస లాభాలకు బ్రేక్



ముంబై: ఆటో, ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో స్టాక్ సూచీలు వరుస లాభాలకు సోమవారం బ్రేక్ పడింది. ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య సమావేశ ప్రారంభానికి(మంగళవారం) ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. ఫలితంగా సెన్సెక్స్ 119 పాయింట్లు నష్టపోయి 81,786 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 44 పాయింట్లు పతనమై 25,069 వద్ద నిలిచింది. ఉదయం ఫ్లాటుగా మొదలైన సూచీలు రోజంతా లాభ, నష్టాల మధ్య పరిమిత శ్రేణిలో ట్రేడయ్యాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 81,745 – 81,999 శ్రేణిలో కదలాడింది. నిఫ్టీ 65 పాయింట్లు కోల్పోయి 25,049 వద్ద కనిష్టాన్ని తాకింది. ఫెడరల్ రిజర్వ్‌తో పాటు బ్యాంక్ ఆఫ్ కెనడా వడ్డీరేట్లను 25 బేసిస్ పాయింట్లు తగ్గించవచ్చు. బ్యాంక్ ఆఫ్ జపాన్, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ వడ్డీ రేట్లను యథావిధిగా కొనసాగించే వీలుందనే అంచనాలు నెలకొన్నాయి. ఆసియాలో దక్షిణ కొరియా, హాంగ్‌కాంగ్ సూచీలు లాభాల్లో, చైనా మార్కెట్ నష్టాల్లో ముగిశాయి. సెలవు కారణంగా జపాన్ మార్కెట్ పనిచేయలేదు. యూరప్ మార్కెట్లు అరశాతం లాభపడ్డాయి. అమెరికా మార్కెట్లు స్వల్ప లాభాల్లో ట్రేడవుతున్నాయి.

ఐపీవో బాటలో మెడికవర్

ఈ ఏడాది రూ. 2,000 కోట్ల టర్నోవరు లక్ష్యం

కొత్తగా రెండు ఆస్పత్రులు • సంస్థ చైర్మన్ అనిల్ కృష్ణ వెల్లడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హెల్త్‌కేర్ సేవల దిగ్గజం మెడికవర్ వచ్చే ఏడాది పబ్లిక్ ఇష్యూకి వచ్చే యోచనలో ఉంది. ఇష్యూ ద్వారా సమీకరించిన నిధులను మౌలిక సదుపాయాల విస్తరణకు, రుణ భారాన్ని తగ్గించుకునేందుకు ఉపయోగించుకోనుంది. ప్రస్తుత రుణభారం సుమారు రూ.1,000 కోట్లుగా ఉంది. సంస్థ సీఎండీ అనిల్ కృష్ణ సోమవారమిక్కడ విలేకరుల సమావేశంలో ఈ విషయాలు తెలిపారు. కొత్తగా రెండు ఆస్పత్రులు ప్రారంభిస్తున్నట్లు వివరించారు. గ్రూప్‌లో 24వదైన సికింద్రాబాద్ హాస్పిటల్‌ను మంగళవారం (నేడు) ప్రారంభించనుండగా, ఈ ఏడాది ఆఖరు నాటికి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మరొకటి (500 బెడ్స్ సామర్థ్యం) అందుబాటులోకి వస్తుందని కృష్ణ చెప్పారు.



గత ఆర్థిక సంవత్సరంలో సంస్థ ఆదాయం సుమారు రూ. 1,850 కోట్లుగా ఉండగా, ఈసారి రూ. 2,000 కోట్లకు పైగా ఉంటుందని అంచనా వేస్తున్నట్లు వివరించారు. ఇక కొత్త ఆస్పత్రితో కలిపి నాలుగు రాష్ట్రాల్లో (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర) పడకల సామర్థ్యం 5,800గా ఉంటుందని కృష్ణ చెప్పారు. హైదరాబాద్ చందానగర్‌లో 150 పడకల విస్తరణతో మొత్తం బెడ్స్ సంఖ్య 6,400కి చేరుతుందన్నారు. ఐపీవోకి సంబంధించి వంద కోట్ల డాలర్ల దాకా వేల్యుయేషన్ అంచనా వేస్తున్నట్లు కృష్ణ చెప్పారు.

చిన్న పట్టణాలపై మరింత ఫోకస్ ...

ప్రస్తుతం తమకు కార్యకలాపాలున్న ప్రాంతాలపైనే ఎక్కువగా దృష్టి పెడుతున్నట్లు కృష్ణ తెలిపారు. బెంగళూరు, పుణేల్లాంటి నగరాలతో పాటు ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో స్థానాన్ని పటిష్టం చేసుకుంటున్నట్లు వివరించారు. అవకాశం వస్తే 300–350 బెడ్స్ సామర్థ్యాలు ఉండే ఇతర ఆస్పత్రుల కొనుగోలు అంశాన్నీ పరిశీలిస్తామని చెప్పారు. సాధారణంగా లీజు ప్రాతిపదికన ప్రాంగణాలను తీసుకుంటున్న తాము ఇకపై తమ కార్యకలాపాల కోసం పూర్తి స్థాయిలో ప్రాపర్టీని కొనుగోలు చేయడంపై ఫోకస్ పెట్టనున్నట్లు వివరించారు. వైద్య సదుపాయాలు విస్తృతంగా పెరుగుతున్నప్పటికీ, ప్రతిభావంతులైన వైద్యుల కొరత సవాలుగా ఉంటోందని పేర్కొన్నారు. కరెన్సీ హెచ్చుతగ్గులు, అధునాతన టెక్నాలజీ గల పరికరాల దిగుమతి వ్యయాలు పెరిగిపోవడమనేది, చికిత్స వ్యయాల పెరుగుదలకు దారితీస్తున్నట్లు వివరించారు. రాబోయే రోజుల్లో వేగవంతమైన, కచ్చితమైన చికిత్సను అందించడంలో కృత్రిమ మేధ (ఏఐ) కీలకపాత్ర పోషించగలదని కృష్ణ చెప్పారు.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» టెట్/డీఎస్సీ ప్రత్యేకం–మెథడాలజీ » సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–భూగోళశాస్త్రం
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–రసాయన శాస్త్రం » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం–రీజనింగ్

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీఈడీఏ, న్యూఢిల్లీలో కన్సల్టెంట్ పోస్టులు

న్యూఢిల్లీలోని అగ్రికల్చరల్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఏపీఈడీఏ).. ఒప్పంద ప్రాతిపదికన కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- » మొత్తం పోస్టుల సంఖ్య: 04.
- » అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, ఎంబీఏ(అగ్రి. బిజినెస్ మేనేజ్‌మెంట్/పబ్లిక్ పాలసీ)లో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- » వేతనం: నెలకు రూ.1,20,000 నుంచి రూ.1,65,000.
- » ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా.
- » దరఖాస్తు విధానం: ఈమెయిల్ ద్వారా.
- » ఈమెయిల్: recruitment@apeda.gov.in
- » దరఖాస్తులకు చివరితేది: 22.09.2025.
- » వెబ్‌సైట్: https://apeda.gov.in

బీడీఆర్‌సీఎల్, న్యూఢిల్లీలో వివిధ ఉద్యోగాలు

న్యూఢిల్లీలోని భరుచ్ దహేజ్ రైల్వే కంపెనీ లిమిటెడ్(బీడీఆర్‌సీఎల్).. వివిధ విభాగాల్లో ఆఫీస్ సూపర్‌వైజర్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- » మొత్తం పోస్టుల సంఖ్య: 04.
- » పోస్టుల వివరాలు: ఆఫీస్ సూపర్‌వైజర్–02, అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్–1, 2–02.
- » విభాగాలు: ఫైనాన్స్ అండ్ అకౌంట్స్.
- » అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, ఎంబీఏ లేదా సీఏ/ఐసీఎంఏఐ ఇంటర్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » వయసు: 26.08.2025 నాటికి ఆఫీసర్ సూపర్‌వైజర్‌కు 35 ఏళ్లు, అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్–1కు 35 ఏళ్లు ఉండాలి.
- » వేతనం: నెలకు ఆఫీసర్ సూపర్‌వైజర్‌కు రూ.19,200 నుంచి రూ.64,800, అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్–1కు రూ.40,000 నుంచి రూ.1,40,000, అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్–2కు రూ.30,000 నుంచి రూ.1,20,000.
- » దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా .
- » దరఖాస్తులకు చివరితేది: 28.09.2025.
- » వెబ్‌సైట్: http://www.bdrail.in

బెంగళూరు యూనివర్శిటీలో 57 గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులు

బెంగళూరు యూనివర్శిటీ జ్ఞానభారతి క్యాంపస్ తాత్కాలిక ప్రాతిపదికన వివిధ విభాగాల్లో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- » మొత్తం పోస్టుల సంఖ్య: 57.
- » విభాగాలు: హిందీ, ఉర్దూ, సంస్కృతం, తెలుగు, సోషల్ వర్క్, హిస్టరీ, విజువల్ ఆర్ట్స్, పొలిటికల్ సైన్స్, కమ్యూనికేషన్, ఉమెన్స్ స్టడీస్, ఫిలాసఫీ, పెర్ఫార్మింగ్ ఆర్ట్స్, సెంటర్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ స్టడీస్, ఎడ్యుకేషన్, ఫిజికల్ కామర్స్, మేనేజ్‌మెంట్.
- » అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీ(కెమిస్ట్రీ, బయో–కెమిస్ట్రీ, బోటనీ, స్టాటిస్టిక్స్, ఎలక్ట్రానిక్ సైన్స్, అప్లైడ్ జువాలజీ, జెనెటిక్స్‌అండ్ ఫోరెన్సిక్ సైన్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, లైఫ్‌సైన్స్, జియాలజీ, జాగ్రఫీ, ఎలక్ట్రానిక్ మీడియా ఫిల్మ్ మేకింగ్, గ్రాఫిక్ అండ్ యానిమేషన్, సైకాలజీ, యోగిక్ సైన్స్, ఫిజిక్స్, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, అండ్ మైక్రోబయాలజీ అండ్ బయోటెక్నాలజీ, సోషల్ వర్క్, సోషియాలజీ, హిస్టరీ, ఎకనామిక్స్, సెంటర్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ స్టడీస్, మ్యాథమేటిక్స్, కామర్స్ మేనేజ్‌మెంట్)లో ఉత్తీర్ణులవ్వాలి.
- » వేతనం: నెలకు రూ.50,000.
- » ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా.
- » దరఖాస్తులకు చివరితేది: 17.09.2025.
- » వెబ్‌సైట్: https://bangaloreuniversity.karnataka.gov.in

ఈఐఎల్‌లో 48 ఇంజనీర్ పోస్టులు

ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్(ఈఐఎల్)లో ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన అసోసియేట్ ఇంజనీర్ గ్రేడ్–2, 3 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- » మొత్తం పోస్టుల సంఖ్య: 48.
- » అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ, బీటెక్/బీఈలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » వయసు: 31 నుంచి 41 ఏళ్లు ఉండాలి.
- » వేతనం: నెలకు పోస్టును అనుసరించి రూ.72,000 నుంచి రూ.96,000.
- » ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 24.09.2025.
- » ఇంటర్వ్యూ తేదీలు: 08.10.2025, 09.10.2025, 29.10.2025, 30.10.2025.
- » వెబ్‌సైట్: https://recruitment.eil.co.in

ఎయిమ్స్ డియోఘర్‌లో 174 సీనియర్ రెసిడెంట్ పోస్టులు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) డియోఘర్‌లో ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- » మొత్తం పోస్టుల సంఖ్య: 174.
- » విభాగాలు: అనెస్థీషియాలజీ, క్రిటికల్ కేర్, అనాటమీ, బయో కెమిస్ట్రీ, బర్న్ అండ్ ప్లాస్టిక్ సర్జరీ, కార్డియాలజీ, కార్డియోథొరాసిక్ అండ్ వాస్కులర్ సర్జరీ, కమ్యూనిటీ అండ్ ఫ్యామిలీ మెడిసిన్, డెంటల్ సర్జరీ, డెర్మటాలజీ, ఎండో క్రైనాలజీ మొదలైనవి.
- » అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(ఎండీ/ఎంఎస్/డీఎన్‌బీ/ఎండీఎస్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » వయసు: 45 ఏళ్లు ఉండాలి.
- » వేతనం: నెలకు రూ.67,700.
- » ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును రిజిస్ట్రార్ ఆఫీస్, నాలుగో అంతస్తు, ఎయిమ్స్, దేవీపూర్(అకడమిక్ బ్లాక్), డియోఘర్–814152(జార్ఖండ్) చిరునామకు పంపించాలి.
- » దరఖాస్తులకు చివరితేది: 20.09.2025.
- » వెబ్‌సైట్: www.aiimsdeoghar.edu.in

ఐపీఆర్‌సీఎల్‌లో 18 ప్రాజెక్ట్ సైట్ ఇంజనీర్ పోస్టులు

ఇండియన్ పోర్ట్ రైల్ అండ్ రోప్‌వే కార్పొరేషన్ లిమిటెడ్ (ఐపీఆర్‌సీఎల్).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ప్రాజెక్ట్ సైట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- » మొత్తం పోస్టుల సంఖ్య: 18.
- » విభాగాలు: ఎలక్ట్రికల్, సివిల్, ఎస్ అండ్ టీ, లోకో/మెకానికల్.
- » అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్/బీఈ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » వయసు: 10.10.2025 నాటికి 32 ఏళ్లు ఉండాలి.
- » వేతనం: నెలకు రూ.54,000.
- » ఎంపిక విధానం: విద్యార్హతల్లో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » దరఖాస్తులకు చివరితేది: 10.10.2025.
- » వెబ్‌సైట్: https://iprcl.in

ఆర్‌బీఐలో ఆఫీసర్ .. నెలకు లక్షన్నర వేతనం

బ్యాంకింగ్ రంగంలో కెరీర్ కోరుకునే వారికి చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది. దేశ అత్యున్నత కేంద్ర బ్యాంకు.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ).. వివిధ విభాగాల్లో ఆఫీసర్ గ్రేడ్-బి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏదైనా డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో ఈ పోస్టులకు పోటీపడొచ్చు. మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహించనుంది. ఎంపిక ప్రక్రియలో విజేతలుగా నిలిస్తే ఆకర్షణీయ వేతనంతోపాటు ఉజ్వల కెరీర్ అవకాశాలు సొంతం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. ఆర్‌బీఐలో ఆఫీసర్ కొలువులపై ప్రత్యేక కథనం..



- » ఆర్‌బీఐలో 120 ఆఫీసర్ గ్రేడ్–బి పోస్టులు
- » ఏదైనా డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు
- » ఫేజ్1, ఫేజ్ 2 పరీక్షలు, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక
- » ఎంపికైతే ప్రారంభంలోనే నెలకు లక్షన్నర వేతనం

- మొత్తం పోస్టుల సంఖ్య: 120.

పోస్టుల వివరాలు

ఆఫీసర్స్ గ్రేడ్–బి (జనరల్ కేడర్)–83 పోస్టులు, ఆఫీసర్స్ గ్రేడ్–బి(డీఈపీఆర్ కేడర్)–17 పోస్టులు, ఆఫీసర్స్ గ్రేడ్–బి(డీఎస్ఐఎం కేడర్)–20 పోస్టులు

అర్హత

- 2025, సెప్టెంబర్1 నాటికి ఆయా పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- ఆఫీసర్స్ గ్రేడ్–బి(డీఆర్) జనరల్ కేడర్ పోస్టులకు ఏదైనా గ్రాడ్యుయేషన్‌లో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత లేదా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి రెండేళ్ల పోస్టుగ్రాడ్యుయేషన్ పాస్ అవ్వాలి.
- ఆఫీసర్స్ గ్రేడ్–బి(డీఈపీఆర్ కేడర్) పోస్టులకు కనీసం 55 శాతం మార్కులతో ఎకనామిక్స్‌లో ఎంఏ/ఎమ్మెస్సీ లేదా ఫైనాన్స్‌లో ఎంఏ/ఎమ్మెస్సీ ఉత్తీర్ణులవ్వాలి. ఎస్సీ/ఎస్టీలు,దివ్యాంగ అభ్యర్థులు కనీసం 50శాతం మార్కులు పొందాలి.
- ఆఫీసర్స్ గ్రేడ్–బి(డీఎస్ఐఎం కేడర్) పోస్టులకు కనీసం 55 శాతం మార్కులతో స్టాటిస్టిక్స్/మ్యాథమెటిక్స్/మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్/అప్లయిడ్ స్టాటిస్టిక్స్/క్వాంటిటేటివ్ ఎకనామిక్స్ /ఎకనోమెట్రిక్స్/ఇన్‌ఫర్ మాటిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి లేదా డేటా సైన్స్/ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్/మెషిన్ లెర్నింగ్/బిగ్ డేటా అనలిటిక్స్‌లో కనీసం 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.

వయసు

01.09.2025 నాటికి 21 నుంచి 30 ఏళ్లు మించకూడదు. అభ్యర్థులు 02.09.1995 కంటే ముందు 01.09.2004 తర్వాత జన్మించి ఉండరాదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

వేతనం

ఎంపికైన అభ్యర్థులకు ప్రారంభంలోనే నెలకు బేసిక్ పే రూ.78,450 లభిస్తుంది. వేతన శ్రేణి రూ.78,450–రూ.1,41,600 అందుతుంది. హెచ్‌ఆర్ఏ మినహాయించి ఇతర అన్ని అలవెన్సులు కలుపుకొని ప్రస్తుతం నెలకు సుమారు రూ.1,50,374 అందుకునే అవకాశం ఉంది.

ఎంపిక విధానం

- ఆన్‌లైన్ విధానంలో ఫేజ్ 1,ఫేజ్ 2 రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- ఫేజ్1 పరీక్ష ఆన్‌లైన్ విధానంలో ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహిస్తారు. ఇందులో ఒకటే పేపర్ 200 మార్కులకు ఉంటుంది. ఈ పేపర్‌లో జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్, రీజనింగ్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్షకు కేటాయించిన సమయం 120 నిమిషాలు. ఫేజ్1 పరీక్షలోని ప్రతి విభాగంలో అభ్యర్థులు కనీస అర్హత మార్కులు సాధించాలి,
- ఫేజ్1 పరీక్షలో ప్రతిభ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసి ఎంపికైన అభ్యర్థులకు ఫేజ్ 2 పరీక్ష నిర్వహిస్తారు.
- ఫేజ్2 పరీక్షలో మూడు పేపర్లు ఉంటాయి.పేపర్1 పరీక్ష ఎకనామిక్స్ అండ్ సోషల్ ఇష్యూస్‌పై 100 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో 50 శాతం ప్రశ్నలు ఆబ్జెక్టివ్ తరహాలో, 50 శాతం ప్రశ్నలు డిస్క్రిప్టివ్ తరహాలో ఉంటాయి. అంటే 50 మార్కులు ఆబ్జెక్టివ్ విధానంలో, మరో 50 మార్కులకు డిస్క్రిప్టివ్ విధానంలో పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష సమయం 120 నిమిషాలు.
- ఫేజ్–2లో పేపర్2 పరీక్ష ఇంగ్లిష్ రైటింగ్ స్కిల్స్‌పై డిస్క్రిప్టివ్ విధానంలో నిర్వహిస్తారు. మొత్తం100 మార్కులకు జరిగే ఈ పేపర్‌ను కీబోర్డ్ సహాయంతో కంప్యూటర్‌పై టైప్ చేయాల్సి ఉంటుంది. మూడు ప్రశ్నలు ఉండే ఈ పరీక్ష వ్యవధి 90 నిమిషాలు.
- ఫేజ్ 2లో పేపర్3 పరీక్ష జనరల్ ఫైనాన్స్ అండ్ మేనేజ్‌మెంట్‌పై 100 మార్కులకు ఉంటుంది. ఇందులో 50 మార్కులకు ఆబ్జెక్టివ్ తరహాలో, 50 మార్కులకు డిస్క్రిప్టివ్ విధానంలో పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్ష వ్యవధి 120 నిమిషాలు.
- ఫేజ్ 2లోని మూడు పేపర్లలో అభ్యర్థులు సాధించిన మెరిట్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసి ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు.
- ఇంటర్వ్యూకు 75 మార్కులు కేటాయించారు.
- ఫేజ్2తోపాటు ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభ ఆధారంగా తుది ఎంపిక చేపడతారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు ఫీజు: జనరల్/ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.850. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు రూ.100.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది: 10.09.2025.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 30.09.2025.

పరీక్ష తేదీలు

- ఆఫీసర్స్ గ్రేడ్–బి(డీఆర్)–జనరల్ కేడర్ ఫేజ్–1 పరీక్ష: 18.10.2025.
- ఆఫీసర్స్ గ్రేడ్–బి(డీఆర్)–జనరల్ కేడర్ ఫేజ్–2 పరీక్ష(పేపర్ 1,2,3): 06.12.2025.
- ఆఫీసర్స్ గ్రేడ్–బి(డీఆర్)–డీఈపీఆర్ ఫేజ్ 1 (పేపర్–1, 2)/ డీఎస్ఐఎం ఫేజ్1 (పేపర్1): 19.10.2025.
- ఆఫీసర్స్ గ్రేడ్–బి(డీఆర్)–డీఈపీఆర్ (పేపర్ –1, 2)/డీఎస్ఐఎం(పేపర్–2, 3) ఫేజ్–2 పరీక్ష: 07.12.2025.
- వెబ్‌సైట్: https://www.rbi.org.in

కొత్త కోర్సులు.. సరికొత్త దేశాలు

ట్రెండింగ్ కోర్సులు ఎక్కడంటే..

లైటింగ్, లైట్ డిజైన్
ఆర్కిటెక్చరల్, వేడుకల కోసం వేదికలు, నగరాల్లోని భవంతుల్లో లైటింగ్ కోసం కళాత్మకతను సాంకేతికతతో జోడించేలా శిక్షణ పొందడం.
కేంద్రాలు: మిలాన్ (ఇటలీ), బిల్‌బావ్ (స్పెయిన్), స్టాక్‌హోం (స్వీడన్).

మ్యూజిక్ థెరపీ
భావోద్వేగ, ఆలోచన, శారీరక స్వస్థత కోసం సంగీతాన్ని వైద్య సాధనంగా ఉపయోగించడం.
కేంద్రాలు: లిమెరిక్ (ఐర్లాండ్), నెదర్లాండ్స్.

క్రూజ్ లైన్ నిర్వహణ
ప్రపంచ క్రూజ్ పరిశ్రమ కోసం రూపొందించిన ప్రత్యేక ఆతిథ్య, కార్యకలాపాలకు సంబంధించిన విద్యా కార్యక్రమాలు.
కేంద్రాలు: స్పెయిన్, స్విట్జర్లాండ్

మాలిక్యులర్ గ్యాస్ట్రోనమీ
నురగ (ఫోమ్), జెల్స్ తదితరాలతో రుచులు, భోజన అనుభవాలను మార్చడానికి శాస్త్రాన్ని ఉపయోగించడం.
కేంద్రాలు: స్పెయిన్, జపాన్, నెదర్లాండ్స్

గేమ్ డిజైనింగ్
వీడియో గేమ్స్‌ను సృష్టించడం, అభివృద్ధి, తయారీ; కేంద్రాలు: ఫిన్లాండ్

గ్రీన్ సప్లై చైన్
పర్యావరణ అనుకూల, సమర్థవంతమైన, తక్కువ కర్బన ఉద్గారాలున్న రవాణా వ్యవస్థల రూపకల్పన
కేంద్రాలు: స్వీడన్, డెన్మార్క్, నెదర్లాండ్స్

హ్యుమానిటేరియన్ లాజిస్టిక్స్
విపత్తుల నుంచి ఉపశమనం, సహాయం, పంపిణీ, సంక్షోభ సమయంలో ప్రతిస్పందన కోసం సరఫరా వ్యవస్థల నిర్వహణ
కేంద్రాలు: ఫిన్లాండ్, బెల్జియం, స్విట్జర్లాండ్, దక్షిణాఫ్రికా

విదేశీ విద్యకు నూతన గమ్యస్థానాలు | సంప్రదాయ దేశాలకు పోటీగా కొత్త దేశాలు ఎంచుకుంటున్న భారతీయ విద్యార్థులు

విదేశాల్లో చదువుకోవాలని ఎవరికి ఉండదు? అక్కడే చదువుకుని, స్థిరపడాలన్నదీ కోట్లాదిమంది భారతీయుల కల. యూఎస్, కెనడా, యూకే, ఆస్ట్రేలియాలోని పేరొందిన యూనివర్సిటీలకు వెళ్లడం అనేది గతం. ఇప్పుడు ట్రెండ్ క్రమంగా మారుతోంది. సంప్రదాయ దేశాలకు బదులుగా భారతీయ విద్యార్థులు నూతన గమ్యస్థానాలను ఎంచుకుంటున్నారు.

ఎంబీబీఎస్ విద్య కోసం మధ్య ఆసియాలోని కిర్గిస్తాన్, ఇంజనీరింగ్ కోసం కంబోడియా, సప్లై చైన్ మేనేజ్‌మెంట్ చదివేందుకు మాల్టా, సాంస్కృతిక అధ్యయనాల కోసం ఉత్తర కొరియాకు చలో అంటున్నారు మన విద్యార్థులు. దేశీయంగా తీవ్రమైన పోటీ, అమెరికాలో రోజుకో రకంగా మారుతున్న విధానాలు; ఆస్ట్రేలియా, బ్రిటన్ వంటి దేశాల్లో వలసలపై పెరుగుతున్న వ్యతిరేకత, వీసాల లభ్యత కఠినతరం కావడం; పలు ఇతర దేశాల్లో విద్యా వ్యయాలు పెరుగుతుండడం.. వీటన్నింటి కారణంగా నూతన కోర్సుల కోసం కొత్త దేశాల బాట పడుతున్నారు.

సరికొత్త గమ్యస్థానాలు

- మాల్టా, పోలాండ్, లాత్వియా, సైప్రస్ వంటి చిన్న యూరోపియన్ దేశాలు వివిధ ప్రోగ్రామ్స్‌లో భారతీయులు సహా విదేశీయులకు సులభంగా ప్రవేశం కల్పిస్తున్నాయి. అలా అక్కడ చదివిన గ్రాడ్యుయేట్లు ఉద్యోగాలు, అధునాతన డిగ్రీల కోసం ఫ్రాన్స్, జర్మనీ, యూకే, మధ్యప్రాచ్యాలకు వెళ్తున్నారు.
- రొమేనియా, బల్గేరియా, హంగేరీలలోని భారతీయ ఇంజనీరింగ్ విద్యార్థులు చౌకైన స్థానిక ప్రోగ్రామ్స్‌లో చేరుతున్నారు. కానీ చాలామంది అధిక జీతాలు, అంతర్జాతీయ ఎక్స్‌పోజర్ కోసం జర్మనీ, నెదర్లాండ్స్, స్కాండినేవియాకు మారుతున్నారు.
- అలాగే బంగ్లాదేశ్, ఉజ్బెకిస్తాన్‌లలో ఎంబీబీఎస్ చేసినవాళ్లు.. ఎక్కువ జీతాల కోసం మధ్య ప్రాచ్యదేశాలకు మరలుతున్నారు.



సాక్షి, స్పెషల్ డెస్క్

సరఫరాను మించిన డిమాండ్

ఈ ఏడాది 22 లక్షలకు పైగా నీట్ అభ్యర్థులు.. భారత్‌లో కేవలం 1.18 లక్షల ఎంబీబీఎస్ సీట్ల కోసం పోటీ పడ్డారు. అంటే అంతరం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అందుకే విద్యార్థులు సంప్రదాయేతర దేశాలవైపు చూస్తున్నారు.

చౌకైన ఎంపిక

భారత్‌లోని ప్రైవేట్ కళాశాలలతో పోలిస్తే 'చాలా తక్కువ ఖర్చు'తో.. ఎంబీబీఎస్ విద్యార్థులను తూర్పు యూరప్, మధ్య ఆసియా దేశాలు ఆకర్షిస్తున్నాయి. ఉజ్బెకిస్తాన్ ఒక్కటే 6వేలకుపైగా విద్యార్థులకు ఆతిథ్యం ఇస్తోంది. విజయవాడ, వరంగల్, తిరుపతి వంటి ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల నుంచి ఇప్పుడు విదేశాలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని ఏజెన్సీలు చెబుతున్నాయి.

ఖర్చు ఎంతంటే?

భారత్ (ప్రైవేట్‌లో ఎంబీబీఎస్): పూర్తి డిగ్రీకి రూ.1 కోటికిపైగా
ఉజ్బెకిస్తాన్/రష్యా/ఫిలిప్పీన్స్: పూర్తి ఎంబీబీఎస్‌కు రూ.15-35 లక్షలు
పోలండ్/చెక్ రిపబ్లిక్: ఏడాదికి రూ.9.5-17.5 లక్షలు (ట్యూషన్+జీవన వ్యయం)
జర్మనీ (ప్రభుత్వ విశ్వవిద్యాలయం): సంవత్సరానికి రూ.30,000

సంప్రదాయ దేశాలకు భారత్ నుంచి ఎంత మంది విద్యార్థులు వెళ్లారంటే..

దేశం	2023	2024
యూఎస్ఏ	2,34,473	2,04,058
కెనడా	2,33,532	1,37,608
యూకే	1,36,921	98,890
ఆస్ట్రేలియా	78,093	68,572



2024లో విదేశాలకు వెళ్లిన భారతీయ విద్యార్థులు

బంగ్లాదేశ్	29,232	మలేసియా	4,390
కిర్గిస్తాన్	11,875	ఇటలీ	3,965
కజకిస్తాన్	11,638	సైప్రస్	3,162
ఐర్లాండ్	10,438	మారిషస్	2,146
ఉజ్బెకిస్తాన్	9,915	వియత్నాం	811
జార్జియా	9,720	ఆస్ట్రియా	719
ఫిలిప్పీన్స్	8,101	హంగేరీ	465

(ఆధారం: కేంద్ర విద్యాశాఖ)



విద్యార్థులే వంట మనుషులు

తిర్యాణి (ఆసిఫాబాద్): గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న డైలీ వేజ్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని నాలుగు రోజులుగా విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు వంట తిప్పలు తప్పడం లేదు. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో 200 మందికి పైగా విద్యార్థులున్నారు. ఇక్కడ ఆరుగురు ఔట్‌సోర్సింగ్, ఇద్దరు సిబ్బంది డైలీవేజ్ విధానంలో పనిచేస్తున్నారు. రెగ్యులర్ సిబ్బంది వాచ్‌ఉమెన్ ఒక్కరే ఉన్నారు. ఆమె ఒక్కరే విద్యార్థులకు వండిపెట్టడం, పాఠశాల గదులు శుభ్రం చేయడం సాధ్యం కావడం లేదు. సోమవారం పలువురు విద్యార్థులు కూరగాయలు కోసి వంట వండేందుకు వాచ్‌ఉమెన్‌కు సాయం చేశారు.

నేటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో తనిఖీలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేసేందుకు విద్యాశాఖకు చెందిన వివిధ స్థాయిల అధికారులతో కమిటీలను ఏర్పాటు చేశారు. ఒక్కో అధికారికి రెండు జిల్లాలను అప్పగించారు. పాఠశాల విద్య కమిషనర్ నవీన్ నికోలస్ ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారు. మంగళ, బుధ వారాల్లో ఎంపిక చేసిన అధికారులు జిల్లాల్లోని కొన్ని స్కూళ్లను పరిశీలించి నివేదిక ఇస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో కొత్త ప్రవేశాలు, యూడైస్ డేటా నవరణ, స్కూళ్లలో పరిశుభ్రత, ముఖ గుర్తింపు హాజరు అమలు, సివిల్ పనులు, ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం జరిగే తీరు, పీఎం పోషన్ స్కీం అమలు సహా పలు అంశాలను ఈ కమిటీలు పరిశీలిస్తాయి.

18 నుంచి నెక్లెస్‌రోడ్‌లో గ్రాండ్ నర్సరీ మేళా

బ్రోచర్‌ను ఆవిష్కరించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సాక్షి, హైదరాబాద్: పట్టణప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంచి పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ తమ వంతు కృషి చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈనెల 18 నుంచి హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఆల్‌ఇండియా హార్టికల్చర్, అగ్రికల్చర్‌షో బ్రోచర్‌ను మంత్రి సోమవారం ఆవిష్కరించారు. నెక్లెస్‌రోడ్ పీపుల్స్ ప్లాజాలో 18వ తేదీ నుంచి 22 వరకు నర్సరీ మేళా ఉంటుందని, దీన్ని నగర వాసులు, చుట్టుపక్కల జిల్లాల వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నర్సరీ మేళా ఇన్‌చార్జి ఖలీద్ అహ్మద్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి అగ్రికల్చర్, హార్టికల్చర్ ఉత్పత్తులతో ఆల్ ఇండియా హార్టికల్చర్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టెర్రస్ గార్డెనింగ్, వర్టికల్ గార్డెనింగ్, హైడ్రోఫోనిక్ సిస్టమ్ వంటి కొత్త పద్ధతులను ఈ షోలో ప్రదర్శిస్తామన్నారు. దేశవ్యాప్తంగా ఏపీ, కోల్‌కతా, ఢిల్లీ, హరియాణా, ముంబై, బెంగళూరు, పుణే, షిర్డీ, కడియం, చెన్నై తదితర ప్రాంతాల నుంచి వచ్చిన ప్లాంట్స్‌తో 150 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, హార్టికల్చర్‌డైరెక్టర్ యాస్మిన్‌భాషా ఈ మేళా ప్రారంభిస్తారని తెలిపారు.

పోలీస్ శాఖలో సంస్కరణలపై అధ్యయనం

- ఇండియన్ పోలీస్ ఫౌండేషన్‌తో తెలంగాణ పోలీస్‌శాఖ ఎంవోయూ



సాక్షి, హైదరాబాద్: పోలీసుల సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు శాఖలో అంతర్గత సంస్కరణలు ఎంతో కీలకమని డీజీపీ డా.జితేందర్ అన్నారు. రాష్ట్రంలో అంతర్గత పోలీసు సంస్కరణల ప్రాజెక్టు కోసం తెలంగాణలో రెండు ప్రాంతాలను ఇండియన్ పోలీస్ ఫౌండేషన్ (ఐపీఎఫ్) ఎంపిక చేసింది. పోలీస్ సంస్కరణల ప్రాజెక్టు అమలులో భాగంగా సోమవారం డీజీపీ కార్యాలయంలో తెలంగాణ పోలీసులు, ఇండియన్ పోలీస్ ఫౌండేషన్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, స్థానిక పరిస్థితులపై అధ్యయనంతోపాటు ఇతర రాష్ట్రాల పోలీస్ శాఖలలో అమలవుతున్న ఉత్తమ పద్ధతులు, ఎస్ఓపీ (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్) తెలుసుకునేందుకు దీనిద్వారా వీలవుతుందన్నారు. తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్, ఐపీఎఫ్ ప్రాజెక్ట్ రాష్ట్ర నోడల్ ఆఫీసర్ అభిలాషా బిస్త్ మాట్లాడుతూ, భవిష్యత్ పోలీసింగ్ వ్యవస్థను నిర్మించేందుకు ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుందని తెలిపారు. ఐపీఎఫ్ అధ్యక్షుడు ఓం ప్రకాశ్‌సింగ్, ఐపీఎఫ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఇష్‌కుమార్ ప్రాజెక్టు ఉపయోగాలను వివరించారు. ఈ ప్రాజెక్ట్ కోసం సైబరాబాద్ కమిషనరేట్‌లోని 15 పోలీస్ స్టేషన్లు, సంగారెడ్డి జిల్లాలోని 15 పోలీస్ స్టేషన్లు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఐపీఎఫ్ కార్యనిర్వాహక కమిటీ సభ్యులు దుర్గా ప్రసాద్, శరత్ కుమార్, టీజీసీఎస్బీ డైరెక్టర్ శిఖా గోయల్, అదనపు డీజీలు మహేశ్ భగవత్, అనిల్ కుమార్, సైబరాబాద్ సీపీ అవినాశ్ మొహంతి, ఐజీలు ఎస్.చంద్రశేఖర్ రెడ్డి, ఎం.రమేశ్, తఫ్సీర్ ఇక్బాల్, సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎంబీబీఎస్ వెబ్ ఆప్షన్స్



- 18వ తేదీ రాత్రి 11.30 గంటల వరకు గడువు.. ఎంబీబీఎస్ మొదటి దశ కౌన్సెలింగ్ నోటిఫికేషన్ విడుదల
- మొదటి దశలో పాల్గొంటేనే తర్వాతి దశలకు అనుమతి.. సీటు వచ్చి చేరకపోయినా తర్వాత దశకు నో చాన్స్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కళాశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఎంబీబీఎస్ కోర్సుల్లో కన్వీనర్ కోటా కింద ప్రవేశానికి సంబంధించి మొదటి దశ వెబ్ కౌన్సెలింగ్ నోటిఫికేషన్ సోమవారం విడుదలైంది. యూనివర్సిటీ ప్రకటించిన తుది మెరిట్ లిస్ట్‌లో ఉన్న ర్యాంకర్లు మంగళవారం ఉదయం 6 గంటల నుంచి ఈ నెల 18 రాత్రి 11.30 గంటల వరకు వెబ్ ఆప్షన్లను పెట్టుకొనేందుకు అవకాశం కల్పించారు. అభ్యర్థులు https://tsmedadm.tsche.in వెబ్‌సైట్ ద్వారా ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ పరిధిలోని 35 వైద్య కళాశాలలతోపాటు ఈఎస్ఐసీ, ప్రైవేటు, అన్ ఎయిడెడ్, మైనారిటీ, నాన్ మైనారిటీ కళాశాలలన్నింటిలో ఈ కౌన్సెలింగ్ ద్వారా సీట్లు భర్తీ చేస్తారు. కాగా, కరీంనగర్‌లోని చల్మెడ ఆనందరావు మెడికల్ కాలేజీలో అడ్మిషన్లు హైకోర్టు తుది తీర్పునకు లోబడి ఉంటాయని యూనివర్సిటీ ప్రకటించింది.

మొదటి దశలో పాల్గొనకుంటే తర్వాత నో చాన్స్

తొలిదశ కౌన్సెలింగ్‌లో వెబ్ ఆప్షన్లు పెట్టుకోని అభ్యర్థులు తరువాత విడతలకు అర్హులు కాదని వర్సిటీ స్పష్టంచేసింది. ఒకసారి సీటు పొందిన విద్యార్థి అందులో చేరకపోయినా తర్వాతి దశ కౌన్సెలింగ్‌లో పాల్గొనే అవకాశం ఉండదని పేర్కొంది. ముస్లిం మైనారిటీ మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటా సీట్లను ముస్లిం మైనారిటీ విద్యార్థులకు మాత్రమే కేటాయిస్తారు. సీటు కేటాయింపుపై యూనివర్సిటీ నుంచి విద్యార్థి రిజిస్టర్డ్ ఫోన్ నంబర్‌కు ఎస్ఎంఎస్ వస్తుంది. ఆ తర్వాత విద్యార్థులు ఆన్‌లైన్‌లో అలాట్‌మెంట్ ఆర్డర్ డౌన్‌లోడ్ చేసుకొని, సంబంధిత కాలేజీలో నిర్ణయించిన గడువులోగా ఒరిజినల్ సర్టిఫికెట్లు, బాండ్లు సమర్పించి ఫీజు చెల్లించాలి. కాలేజీ స్థాయిలో ఒరిజినల్ సర్టిఫికెట్ల తుది పరిశీలన జరగనుంది. ఏవైనా లోపాలు బయటపడితే సీటు రద్దవుతుంది.

ఫీజు వివరాలు

ప్రతి విద్యార్థి యూనివర్సిటీ ఫీజు రూ.12,000 ఆన్‌లైన్ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. సీటు లభించిన ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో వార్షిక ట్యూషన్ ఫీజు రూ.10,000. ప్రైవేట్ కళాశాలలు, ఈఎస్ఐసీ కాలేజీల్లో రూ.60,000 చెల్లించాల్సి ఉంటుంది.

సందేహాల నివృత్తికి సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

టెక్నికల్ సహాయం కోసం: 9392685856, 7842136688, 9059672216; నిబంధనల వివరణ కోసం: 7901098840, 490585796; పేమెంట్ సమస్యల కోసం: 9618240276

బీఎస్సీ నర్సింగ్ కన్వీనర్ కోటా అడ్మిషన్లకు దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం (కేఎన్ఆర్‌యూహెచ్ఎస్) 2025–26 విద్యాసంవత్సరానికి బీఎస్సీ (నర్సింగ్) 4 ఏళ్ల డిగ్రీ కోర్సులో కన్వీనర్ కోటా కింద ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానించింది. టీజీ–ఈఏపీసెట్–2025 క్వాలిఫై అయిన విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ నర్సింగ్ కళాశాలల్లో సీట్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. మంగళవారం (నేడు) ఉదయం 9 గంటల నుంచి ఈనెల 30 సాయంత్రం 5 గంటల వరకు వెబ్‌సైట్ https://tsparamed.tsche.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

అర్హతలు: అభ్యర్థి భారత పౌరుడై ఉండాలి. తెలంగాణలో కనీసం 4 ఏళ్లు చదివి ఉండాలి లేదా నివాసం ఉండాలి. ఇంటర్మీడియెట్ (బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ)లో కనీసం 45 శాతం మార్కులు సాధించి ఉండాలి. (ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 40 శాతం సరిపోతుంది). టీజీ–ఈఏపీసెట్–2025లో అర్హత సాధించాలి. 2025, డిసెంబర్ 31 నాటికి కనీసం 17 సంవత్సరాలు పూర్తై ఉండాలి. గరిష్ట వయసుకు పరిమితి లేదు.

ఈఏపీ సెట్ కట్‌ఆఫ్ మార్కులు

ఓసీ/ఈడబ్ల్యూఎస్:50 పర్సంటైల్ (40,599 ర్యాంకు లోపు), ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీడబ్ల్యూడీ: 40 పర్సంటైల్ (48,718 ర్యాంకు లోపు), ఓసీ–పీడబ్ల్యూడీ: 45 పర్సంటైల్ (44,658 ర్యాంకు లోపు) ● ఓసీ/బీసీ విద్యార్థులకు రూ.2,500, ఎస్సీ/ఎస్టీలకు రూ.2,000 (ఆన్‌లైన్ పేమెంట్ ద్వారా మాత్రమే) ● సాంకేతిక సహాయం కోసం: 9392685856, 7842136688, 9059672216, ఇమెయిల్: tsparamed.tech@gmail.com ద్వారా సంప్రదించవచ్చు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.




'సీజనల్' కష్టాలు

సీజనల్ వ్యాధులు పంజా విసురుతున్నాయి. ఆస్పత్రులకు రోగులు పోటెత్తుతున్నారు. సోమవారం ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి కిటకిటలాడింది. ఆదివారం ఓపీ లేకపోవడం.. సీజనల్ వ్యాధుల వ్యాప్తి నేపథ్యంలో సోమవారం ఉదయమే ఆస్పత్రిలో జనం బారులుదీరారు. దీంతో ఓపీ కౌంటర్ల వద్ద చీటీలు తీసుకునేందుకు గంటల తరబడి క్యూలో నిల్చోవాల్సి వచ్చింది. మాతాశిశు ఆరోగ్య కేంద్రం ఓపీ వద్ద కూడా రద్దీ నెలకొంది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

గోడు వింటున్నారు.. పరిష్కారం చూపుతున్నారు

ప్రవాసుల పాలిట వరంగా మారిన ప్రవాసీ ప్రజావాణి

కార్యక్రమం ప్రారంభమై నేటికి ఏడాది పూర్తి

ప్రతి మంగళ, శుక్రవారాల్లో ప్రవాసీ ప్రజావాణి నిర్వహణ

ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ చిన్నారెడ్డి, మున్సిపల్ శాఖ డైరెక్టర్ దివ్యా దేవరాజన్ పర్యవేక్షణ

ఆశ్రయిస్తున్న తెలంగాణ వలస బాధిత కుటుంబాలు


ప్రవాసీ ప్రజావాణి ఆరంభ సమయంలో అభ్యర్థనలను స్వీకరిస్తున్న మంత్రి పొన్నం (ఫైల్)



ప్రవాసీ ప్రజావాణి బ్రోచర్

మోర్తాడ్ (బాల్కొండ): కరీంనగర్‌కు చెందిన రాహుల్ రావు ఉన్నత చదువుల కోసం లండన్ వెళ్లాడు. దురదృష్ట వశాత్తు అతను అక్కడ బ్లడ్ కేన్సర్‌కు గురయ్యాడు. అతనికి బోన్‌మ్యారో చికిత్స చేయాల్సి ఉంది. అతని రక్తం పంచుకుని పుట్టిన వారే తమ వారి శరీరంలో నుంచి ఎముకను ఇస్తేనే రాహుల్ బతికి బట్టకట్టగలడని వైద్యులు స్పష్టం చేశారు. రాహుల్ సోదరుడు రుతిక్‌రావు అందుకు సిద్ధం కావడంతో అతను లండన్ వెళ్లడానికి, వైద్య ఖర్చుల కోసం ప్రవాసీ ప్రజావాణిలో రాహుల్ తల్లి మంగ అభ్యర్థన పత్రం అందించింది. వెంటనే స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం రాహుల్‌రావు సోదరుడు లండన్ వెళ్లడానికి అవసరమైన ఏర్పాట్లు చేయించడంతో పాటు ఖర్చు కోసం రూ.10 లక్షలను మంజూరు చేసింది. ప్రవాసీ ప్రజావాణి వినతికి స్పందించిన జిల్లా కలెక్టర్ కూడా తన విచక్షణాధికారాలను ఉపయోగించి రూ.లక్ష సాయం మంజూరు చేశారు. ప్రవాసీ ప్రజావాణి ద్వారానే తమ కుటుంబానికి రూ.11 లక్షల సాయం అందిందని రాహుల్ కుటుంబ సభ్యులు వెల్లడించారు.

గంగయ్యకూ విముక్తి

నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం కొడిచెర్లకు చెందిన కంచు గంగయ్య 18 ఏళ్లుగా బహ్రెయిన్‌లో ఉండిపోయాడు. అతను ఇంటికి రావడానికి పాస్‌పోర్టు లేకపోవడం, పరాయి దేశంలో సాయం చేసేవారు లేకపోవడంతో గంగయ్య భార్య లక్ష్మి ప్రవాసీ ప్రజావాణిలో వినతి పత్రం సమర్పించింది. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి విదేశాంగ శాఖతో, బహ్రెయిన్‌లోని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో మాట్లాడటంతో గంగయ్య ఇటీవల ఇంటికి చేరుకున్నాడు. తాము చూస్తామో చూడమో అనుకున్న వ్యక్తి 18 ఏళ్ల నిరీక్షణ తర్వాత ఇంటికి చేరడానికి ప్రవాసీ ప్రజావాణి మార్గం చూపిందని గంగయ్య కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఇలా రాహుల్, గంగయ్యలకే కాదు గల్ఫ్ దేశాలతో పాటు ఇతర దేశాల్లో ఉన్న తెలంగాణ వాసులు ఎలాంటి కష్టాల్లో ఉన్నా ప్రవాసీ ప్రజావాణి పరిష్కారం చూపే దిశగా అడుగులు వేస్తోంది. 2024, సెప్టెంబర్ 16న హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే భవన్‌లో ప్రారంభించిన ప్రవాసీ ప్రజావాణితో ప్రవాసులైన తెలంగాణ వాసులకు వరంగా మారిందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ప్రతి మంగళ, శుక్రవారాల్లో ప్రవాసీ ప్రజావాణి నిర్వహిస్తున్నారు. తెలంగాణలోని ఏ మూలన ఉన్న వారైనా తమవారు విదేశాల్లో ఏమైనా ఇబ్బంది పడితే వారి సమస్యను ప్రవాసీ ప్రజావాణి దృష్టికి తీసుకెళ్తే పరిష్కారం లభిస్తుండటం విశేషం. ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ దివ్యా దేవరాజన్ ప్రవాసీ ప్రజావాణిని పర్యవేక్షిస్తున్నారు. వీరితో పాటు ఎన్నారై అడ్వైజరీ బోర్డు చైర్మన్ బీఎం వినోద్‌కుమార్, వైస్‌చైర్మన్ మంద భీంరెడ్డి, ఇతర సభ్యులు ప్రవాసీ ప్రజావాణిలో పాల్గొంటూ వలస కార్మికుల కుటుంబ సభ్యులు ఇచ్చే వినతులను స్వీకరిస్తున్నారు. ఇప్పటి వరకు వందకు పైగా కుటుంబాల వినతులకు ప్రవాసీ ప్రజావాణి పరిష్కారం చూపడం ఎంతో ఊరటనిచ్చే విషయం. గతంలో గల్ఫ్ దేశాల్లో ఎవరైనా మరణిస్తే వారి మృతదేహాలు ఇంటికి చేరడానికి నెలల సమయం పట్టేది. ప్రవాసీ ప్రజావాణిలో వినతిపత్రం సమర్పిస్తే అధికార యంత్రాంగం స్పందించి వారం, పది రోజుల వ్యవధిలోనే కడసారి చూపు దక్కేలా చేస్తోంది. ఆర్థిక అంశాలకు సంబంధించిన కార్యక్రమాలతో పాటు సామాజిక దృక్పథంతో ప్రజావాసీ ప్రజావాణిని కొనసాగిస్తుండటం వలసదారుల కుటుంబాలకు ఎంతో ధీమా ఇచ్చే కార్యక్రమం అని భీంరెడ్డి ఈ సందర్భంగా 'సాక్షి'తో చెప్పారు. వలసదారుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉందని చెప్పడానికి ప్రవాసీ ప్రజావాణి గొప్ప నిదర్శనమని తెలిపారు.

వలసదారుల జీవితాల్లో వెలుగులు



వలసదారుల జీవితాల్లో ప్రవాసీ ప్రజావాణి వెలుగులు నింపుతోంది. ప్రతి వారంలో రెండు రోజుల పాటు ప్రవాసీ ప్రజావాణిని నిర్వహించి వినతులను స్వీకరిస్తుండటం ఎంతో గొప్ప విషయం. వలస కార్మికులకు మేమున్నాం అనే ధీమాను ప్రభుత్వం ఇవ్వడం ఇదే మొదటిసారి.

- రంగు సుధాకర్‌గౌడ్, ఎన్నారై, లండన్

ఎన్నికల వేళ కొత్త రైళ్ల కూత

బిహార్ ఎన్నికల నేపథ్యంలో కొత్తవి ప్రారంభం

తెలుగు రాష్ట్రాల ప్రయాణికులకు ఊరట


అమృత్ భారత్ రైలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: బిహార్ అసెంబ్లీ ఎన్నికల పుణ్యమా అని దక్షిణ మధ్య రైల్వే పరిధిలో తెలుగు రాష్ట్రాల ప్రయాణికులకు మేలు జరుగుతోంది. ఆ రాష్ట్ర శాసనసభ ఎన్నికల వేళ కేంద్ర ప్రభుత్వం పలు కొత్త రైళ్లు ప్రారంభిస్తోంది. అలాగే పాత రైళ్లకు పలు స్టేషన్లలో హాల్ట్‌ల పునరుద్ధరణ, స్టేషన్ల పొడిగింపు ఇస్తున్నారు. దీంతో బల్లర్షా–కాజీపేట, సికింద్రాబాద్, విజయవాడ, తిరుపతి, చెన్నై వరకు పలు రైళ్లు అందుబాటులోకి వస్తున్నాయి. ఉద్యోగ, ఉపాధి నిమిత్తం బిహార్ నుంచి నిత్యం వేలాది మంది తెలుగు రాష్ట్రాలకు వలసలు సాగిస్తున్నారు. వ్యవసాయ కూలీల నుంచి అసంఘటిత రంగ, నైపుణ్య పనుల్లోనూ బిహారీల సంఖ్య పెరుగుతోంది. దీంతో ఉత్తరభారత దేశం నుంచి వచ్చే రైళ్లన్నీ వలస జీవులతో కిక్కిరిసి ఉంటున్నాయి. దీంతో ఆయా స్టేషన్లలో స్థానిక ప్రయాణికులు ఎక్కాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. ఎన్నికల ముందు వలస వెళ్లే బిహారీల కోసమే ఏడు 'అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్'లు ప్రవేశపెట్టడం గమనార్హం. వీటిలో జోగ్బని నుంచి చెన్నైలోని ఈరోడ్ వరకు ప్రారంభించిన కొత్త రైలు తెలుగు రాష్ట్రాల స్టేషన్లలో హాల్ట్ ఉంది. ఇక ముజఫర్‌పూర్ నుంచి సికింద్రాబాద్ వరకు మరో నూతన రైలును నడుపుతున్నారు. ఈ రైళ్లు ప్రత్యేకించి వలస కూలీల కోసమే కేటాయించారు. వీటిలోని 22 బోగీల్లో అత్యధికంగా 12 జనరల్ బోగీలతో నడుపుతున్నారు. ఇక పాటలీపుత్ర నుంచి ఎస్ఎంవీటీ బెంగళూరు వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను సహర్స జంక్షన్ వరకు పొడిగించారు. గత ఆరేళ్లుగా రక్సాల్ నుంచి సికింద్రాబాద్ వరకు స్పెషల్ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌గానే నడుపుతున్న రైలును తిరుపతి వరకు పొడిగించారు. ఈ రైళ్లకు కాజీపేట, వరంగల్, రామగుండం, మంచిర్యాలతో పాటు కీలకమైన సికింద్రాబాద్, విజయవాడ జంక్షన్లలోనూ హాల్టింగ్ పాయింట్లు ఇవ్వడంతో ఆయా స్టేషన్ల పరిధిలోని స్థానికులకు ఉపయుక్తం కానుంది.

'రీయింబర్స్‌మెంట్' బకాయిలు వెంటనే విడుదల చేయాలి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలంటూ ప్రైవేట్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్లు చేస్తున్న డిమాండ్‌కు బీజేపీ మద్దతు ప్రకటించింది. సోమవారం బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు మీడియాతో మాట్లాడుతూ, విద్యా వ్యవస్థను కాపాడడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని, ఫీజు బకాయిల విడుదలతో పాటు కొత్త భవనాల నిర్మాణం వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. కాలేజీలకు భారీగా ఫీజు బకాయిలు పెరగడంతో, ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితులు ఏర్పడ్డాయని, రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ కాలేజీలు తాత్కాలికంగా మూసివేయాల్సిన పరిస్థితికి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాల కారణంగా ఈ పరిస్థితి తలెత్తిందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలకోసం కాంగ్రెస్ సర్కార్ రెండేళ్లుగా ఒక్క పైసా కూడా విడుదల చేయలేదని ఆయన మండిపడ్డారు.

సర్కారు తీరుతో ప్రశ్నార్థకంగా విద్యార్థుల భవిష్యత్తు: గెల్లు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించక 13 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ తెలిపారు. నేటి నుంచి నిరసనలు, నిరాహార దీక్షలు, నిరవధిక బంద్‌లు చేయనున్నట్లు ప్రకటించినప్పటికీ ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడం లేదని సోమవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, పీజీ, ఫార్మసీ, బీఈడీ, ఎంబీఏ, ఎంసీఏ, ఇంజనీరింగ్ విద్యాసంస్థలు అప్పుల భారంతో మూతపడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. గురుకులాలను గాలికి వదిలి.. రూ.25 వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు టెండర్లు, మూసీ సుందరీకరణకు లక్షయాభై వేల కోట్ల టెండర్లు ఎలా వేస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు.

ఆరోపణల నిరూపణలో టీఎంసీ విఫలం

ఆయుష్ వైద్యులపై కేసులు కొట్టివేసిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: సైబరాబాద్, సంగారెడ్డి పోలీస్ స్టేషన్లలో ఆయుష్ వైద్యులపై నమోదైన కేసుల్లో మోసం, వంచన అభియోగాలను నిరూపించడంలో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ (టీఎంసీ) విఫలమైందని హైకోర్టు అభిప్రాయపడింది. ఆ మేరకు ఆధారాలను సమర్పించలేకపోయిందని స్పష్టం చేసింది. ఈ ఏడాది మేలో తనిఖీలు నిర్వహించిన పిటిషనర్లపై నమోదు చేసిన కేసులను కొట్టివేసింది. వారి పిటిషన్లను అనుమతించింది. చట్టవిరుద్ధంగా అల్లోపతి వైద్యం చేస్తున్నారన్న ఆరోపణల మేరకు దాడులు నిర్వహించిన టీఎంసీ కొందరు ఆయుర్వేద వైద్యులపై కేసులు నమోదు చేసింది. అలాగే శాఖాపరమైన చర్యలు తీసుకునే ప్రక్రియ చేపట్టింది. ఈ కేసులను సవాల్ చేస్తూ లోకేశ్ సహా మరికొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై జస్టిస్ ఎస్.తుకారాంజీ విచారణ జరిపారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పోలీసులకు ఫిర్యాదు చేయడానికి టీఎంసీకి అధికారం లేదని, చర్యలు తీసుకునే అధికారం ఆయుష్ కమిషనర్‌కు మాత్రమే ఉంటుందన్నారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లు ఆయుర్వేదంలో అర్హత సాధించి.. నిబంధనలకు విరుద్ధంగా అల్లోపతి వైద్యం అందిస్తున్నారని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. టీఎంసీ వైఖరిని తప్పుబట్టారు. పిటిషనర్లపై చర్య తీసుకోవడానికి ఆయుష్ కమిషనర్‌కు మాత్రమే అధికారం ఉందన్నారు.

సెప్టెంబర్ 17 గురించి మాట్లాడే అర్హత బీజేపీకి లేదు

ముమ్మాటికీ అది విలీన దినోత్సవమే: మాజీ ఎంపీ వీహెచ్



సాక్షి, హైదరాబాద్: నిజాం సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసిన సెప్టెంబర్ 17 గురించి మాట్లాడే అర్హత బీజేపీ నేతలకు ఎక్కడిదని సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు (వీహెచ్) ప్రశ్నించారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన రోజే ప్రజలకు విమోచనం కలిగిందని, ఆ తర్వాత సంస్థానాల విలీనం జరిగిందని తెలిపారు. బీజేపీ నేతలు చెప్తున్నట్టు విమోచనమే జరిగిందనుకున్నా.. అప్పుడు బీజేపీ ఎక్కడుందో చెప్పాలని ఎద్దేవా చేశారు. నాడు స్వాతంత్య్రం కోసం గాంధీ ఆలోచనలతో నెహ్రూ, పటేల్, మౌలానా లాంటి మహనీయులు కృషి చేస్తే హైదరాబాద్‌ను భారత్‌లో విలీనం చేశారన్నారు. జమలాపురం కేశవరావు, స్వామి రామానంద తీర్థ, పీవీ నరసింహారావు పోరాడారని చెప్పారు. ఏదో ప్రచారం కోసం రాజ్‌నాథ్ సింగ్‌ను పిలిపించి సెప్టెంబర్ 17న హడావుడి చేయాలని బీజేపీ చూస్తోందని, కానీ సెప్టెంబర్ 17 ముమ్మాటికీ విలీన దినోత్సవమేనని పేర్కొన్నారు. పహల్గాం గాయం మానకముందే పాకిస్తాన్‌తో క్రికెట్ మ్యాచ్ ఆడించిన వారే ఉగ్రవాదులను ప్రోత్సహిస్తున్నట్టు అభిప్రాయపడాల్సి ఉంటుందని వీహెచ్ వ్యాఖ్యానించారు.

పారిశ్రామిక మురుగునీటి నిర్వహణలో భేష్

- ఉత్తమ పనితీరు కనబరుస్తున్న రాష్ట్రాల్లో ఒకటిగా తెలంగాణ
- 98% పరిశ్రమలు మురుగునీటి శుద్ధి ప్రమాణాలు పాటిస్తున్నాయి...
- మొత్తం 2,179 పరిశ్రమల్లో 2,142 పరిశ్రమలు నిబంధనలను పూర్తిగా పాటిస్తున్నాయి...
- కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ గణాంకాల్లో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: పారిశ్రామిక మురుగునీటి నిర్వహణలో దేశంలోనే ఉత్తమ పనితీరు కనబరుస్తున్న రాష్ట్రాలలో తెలంగాణ ఒకటిగా నిలుస్తోంది. దక్షిణాసియాలోనే వందశాతం రోజువారీ మురుగునీటిని శుద్ధి చేసే నగరాల్లో ఒకటిగా హైదరాబాద్‌ను నిలపాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఇందుకు అనుగుణంగా భారీ ప్రాజెక్టులతో తెలంగాణ వ్యాప్తంగా మురుగునీటి శుద్ధిలో అగ్రగామిగా నిలిచే దిశలో అడుగులు వేస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలో గుర్తింపు పొందిన 2,180 పరిశ్రమల్లో 98 శాతం కంటే ఎక్కువ పరిశ్రమలు ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లను (ఈటీపీలు) ప్రమాణాల మేరకు అమలుచేస్తున్నాయి. కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ అధికారిక డేటా ప్రకారమే... రాష్ట్రంలో ఈటీపీల స్థాపన, వాటి ఆపరేషన్‌లో దాదాపు సార్వత్రిక రేటును సాధించడం ద్వారా జాతీయంగా ఉత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాలలో ఒకటిగా తెలంగాణ నిలుస్తోంది. ఈటీపీలు అవసరమయ్యే దాదాపు అన్ని పరిశ్రమలు ఇప్పుడు క్రియాత్మక యూనిట్లతో పనిచేస్తున్నాయి... వీటిలో 2,142 పరిశ్రమలు నిర్దేశించిన మురుగునీటి విడుదల నిబంధనలను పూర్తిగా పాటిస్తున్నాయి, అయితే 37 పరిశ్రమల్లో ఇంకా కొన్ని లోపాలు అధిగమించాల్సి ఉందని తెలుస్తోంది.

ఇతర రాష్ట్రాలతో పోలిస్తే...

ఇతర రాష్ట్రాలతో పోల్చి చూస్తే... తమిళనాడు, ఢిల్లీ, మధ్యప్రదేశ్, కేరళ వంటి రాష్ట్రాలు 100 శాతం సాధనతో తెలంగాణ కంటే కొంచెం ముందున్నాయి. మహారాష్ట్ర (98.1%), కర్ణాటక (94.2%) కూడా బలమైన పనితీరును కనబరుస్తుండగా, ఇతర విషయాల్లో కొన్ని పాయింట్లు వెనుకబడి ఉన్నాయి. మరోవైపు... పంజాబ్ (89.5%), ఒడిశా (90.2%) వంటి రాష్ట్రాలు అమలులో లోపాలను ఎదుర్కొంటున్నాయి. అస్సాం (58.3%), పశ్చిమ బెంగాల్ (54.5%) జాబితాలో అట్టడుగున నిలుస్తున్నాయి, అక్కడ పరిశ్రమలలో దాదాపు సగం చికిత్స నిబంధనలను పాటించడంలో విఫలమవుతున్నాయి. ఇతర పారిశ్రామిక రాష్ట్రాలతో పోల్చినప్పుడు రాష్ట్రం సాధించిన విజయం ప్రత్యేకంగా నిలుస్తోంది. మహారాష్ట్రలో 9,925 పరిశ్రమలకు ఈటీపీలు అవసరం కాగా 190 నిబంధనలు పాటించని యూనిట్లు నమోదయ్యాయి. గుజరాత్‌లో 143 కేసులు నమోదయ్యాయి. అత్యధిక సంఖ్యలో పరిశ్రమలు (13,199) ఉన్న తమిళనాడులో పూర్తి ఈటీపీ కవరేజ్ ఉన్నప్పటికీ 48 మంది ఉల్లంఘనదారులు నమోదయ్యారు.

జెడ్ఎల్‌డీ అమలు ఎప్పుడు?

తెలంగాణ రాష్ట్రం మంచినీటి వనరుల సంరక్షణకు, శీతలీకరణ, నిర్మాణం, తోటపని కోసం శుద్ధి చేసిన మురుగునీటిని తిరిగి ఉపయోగించడాన్ని ప్రోత్సహిస్తోంది. ద్రవ వ్యర్థాలను తొలగించే వ్యవస్థ అయిన జీరో లిక్విడ్ డిశ్చార్జ్ (జెడ్ఎల్‌డీ) కోసం రూపొందించిన మరిన్ని సౌకర్యాలను రాష్ట్రం అమలు చేయాల్సిన అవసరం ఉందని భావిస్తున్నారు. పటాన్‌చెరు వంటి చారిత్రాత్మకంగా కలుషితమైన ప్రాంతాలలో నివసించేవారు, కాగితాలపై అంకెలు బాగున్నప్పటికీ, నీటి కాలుష్య నివారణకు నిరంతర పర్యవేక్షణ, అప్రమత్తత అవసరాన్ని నొక్కి చెబుతున్నారు.


సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర


సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎంపీ డీకే అరుణ

సోయగాల హోరు సీలేరు

ప్రకృతి సహజసిద్ధ అందాలకు నెలవు సీలేరు. ఎటు చూసినా ప్రకృతికి పచ్చని చీర కట్టినట్లుగా పచ్చదనంతో కొండలు.. వీటి మధ్య వెలుగులు విరజిమ్మే అల్లూరి జిల్లా లోని సీలేరు జల విద్యుత్ కేంద్రం.. ఉత్పాదనకు నీరందించే గుంటవాడ జలాశయం.. పాలనురగ మాదిరిగా వేల అడుగుల ఎత్తునుంచి జాలువారే జలపాతాలు.. ఇలాంటి అందాలు చూడాలంటే సీలేరు సందర్శించాల్సిందే. వీటిని తిలకించేందుకు తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశా నుంచి సందర్శకులు తరలివస్తుంటారు. ప్రకృతి అందాలను తిలకించిన అనంతరం ధారాలమ్మ తల్లిని దర్శించుకుని వెళ్తుంటారు. మరువలేని అనుభూతిని పొందుతుంటారు.

- సీలేరు


జాలువారుతున్న తురాయి జలపాతం


వెలుగులు నింపుతున్న సీలేరు జలవిద్యుత్ కేంద్రం


గుంటవాడ జలాశయం

క్లుప్తంగా...

విద్యుత్ సంస్థల్లో ఇంజనీర్స్ దినోత్సవం

ఆంధ్రప్రదేశ్ పవర్ ట్రెండ్స్ న్యూస్ లెటర్ ఆవిష్కరణ

సాక్షి,అమరావతి: ఏపీ ఎస్ఈబీ ఇంజనీర్ల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 'ఆంధ్రప్రదేశ్ పవర్ ట్రెండ్స్' అనే న్యూస్ లెటర్‌ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. భారత రత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని ఇంజనీర్స్ డే సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సీఎస్ పాల్గొన్నారు. 2030 నాటికి 50 శాతం పునరుత్పాదక ఇంధన సామర్థ్యం రాష్ట్ర లక్ష్యమని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఏపీ ఎస్ఈబీ ఇంజనీర్ల సంఘం అధ్యక్షుడు ఎస్. సామ్యేల్, అసోసియేట్ ప్రెసిడెంట్ కె.వెంకట రామారావు, సెక్రటరీ జనరల్ కె. నాగప్రసాద్, అదనపు సెక్రటరీ జనరల్ డి.నాగరాజు, ఇతర ఇంజనీర్లు పాల్గొన్నారు. అలాగే విద్యుత్ సౌధలో ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.ఎస్. చక్రధర్‌బాబు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపి ట్రాన్స్ కో, ఏపీ జెన్‌కో డైరెక్టర్లు, ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సింధు, కిడాంబి, జ్యోతి సురేఖ ప్రొబేషన్ పూర్తి

సాక్షి, అమరావతి: స్పోర్ట్స్ కోటాలో డిప్యూటీ కలెక్టర్లుగా నియమితులైన బ్యాడ్మింటన్ స్టార్ల ప్రొబేషన్ గడువు పూర్తయినట్లు ప్రభుత్వం ధ్రువీకరించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. పీవీ సింధు 2017 ఆగస్టు 9న విధుల్లో చేరగా, 2019 ఆగస్టు 8 నుంచే ఆమె ప్రొబేషన్ పూర్తయినట్లు తెలిపింది. కిడాంబి శ్రీకాంత్ 2018 మార్చి 29న విధుల్లో చేరగా 2020 జూలై 3 నాటికి ప్రొబేషన్ పూర్తయ్యిందని, వి.జ్యోతి సురేఖ 2022 డిసెంబర్ 19న బాధ్యతలు స్వీకరించగా 2024 డిసెంబర్ 18న ఆమె ప్రొబేషన్ పూర్తయినట్లు పేర్కొంది.

50 లక్షల టన్నుల ధాన్యం సేకరణకు కేంద్రం అనుమతి

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వం ఈ ఖరీఫ్‌లో 50 లక్షల టన్నుల ధాన్యం సేకరణకు అనుమతి ఇచ్చిందని పౌరసరఫరాల శాఖ ఎక్స్‌అఫీషియో కార్యదర్శి సౌరబ్‌గౌర్ చెప్పారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. గత ఖరీఫ్‌లో 35.90 లక్షల టన్నుల ధాన్యం సేకరించినట్లు తెలిపారు. ఈ ఖరీఫ్‌లో సేకరించే 50 లక్షల టన్నుల ధాన్యంలో 30 లక్షల టన్నులు రాష్ట్ర ప్రజా పంపిణీ అవసరాలకు వినియోగించనున్నట్లు చెప్పారు. మిగిలిన 20 లక్షల టన్నులు ఎఫ్‌సీఐకి ఇస్తామన్నారు. రాష్ట్రంలో సుమారు 3,500 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరిస్తామన్నారు.

అపరాల సేకరణకు నోడల్ ఏజెన్సీగా మార్క్‌ఫెడ్

సాక్షి, అమరావతి: ఖరీఫ్ 2025 మార్కెటింగ్ సీజన్‌లో ధరలు పతనమైన సందర్భంలో కందులు, పెసలు, మినుములు, జొన్నలు, సజ్జలు, మొక్కజొన్న, రాగులు, కొర్రలు, వేరుశనగ వంటి పంటలకు ధరల మద్దతు స్కీమ్ (పీఎస్ఎస్) కింద మార్కెట్‌లో జోక్యం చేసుకొని రాష్ట్ర స్థాయిలో సేకరణ కోసం నోడల్ ఏజెన్సీగా మార్క్‌ఫెడ్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ సోమవారం ఉత్తర్వులిచ్చారు.

వలంటీర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులపై ప్రభుత్వం పని భారం పెంచడం మానుకుని వెంటనే వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ అనుబంధ వలంటీర్ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొమ్ము సురేష్ బాబు డిమాండ్ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వ రాకతో రెండున్నర లక్షల మంది వలంటీర్లు రోడ్డునపడ్డారని విమర్శించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రజలకు సంక్షేమ పథకాలు గడప వద్దకే చేర్చాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చెయ్యడం భావ్యం కాదని హితవుపలికారు.

వచ్చేనెల 2న ముగియనున్న ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్ పదవీ కాలం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఎ.అనురాధ పదవీకాలం వచ్చే నెల 9 నాటికి పూర్తవుతుందని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి అయిన అనురాధను కూటమి ప్రభుత్వం గతేడాది అక్టోబర్ 23న ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్‌గా నియమించింది.

పచ్చదనం బొగ్గుపాలు

యథేచ్ఛగా బొగ్గు బట్టీల ఏర్పాటు

అధికార పార్టీ నేతల అండతో దోపిడీ

పర్మిట్ల ముసుగులో అక్రమాలు

'మామూలు'గా పోతున్న అటవీశాఖ అధికారులు



రాయదుర్గం/కుందుర్పి: పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వాలు రూ.కోట్లు వెచ్చిస్తుంటే... కొందరు స్వార్థపరులు ఆ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు. అటవీ శాఖ అనుమతులు లేకుండా బొగ్గుబట్టీలు నిర్వహిస్తూ పచ్చదనాన్ని 'బొగ్గు'పాలు చేస్తున్నారు. పెద్ద పెద్ద చెట్లను నేలకూలుస్తున్నారు. విలువైన కలపను బొగ్గుగా మార్చి రూ.లక్షలు కొల్లగొడుతున్నారు. అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతాల్లో కొందరు యథేచ్ఛగా బొగ్గు బట్టీలు నిర్వహిస్తున్నా అటవీశాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. అధికార పార్టీ నాయకుల అండతోనే బొగ్గుల బట్టీల నిర్వాహకులు దోపిడీ చేస్తున్నారని, అందుకే అటవీ శాఖ అధికారులు 'మామూలు'గా తీసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నిబంధనలకు పాతర..

జిల్లాలో కళ్యాణదుర్గం, గుత్తి, అనంతపురం ఫారెస్ట్ రేంజ్‌లు ఉన్నాయి. గతంలో మూడు రేంజ్‌ల పరిధిలో అధికారికంగా నూతిమడుగు, సంతేకొండాపురం, వేపరాళ్ల, రచ్చుమర్రి, గార్లదిన్నె, సలకంచెరువు, పామిడి, చుక్కలూరు గ్రామాల్లో బొగ్గు బట్టీల ఏర్పాటుకు అనుమతులిచ్చారు. అయితే, వీటిలో కొన్నిచోట్ల గడువు ముగిసినా నేటికీ అలాగే కొనసాగిస్తున్నట్లు సమాచారం. కుందుర్పి, శెట్టూరు, గుమ్మఘట్ట, బ్రహ్మసముద్రం, కణేకల్లు, రాయదుర్గం మండలాల్లో ఇష్టారాజ్యంగా బొగ్గు బట్టీలు వెలిశాయి. అటవీ శాఖ అనుమతులున్న చోట కూడా తుమ్మ చెట్లు, వాటి మొద్దులు మాత్రమే కాల్చి బొగ్గుగా మార్చాలి. అయితే నిబంధనలకు పాతరేస్తూ విలువైన కలపను తరలిస్తూ బొగ్గుగా మారుస్తుండడం గమనార్హం.

పర్మిట్ల ముసుగులో దోపిడీ

ఒక్కో బొగ్గు బట్టీ డిపోకు పది పర్మిట్ల వరకు అటవీ శాఖ అధికారులు జారీ చేస్తారు. 30 కిలోల చొప్పున బొగ్గు బస్తాల్లో నింపి లారీలో 200 బస్తాల వరకు తరలించవచ్చు. ఈ లెక్కన పర్మిట్‌కు ఆరు టన్నుల చొప్పున తరలించే వెసులుబాటు ఉంటుంది. అయితే తక్కువ పర్మిట్లు పొంది ఎక్కువ బొగ్గు ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిసింది. ప్రతి నెలా 400 టన్నులకు పైగా అక్రమంగా బొగ్గు ఉత్పత్తి చేస్తున్నట్లు సమాచారం. టన్ను బొగ్గు రూ.20 వేల నుంచి రూ.25 వేల ప్రకారం విక్రయిస్తూ రూ.కోటికి పైగా కొల్లగొడుతున్నట్లు తెలిసింది.


రాయదుర్గం సమీపంలో బొగ్గులను బస్తాల్లో నింపిన దృశ్యం


కళ్యాణదుర్గం సమీపంలోని కామక్కపల్లి అటవీ ప్రాంతం నుంచి రాత్రి సమయంలో కలపను తరలిస్తున్న దృశ్యం

పచ్చని చెట్లు బుగ్గిపాలు



బొగ్గుల బట్టీల మాటున పచ్చని చెట్లను నేలకూల్చుతున్నారు. చెరువుల్లో కంపచెట్లు అంటూనే అటవీ ప్రాంతాల్లోని కలపను సైతం తరలిస్తున్నారు. బొగ్గు బట్టీలకు అనుమతులు ఇవ్వకూడదు. అడవులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది.

– తిప్పేస్వామి, జంబుగుంపల, కుందుర్పి మండలం

కంపచెట్లు మాత్రమే వాడాలి



ఇటుకల, బొగ్గుల బట్టీలు నిర్వహించేవారు కేవలం చెరువులు, గుట్టల్లో ఉన్న కంప చెట్లను మాత్రమే వాడాలి. అటవీశాఖ వారు గ్రామాలకు దూరంగా బట్టీలు నిర్వహించేలా చూడాలి. కుందుర్పి లో అర కిలోమీటరు దూరంలోనే బట్టీలు ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– మంజు, కుందుర్పి గ్రామం

లైసెన్సులు రద్దు చేస్తాం

ఎక్కడైనా చెట్లను నరకాలంటే నీరు–నేల–చెట్టు చట్టం ప్రకారం అనుమతులు పొందాలి. అనుమతి లేకుండా నరికితే జైలు శిక్ష తప్పదు. అటవీశాఖ అనుమతులు లేకుండా ఎక్కడైనా బొగ్గు బట్టీలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. బొగ్గు అమ్మకాలు జరపాలంటే అటవీ శాఖ అనుమతి తప్పనిసరి. ఏ చెట్టు నరికి బొగ్గుగా తయారు చేస్తున్నారనేది అనుమతి పత్రంలో చూపాలి. అనుమతి పొందిన బట్టీలపై కూడా ప్రత్యేక నిఘా ఉంచుతాం. తుమ్మ చెట్లు, వాటి మొద్దులు కాకుండా ఇతర ఏ కలప వినియోగించినా లైసెన్సులు రద్దు చేయిస్తాం.

– రామచంద్రుడు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, కళ్యాణదుర్గం

ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించండి

ముఖ్యమంత్రి చంద్రబాబుకు రైతు సంఘాలు డిమాండ్

సాక్షి, అమరావతి: అమెరికా సుంకాల వల్ల తీవ్రంగా నష్టపోతున్న ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించాలని సీఎం చంద్రబాబును ఏపీ ఆక్వా సంఘం, ఏపీ రైతు సంఘం, ఏపీ కౌలు రైతు సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఆయా సంఘాల నాయకులు బి.బలరామ్, వి.కృష్ణయ్య, ఎం.హరిబాబు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆక్వా రైతులను పట్టించుకోకుండా.. కేవలం ఎగుమతిదారులు, కంపెనీలకు రాయితీలు ఇవ్వాలంటూ కేంద్ర మంత్రులకు చంద్రబాబు లేఖలు రాయడం దారుణమని మండిపడ్డారు. రొయ్యల సాగుతో నష్టపోతున్న రైతులకు రాయితీలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. గత రేట్లకు, ప్రస్తుతమున్న ధరలకు మధ్య వ్యత్యాసాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బోనస్‌గా ఇవ్వాలన్నారు. జోన్, విస్తీర్ణంతో సంబంధం లేకుండా ఆక్వా సాగు చేసే ప్రతి రైతుకూ యూనిట్ రూ.1.50కే విద్యుత్ సరఫరా చేయాలన్నారు.

యూరియాకు ప్రత్యామ్నాయాలు అవసరం

వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు

సాక్షి, అమరావతి: తక్కువ ధరకు లభ్యమయ్యే యూరియాను రైతులు అధికంగా వినియోగిస్తున్నారని, దీనివల్ల నేల ఆరోగ్యం, సారం దెబ్బతింటోందని వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి ఢిల్లీరావు ఆందోళన వ్యక్తం చేశారు. యూరియాకు ప్రత్యామ్నాయాలు అవసరమని, ఆ దిశగా శాస్త్రీయ పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో రబీ–2025–26 క్యాంపయిన్‌పై ఢిల్లీలో జరిగిన 2 రోజుల వర్క్ షాపులో సోమవారం ఢిల్లీరావు మాట్లాడారు. నేల ఆరోగ్యం, ఫెర్టిలిటీ, సమతుల ఎరువుల వినియోగంపై మరింత దృష్టి సారించాలన్నారు. రైతులకు మేలు కలిగే విధంగా కలిసికట్టుగా వ్యూహాలను సిద్ధం చేయడానికి ఈ వర్క్‌షాపు ఎంతగానో దోహదపడుతుందని వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ కార్యదర్శి దేవేష్ చతుర్వేది అన్నారు. కార్యక్రమంలో ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మంగీలాల్ జాట్, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ పీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'అనంత' జానపద కళావైభవం

'అనంత' జానపద నృత్యం మరోసారి సరికొత్త చరిత్ర సృష్టించింది. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన కళాకారులు, విద్యార్థుల జానపద ప్రదర్శనలతో అనంతపురం లలితకళాపరిషత్తు సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు హోరెత్తింది. రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రంగస్థల సకలవృత్తి కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 'జానపద కళా వైభవం -2025' పేరిట నిర్వహించిన మహాబృంద నృత్యం ఆహూతులను ఆకట్టుకుంది. సంస్థ నిర్వాహకులు సురభి ఆనంద్, డ్యాన్స్‌మాస్టర్ రమేష్ సంయుక్త నేతృత్వంలో 2025 మంది కళాకారులు అనంతకే సొంతమైన జానపదాలను అద్భుతంగా ప్రదర్శించి అలరించారు. ఈ ప్రదర్శన తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, మిరాకిల్ వరల్డ్ రికార్డు, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు అయినట్టు నిర్వాహకులు తెలిపారు.

– అనంతపురం కల్చరల్


చిన్నారుల జానపద కళాప్రదర్శన

డిసెంబర్‌కల్లా గుంతలు లేని రహదారులు

ఆర్ అండ్ బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు

సాక్షి, అమరావతి: డిసెంబర్ నాటికి రోడ్లను గుంతలు లేని రహదారులుగా తీర్చిదిద్దనున్నట్లు ఆర్ అండ్ బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు చెప్పారు. సోమవారం నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 4,223 కిలోమీటర్ల మేర రహదారులు దారుణంగా దెబ్బతిన్నాయని చెప్పారు. వాటిని బాగు చేసేందుకు రూ.2 వేల కోట్లు అవసరమన్నారు. పీపీపీ విధానంలో 12,653 కిలోమీటర్ల మేర రహదారులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రభుత్వం రూ.860 కోట్లతో 19 వేల కిలోమీటర్ల మేర రహదారులపై గుంతలను పూడ్చిందని చెప్పారు. మరో 5,946 కిలోమీటర్ల మేర మరమ్మతుల కోసం రూ.500 కోట్లు మంజూరు చేసిందన్నారు. వర్షాకాలంలో రోడ్లపై గుంతలు పూడ్చేందుకు ఎకోఫిక్స్‌ను ఉపయోగిస్తామన్నారు. అనంతపురం జిల్లాలోని కోనవారిపల్లి–వంగనూరు రోడ్డును స్టీల్ స్లాగ్‌తో నిర్మిస్తున్నామన్నారు. జాతీయ రహదారుల కోసం 850 హెక్టార్ల భూమిని సేకరించాల్సి ఉందని చెప్పారు.

సుప్రీంకోర్టు ఆదేశాలపై ముస్లిం సమాజం హర్షం

సాక్షి, అమరావతి: వక్ఫ్ సవరణ చట్టం–2025పై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తాత్కాలిక ఆదేశాలపై ముస్లిం సమాజం హర్షం వ్యక్తం చేసింది. సవరణ చట్టంలోని మూడు కీలక సెక్షన్లపై సుప్రీంకోర్టు స్టే ఇవ్వడం పట్ల రాష్ట్రానికి చెందిన పలువురు ముస్లిం ప్రముఖులు సోమవారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. వారేమన్నారంటే..

జగన్‌కు ముస్లిం సమాజం రుణపడి ఉంటుంది

వక్ఫ్ చట్టం సవరణ విషయంలో సుప్రీంకోర్టు తాత్కాలిక ఆదేశాలు ముస్లిం సమాజానికి ఊరటనిచ్చాయి. తుదితీర్పులో అల్లాహ్ దయతో ముస్లింలకు శాశ్వత న్యాయం జరుగుతుంది. సుప్రీంకోర్టులో కేసు ఫైల్ చేయడానికి ఆదేశాలిచ్చిన మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ముస్లిం సమాజం రుణపడి ఉంటుంది. ముస్లిం సమాజానికి ఇబ్బందికరమైన సవరణ బిల్లుకు పార్లమెంట్‌లో టీడీపీ మద్దతు తెలిపింది. చంద్రబాబు నిర్ణయం వల్లనే ముస్లిమేతరులు వక్ఫ్‌బోర్డులో సభ్యులుగా వచ్చారనేది ముస్లిం సమాజం ఎప్పటికీ మరిచిపోకూడదు.

– వి.ఖాదర్‌బాషా, వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు

నల్ల చట్టం నుంచి ఊరట

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నల్ల చట్టం నుంచి దేశంలోని ముస్లిం సమాజానికి ఊరట కల్పిస్తూ సుప్రీం స్టే ఇచ్చింది. ఎన్డీఏ ప్రభుత్వం మైనారిటీలకు చేటుతెచ్చే వక్ఫ్ సవరణ బిల్లు తెచ్చింది. పార్లమెంటులో దీనికి మద్దతుగా టీడీపీ ఓటు వేయడం మైనారిటీలకు వెన్నుపోటు పొడవటమే. అత్యున్నత న్యాయస్థానంలో ముస్లిం మైనార్టీలకు న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉంది.

– బాజీబాబా, వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ కార్యదర్శి

సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు పాటించాలి

ఎన్డీఏ ప్రభుత్వం ఏకపక్షంగా తెచ్చిన బిల్లును సుప్రీంకోర్టు నియంత్రించింది. వక్ఫ్ బై యూజర్, ది ప్లేస్ ఆఫ్ వర్షిప్ యాక్ట్‌పైన పూర్తి తీర్పు రావాల్సి ఉంది. మూడు కీలక సెక్షన్లపై సుప్రీంకోర్టు స్టే ఇవ్వడం ముస్లిం సమాజానికి ఊరట. మొదటినుంచి అండగా నిలిచిన వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాం.

– షేక్ మునీర్ అహ్మద్, ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్

సుప్రీంకోర్టు మధ్యంతర తీర్పు చారిత్రాత్మకం

వక్ఫ్ ఆస్తులపై తుది నిర్ణయం కేవలం వక్ఫ్ ట్రిబ్యునల్స్‌కే ఉందని, కలెక్టర్లకు ఆ అధికారం లేదని సుప్రీంకోర్టు చెప్పడం చారిత్రాత్మకం. వక్ఫ్ (సవరణ) చట్టం–2025లోని కొన్ని కీలక సెక్షన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర తీర్పు ముస్లిం హక్కులకు ఊరటనిచ్చింది. ముఖ్యంగా సెక్షన్ 3(ఆర్), 2(సి), 3సి లను నిలిపేయడం వల్ల వక్ఫ్ ఆస్తులపై ఇతరుల అనవసర జోక్యం తగ్గుతుంది. వక్ఫ్‌బోర్డులో సీఈవో తప్పనిసరిగా ముస్లిం వ్యక్తి కావాలని సుప్రీంకోర్టు స్పష్టం చేయడం ముస్లిం సమాజ గౌరవాన్ని కాపాడే నిర్ణయం. వక్ఫ్ సవరణ చట్టం విషయంలో ముస్లిం సమాజానికి అండగా నిలిచిన వైఎస్ జగన్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– షేక్ నాగుల్ మీరా, ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది

ముస్లిం సమాజానికి అండగా నిలిచిన వైఎస్ జగన్

ఓటుబ్యాంకు రాజకీయాలు కాకుండా మైనార్టీలకు మొదటినుంచి అండగా నిలిచిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముస్లిం సమాజం ఎప్పటికీ మరచిపోదు. ముస్లింల మనోభావాలను గౌరవించి,, ఆ సమాజానికి జరుగుతున్న అన్యాయంపై మొదటినుంచి వైఎస్సార్‌సీపీ పోరాడుతూనే ఉంది. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లు విషయంలో ముస్లింలను పూర్తిగా వంచించింది. ముస్లిం పెద్దలు కలిసినప్పుడు మాట ఇచ్చిన వైఎస్ జగన్, పార్లమెంట్ ఉభయసభల్లోనూ వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఓటువేసి మైనార్టీలకు అండగా నిలిచారు.

– షేక్ దస్తగిరి, ముస్లిం దూదేకుల పొలిటికల్ జేఏసీ అధ్యక్షుడు

తుది తీర్పులోనూ న్యాయం జరుగుతుందని ఆశ

సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వుల్లో మూడు కీలక సెక్షన్లపై స్టే ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నాం. తుదితీర్పులోనూ ముస్లిం సమాజానికి పూర్తి న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాం. మొదటినుంచి ముస్లిం సమాజానికి అండగా నిలిచిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాం. వక్ఫ్ సవరణ చట్టం విషయంలో టీడీపీ, జనసేన కూటమి ముస్లిం సమాజానికి చేసిన ద్రోహానికి మూల్యం చెల్లించక తప్పదు.

– బి.ఎస్.గౌస్‌లాజమ్, ఏపీ హజ్ కమిటీ మాజీ చైర్మన్

ఇంటిని నడిపే ఆమెకు నడుము నొప్పి!



ఈ రోజుల్లో నడుమునొప్పి సాధారణంగా కనిపించే సమస్య. అయితే మహిళల్లో రోజువారీ పనుల వల్ల నడుమునొప్పి వచ్చే అవకాశాలు మరింత ఎక్కువ. ఉదాహరణకు వాళ్లు రోజంతా నిలబడి వంట చేయడం లేదా బట్టలు ఉతకడం లేదా రొట్టెల కర్ర (బేలన్)తో రోటీలు తయారు చేయడం నడుమును చాలాసేపు అదేపనిగా ముందుకు వంచి ఆ పనులు చేయాల్సి రావడం వంటి కారణాలతో వారిలో నడుమునొప్పి ముప్పు మరింత ఎక్కువ. దీనికితోడు మహిళల్లో ప్రతి నెలా రుతుస్రావం నొప్పి వారి నడుము నొప్పిని మరింత ప్రభావితం చేస్తుంది. ఇలాంటి అనేక కారణాలతో పురుషులతో పోలిస్తే మహిళల్లో కాస్త ఎక్కువగానే కనిపించే నడుము నొప్పులు, వాటికి కారణాలూ, వాటి పరిష్కారాలేమిటో తెలుసుకుందాం...

పురుషులతో పోలిస్తే మహిళల్లో స్రవించే హార్మోన్లు కాస్త ప్రత్యేకంగానూ, సంక్లిష్టంగానూ ఉంటాయి. ఈ హార్మోన్లు సైతం వాళ్లలో నొప్పిని మరింత తీవ్రతరం చేస్తుంటాయని కొన్ని అధ్యయనాల్లో తేలింది. పురుషుల్లో కంటే మహిళల్లో ఇన్‌ఫ్లమేషన్ (నొప్పి, వాపు, మంట)కు స్పందించడం కాస్తంత తీవ్రంగా ఉంటుందనే అంశం కూడా ఇందుకు మరో కారణం. ఈ కారణం వల్లనే... పురుషుల్లో మహిళల్లో ఒకేలాంటి నొప్పి వస్తున్నప్పటికీ... మహిళల్లో ఆ నొప్పి తాలూకు తీవ్రత కాస్తంత ఎక్కువగానే ఉంటుందని ఇటీవలి కొన్ని అధ్యయనాలు పేర్కొంటున్నాయి. ఇలా మహిళల్లో హార్మోన్లు, వారికే ప్రత్యేకమైన కొన్ని జన్యువులు, వారి మనస్తత్వం, నొప్పిని తెలిపే వ్యవస్థ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నప్పుడు మహిళల్లో నడుమునొప్పి తీవ్రత పురుషుల్లో కంటే ఎక్కువే.

వైద్యపరమైన కారణాలతో నడుము నొప్పుల్లో కొన్ని...

టెయిల్‌బోన్ పెయిన్ : మనం కుదురుగా కూర్చున్నప్పుడు సరిగ్గా మన నడుము కింద... పిరుదుల మధ్యగా కాస్తంత పైభాగంలో నొప్పి వస్తుంటే దాన్ని 'టెయిల్‌బోన్ పెయిన్'గా చెప్పవచ్చు. అంటే ఇది సరిగ్గా వెన్నుపూసల్లోని చివరి ఎముక దగ్గర వచ్చే నొప్పి. వైద్య పరిభాషలో దీన్ని 'కాక్సిడైనియా' అంటారు. పురుషులతో పోలిస్తే ఇది మహిళల్లో ఐదు రెట్లు ఎక్కువగా కనిపిస్తుంటుంది. దాంతోపాటు మహిళల్లో గర్భధారణ అంశం కాక్సిడైనియా ముప్పును మరింత పెంచుతుంది. అందుకే పురుషుల కంటే మహిళల్లో ఇది ఎక్కువ.



డా॥ సుధీర్ రెడ్డి
సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్

ఆస్టియోఆర్థరైటిస్ : ఇది కీళ్ల అరుగుదలతో వచ్చే నొప్పి. రెండు ఎముకలు కలిసే జాయింట్లలోని ఎముక అరిగినప్పుడు వచ్చే నొప్పి ఇది. నడుముభాగంలోని ఎముకల అరుగుదల కారణంగా ఈ తరహా నడుము నొప్పి వస్తుంది. ఇదే తరహాలో మోకాలు, తుంటి భాగంలో కీళ్ల (జాయింట్లు) అరిగినప్పుడు వచ్చే నొప్పి లాగే నడుము ప్రాంతంలోని ఈ నొప్పి వస్తుంటుంది.

శాక్రో ఇలియాక్ జాయింట్ సమస్యలు : శాక్రమ్, ఇలియాక్ అనే ఎముకలు వెన్నెముక చివరి భాగంలో ఉంటాయి. శాక్రమ్ అనే వెన్నెముక చిట్టచివరి ఎముక (టెయిల్‌బోన్)ను తుంటితో కలుపుతూ... ఈ ఎముకలు పిరుదులకు ఇరువైపులా కొద్దిగా విస్తరించినట్లుగా ఉంటాయి. ఈ భాగంలో ఇన్‌ఫ్లమేషన్ వచ్చినప్పుడు నడుము కింద భాగంతో పాటు కాళ్లలోకి సైతం పాకుతున్నట్లుగా నొప్పి వస్తుంటుంది. మహిళల్లో గర్భధారణ అంశం ఈ నొప్పిని మరింత ప్రభావితం చేస్తుంది. దాంతో ఈ తరహా నొప్పి మహిళల్లో మరింత ఎక్కువగా కనిపిస్తుంటుంది.

కంప్రెషర్ ఫ్రాక్చర్ : ఇది వెన్నెముకల్లోని వెన్నుపూసల్లో ఏదైనా ఎముక విరిగినప్పుడు వచ్చే నొప్పి. అనేక వెన్నుపూసలు (అంటే వెన్నులోని చిన్న చిన్న ఎముకలు) కలుస్తూ చక్కగా అమరిపోతూ... 'ఎస్' ఆకృతిలో ఒకే ఎముకలా కనిపించే వెన్నెముక ఏర్పడుతుందన్న విషయం తెలిసిందే. ఆస్టియోపోరోసిస్‌గా లేదా ఇతరత్రా ఏదైనా కారణం వల్ల ఈ వెన్నుపూసల్లోని ఏదైనా ఎముక విరిగినప్పుడు తీవ్రమైన నడుమునొప్పి వస్తుంది. ఇలా జరగడాన్ని కంప్రెషర్ ఫ్రాక్చర్ అంటారు. ఈ కంప్రెషన్ ఫ్రాక్చర్స్‌కు స్త్రీ, పురుషులిరువురిలోనూ అవకాశమున్నప్పటికీ... పురుషుల్లో కంటే మహిళల్లో ఇవి రెండు రెట్లు ఎక్కువ.

ఫైబ్రోమయాల్జియా : కండరాల్లో నొప్పుల కారణంగా వచ్చే ఈ తరహా నొప్పి వెన్ను కింది భాగంతో పాటు పైభాగంలో కూడా కనిపించవచ్చు లేదా నడుము భాగంలో ఎక్కడైనా రావచ్చు. ఇది కూడా మహిళ్లోనే ఎక్కువ. పురుషులతో పోలిస్తే మహిళల్లో కనిపించే యాంగ్జైటీ ఈ నొప్పులకు కారణమవుతుంటుంది.

నివారణ / చికిత్స...

నడుమునొప్పితో బాధపడుతున్న మహిళలు ముందుగా అది ఏ కారణంగా వస్తున్నదో తెలుసుకోవాలి. ఆ నిర్దిష్టమైన కారణాన్ని బట్టి, దానికి అవసరమైన నిర్దిష్టమైన చికిత్స అందించడం లేదా తొలిదశల్లో నివారణ మార్గాలను అనుసరించడం ద్వారా నడుము నొప్పి నుంచి దూరం కావచ్చు. అవి... ● ఫిజియోథెరపిస్ట్ సహాయంతో అవసరమైన వ్యాయామాలు చేయడం ● తొలిదశల్లో (ఇంటర్ ఫెరెన్షియల్ థెరపీ) ఐఎఫ్‌టీ వంటి ప్రక్రియలతో చేసే చికిత్సలూ ఉపశమనాన్ని కలిగిస్తాయి. టెన్స్ అనే చికిత్స కూడా ఇలాంటిదే. ట్రాన్స్‌క్యుటేనియస్ ఎలక్ట్రికల్ నర్వ్ స్టిమ్యులేషన్ అనే మాటలకు సంక్షిప్త రూపమే ఈ 'టెన్స్'. ఈ చికిత్స ప్రక్రియలో ఎలక్ట్రోడ్‌ల సహాయంతో చిన్న చిన్న విద్యుత్ ప్రకంపనలను చర్మం కిందికి పంపుతారు. దాంతో తగిన ఉపశమనం కలుగుతుంది. (అయితే గర్భవతులు, మూర్ఛతో బాధపడే రోగులు, గుండెజబ్బులు ఉన్నవారు లేదా గుండె సమస్యను చక్కదిద్దడానికి పేస్‌మేకర్ అమర్చిన వాళ్లకు టెన్స్ చికిత్స ఎంతమాత్రమూ సరికాదు. అందుకే ఇలాంటి చికిత్సలు పూర్తిగా వైద్యనిపుణుల పర్యవేక్షణలోనే సాగాలి).

● **తక్షణ నొప్పి నివారణ కోసం :** నొప్పిని తాత్కాలికంగా తగ్గించడం కోసం నొప్పి నివారణ మందులు (పెయిన్ కిల్లర్స్) అందుబాటులో ఉన్నా... ఇవి కేవలం తక్షణ నొప్పి నివారణ కోసమే పనికి వస్తాయి. నడుమునొప్పి లేదా వెన్ను నొప్పి లేదా మెడనొప్పి లాంటి సమస్య ఏదైనా ఉన్నప్పుడు దాని శాశ్వత నివారణ కోసం నొప్పి నివారణ మందులను వాడటాన్ని పూర్తిస్థాయి చికిత్సగా పరిగణించకూడదు. పైగా నొప్పి నివారణ మందులను దీర్ఘకాలం వాడటం వల్ల జీర్ణవ్యవస్థపై దుష్ప్రభావం చూపవచ్చు. అందునా మరీ ముఖ్యంగా కాలేయంతో పాటు మూత్రపిండాల వంటి కీలకమైన అవయవాలు దెబ్బతినవచ్చు. అందుకే నడుమునొప్పి లాంటివి వస్తున్నప్పుడు రెండు వారాలకు మించి నొప్పి నివారణ మందులు తీసుకోవడం సరికాదు. దీనికి బదులు ఉపశమనం కోసం పైపూత మందులు (టాపికల్ మెడిసిన్స్) వాడటం మేలు. అయితే ఇందుకోసం కొన్ని ఆయిల్స్‌తో మసాజ్ చేస్తుంటారు. తొలుత నొప్పిని ఉపశమింపజేసే నూనెలతో మసాజ్‌లు చేయడం మంచిదే. మసాజ్‌లో భాగంగా నిపుణులు రుద్దడం, నొక్కడం, కొన్ని నిర్దిష్టమైన చోట్ల ఒత్తిడి కల్పించడం... అంటే రోలింగ్, నీడింగ్, అప్లయింగ్ ప్రెషర్ వంటివి చేస్తుంటారు. అలా నొప్పి ఉన్న భాగాల్లో రక్తప్రసరణ బాగా అయ్యేలా చేస్తారు. ఫలితంగా అక్కడి కండరాల్లో ఒత్తిడి తగ్గడం లేదా పట్టివేసిన కండరం వదులు కావడం వల్ల నొప్పి ఉపశమిస్తుంది. అయితే... ఇలా ఆరు వారాల కంటే ఎక్కువగా చేసినప్పటికీ నొప్పి కొనసాగుతూ ఉంటే మాత్రం ఒకసారి డాక్టర్‌ను సంప్రదించడం అవసరం. అలాగే 20 ఏళ్ల లోపు వాళ్లలో నడుము నొప్పి కనిపిస్తే తప్పనిసరిగా డాక్టర్‌ను సంప్రదించాలి

● పై మార్గాలతో అంతగా గుణం కనిపించనప్పుడు ఎముకల వైద్య నిపుణులు లేదా న్యూరోసర్జన్లు లేదా స్పైన్ సర్జన్ల సహాయంతో అవసరమైన శస్త్రచికిత్స చేసి సమస్యను పరిష్కరించే అవకాశముంది.

నడుమునొప్పిని నివారించే ఆహారం...



చాలామందికి తెలియని విషయం, ఆశ్చర్యం కలిగించే సంగతేమిటంటే... వెన్ను ఆరోగ్యానికి తగినంత వ్యాయామంతో పాటు పోషకాహారం కూడా అవసరమే. ఆ ఆహారం ఎన్నో గాయాలను త్వరగా మాన్చి... వెన్నునొప్పులను నివారిస్తుంది. కొన్ని సందర్భాల్లో ఎముక సాంద్రత తగ్గకుండా చేయడం ద్వారా నడుమునొప్పి రాకుండా చేస్తుంది. ఇందుకు మీ ఆహారంలో ఉండాల్సిన పోషకాలు ఏమిటంటే...

● **కాల్షియమ్:** కాల్షియమ్ సమృద్ధిగా ఉండే ఆహారం తీసుకోవడం వల్ల ఎముకల ఆరోగ్యం బాగుంటుంది. పాలు, పాల ఉత్పాదనలైన పెరుగు, వెన్నతో పాటు ముదురు ఆకుపచ్చగా ఉండే ఆకుకూరలు, చేపలలో క్యాల్షియమ్ ఎక్కువ.

● **విటమిన్ డి3 :** మన ఒంట్లోకి వచ్చే క్యాల్షియమ్ ఎముకల్లోకి ఇంకేలా చేసి, వాటి ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో విటమిన్–డి బాగా సహాయపడుతుంది. స్వాభావికమైన ఎండ (నేచురల్ సన్‌లైట్)తో పాటు సాల్మన్ వంటి చేపలు, కాలేయం, గుడ్డు వంటి ఆహారాల్లో విటమిన్ డి పుష్కలంగా ఉంటుంది.

● **విటమిన్-సి :** చిగురు ఎముకలో ఉండే కొలాజెన్ వంటివి ఏర్పరచడంలోనూ, ఎముకలు, కండరాలు, చర్మం, టెండన్ల ఆరోగ్యాన్ని కాపాడటంలో విటమిన్-సి ప్రధాన పాత్ర పోషిస్తుంది. అన్ని రకాల నిమ్మజాతి పండ్లతో పాటు టొమాటో, కాప్సికమ్ వంటి కూరల్లో ఇది ఎక్కువ.

● అలాగే గాయాలను మాన్పడం, ఏవైనా గాయాలైనప్పుడు దెబ్బతినే భాగాలను సత్వరం రిపేర్ చేయడానికి ప్రోటీన్లు చాలా అవసరం. మాంసాహారం, పప్పులలో ప్రోటీన్లు ఎక్కువ.

● **విటమిన్-బి12 :** మన శరీరంలోని ఎముకలను నిర్మించే కణాల రూపకల్పనకు విటమిన్ బి12 చాలా అవసరం. అన్ని రకాల చేపలు, మాంసంతో పాటు తాజా పండ్లు, ఆకుకూరలు, పౌల్ట్రీ ఉత్పాదనల్లో బిటమిన్-బి 12 పాళ్లు ఎక్కువ.



పోశ్చర్ పరంగా...

పక్కలకు అకస్మాత్తుగా ఒంగడం లేదా ఒక పక్క బరువును అపసవ్యంగా మోయడం వల్ల : మహిళలు తమ రోజువారీ పనుల్లో భాగంగా బిందెల వంటి బరువులు ఎత్తే సమయంలో, లేదా పిల్లలను అలాగే బిందెలను కూడా ఒకవైపున చంకలో మోసే సమయంలో నడుముఒంపు మీద బరువు ఆనించి చాలాసేపు అదేపనిగా నడవడం, బరువు మోస్తుండటం వంటి పనులు చేస్తుంటారు. ఇలా చాలాసేపు అపసవ్య భంగిమలో, అందునా బరువు మోస్తూ ఉండటం వంటి అంశాలు కూడా నడుము నొప్పికి కారణమవుతాయి. అలాగే ఇల్లు తుడిచే సమయంలో కొందరు కింద కూర్చొని తడిగుడ్డతో ఫ్లోర్ తుడుస్తుంటారు. దీనివల్ల తరచూ కూర్చోవడం, లేవడం వంటి పనులతోనూ అలాగే కొన్నిసార్లు అదేపనిగా నడుము ఒంచి ఒకేభంగిమలో చాలాసేపు ఉండటం వంటివి చేస్తుంటారు. ఫలితంగా నడుము నొప్పి రావచ్చు. ఇలాంటి సమయాల్లో లాంగ్ హ్యాండిల్ మాప్‌లు వాడుతూ నిటారుగా నిలబడే వాటిని వాడుతూ ఫ్లోర్‌లు తుడవటం లాంటి జాగ్రత్తలతో నడుమునొప్పిని నివారించుకోవచ్చు.

ఇక వారు అనేక పనుల్లో భాగంగా అకస్మాత్తుగా ముందుకు వంగాల్సిరావడం లేదా పక్కలకు తిరగాల్సిరావడం, ఏవైనా బరువులు ఎత్తేందుకు గబుక్కున ముందుకు ఒంగడం లాంటివి చేస్తుంటారు. ఈ అంశాలు కూడా నడుము నొప్పికి కారణం కావచ్చు. వారు ఏదైనా బరువును (అంటే... బిందె, కుండ లేదా బస్తాల వంటి బరువులు) ఎత్తే సమయంలో ముందుకు ఒంగి కాకుండా...మెల్లగా కూర్చొని నెమ్మదిగా ఎత్తుకోవడం మేలు.

ఇక ఆఫీసుల్లో పనిచేసే చోట్ల మహిళల్లో ముందుకు వంగి కంప్యూటర్‌లోకి చూస్తుండటం వల్ల కూడా నడుము నొప్పి రావచ్చు. అందుకే కంప్యూటర్ వంటివి చూస్తున్నప్పుడు నడుమును వీలైనంత నిటారుగా ఉంచడం మంచిది.



చాలాసేపు నిలబడి ఉండే వాళ్లలో నడుము నొప్పి...

కొన్ని వృత్తుల్లో ఉండేవారు ఉదాహరణకు ట్రాఫిక్ విభాగంలో పనిచేసే మహిళా పోలీసులు, బస్ కండక్టర్లు, షాపుల్లో పనిచేసే సేల్స్ గర్ల్స్ అదేపనిగా చాలాసేపు నిలబడే ఉంటారు. ఒక్కోసారి దాదాపు ఐదారు గంటల పాటు కూడా వారు నిలబడే ఉండాల్సి రావచ్చు. ఇలాంటి వాళ్లలో నడుమునొప్పి రావడంతో పాటు కాళ్లలోని ఎముకలు, కండరాలు దెబ్బతిని 'మస్క్యులో స్కెలెటల్ డిజార్డర్స్' వంటివి వచ్చే అవకాశాలెక్కువ. అలాగే చాలాసేపు నిలబడి ఉండటం వల్ల వచ్చే స్వల్పకాలిక సమస్యలైన కాళ్లలో తిమ్మిర్లు (క్రాంప్స్) వంటివీ రావచ్చు. ఒక్కోసారి నడుమునొప్పితో పాటు ఈ క్రాంప్స్ వంటివి వచ్చినప్పుడు వాళ్ల పరిస్థితి మరింత దుర్భరమవుతుంది. అందుకే చాలాసేపు నిలబడే ఉండే వృత్తుల్లో ఉండేవారు తరచూ కాస్తంత సేపు బ్రేక్ తీసుకోవడం వంటివి చేస్తూ ఉండాలి. కొంతసేపు కూర్చొని వచ్చి మళ్లీ నిలబడి తమ వృత్తిని / పనులను కొనసాగించాలి. నిలబడి ఉన్నప్పుడు కూడా అదేపనిగా చాలాసేపు నిటారుగా ఉండకుండా తరచూ పోశ్చర్‌లో తరచూ కాస్తంత మార్పులు చేస్తూ ఉండాలి. ఒక వంట వండుతూ ఉండే సమయాల్లో కూడా మహిళలు వంట ప్లాట్‌ఫారమ్ దగ్గర చాలాసేపు నిలబడే ఉండాల్సి వస్తుంటుంది. ఇలాంటి సమయాల్లో వారు తమ ఎత్తునకు అనుగుణంగా ప్లాట్‌ఫారమ్ అమర్చుకోవడం, అప్పుడప్పుడూ కూర్చోడానికి ఎత్తైన లాంగ్ స్టూల్‌ను వేసుకోవడం మంచిది. దాని కాళ్ల దగ్గర ఫుట్‌రెస్ట్ చేసుకోవడానికి అనుగుణంగా అడ్డుపట్టీలు ఉండేలా చూసుకుంటూ, కూర్చున్నప్పుడు మీ కాళ్లు ఆ అడ్డుపట్టీలపైన ఉండేలా చూసుకుంటే నడుముపై భారం తగ్గి నడుమునొప్పి నివారించడానికి ఆ అంశాలు తోడ్పడుతుంటాయి.

నిర్వహణ: యాసీన్



డ్రైవింగ్ - నడుము నొప్పి...

వాహనాలు నడపడానికీ, నడుమునొప్పికీ చాలా దగ్గరి సంబంధం ఉంటుంది. వాహనాన్ని నడిపే చాలామందిలో కొంతకాలం తర్వాత నడుము నొప్పి రావడం చాలా సాధారణంగా కనిపించే అంశం. చాలాకాలం పాటు వాహనం నడిపేవారిలో వెన్నెముక కారు సీటుకు అనుగుణంగా అలా నిర్దిష్టమైన ఒంపులా ఒంగి ఉండటంతో వెన్నెముకలోని వెన్నుపూసలు ప్రభావితమవుతాయి. అదీగాక వాహనం నడిపే సమయంలో కలిగే కుదుపుల వల్ల ఈ వెన్నుపూసలు ప్రభావితమవుతాయి. దాంతో చాలాకాలం పాటు వాహనాలు నడిపేవారిలో నడుమునొప్పి వచ్చే అవకాశాలెక్కువ. కార్స్ లేదా ఇతరత్రా ఫోర్‌వీలర్స్ విషయంలో నడుమునొప్పికి కారణమయ్యే కొన్ని అంశాలను చూద్దాం. ఇటీవల కొన్ని కార్లలోని పైకప్పు (రూఫ్) చాలా కిందికి ఉంటోంది. అలాగే డ్రైవింగ్ సీట్‌లో కూర్చునేవారి సౌకర్యం కోసం సీట్‌ను వెనకవైపునకు బాగా కిందికి దిగి ఉంచేలా చేస్తారు. డ్రైవింగ్ చేసేవారు తమ కాళ్లను తగినంతగా చాపి ఉంచేలా చూసుకోవడం కోసం సీట్‌ను వెనక్కి వాలేలా చూస్తారు. దాంతో డ్రైవింగ్ సీటులో నిటారుగా కూర్చోవడమన్నది దాదాపుగా జరగదు. ఫలితంగా వెన్ను మీద ప్రత్యేకంగా నడుము మీద ఒత్తిడి చాలా ఎక్కువ. ఇలా సీట్‌ను వెనక్కు వంచినప్పుడు మళ్లీ కారు ముందరిభాగంలో స్పష్టంగా చూడటం కోసం మెడను ముందుకు వంచడంతో మెడ 20 డిగ్రీలు ముందుకు వస్తుంది. దాంతో నడుము అంతా ఒక భంగిమలోనూ, మెడ మరో భంగిమలో ఒంగుతాయి. ఈ అపసవ్యతల కారణంగా డ్రైవింగ్ చేసేవారిలో చాలా తరచుగా వెన్ను నొప్పి / నడుమునొప్పి వస్తుంటాయి.

కార్ డ్రైవింగ్‌తో వచ్చే నడుము నొప్పి నివారణకు సూచనలు:

● మీ తొడలకు సీట్ సపోర్ట్ వీలైనంత ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. అంటే తొడల నిడివిలో అవి ఎక్కువ భాగం సీట్ పైనే ఉండేలా చూసుకోవాలి ● బ్రేక్, క్లచ్ వంటివి మీ కాళ్లు ఆనే చోటికి మరీ దూరంగా ఉండేలా కూర్చోవడం సరికాదు. అవి సరిగ్గా కాళ్ల చివరలో అందుబాటులో ఉండాలి ● మీ కాళ్ల పొడవుకు అనుగుణంగా సీట్‌ను మీకు సౌకర్యంగా ఉండేలా చూసుకోవాలి ● మీ ఎత్తుకు అనుగుణంగా సీట్ ఎత్తును అడ్జెస్ట్ చేసుకోవాలి ● మీ సీట్‌ను వీలైనంత మేరకు నిటారుగా ఉంచేలా చూసుకోవాలి లేదా అది మీకు మరీ ఇబ్బందిగా ఉంటే కేవలం కొద్దిగా మాత్రమే వెనక్కు వాలేలా సీట్ వంచాలి. ఆ సీట్ ఒంపు ఎంత అవసరం అంటే... ఆ ఒంపు మీ నడుము మీదగానీ మీ మోకాళ్ల మీద గానీ ఒత్తిడి పడనివ్వని విధంగా సౌకర్యంగా ఉండాలి ● మీ నడుము దగ్గర ఉండే ఒంపు (లంబార్) భాగంలో ఒక కుషన్ ఉంచుకోవాలి. ఆ లంబార్ సపోర్ట్ వల్ల నడుము నొప్పి చాలావరకు తగ్గుతుంది ● మెడ మీద ఒత్తిడి పడని విధంగా మీ హెడ్‌రెస్ట్ ఉండాలి ● సీట్‌లో చాలాసేపు ఒకే భంగిమలో కూర్చొని ఉండకూడదు. అప్పుడప్పుడూ మీ పొజిషన్ కాస్త మారుస్తూ ఉండాలి ● అదేపనిగా డ్రైవ్ చేయకుండా మధ్య మధ్య కాస్త బ్రేక్ తీసుకుంటూ ఉండాలి ● ఇక డ్రైవ్ చేస్తున్నప్పుడు సీట్ బెల్ట్ పెట్టుకోవడమన్నది అన్ని విధాలా మేలు చేస్తుందని గుర్తుంచుకోవాలి.

మోటార్ సైకిల్ విషయంలో...

ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు బైక్‌లు నడిపే అమ్మాయిల సంఖ్య చాలా ఎక్కువ. సాధారణంగా బైక్‌ల తయారీదారులు హ్యాండిల్‌బార్స్, ఫుట్‌రెస్ట్ వంటి అంశాల్లో కొన్ని ప్రమాణాలను పాటిస్తుంటారు. మీ బైక్ ఆ ప్రమాణాలకు అనుగుణంగా తయారైనదైతే మంచిదే. వాటిని అనుసరించడం వల్ల కొన్ని అవయవ సమస్యలు గానీ నొప్పులుగానీ రావు. ఒకవేళ మీ బైక్‌లోని వివిధ అంశాలు సరైన ప్రమాణాలు లేకపోతే వాటివల్లనే మీకు నడుము నొప్పి వస్తోందని భావించాలి. మీరు మీ బైక్ విషయంలో ఈ కింద పేర్కొన్న అంశాల విషయంలో జాగ్రత్తలు పాటించండి. ● బైక్‌ల హ్యాండిల్స్ సాధారణంగా తగినంత విశాలంగా, రెండు చేతులతో సౌకర్యంగా పట్టుకోవడానికి వీలైనంత నిడివితో ఉండాలి. పొట్టిగా ఉండే షార్ట్‌హ్యాండిల్స్ వల్ల ఒంటిపై భారం పడి శరీరభాగాల్లో ముఖ్యంగా నడుమునొప్పి వచ్చే అవకాశాలు ఎక్కువ ● మనం కాళ్లు పెట్టుకునే ఫుట్‌రెస్ట్ మన శరీరానికి మరీ దూరంగా ఉండకూడదు. దీనివల్ల కాళ్లు సాగినట్లుగా అయిపోయి నడుముపై భారం ఎక్కువగా పడుతుంది. దాంతో నడుమునొప్పి రావచ్చు ● బైక్‌పై కూర్చొనే సమయంలో వీపు భాగమంతా నిటారుగా ఉండి, మన వెన్ను ఒంగకుండా ఉండాలి. సాధారణ బైక్‌ల నిర్మాణం ఇలాగే ఉంటుంది. కానీ కొన్ని స్పోర్ట్స్ బైక్‌లలో సీట్లు ఏటవాలుగా ఉండి, మనం కూర్చొనే భంగిమ ముందుకు వాలినట్టుగా ఉండేలా అమరి ఉంటాయి. దాంతో బాగా ముందుకు వాలిపోతున్నట్లుగా కూర్చోవాల్సి వస్తుంది. ఇలా రూపొందించిన ఫ్యాషన్ బైక్స్ వల్ల మన వెన్ను నిటారుగా నిలపలేకపోవడంతో వెన్ను నొప్పి వచ్చే అవకాశాలు ఎక్కువ ● బైక్‌లపై వెళ్లేవారు వీపుపై ఉండే బ్యాగ్స్ (బ్యాక్‌ప్యాక్స్ / ల్యాప్‌టాప బ్యాగ్స్) పెట్టుకొని వెళ్తుండటం సాధారణం. ఈ భారం నడుంపైనా భారం పడటం వల్ల కూడా నొప్పి రావచ్చు. అందువల్ల ఆ బ్యాగ్ భారం వీపుపై కాకుండా సీట్‌పై పడేలా చూసుకోవాలి.

మీ బైక్‌లో పైన పేర్కొన్న భాగాల అమరిక, మీరు కూర్చొనే భంగిమ ఎలా ఉందో పరీక్షించుకొని, లోపాలు ఉన్నట్లయితే సరిచేసుకోవాలి. దాంతో నొప్పి దూరం కావచ్చు. అప్పటికీ నడుం నొప్పి వస్తుంటే డాక్టర్‌ను సంప్రదించాలి.

బిజినెస్ రీల్

అతి పెద్ద వాహన స్క్రాపేజ్ నెట్‌వర్క్‌గా 'రీ కర్మ'

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జీవితకాలం పూర్తయిపోయిన వాహనాల (ఈఎల్‌వీ) తుక్కు, రీసైక్లింగ్ కార్యకలాపాలకు సంబంధించి తమ అనుబంధ విభాగం 'రీ కర్మ' దేశీయంగా అతి పెద్ద నెట్‌వర్క్‌గా ఆవిర్భవించినట్లు రీ సస్టైనబిలిటీ (ఆర్ఈఎస్ఎల్) వెల్లడించింది. ఢిల్లీ నేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్‌సీఆర్) జార్ఖర్‌లోని రిలయన్స్ మోడల్ ఎకనమిక్ టౌన్‌షిప్‌లో అధునాతన ఫ్లాగ్‌షిప్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ఇది వార్షికంగా 30,000 వాహనాలను (ప్యాసింజర్ కార్లు, వాణిజ్య, ఎర్త్‌మూవింగ్ వాహనాలు మొదలైనవి) స్క్రాప్ కింద మార్చగలిగే సామర్థ్యంతో ఉంటుందని వివరించింది. ఇప్పటికే దేశవ్యాప్తంగా ఫ్రాంచైజీల ద్వారా 2,00,000 టన్నుల వార్షిక స్థాపిత సామర్థ్యంతో పని చేస్తున్నట్లు కంపెనీ తెలిపింది.

వివో నుంచి సరికొత్త వై31 సిరీస్ స్మార్ట్‌ఫోన్లు

ధర రూ. రూ. 14,999 నుంచి ప్రారంభం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ వివో తాజాగా సరికొత్త వై31 సిరీస్‌ను ఆవిష్కరించింది. ఇందులో వై31, వై31 ప్రో ఉన్నాయి. వై31 ధర రూ. 14,999 నుంచి, వై31 ప్రో ధర రూ. 18,999 నుంచి ప్రారంభమవుతుంది. 6500 ఎంఏహెచ్ బ్యాటరీ, 50 ఎంపీ హెచ్‌డీ ఇమేజింగ్ సిస్టం, 4కే వీడియో రికార్డింగ్ సామర్థ్యాలు, మీడియాటెక్ డైమెన్సిటీ 7300 చిప్‌సెట్ మొదలైన ప్రత్యేకతలు ఇందులో ఉన్నాయి. ఎస్‌బీఐ కార్డ్, డీబీఎస్, యస్ బ్యాంక్ తదితర కార్డులపై రూ. 1,500 వరకు తక్షణ క్యాష్‌బ్యాక్, జియో యూజర్లకు రెండు నెలల పాటు ఉచితంగా 10 ఓటీటీ యాప్‌లకు ప్రీమియం యాక్సెస్ లభిస్తుంది.

తెలుగు రాష్ట్రాల కస్టమర్లకు కియా ఇండియా ఆఫర్



హైదరాబాద్: కియా ఇండియా తెలుగు రాష్ట్రాల కస్టమర్లకు కార్ల కొనుగోలుపై రూ.2 లక్షల వరకు ఆఫర్ ప్రకటించింది. పండుగ డిస్కౌంట్ కింద రూ.1.42 లక్షలు, కొత్త జీఎస్‌టీ రేట్ల అమలుకు ముందు రూ.58 వేలు అదనపు తగ్గింపుతో కలిసి రూ.2 లక్షల వరకు ఆదా చేసుకునే సదుపాయం కల్పిస్తుంది. సెల్టోస్ కొనుగోలుపై రూ.2 లక్షల వరకు; కారెన్స్ క్లావిస్ కొనుగోలుపై రూ.1,33,350 వరకు; కారెన్స్‌పై రూ.1,20,500 వరకు తగ్గింపు పొందవచ్చు. ఈ ఆఫర్ సెప్టెంబర్ 22 వరకు అందుబాటులో ఉంటుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

16-9-2025

విశాఖ	555-00
చిత్తూరు	578-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	550-00
విజయవాడ	560-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	540-00
వరంగల్	542-00
రిటైల్ ధర	6.00

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
JIOFIN	315.5	1.38
BAJFINANCE	1,011.70	0.84
ETERNAL	323.6	0.68
ULTRACEMCO	12,419.00	0.4
BAJAJ-AUTO	9,030.50	0.34

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
CIPLA	1,547.00	-1.75
M&M	3,530.30	-1.66
ASIANPAINT	2,504.90	-1.63
SHRIRAMFIN	625.15	-1.22
DRREDDY	1,301.00	-1.19

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,436
ఎన్ఎస్ఈ	85,105
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,04,635
ఎఫ్ఐఐ	- 1,269
డీఐఐ	+ 1,933

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	63.28	$ 62.69
బ్రెంట్	67.38	$ 66.99

ఆగస్టులో ఎగుమతులు జంప్

రూ.3.09 లక్షల కోట్లు
- 6.7 శాతం వృద్ధి
- 10 శాతం తగ్గిన దిగుమతులు



న్యూఢిల్లీ: ఎగుమతులు ఆగస్టులో మెరుగైన వృద్ధిని చూశాయి. 35.1 బిలియన్ డాలర్ల విలువైన (సుమారు రూ.3.09 లక్షల కోట్లు) వస్తు ఎగుమతులు నమోదయ్యాయి. అదే సమయంలో దిగుమతులు 10.12 శాతం తగ్గి 61.59 బిలియన్ డాలర్లు (రూ.5.42 లక్షల కోట్లు)గా ఉన్నాయి. దీంతో ఆగస్టు నెలలో వాణిజ్య లోటు 26.49 మిలియన్ డాలర్లకు (రూ.2.33 లక్షల కోట్లు) పరిమితమైంది. క్రితం ఏడాది ఆగస్టులో వాణిజ్య లోటు 35.64 బిలియన్ డాలర్లతో పోల్చితే గణనీయంగా తగ్గింది. ముఖ్యంగా ఈ ఏడాది ఆగస్టులో బంగారం దిగుమతులు క్రితం ఏడాది ఇదే నెలతో పోల్చి చూస్తే 56 శాతం తగ్గడం అనుకూలించింది.

- కేంద్ర వాణిజ్య శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఆగస్టులో వస్తు, సేవల ఎగుమతులు అన్నీ కలిపి 69.16 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. గతేడాది ఇదే నెలలో ఇవి 63.25 బిలియన్ డాలర్లుగా ఉండడం గమనార్హం. ఆగస్టులో వస్తు, సేవల దిగుమతులు 79.04 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. దీంతో వాణిజ్య లోటు 9.88 బిలియన్ డాలర్లకు పరిమితమైంది.
- భారత ఉత్పత్తులపై అమెరికా రెండు విడతల్లో విధించిన మొత్తం 50 శాతం టారిఫ్‌లు ఆగస్టు నుంచి అమల్లోకి రాగా, ఇదే నెలలో ఆ దేశానికి 6.86 బిలియన్ డాలర్ల ఎగుమతులు నమోదయ్యాయి. భారత ఎగుమతుల్లో అమెరికాయే మొదటి స్థానంలో నిలిచింది.
- యూఏఈకి 3.24 బిలియన్ డాలర్లు, నెదర్లాండ్స్‌కు 1.83 బిలియన్ డాలర్లు, చైనాకి 1.21 బిలియన్ డాలర్లు, యూకేకి 1.14 బిలియన్ డాలర్ల చొప్పున ఎగుమతులు వెళ్లాయి.
- ఇక చైనా నుంచి అత్యధికంగా 10.91 బిలియన్ డాలర్ల వస్తువులను భారత్ దిగుమతి చేసుకుంది. ఆ తర్వాత రష్యా నుంచి 4.83 బిలియన్ డాలర్లు, యూఏఈ నుంచి 4.66 బిలియన్ డాలర్లు, యూఎస్ నుంచి 3.6 బిలియన్ డాలర్లు, సౌదీ నుంచి 2.5 బిలియన్ డాలర్ల విలువైన దిగుమతులు నమోదయ్యాయి.
- బంగారం దిగుమతులు 56.67 శాతం తగ్గి 5.43 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.
- సేవల ఎగుమతుల వరకే చూస్తే 34.06 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. 2024 ఆగస్టులో సేవల ఎగుమతులు 30.36 బిలియన్ డాలర్లతో పోల్చి చూస్తే 13 శాతం పెరిగాయి.
- ఎలక్ట్రానిక్స్ వస్తు ఎగుమతులు 2.93 బిలియన్ డాలర్లు, ఇంజనీరింగ్ ఉత్పత్తులు 9.9 బిలియన్ డాలర్లు, రత్నాభరణాలు 2.31 బిలియన్ డాలర్లు, పెట్రోలియం ఉత్పత్తులు 4.48 బిలియన్ డాలర్లు, ఫార్మా ఎగుమతులు 2.51 బిలియన్ డాలర్ల చొప్పున ఆగస్టులో నమోదయ్యాయి.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఐదు నెలల్లో వస్తు సేవల ఎగుమతులు 349.35 బిలియ్ డాలర్లుగా ఉన్నట్టు వాణిజ్య శాఖ అంచనా వేసింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఉన్న 329 బిలియన్ డాలర్ల కంటే 6.18 శాతం అధికం.
- ఆగస్టు చివరి నాటికి వాణిజ్య మిగులు 80.97 బిలియన్ డాలర్లకు పెరిగింది.

0.52 శాతానికి పెరిగిన టోకు ద్రవ్యోల్బణం

నాలుగు నెలల గరిష్టానికి చేరిక



న్యూఢిల్లీ: ఆహార, తయారీ వస్తు రేట్ల పెరుగుదలతో ఆగస్టు నెలలో టోకు ద్రవ్యోల్బణం నాలుగు నెలల గరిష్ట స్థాయిలో 0.52 శాతంగా నమోదైంది. గత రెండు నెలల పాటు నమోదైన క్షీణత (మైనస్) నుంచి బయటపడింది. జూలైలో మైనస్ 0.58 శాతం, జూన్‌లో మైనస్ 0.19 శాతం చొప్పున టోకు ద్రవ్యోల్బణం నమోదైంది. 2024 ఆగస్టు నెలలో ఇది 1.25 శాతంగా ఉంది. టోకు ధరల ఆధారిత సూచీ (డబ్ల్యూపీఐ) వివరాలను పరిశ్రమల శాఖ విడుదల చేసింది. ఆహార, తయారీ వస్తువులు, నాన్ మెటాలిక్ మినరల్ ఉత్పత్తులు, రవాణా ఎక్విప్‌మెంట్ ధరలు పెరగడం వల్లే టోకు ద్రవ్యోల్బణం సానుకూల స్థితిలోకి వచ్చినట్టు తెలిపింది.


- ఆహార విభాగంలో టోకు ద్రవ్యోల్బణం మైనస్ 3.06 శాతంగా నమోదైంది. జూలైలో ఇది మైనస్ 6.29 శాతంగా ఉంది.
- కూరగాయల విభాగంలో మైనస్ 14.18 శాతంగా, పప్పుల్లో మైనస్ 14.85 శాతంగా ద్రవ్యోల్బణం ఉంది. జూలైలో ఇవి వరుసగా 28.96%, 15.12% చొప్పున ఉన్నాయి.
- ఆలుగడ్డల విభాగంలో మైనస్ 44.11 శాతం, ఉల్లిగడ్డల విభాగంలో మైనస్ 50.46 శాతం చొప్పున ద్రవ్యోల్బణం నమోదైంది.
- విద్యుత్, ఇంధన విభాగంలో మైనస్ 3.17 శాతం ద్రవ్యోల్బణం నెలకొంది. జూలైలో ఇది మైనస్ 2.43 శాతంగా ఉంది.
- తయారీ ఉత్పత్తుల విభాగంలో టోకు ద్రవ్యోల్బణం జూలైలో 2.05 శాతంగా ఉంటే, ఆగస్టులో 2.55 శాతానికి పెరిగింది.

7 ఐపీవోలకు ఓకే

తాజాగా సెబీ గ్రీన్ సిగ్నల్

జాబితాలో కెనరా హెచ్ఎస్‌బీసీ, ఫైన్ ల్యాబ్స్ హీరో మోటార్స్, ఎంటీఆర్ ఫుడ్స్, కెనరా రొబెకో

కొద్ది నెలలుగా సెకండరీ మార్కెట్లు ఊగిసలాడుతున్నప్పటికీ ప్రైమరీ మార్కెట్లు కళకళలాడుతున్నాయి. పబ్లిక్ ఇష్యూ చేపట్టేందుకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సెబీ తాజాగా 7 కంపెనీలను అనుమతించింది. జాబితాలో కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్,కెనరా రొబెకో, హీరో మోటర్స్ తదితర కంపెనీలున్నాయి. ఈ కేలండర్ ఏడాదిలో ఇప్పటికే 55 కంపెనీలు పబ్లిక్ ఇష్యూ చేపట్టడం ద్వారా సుమారు రూ. 75,000 కోట్లు సమీకరించాయి. మరో 12 కంపెనీలు రెండు, మూడు వారాల్లో ఐపీవోకు రానున్నాయి. తాజా వివరాలు చూద్దాం..



న్యూఢిల్లీ: దేశీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో ఇటీవల జోరుగా లిస్టవుతున్న పలు కంపెనీల బాటలో మరో 7 కంపెనీలు ఐపీవో చేపట్టేందుకు దారి ఏర్పడింది. సెబీ తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో నిధుల సమీకరణ బాటలో సాగనున్నాయి. ఐపీవోకు అనుమతి పొందిన కంపెనీల జాబితాలో కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్, కెనరా రొబెకో ఏఎంసీ, హీరో మోటార్స్‌సహా ఎమ్వీ ఫొటోవోల్టాయిక్ పవర్, ఫైన్ ల్యాబ్స్, మణిపాల్ పేమెంట్ అండ్ ఐడెంటిటీ సొల్యూషన్స్, ఎంటీఆర్ ఫుడ్స్ చేరాయి. ఈ ఏడాది(2025) ఏప్రిల్–జూలై మధ్య ఈ కంపెనీలన్నీ సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు చేశాయి. వెరసి ఈ 7 కంపెనీలు ఉమ్మడిగా రూ. 10,000 కోట్లకుపైగా సమీకరించే వీలున్నట్లు మర్చంట్ వర్గాలు తెలియజేశాయి. అత్యధిక శాతం కంపెనీలు ఈక్విటీ జారీ నిధులను ప్రధానంగా వ్యాపార విస్తరణ, రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనున్నాయి. మరోవైపు ఆఫర్ ఫర్ సేల్ ద్వారా ప్రస్తుత వాటాదారులకు తమ పెట్టుబడులు విక్రయించేందుకు సైతం వీలు కల్పించనున్నాయి.

జీవిత బీమా సంస్థ

పీఎస్‌యూ దిగ్గజం కెనరా బ్యాంక్ బీమా అనుబంధ సంస్థ కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ పబ్లిక్ ఇష్యూకి రానుంది. ఇందుకు సెబీ తాజాగా క్లియరెన్స్ ఇచ్చినట్లు కెనరా బ్యాంక్ వెల్లడించింది. ప్రాస్పెక్టస్ ప్రకారం ఇష్యూలో భాగంగా సంస్థ 23.75 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచనుంది. వీటిలో కెనరా బ్యాంక్ 13.77 కోట్ల షేర్లు, ప్రభుత్వ రంగ దిగ్గజం పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) 9.5 కోట్ల షేర్లు చొప్పున ఆఫర్ చేయనున్నాయి. ఈ బాటలో హెచ్ఎస్‌బీసీ ఇన్సూరెన్స్(ఆసియా పసిఫిక్) హోల్డింగ్స్ సైతం 47 లక్షల షేర్లు విక్రయించనుంది. కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్‌ను కెనరా బ్యాంక్, పీఎన్‌బీ, హెచ్ఎస్‌బీసీ గ్రూప్ ప్రమోట్ చేశాయి. 2024 మార్చికల్లా నిర్వహణలోని ఆస్తుల(ఏయూఎం)రీత్యా మూడో పెద్ద కంపెనీగా నిలుస్తోంది.

ఫిన్‌టెక్ కంపెనీ

పీఈ దిగ్గజాలు టిమాసెక్, పీక్ 15 పార్ట్‌నర్స్ తదితరాలకు పెట్టుబడులున్న ఫిన్‌టెక్ కంపెనీ ఫైన్ ల్యాబ్స్ ఐపీవోలో భాగంగా రూ. 2,600 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతే కాకుండా ప్రస్తుత వాటాదారులు మరో 14.78 కోట్లకుపైగా షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. లోక్‌వీర్ కపూర్‌సహా.. టిమాసెక్, పీక్ 15 పార్ట్‌నర్స్, యాక్సిస్ తదితర సంస్థలు షేర్లను ఆఫర్ చేయనున్నాయి. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 870 కోట్లు రుణ చెల్లింపులకు, మరో రూ. 760 కోట్లు క్లౌడ్, డిజిటల్ చెక్‌ఔట్ పాయింట్లు తదితర ఐటీ మౌలికసదుపాయాలపై వెచ్చించనుంది.

రూ. 1,200 కోట్లపై కన్ను

పబ్లిక్ ఇష్యూలో భాగంగా హీరో మోటార్స్ రూ. 800 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా ప్రమోటర్లు మరో రూ. 400 కోట్ల విలువైన షేర్లను ఆఫర్ చేయనున్నారు. వెరసి ఇష్యూ ద్వారా కంపెనీ రూ. 1,200 కోట్లు సమకూర్చుకునే యోచనలో ఉంది. ప్రమోటర్ సంస్థలలో ఓపీ ముంజాల్ హోల్డింగ్స్ రూ. 390 కోట్ల విలువైన ఈక్విటీని విక్రయానికి ఉంచనుంది. ఈక్విటీ జారీ నిధులలో రూ. 285 కోట్లు రుణ చెల్లింపులకు, యూపీలోని గౌతమ్ బుద్ధ నగర్‌లోగల యూనిట్ విస్తరణకు రూ. 237 కోట్లు(పరికరాల కొనుగోలుకి) వెచ్చించనుంది.

అసెట్ మేనేజ్‌మెంట్

ఐపీవోలో భాగంగా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ(ఏఎంసీ).. కెనరా రొబెకో ఏఎంసీ 4.98 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనుంది. వీటిని సంస్థ ప్రమోటర్లు కెనరా బ్యాంక్(2.59 కోట్ల షేర్లు), ఓరిక్స్ కార్పొరేషన్ యూరోప్ ఎన్‌వీ(2.39 కోట్ల షేర్లు) ఆఫర్ చేయనున్నాయి. వెరసి ఐపీవో నిధులు కంపెనీకికాకుండా ప్రమోటర్లకు చేరనున్నాయి.

సోలార్ పరికరాలు

ఐపీవో ద్వారా సోలార్ పరికరాల తయారీ కంపెనీ ఎమ్వీ ఫొటోవోల్టాయిక్ పవర్ రూ. 3,000 కోట్లు అందుకోవాలని ప్రణాళికలు వేసింది. వీటిలో తాజా ఈక్విటీ జారీ ద్వారా రూ. 2,144 కోట్లు, ప్రమోటర్ల షేర్ల విక్రయం ద్వారా మరో రూ. 856 కోట్లు చొప్పున సమీకరించాలని భావిస్తోంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 1,608 కోట్లు అనుబంధ సంస్థలతోపాటు కంపెనీ రుణ చెల్లింపులకు వినియోగించనుంది.

ఒర్క్లా ఇండియా

ఎంటీఆర్ ఫుడ్స్, ఈస్టర్న్ బ్రాండ్లతో సుగంధ ద్రవ్యాలు, మసాలా దినుసులు విక్రయించే ఒర్క్లా ఇండియా(మాతృ సంస్థ) ఐపీవో ద్వారా 2.28 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనుంది. వీటిని కంపెనీ ప్రమోటర్లతోపాటు.. ప్రస్తుత వాటాదారులు ఆఫర్ చేయనున్నారు.

మణిపాల్ పేమెంట్

బ్యాంకింగ్ సేవలు, స్మార్ట్ కార్డ్ తయారీ కంపెనీ మణిపాల్ పేమెంట్ అండ్ ఐడెంటిటీ సొల్యూషన్స్ పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ. 1,200 కోట్లు సమకూర్చుకునే యోచనలో ఉంది.

ఐవేల్యూ ఇన్ఫో @ రూ. 284-299

- ఈ నెల 18–22 మధ్య ఐపీవో
- రూ. 560 కోట్ల సమీకరణకు సై



న్యూఢిల్లీ: పీఈ సంస్థ క్రియేడర్‌కు పెట్టుబడులున్న ఐవేల్యూ ఇన్ఫోసొల్యూషన్స్ పబ్లిక్ ఇష్యూకి రూ. 284–299 ధరల శ్రేణి నిర్ణయించింది. ఈ నెల 18న ప్రారంభంకానున్న ఇష్యూలో భాగంగా ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు 1.87 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. 22న ముగియనున్న ఇష్యూ ద్వారా రూ. 560 కోట్లు సమీకరించాలని భావిస్తున్నారు. లిస్టయితే కంపెనీ విలువ రూ. 1,600 కోట్లుగా నమోదయ్యే వీలుంది. ఐపీవోలో భాగంగా ప్రమోటర్లు 38 లక్షల షేర్లు ఆఫర్ చేయనుండగా.. క్రియేడర్ 1.1 కోట్ల షేర్లు విక్రయించనుంది. వెరసి ఇష్యూ నిధులు కంపెనీకి లభించవు. 2008లో ఏర్పాటైన కంపెనీ ప్రధానంగా ఎంటర్‌ప్రైజ్ టెక్నాలజీ సొల్యూషన్లు అందిస్తోంది. డిజిటల్ అప్లికేషన్‌తోపాటు డేటా సెక్యూరింగ్, మేనేజింగ్ సొల్యూషన్లు సమకూర్చుతోంది.



ఆగస్టులో 9% తగ్గిన ప్యాసింజర్ వాహన విక్రయాలు

ద్విచక్ర వాహన అమ్మకాల్లో 7% వృద్ధి
- డీలర్లకు సరఫరా తగ్గించిన కంపెనీలు
- సియామ్ గణాంకాల వెల్లడి

న్యూఢిల్లీ: దేశీయంగా ఈ ఆగస్టులో 3,21,840 ప్యాసింజర్ వాహనాలు అమ్ముడైనట్లు వాహన తయారీదారుల సంఘం సియామ్ తెలిపింది. తగ్గిన డిమాండ్‌కు అనుగుణంగా కంపెనీలు డీలర్లకు సరఫరాను సర్దుబాటు చేసినట్లు పేర్కొంది. 2024 ఇదే ఆగస్టులో అమ్ముడైన 3,52,921 వాహనాలతో పోలిస్తే ఈసారి 9% తగ్గాయి. ''జీఎస్టీ రేట్ల సవరణ కారణంగా ధరలు తగ్గే వీలుందని అంచనా వేసిన కస్టమర్లు వాహన కొనుగోలు నిర్ణయాన్ని వాయిదా చేసుకున్నారు. దీంతో ఆగస్టులో డిమాండ్ తగ్గింది. అందుకు తగ్గట్లు కంపెనీలు సైతం డీలర్లకు సరఫరా సర్దుబాటు చేశాయి.'' అని సియామ్ ప్రకటనలో తెలిపింది.

- అయితే ద్విచక్ర అమ్మకాల్లో 7% వృద్ధి నమోదైంది. ఆగస్టులో మొత్తం 18,33,921 అమ్మకాలు జరిగాయి. గతేడాది ఇదే నెలలో విక్రయాలు 17,11,662 యూనిట్లుగా ఉన్నాయి. మోటార్ సైకిళ్ల విక్రయాలు 10,60,866 నుంచి 11,06,638కు; స్కూటర్ల అమ్మకాలు 6,43,169 నుంచి 6,83,397కు పెరిగాయి. అయితే మోపెడ్లు మాత్రం 44,546 నుంచి 43,886కు పరిమితమయ్యాయి.
- త్రి చక్ర వాహన విక్రయాలు రికార్డు స్థాయిలో 8% వృద్ధి నమోదైంది. ఆగస్టులో 69,962 నుంచి 75,759 యూనిట్లకు పెరిగాయి.
- ''కేంద్రం జీఎస్టీ రేట్ల తగ్గింపు నిర్ణయంతో అందుబాటు ధరల వాహనాలు కస్టమర్లను ఆకర్షిస్తాయి. అలాగే పండుగ ఉత్సాహానికి మరింత ఉపకరిస్తుంది'' అని సియామ్ డైరెక్టర్ జనరల్ రాజేశ్ మీనన్ తెలిపారు.

హైదరాబాద్‌లో '1 ఫైనాన్స్' ప్లానింగ్ సెంటర్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆర్థిక సలహా సేవల సంస్థ 1 ఫైనాన్స్ తమ ఫైనాన్షియల్ ప్లానింగ్ సెంటర్‌ని ప్రారంభించింది. ముంబై తర్వాత ఇది తమకు రెండో కార్యాలయం అని సంస్థ తెలిపింది. ఇన్వెస్ట్‌మెంట్, ట్యాక్స్ ప్లానింగ్, ఇన్సూరెన్స్, రుణాలు, రిటైర్మెంట్ తదితర అంశాలకు సంబంధించి కంపెనీ అడ్వైజరీ సేవలు అందిస్తుంది. పర్సనల్ ఫైనాన్స్‌కి సంబంధించి అవగాహన పెంచే దిశగా వర్క్‌షాప్‌లు, సెమినార్లు మొదలైనవి హైదరాబాద్ సెంటర్లో నిర్వహించనున్నట్లు 1 ఫైనాన్స్ వైస్ ప్రెసిడెంట్ అనుజ్ మెహతా తెలిపారు. బెంగళూరు, పుణె తదితర నగరాలకు విస్తరిస్తున్నట్లు వివరించారు.

23 నుంచి ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్



బెంగళూరు: ఈ–కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ సెప్టెంబర్ 23 నుంచి ది బిగ్ బిలియన్ డేస్ (టీబీబీడీ) సేల్ ప్రారంభించనున్నట్లు వెల్లడించింది. ఫ్లిప్‌కార్ట్ బ్లాక్, ప్లస్ మెంబర్లకు ముందు రోజు నుంచి ఇది అందుబాటులో ఉంటుందని వివరించింది. మొబైల్స్, ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్, ఉపకరణాలు మొదలైన ఉత్పత్తులపై భారీ ఆఫర్లను పొందవచ్చని పేర్కొంది. మెట్రోలు, ద్వితీయ శ్రేణి నగరాల్లో 3,000 పిన్‌కోడ్స్‌వ్యాప్తంగా 10 నిమిషాల ఫ్లిప్‌కార్ట్ మినిట్స్ సర్వీసులు పెద్ద ఎత్తున అందుబాటులో ఉంటాయని వివరించింది. టీబీబీడీ 12వ ఎడిషన్‌కి శాంసంగ్ గెలాక్సీ ఏఐ టైటిల్ స్పాన్సర్‌గా, 'ఇంటెల్ కోర్' టెక్నాలజీ స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది. టీబీబీడీ కింద యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డులపై 10 శాతం ఇన్‌స్టంట్ బ్యాంక్ డిస్కౌంటు, సూపర్‌కాయిన్స్ మొదలైన ప్రయోజనాలు పొందవచ్చు.

రద్దవుతున్న కారు రుణాలు

- జీఎస్‌టీ రేట్ల సవరణ ప్రభావం
- ధరలు తగ్గిన తర్వాత కొనే యోచనలో కస్టమర్లు



న్యూఢిల్లీ: జీఎస్‌టీ రేట్ల తగ్గింపు నేపథ్యంలో తమ కారు రుణం రద్దు చేయాలని కోరుతూ బ్యాంక్‌లకు అభ్యర్థనలు పెరిగిపోతున్నాయి. 1,200సీసీ వరకు సామర్థ్యం కలిగిన కార్లను 28 శాతం నుంచి 18 శాతం జీఎస్‌టీ శ్లాబు కిందకు మారుస్తూ జీఎస్‌టీ కౌన్సిల్ నిర్ణయం తీసుకోవడం తెలిసిందే. వీటితోపాటు 40 శాతం శ్లాబులోకి మార్చినప్పటికీ, అదనపు లెవీలు లేకపోవడంతో ఖరీదైన కార్ల ధరలు సైతం తగ్గనున్నాయి. ఈ నెల 22 నుంచి కొత్త రేట్లు అమల్లోకి రానున్నాయి. ఇప్పటికే పలు ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీలు కార్ల ధరలను తగ్గిస్తున్నట్టు ప్రకటించాయి. ఒక్కో కారుపై రూ.3 లక్షల వరకు ధర తగ్గనుంది. దీంతో ఇప్పటికే కార్ల కొనుగోలుకు రుణ ఆమోదాలను పొందిన కస్టమర్లు బ్యాంక్ శాఖలను సంప్రదిస్తున్నారు. జీఎస్‌టీ కొత్త రేట్లు అమల్లోకి వచ్చిన తర్వాతే కారు కొనుగోలు చేసుకుంటామని బ్యాంక్ అధికారులకు తెలియజేస్తున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వరంగ బ్యాంక్ సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. రుణాన్ని రద్దు చేసుకోవడం వల్ల నష్టపోయే దాని కంటే జీఎస్‌టీలో మార్పుల ఫలితంగా ఒక్కో కారుపై తగ్గే ధర అధికంగా ఉంటున్నట్టు చెప్పారు. దీంతో కొత్త రేట్లు అమల్లోకి వచ్చిన తర్వాత తిరిగి రుణానికి దరఖాస్తు చేసుకోవాలనే యోచనలో కస్టమర్లు ఉన్నట్టు తెలిపారు.

హైఎండ్ వేరియంట్స్ పట్ల ఆసక్తి

కారు డీలర్లు ఇప్పటికే జారీ చేసిన ఇన్వాయిస్‌లకు సంబంధించి పాత జీఎస్‌టీ రేట్లు అమలవుతాయని పరోక్ష పన్నుల కేంద్ర మండలి (సీబీఐసీ) సీనియర్ అధికారి ఒకరు స్పష్టం చేశారు. దీని ప్రకారం సెప్టెంబర్ 22 నుంచి జారీ చేసే ఇన్వాయిస్‌లకు కొత్త రేట్లు అమలవుతాయని తెలుస్తోంది. ధరలు తగ్గడంతో మరిన్ని ఫీచర్లు ఉన్న మెరుగైన మోడళ్లకు వెళ్లాలని కొందరు కొనుగోలు దారులు భావిస్తుండడం గమనార్హం. ప్రస్తుతం కార్లపై 28 శాతం జీఎస్‌టీతోపాటు, వాటి సామర్థ్యానికి అనుగుణంగా ఒక శాతం నుంచి 22 శాతం వరకు కాంపన్సేషన్ సెస్సును అమలు చేస్తున్నారు. దీంతో నికర రేటు 29% నుంచి 50 శాతం మధ్య ఉంటోంది. సెప్టెంబర్ 22 నుంచి 1,200 సీసీ సామర్థ్యం మించని పెట్రోల్, 1,500 సీసీ సామర్థ్యం మించని డీజిల్ కార్లపై 18 శాతం జీఎస్‌టీ రేటు, అంతకుమించిన వాటికి 40 శాతం రేటు అమల్లోకి రానుంది.

ఇంగ్లండ్‌లో భారత్-పాక్ హాకీ మ్యాచ్‌లు

2026 ప్రొ లీగ్‌లో తలపడనున్న చిరకాల ప్రత్యర్థులు



లుసానే: అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్‌ఐహెచ్) హాకీ ప్రొ లీగ్ కొత్త సీజన్ ఈ డిసెంబర్‌లోనే మొదలవుతుంది. 2025-26కు సంబంధించిన ప్రొ లీగ్ డిసెంబర్ 9 నుంచి అర్జెంటీనా, ఐర్లాండ్‌లలో జరుగుతుందని హాకీ వర్గాలు తెలిపాయి. ఈ సీజన్‌లో ఐర్లాండ్ మహిళల జట్టు, పాకిస్తాన్ పురుషుల జట్టు కొత్తగా చేరుతున్నాయి. ఈ రెండు జట్లు నేషన్స్ కప్ హాకీ టోర్నమెంట్ నుంచి అర్హత సాధించినట్లు ఎఫ్‌ఐహెచ్ తెలిపింది. వచ్చే సీజన్ మొత్తం 10 దేశాల్లో జరుగనుంది. రికార్డుస్థాయిలో 144 మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. భారత్‌లో ఫిబ్రవరి 10 నుంచి 15 వరకు జరుగుతాయి. భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య జూన్ 23 నుంచి 28 మధ్య ఇంగ్లండ్ వేదికగా రెండు మ్యాచ్‌లు జరుగుతాయి.

ఈ లీగ్‌లో విజేతగా నిలిచిన జట్టు 2028 ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తాయి. డిసెంబర్ 9న జరిగే పురుషుల ఈవెంట్ తొలి మ్యాచ్‌లో జర్మనీతో బెల్జియం తలపడుతుంది. దీంతో పాటు ఇంగ్లండ్ ఆడే మ్యాచ్‌లు కూడా ఐర్లాండ్‌లోనే జరుగుతాయి. అదే రోజు అర్జెంటీనాలో జరిగే మ్యాచ్‌లో ప్రస్తుత చాంపియన్ నెదర్లాండ్స్‌తో పాకిస్తాన్ ఢీకొంటుంది. అనంతరం చైనా, స్పెయిన్, ఆస్ట్రేలియా, భారత్, ఇంగ్లండ్, నెదర్లాండ్స్, బెల్జియం, జర్మనీలలో జూన్ 28 వరకు లీగ్ దశ మ్యాచ్‌లే జరుగుతాయి.

పతకం రేసులో సుజీత్, విక్కీ

జాగ్రెబ్: ప్రపంచ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ ఫ్రీస్టయిల్ విభాగంలో భారత రెజ్లర్లు సుజీత్ కల్కాల్ (65 కేజీలు), విక్కీ (97 కేజీలు) పతకం రేసులో ఉన్నారు. సోమవారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో సుజీత్ 5-6తో రహమాన్ అమూజాద్‌ఖలీలి (ఇరాన్) చేతిలో, విక్కీ 0-10తో అమీరలీ అజర్‌పిరా (ఇరాన్) చేతిలో ఓడిపోయారు. రహమాన్, అమీరలీ ఫైనల్‌కు చేరుకోవడంతో నేడు 'రెపిచాజ్' రౌండ్‌ల ద్వారా సుజీత్, విక్కీలకు కాంస్య పతక మ్యాచ్‌లకు అర్హత సాధించే అవకాశం లభించింది.



దుప్లాంటిస్... ప్రపంచ రికార్డు నంబర్ 14



పోల్ వాల్ట్‌లో స్వీడన్ అథ్లెట్ అద్భుతం

- 6.30 మీటర్ల ఎత్తుకు ఎగిరి కొత్త చరిత్ర
- వరుసగా మూడోసారి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సొంతం
- సెర్గీ బుబ్కా తర్వాత ఈ ఘనత సాధించిన రెండో పోల్ వాల్టర్‌గా గుర్తింపు

ఊహించిన అద్భుతమే జరిగింది. పోల్ వాల్ట్‌లో మరోసారి ప్రపంచ రికార్డు బద్దలయింది. మారింది వేదిక మాత్రమే... ప్రపంచ రికార్డు సృష్టించిన వ్యక్తి మాత్రం మారలేదు... వరల్డ్ రికార్డు నెలకొల్పడం... మళ్లీ దానిని సవరించడం... తన ఖాతాలో పసిడి పతకం వేసుకోవడం... సమీప ప్రత్యర్థులను రెండో స్థానానికే పరిమితం చేయడం... పోల్ వాల్ట్ క్రీడాంశం పేరు చెబితే తనను తప్పనిసరిగా గుర్తు చేసుకునేలా రోజురోజుకూ రాటుదేలుతూ దూసుకుపోతున్న ఆ అథ్లెట్ ఎవరో కాదు... స్వీడన్ స్టార్ అర్మాండో దుప్లాంటిస్... బరిలో దిగితే ప్రపంచ రికార్డుపైనే గురి పెట్టే ఈ సూపర్ స్టార్ పోల్ వాల్టర్ సోమవారం టోక్యోలో మెరిశాడు. కళ్లు చెదిరే ప్రదర్శనతో తన ఖాతాలో 14వ ప్రపంచ రికార్డు వేసుకోవడంతోపాటు... ప్రపంచ చాంపియన్‌షిప్ చరిత్రలో వరుసగా మూడు స్వర్ణాలు సాధించి... ఈ క్రీడాంశంలో దిగ్గజం సెర్గీ బుబ్కా సరసన దుప్లాంటిస్ చేరాడు.



టోక్యో: అథ్లెటిక్స్ అభిమానులందరూ ఆసక్తిగా ఎదురుచూసిన పురుషుల పోల్ వాల్ట్ ఈవెంట్‌లో ప్రపంచ, ఒలింపిక్ చాంపియన్ అర్మాండో దుప్లాంటిస్ అలరించాడు. సోమవారం జరిగిన ఫైనల్లో స్వీడన్‌కు చెందిన 25 ఏళ్ల దుప్లాంటిస్ కొత్త ప్రపంచ రికార్డు సృష్టించడంతోపాటు పసిడి పతకాన్ని కైవసం చేసుకున్నాడు. 6.30 మీటర్ల ఎత్తుకు ఎగిరిన దుప్లాంటిస్ తన కెరీర్‌లో 14వ సారి ప్రపంచ రికార్డును లిఖించాడు. గత నెలలో హంగేరి రాజధాని బుడాపెస్ట్‌లో జరిగిన మీట్‌లో 6.29 మీటర్లతో తానే నెలకొల్పిన ప్రపంచ రికార్డును దుప్లాంటిస్ సవరించాడు. విజేతగా నిలిచిన దుప్లాంటిస్‌కు 70 వేల డాలర్లు (రూ. 61 లక్షల 68 వేలు) ప్రైజ్‌మనీగా, ప్రపంచ రికార్డు సృష్టించినందుకు లక్ష డాలర్లు (రూ. 88 లక్షల 12 వేలు) బోనస్‌గా లభించాయి. 12 మంది పోటీపడ్డ ఫైనల్లో దుప్లాంటిస్ తన ఆరో ప్రయత్నంలో 6.15 మీటర్ల ఎత్తును అధిగమించి స్వర్ణ పతకాన్ని ఖాయం చేసుకున్నాడు. కరాలిస్ (గ్రీస్; 6 మీటర్లు) రజత పతకం నెగ్గగా... కుర్టిస్ మార్షల్ (ఆస్ట్రేలియా; 5.95 మీటర్లు) కాంస్య పతకాన్ని దక్కించుకున్నాడు. పసిడి పతకం ఖాయమయ్యాక దుప్లాంటిస్ ప్రపంచ రికార్డుపై గురి పెట్టాడు. తొలి రెండు ప్రయత్నాల్లో 6.30 మీటర్ల ఎత్తును అధిగమించడంలో విఫలమైన దుప్లాంటిస్ మూడో ప్రయత్నంలో సఫలమై ప్రపంచ రికార్డును అందుకున్నాడు. దుప్లాంటిస్ కెరీర్‌లో ఇది వరుసగా 49వ విజయంకాగా... మేజర్ టోర్నీల్లో ఐదో టైటిల్. టోక్యో ఒలింపిక్స్, పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకాలు గెలిచిన దుప్లాంటిస్.. 2022 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో, 2023 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకాలు సాధించాడు. తాజా విజయంతో దుప్లాంటిస్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 'హ్యాట్రిక్' స్వర్ణాలను సొంతం చేసుకున్నాడు. సెర్గీ బుబ్కా తర్వాత వరుసగా మూడు ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో బంగారు పతకాలు గెలిచిన రెండో పోల్ వాల్టర్‌గా దుప్లాంటిస్ గుర్తింపు పొందాడు. సెర్గీ బుబ్కా (సోవియట్ యూనియన్/ఉక్రెయిన్) వరుసగా ఆరు ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో (1983, 1987, 1991, 1993, 1995, 1997) స్వర్ణ పతకాలు సాధించాడు.

సెంట్రల్ చేతికి 'దులీప్ ట్రోఫీ'

ఫైనల్లో 6 వికెట్లతో సౌత్‌జోన్‌పై గెలుపు ● 11 ఏళ్ల తర్వాత మళ్లీ టైటిల్ సొంతం

బెంగళూరు: దేశవాళీ క్రికెట్ టోర్నీ 'దులీప్ ట్రోఫీ' విజేతగా సెంట్రల్ జోన్ నిలిచింది. ఐదు రోజుల పాటు జరిగిన ఫైనల్లో సెంట్రల్ జట్టు 6 వికెట్ల తేడాతో సౌత్ జోన్‌పై విజయం సాధించింది. 11 ఏళ్ల తర్వాత సెంట్రల్ జోన్ 'దులీప్'ను చేజిక్కించుకుంది. ఆఖరి రోజు సోమవారం సులువైన లక్ష్యంతో బరిలోకి దిగిన సెంట్రల్ జట్టు తడబడింది. సౌత్ బౌలర్లు అంత సులువుగా మ్యాచ్‌ను అప్పగించలేదు. కాసేపు సెంట్రల్ బ్యాటర్లను వణికించారు. దీంతో సెంట్రల్ జోన్ 65 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు ఏకంగా 4 వికెట్లను కోల్పోవాల్సి వచ్చింది. ఐదో రోజు ఆటలో లక్ష్యఛేదన కోసం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన సెంట్రల్ జోన్ 20.3 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 66 పరుగులు చేసి గెలిచింది. తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో యశ్ రాథోడ్ (16 బంతుల్లో 13 నాటౌట్; 1 ఫోర్), ఓపెనర్ అక్షయ్ వాడ్కర్ (52 బంతుల్లో 19 నాటౌట్; 3 ఫోర్లు) అజేయంగా నిలిచారు. ఆరంభంలోనే సౌత్‌జోన్ బౌలర్లు అంకిత్ శర్మ (2/22), గుర్‌జప్‌నీత్ (2/21) కట్టుదిట్టమైన బౌలింగ్‌తో వికెట్లు తీయడంతో ఆ కాస్త లక్ష్యాన్ని ఛేదించేందుకు సెంట్రల్ జోన్ కష్టపడింది. ఓపెనర్ దానిశ్ మాలేవర్ (5), శుభమ్ శర్మ (8), సారాంశ్ జైన్ (4), కెప్టెన్ రజత్ పాటీదార్ (13) అవుట్ కావడంతో 49 పరుగుల వద్ద 4 ప్రధాన వికెట్లను కోల్పోయింది. యశ్ రాథోడ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డుతోపాటు రూ. 50 వేలు ప్రైజ్‌మనీ... ఈ టోర్నీలో 16 వికెట్లతో పాటు 136 పరుగులు కూడా చేసిన సారాంశ్ జైన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డుతోపాటు రూ. 2 లక్షల 50 వేల ప్రైజ్‌మనీ... 'స్ట్రయికర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు నెగ్గిన దానిశ్ మాలేవర్‌కు రూ. 1 లక్ష 50 వేలు ప్రైజ్‌మనీ దక్కింది. విజేతగా నిలిచిన సెంట్రల్ జోన్ జట్టుకు రూ. 1 కోటీ... రన్నరప్ సౌత్ జోన్ జట్టుకు రూ. 50 లక్షలు ప్రైజ్‌మనీ లభించింది. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్ విజేత జట్టుకు ట్రోఫీ అందజేశాడు. ఈ సీజన్‌లో పాటీదార్ రెండు ట్రోఫీలను అందుకున్నాడు. ఇప్పటికే ఐపీఎల్‌లో తొలిసారి రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)ను విజేతగా నిలిపాడు. వచ్చే నెల 15 నుంచి రంజీ ట్రోఫీ ప్రారంభం కానుంది.



ఈ ఏడాది నుంచి యూత్ లీగ్ ఫుట్‌బాల్ టోర్నీ

టీఎఫ్‌ఏ చైర్మన్ కేటీ మహీ ప్రకటన



సాక్షి, హైదరాబాద్: చిన్నారుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ ఏడాది నుంచి కొత్తగా అండర్-13, అండర్-15 వయో విభాగాల్లో యూత్ లీగ్‌ను నిర్వహిస్తామని తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ (టీఎఫ్‌ఏ) చైర్మన్ కేటీ మహీ ప్రకటించారు. నిజాం క్లబ్‌లో జరిగిన టీఎఫ్‌ఏ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ విషయంపై తీర్మానం చేశారు. యూత్ లీగ్‌లో పాల్గొనేందుకు వచ్చే అన్ని జిల్లాల జట్లకు ఉచిత వసతి సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని మహీ హామీ ఇచ్చారు. అంతేకాకుండా తెలంగాణ మహిళల లీగ్‌ను కూడా నిర్వహించామని, విజేత జట్టును ఇండియన్ ఉమెన్ లీగ్-2కు నామినేట్ చేశామని ఆయన వివరించారు. కరీంనగర్ జిల్లాకు చెందిన గణపతిని టీఎఫ్‌ఏ కోశాధికారి పదవికి నామినేట్ చేశారు. ఈ సమావేశంలో టీఎఫ్‌ఏ అధ్యక్షుడు రాఫత్ అలీ, జనరల్ సెక్రటరీ జీపీ ఫాల్గుణ, న్యాయ సలహాదారు అశోక్ ఆనంద్ పాల్గొన్నారు.

అర్జున్‌కు ఆరో స్థానం



సమర్‌కండ్ (ఉజ్బెకిస్తాన్): గ్రాండ్ స్విస్ అంతర్జాతీయ చెస్ టోర్నీ ఓపెన్ విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్లకు నిరాశ ఎదురైంది. టాప్-2లో నిలువకపోవడంతో ఈ టోర్నీ ద్వారా భారత్ నుంచి ఎవరూ వచ్చే ఏడాది జరిగే క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత పొందలేకపోయారు. నిర్ణీత 11 రౌండ్ల తర్వాత భారత్ నుంచి అత్యుత్తమ ప్రదర్శన తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ నుంచి వచ్చింది. అర్జున్ మొత్తం 7 పాయింట్లు స్కోరు చేసి 6వ స్థానంలో నిలిచాడు. భారత ఇతర గ్రాండ్‌మాస్టర్లు నిహాల్ సరీన్ (7 పాయింట్లు) 9వ స్థానంలో, విదిత్ (7 పాయింట్లు) 15వ స్థానంలో, ప్రణవ్ (6.5 పాయింట్లు) 22వ స్థానంలో, పెంటేల హరికృష్ణ (6.5 పాయింట్లు) 26వ స్థానంలో, ప్రజ్ఞానంద (6 పాయింట్లు) 35వ స్థానంలో, ఆదిత్య మిట్టల్ (6 పాయింట్లు) 37వ స్థానంలో, ఎస్‌ఎల్ నారాయణన్ (6 పాయింట్లు) 39వ స్థానంలో, ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్ (6 పాయింట్లు) 41వ స్థానంలో, రౌనక్ సాధ్వాని (6 పాయింట్లు) 48వ స్థానంలో, ఆర్యన్ చోప్రా (5.5 పాయింట్లు) 58వ స్థానంలో, పురాణిక్ అభిమన్యు (5 పాయింట్లు) 73వ స్థానంలో, లియోన్ ల్యూక్ మెండోంకా (5 పాయింట్లు) 75వ స్థానంలో, మురళీ కార్తికేయన్ (4.5 పాయింట్లు) 102వ స్థానంలో నిలిచారు. స్కోరు సమమైతే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించారు.

ఆకట్టుకున్న దివ్య దేశ్‌ముఖ్



తొలిసారి ఓపెన్ విభాగంలో (పురుషుల ఈవెంట్‌లో మహిళలు పాల్గొనవచ్చు) పోటీపడ్డ భారత మహిళా గ్రాండ్‌మాస్టర్, ప్రపంచ కప్ విజేత దివ్య దేశ్‌ముఖ్ ఆకట్టుకునే ప్రదర్శన చేసింది. నిర్ణీత 11 రౌండ్ల తర్వాత దివ్య 5 పాయింట్లతో 81వ స్థానంలో నిలిచింది. తనకంటే (2478) ఎంతో మెరుగైన రేటింగ్ పాయింట్లు కలిగిన 11 మంది పురుష గ్రాండ్‌మాస్టర్లతో దివ్య ఆడింది. ఇద్దరు గ్రాండ్‌మాస్టర్లు అమిన్ బాసెమ్ (ఈజిప్ట్), వెలిమిర్ ఇవిచ్ (సెర్బియా) దివ్య చేతిలో ఓడిపోయారు. మరో ఇద్దరు గ్రాండ్‌మాస్టర్లు అభిమన్యు పురాణిక్ (భారత్), సనన్ జుగిరోవ్ (హంగేరి) దివ్యపై గెలిచారు. మిగతా ఆరుగురు గ్రాండ్‌మాస్టర్లు అలెగ్జాండర్ డోన్‌చెంకో (జర్మనీ), మురళీ కార్తికేయన్ (భారత్), గాబ్రియేల్ సర్గిసియాన్ (అర్మేనియా), దొమ్మరాజు గుకేశ్ (భారత్), అలెగ్జాండర్ ఇండిక్ (సెర్బియా), ఇవాన్ చెపరినోవ్ (బల్గేరియా) దివ్యతో గేమ్‌లను 'డ్రా' చేసుకున్నారు. ఈ టోర్నీ ద్వారా 19.6 రేటింగ్ పాయింట్లు సంపాదించిన దివ్య ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మూడు స్థానాలు ఎగబాకి 2497.6 పాయింట్లతో 11వ స్థానానికి చేరుకుంది.

తెలుగు టైటాన్స్ పరాజయం

హోరాహోరీ పోరులో గెలిచిన బెంగళూరు



జైపూర్: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్-12)లో తెలుగు టైటాన్స్‌కు బెంగళూరు బుల్స్ చేతిలో పరాజయం ఎదురైంది. సోమవారం జరిగిన హోరాహోరీ మ్యాచ్‌లో బెంగళూరు 34-32 పాయింట్ల తేడాతో టైటాన్స్‌పై గెలుపొందింది. మ్యాచ్ ముగిసే దశలో అనూహ్యంగా ఆధిక్యాన్ని కోల్పోయిన తెలుగు టైటాన్స్ చివరకు 2 పాయింట్ల తేడాతో ఓడిపోయింది. టైటాన్స్ జట్టులో ఆల్‌రౌండర్లు భరత్, కెప్టెన్ విజయ్ మలిక్ అదరగొట్టారు. 19 సార్లు కూతకెళ్లిన భరత్ 13 పాయింట్లు తెచ్చిపెట్టాడు. 18 సార్లు రెయిడింగ్ చేసిన విజయ్ 9 పాయింట్లు సాధించాడు. బెంగళూరు తరఫున అలీరెజా మిర్జాయిన్ (11) రాణించాడు. కీలక తరుణంలో పాయింట్లు చేసి జట్టును గెలిపించాడు. మిగతా వారిలో డిఫెండర్లు యోగేశ్ 3, దీపక్ శంకర్ 2, రెయిడర్ ఆకాశ్ షిండే 2 పాయింట్లు సాధించారు. ఈ సీజన్‌లో 6 మ్యాచ్‌లాడిన తెలుగు జట్టుకిది మూడో పరాజయం. అంతకుముందు జరిగిన తొలి మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 40-37తో గుజరాత్ జెయింట్స్‌పై గెలుపొందింది. స్టీలర్స్ తరఫున రెయిడర్లు శివమ్ పతారే (12), వినయ్ (8), డిఫెండర్లు జైదీప్ (6), సాహిల్ నర్వాల్ (4), రాహుల్ (3) రాణించారు. గుజరాత్ జట్టులో రెయిడర్ రాకేశ్ (14) చక్కని పోరాటం చేశాడు. 21 సార్లు కూతకెళ్లిన అతను 14 సార్లు విజయవంతంగా పాయింట్లు తెచ్చాడు. మిగతావారిలో నితిన్ పన్వార్ 3, లక్కీ శర్మ, శుభమ్ కుమార్ చెరో 2 పాయింట్లు చేశారు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో బెంగాల్ వారియర్స్‌తో యూపీ యోధాస్, తమిళ్ తలైవాస్‌తో బెంగళూరు బుల్స్ తలపడతాయి.

సాక్షి ప్లస్
మంగళవారం ၊ 16-9-2025

ఇండియాలో...



నవరాత్రి ఉత్సవాలు సమీపిస్తున్న వేళ సోమవారం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో సంప్రదాయ గార్బా నృత్యం ప్రాక్టీస్ చేస్తున్న యువతులు

ఇరాన్‌లో...



సోమవారం ఇరాన్‌లోని టెహ్రాన్ వర్సిటీ స్నాతకోత్సవం వేళ హిజాబ్‌కు నిరసనగా విద్యార్థినుల సెల్ఫీ

చైనాలో...



చైనాలోని గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్ షెంజెన్‌లో పిల్లి విగ్రహం వద్ద సోమవారం ఫొటోల ముచ్చట తీర్చుకుంటున్న యువతులు

కార్లతో సమానంగా ఏసీల కాలుష్యం

2035 కల్లా రెట్టింపు కానున్న ప్రమాదం

ఢిల్లీకి చెందిన ఐఫారెస్ట్ సంస్థ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: ఎండల తీవ్రత పెరిగిన కొద్దీ దేశంలో ఎయిర్ కండిషనర్లను కొనుగోలు చేసే వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఒకప్పటి విలాస ఉపకరణం నేడు ముఖ్యావసరంగా మారింది. ధనవంతులకు మాత్రమే పరిమితమైన ఏసీ ఇప్పుడు మధ్యతరగతి, దిగువ మధ్య తరగతి ప్రజల ఇళ్లలోనూ కనిపిస్తోంది. అయితే, కారు మాదిరిగానే ఏసీకూడా వాతావరణం మరింత వేడెక్కేందుకు కారణమవుతోందని తాజా అధ్యయనం హెచ్చరించింది. వాతావరణం కోణంలో చూస్తే ఏసీ కూడా ప్రమాదకరమైన గృహోపకరణమేనని ఢిల్లీకి చెందిన ఐఫారెస్ట్ సంస్థ సర్వే తేల్చింది. ఇంకా ఏం చెప్పిందంటే.. 2030 నాటికి భారత్‌లో గ్రీన్‌హౌస్ వాయువులను విడుదల చేసే అతిపెద్ద గృహోపకరణంగా ఎయిర్ కండిషనర్లు మారనున్నాయి. దేశంలో 2035 నాటికి వాతావరణంలో కలిసే కార్బన్ డయాక్సైడ్ రెట్టింపయ్యి 329 మిలియన్ టన్నులకు చేరుకోనుంది. 2024లో ఒక్క ఏడాదిలోనే ఎయిర్ కండిషనర్లు (ఏసీలు) 156 మిలియన్ టన్నుల కార్బన్ డయాక్సైడ్ సమాన ఉద్గారాలను విడుదల చేశాయని, ఇది దేశంలోని అన్ని ప్రయాణికుల కార్ల ఉద్గారాలకు సమానమని వెల్లడైంది. ఇందులో 52 మిలియన్ టన్నుల ఉద్గారాలు కూలింగ్ గ్యాస్ లీకేజీల (రెఫ్రిజిరెంట్లు) వల్లనే జరిగాయని పేర్కొంది. 2035 నాటికి ఏసీల వల్ల విడుదలయ్యే మొత్తం ఉద్గారాలు 329 మిలియన్ టన్నులకు పెరిగే అవకాశం ఉంది. ఇది ఇప్పటి వాటితో పోలిస్తే రెట్టింపునకు మించి ఉంటుందని నివేదిక పేర్కొంది. ఒక ఏసీని రెండేళ్లకోసారి గ్యాస్ రీఫిల్ చేయిస్తే, అది ఓ కారు విడుదల చేసేంత ఉద్గారాలను విడుదల చేస్తుంది. వాతావరణ పరంగా చూస్తే ఏసీ కూడా కారు లాంటిదే, అంతే ప్రమాదకరమైందని ఐఫారెస్ట్ అధ్యక్షుడు, సీఈవో చంద్ర భూషణ్ చెప్పారు. రెఫ్రిజిరెంట్ల తయారీదారులు ఉద్గారాలను మరింతగా అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకునేలా ఒత్తిడిపెంచాలి. ప్రభుత్వం జాతీయ రెఫ్రిజిరెంట్ డేటాబేస్ ఏర్పాటు చేయాలి. వాతావరణంపై తీవ్రప్రభావాన్ని తగ్గించేందుకు కఠినమైన నిబంధనలను అమలు చేయాలని పేర్కొన్నారు. ఈ చర్యలతో వచ్చే దశాబ్దంలో 500–650 మిలియన్ టన్నుల రెఫ్రిజిరెంట్ ఉద్గారాలను తగ్గించవచ్చని, వాటి విలువ 25 నుంచి 33 బిలియన్ల డాలర్ల కార్బన్ క్రెడిట్లుగా ఉండొచ్చని ఐఫారెస్ట్ నివేదిక పేర్కొంది. అలాగే, వినియోగదారులు 10 బిలియన్ డాలర్ల వరకు రీఫిల్లింగ్ ఖర్చులు ఆదా చేసుకోగలరని తెలిపింది.

ఏసీ వాడకం ఎలా ఉంటుందంటే..

2024లో 62 మిలియన్లు ఉన్న ఏసీలు, 2035 నాటికి 245 మిలియన్లకు చేరనున్నాయి. వార్షిక విక్రయాలు సైతం 14 మిలియన్ల నుంచి 40 మిలియన్లకు పెరిగే అవకాశం ఉంది. 2020 నుంచి ఏసీల విక్రయాలు ఏడాదికి 15 నుంచి 20% చొప్పున పెరుగుతున్నాయి. దీనికి ప్రధాన కారణాల్లో నగరీకరణ, వ్యక్తుల ఆదాయాల్లో పెరుగుదల, పెరిగిన ఎండల తీవ్రత తదితరాలు ముఖ్యమైనవిగా ఉన్నాయి.

సర్వే ఎలా జరిపారంటే..

ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా, చెన్నై, అహ్మదాబాద్, పుణె, జైపూర్ నగరాల్లో 3,100 కుటుంబాలపై ఈ సర్వే చేపట్టారు. ఆయా నివాసాలు, కార్యాలయాల్లోని 80% ఏసీలు ఐదేళ్ల లోపు తయారైనవి. ఇందులో 87% కుటుంబాలు ఒకే ఏసీ కలిగి ఉండగా, 13% మంది రెండు, అంతకంటే ఎక్కువ ఏసీలను వాడుతున్నారు. చెన్నై, జైపూర్, కోల్‌కతా, పుణెల్లోని ఎక్కువ కుటుంబాలు ఒకటికి మించి ఏసీలను కలిగి ఉన్నాయి. కోల్‌కతా, జైపూర్, పుణె వాసులు ఏసీలను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నట్లు సైతం నివేదిక వెల్లడించింది.

రెఫ్రిజిరెంట్ రీఫిల్లింగ్

భారత్‌లో రీఫిల్లింగ్ ఖర్చు ప్రపంచంలోనే అత్యధికంగా ఉంది. సాధారణంగా ఏసీలను ఐదేళ్లకోసారి రీఫిల్ చేస్తే సరిపోతుంది. కానీ, భారత్‌లో సగటున 40% ఏసీలు ఏటా రీఫిల్ అవుతున్నాయి. ఐదేళ్లకు మించి ఉన్న ఏసీలలో 80%కు పైగా ఏటా రీఫిల్ చేయించాల్సిన అవసరం ఉంటుంది. వినియోగదారులు 2024లో రూ.7,000 కోట్ల విలువైన రెఫ్రిజిరెంట్ల రీఫిల్లింగ్ చేసుకున్నారు. ఇది 2035 నాటికి రూ. 27,540 కోట్లకు పెరగవచ్చని నివేదిక అంచనా వేసింది.

హానికరమైన రెఫ్రిజిరెంట్లు

దేశంలో ప్రధానంగా వాడే హెచ్ఎఫ్‌సీ–32 అనే గ్యాస్, కార్బన్ డయాక్సైడ్ కంటే 675 రెట్లు ఎక్కువ ఉష్ణతాపాన్ని కలుగ జేస్తుంది. 2024లో రెఫ్రిజిరెంట్ లీకేజీల వల్ల 52 మిలియన్ టన్నుల ఉద్గారాలు వెలువడగా, 2035 నాటికి ఇది 84 మిలియన్ టన్నులకు చేరే అవకాశం ఉంది.

వినియోగం తీరు ఎలా ఉంది?

దేశంలో కుటుంబాలు సగటున ఏసీని రోజుకు 4 గంటల పాటు వాడుతున్నాయి. వేసవిలో ఎక్కువగా 7.7 గంటలపాటు వాడుతున్నారు. వర్షాకాలంలో 3.2 గంటలు మాత్రమే వినియోగించుకుంటున్నారు. దాదాపు 98% కుటుంబాలు 3 స్టార్ నుంచి 5 స్టార్ రేటెడ్ ఏసీలు వాడుతున్నారు. త్రీస్టార్ ఏసీలు 60% ఇళ్లలో ఉంటే 5 స్టార్ ఏసీలు 28% మంది వినియోగిస్తున్నారు.

థర్మోస్టాట్ సెట్టింగ్స్

దేశంలో సగటున 67% కుటుంబాలు ఏసీని 23సెల్సియస్–25సెల్సియస్ మధ్య ఉంచుతున్నాయి. కేవలం 33% మాత్రమే 22 సెల్సియస్ కంటే తక్కువ ఉష్ణోగ్రతకు సెట్ చేస్తున్నారు. వీరిలో అత్యధికులు ఢిల్లీ, ముంబయి, పుణెకు చెందినవారేనని సర్వేలో తేలింది. విద్యుత్ వినియోగంపై ప్రజలు జాగ్రత్తగా ఉన్నా, రెఫ్రిజిరెంట్ల విషయంలో అవగాహన తక్కువగా ఉంది. ప్లాస్టిక్ లాగే రెఫ్రిజిరెంట్ల జీవిత కాలంపై కూడా సమగ్ర అవగాహన అవసరమని ఐఫారెస్ట్ చైర్మన్ చంద్ర భూషణ్ అంటున్నారు.

వన్‌తారకు సిట్ క్లీన్ చిట్

నివేదికపై సుప్రీంకోర్టు సంతృప్తి

- ఏనుగుల తరలింపులో తప్పులేదు
- త్వరలో సవివర ఆదేశాలిస్తామని వెల్లడి

న్యూఢిల్లీ: గుజరాత్‌లోని జామ్‌నగర్‌లోని జూలాజికల్ రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్ 'వన్‌తార'కు సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)క్లీన్ చిట్ ఇచ్చింది. అక్కడ జరిగే కార్యక్రమాలన్నీ నిబంధనలకు లోబడే ఉన్నాయని పేర్కొంది. జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ పీబీ వరాలేల ధర్మాసనం సోమవారం సిట్ ఇచ్చిన నివేదికను పరిశీలించింది. నివేదికను పూర్తి స్థాయిలో అధ్యయనం చేసిన తర్వాత తగురీతిలో సవివర ఆదేశాలను జారీ చేస్తామని తెలిపింది. జామ్ నగర్ రిఫైనరీ పక్కనే ఉన్న వందల ఎకరాల్లోని అటవీ ప్రాంతంలో రిలయన్స్ సంస్థ వన్‌తార పేరుతో వన్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం తెల్సిందే. అయితే, వన్‌తారలో నిబంధనల ఉల్లంఘన జరుగుతోందని, ఏనుగులను విదేశాల నుంచి తీసుకువస్తున్నారని ఎన్జీవోలు, వివిధ వన్యప్రాణుల సంఘాలతోపాటు మీడియాలో ఆరోపణలు రావడంతో సుప్రీంకోర్టు ఆగస్ట్ 25వ తేదీన నలుగురు సభ్యుల సిట్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో సుప్రీంకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ చలమేశ్వర్, హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్ర చౌహాన్, ముంబై మాజీ పోలీస్ కమిషనర్ హేమంత్ నగ్రాలే, రిటైర్డు ఐఆర్ఎస్ అధికారి అనిష్ గుప్తా ఉన్నారు. వీరు వన్‌తారను స్వయంగా సందర్శించి, అక్కడ వన్యప్రాణుల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను, ఇతర వసతులను సమగ్రంగా పరిశీలించారు. సోమవారం గుజరాత్ ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, వన్‌తార తరఫున సీనియర్ అడ్వొకేట్ హరీశ్ సాల్వే వాదనలు వినిపించారు. నివేదికలోని వివరాలను తన తీర్పులో ధర్మాసనం పేర్కొనడాన్ని వీరు వ్యతిరేకించారు. అయితే, ఈ విషయంలో ఇకపై ఎలాంటి వివాదాలకు తావివ్వబోమన్న ధర్మాసనం, సిట్ నివేదికపై సంతృప్తి వ్యక్తం చేసింది. కమిటీ సభ్యులు ప్రతి అంశాన్ని పరిశీలించారని, నిపుణుల సూచనలు కూడా తీసుకున్నారంది. సిట్ ఇచ్చిన సూచనలు, సలహాలను అమలు చేసేందుకు సంబంధిత విభాగాల అధికారులకు స్వేచ్ఛనిస్తున్నామని ధర్మాసనం స్పష్టం చేసింది. ఓ ఆలయానికి సంబంధించిన ఏనుగును వన్‌తారకు తరలించడంపై ఈ సందర్భంగా ఓ లాయర్ ప్రస్తావనకు తేగా, ధర్మాసనం తోసిపుచ్చింది. 'దేశానికి గర్వకారణంగా మనం భావించే కొన్ని విషయాలుంటాయి. అనవసరంగా ఆ విషయాలన్నింటినీ లేవనెత్తకూడదు'అని ధర్మాసనం పేర్కొంది.



సోమవారం పంజాబ్‌లో వరద ప్రభావిత ప్రాంతాల్లో ట్రాక్టర్‌పై రాహుల్ గాంధీ పర్యటన

పంజాబ్ వరద బాధితులకు రాహుల్ పరామర్శ

- వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన కాంగ్రెస్ నేత
- బాధితులకు అండగా ఉండాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపు

చండీగఢ్: పంజాబ్‌లో ఇటీవల భారీ వరదల కారణంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సోమవారం పర్యటించారు. బాధితులతో స్వయంగా మాట్లాడి, దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. పంజాబ్ పీసీసీ అధ్యక్షుడు అమరీందర్‌సింగ్ రాజా వారింగ్, ఆ రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేత ప్రతాప్‌సింగ్ బజ్వా, కాంగ్రెస్ ఎంపీలు గుర్జీత్‌సింగ్, సుఖ్‌జిందర్‌సింగ్ తదితరులతో కలిసి గుర్దాస్‌పూర్, అమృత్‌సర్ జిల్లాల్లోని పలు గ్రామాల్లో పర్యటించారు. అమృత్‌సర్ జిల్లాలోని ఘోనెవాల్ గ్రామంలో వరద బాధితులతో మాట్లాడారు. రామ్‌దాస్ ప్రాంతంలోని చారిత్రక గురుద్వారా బాబా బుధా సాహిబ్‌లో ప్రార్థనలు నిర్వహించారు. గుర్దాస్‌పూర్ జిల్లాలోని డేరా బాబా నాయక్ ప్రాంతంలో ఉన్న గుర్‌చక్ గ్రామంలో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. రాహుల్ పర్యటన వరద బాధితులకు ధైర్యాన్ని ఇచ్చిందని కాంగ్రెస్ పార్టీ తన అధికారిక ఎక్స్ ఖాతాలో పేర్కొంది. ఈ కష్ట సమయంలో రైతులు, వరద బాధితులకు రాష్ట్రంలోని కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలు అండగా నిలవాలని రాహుల్‌గాంధీ పిలుపునిచ్చినట్లు కాంగ్రెస్ ఎమ్మెల్యే పర్గత్‌సింగ్ తెలిపారు. హిమాచల్‌ప్రదేశ్, జమ్ముకశ్మీర్, పంజాబ్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సట్లెజ్, రావి, బియాస్ నదులు ఉప్పొంగటంతో పంజాబ్‌లో ఇటీవల భారీ వరదలు సంభవించాయి. దీంతో దాదాపు 1.98 లక్షల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. 56 మంది మరణించారు.

అమెరికా బాటలోనే మనమూ నడవాలి

కేంద్ర ప్రభుత్వానికి పార్లమెంటరీ కమిటీ సూచన

న్యూఢిల్లీ: భారత ప్రభుత్వం 1997లో ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీవో)తో ఐటీ, ఎలక్ట్రానిక్ రంగానికి సంబంధించి కుదుర్చుకున్న ఒప్పందం లోపభూయిష్టంగా, నిరుత్సాహకరంగా ఉందని పార్లమెంటరీ కమిటీ పేర్కొంది. దీని వల్ల మన దేశంలో ఐటీరంగానికి ఎటువంటి లాభం కలగలేదని పేర్కొంది. ఈ విషయంలో మనం కూడా అమెరికా బాటలోనే నడవాలని సూచన చేసింది. అమెరికా మాదిరిగానే మనం కూడా దేశీయ పరిశ్రమను కాపాడుకునేందుకు టారిఫ్‌లను విధించాలని, అవసరమైతే డబ్ల్యూటీవోను వదిలేయాలని స్పష్టం చేసింది. ఐటీ రంగానికి మేలు చేకూర్చే చర్యలను చేపట్టేందుకు వచ్చిన ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరింది. ఈ మేరకు బీజేపీ ఎంపీ నిశికాంత్ దుబే సారథ్యంలోని కమ్యూనికేషన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ స్టాండింగ్ కమిటీ గత వారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు నివేదిక సమర్పించింది. 1997లో మన దేశం డబ్ల్యూటీవో షరతులకు తలొగ్గడంతో మన ఐటీ రంగం వాణిజ్యం లోటుతోనే కొనసాగుతోందని, మన తయారీదారులు అంతర్జాతీయ మార్కెట్‌తో పోటీ పడలేకపోతున్నారని కమిటీ తెలిపింది.

దగ్గరి ఆస్పత్రికి తీసుకెళ్లమని వేడుకున్నా..

- 22 కిలోమీటర్ల దూరంలోని చిన్న ఆస్పత్రికి తీసుకెళ్లారు
- ఢిల్లీ బీఎండబ్ల్యూ ఘటన బాధితురాలి వెల్లడి
- ప్రమాదంలో ఆర్థికశాఖ ఉన్నతాధికారి మృతి

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కేంద్ర ఆర్థిక శాఖ ఉన్నతాధికారి నవ్‌జ్యోత్ సింగ్(52)చనిపోగా, ఆయన భార్య సందీప్ కౌర్ తీవ్రంగా గాయపడ్డారు. వీరి ద్విచక్ర వాహనాన్ని ఓ బీఎండబ్ల్యూ కారు ఢీకొట్టింది. ఘటన అనంతరం మొత్తం నలుగురు బాధితులను ధౌలా క్వాన్ సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లకుండా, అక్కడికి 23 కిలోమీటర్ల దూరంలోని ఆజాద్‌పూర్‌లో ఉన్న చిన్న ఆస్పత్రికి తీసుకెళ్లారని అధికారి భార్య ఆరోపించారు. హరినగర్‌లో నివసిస్తున్న నవ్‌జ్యోత్ సింగ్ దంపతులు బంగ్లా సాహిబ్ గురుద్వారాను సందర్శించుకుని తిరిగి ఇంటికి వెళ్తుండగా ఢిల్లీ కంటోన్మెంట్ వద్ద రింగ్ రోడ్డుపై బీఎండబ్ల్యూ కారు ఢీకొట్టింది. ఆ సమయంలో ఓ మహిళ ఆ కారును నడుపుతున్నట్లు తేలింది. దాదాపు 25 నిమిషాల తర్వాత ఆజాద్‌పూర్‌లోని ఆస్పత్రికి చేరుకునేసరికే నవ్‌జ్యోత్ సింగ్ చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తనను ఆజాద్‌పూర్ తీసుకెళ్లాలని బీఎండబ్ల్యూ నడుపుతూ గాయపడిన దంపతులు గట్టిగా చెప్పడం వల్లే అంత దూరం తీసుకెళ్లినట్లు వ్యాన్ డ్రైవర్ మహ్మద్ గుల్ఫామ్ తెలిపారు. పోలీసులు గుల్ఫామ్ వాఙ్మూలాన్ని నమోదు చేసుకున్నారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ప్రమాద సమయంలో బీఎండబ్ల్యూ కారును నడుపుతున్నట్లు గుర్తించిన గురుగ్రామ్‌కు చెందిన గగన్‌దీప్ కౌర్‌ను అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై పోలీసులు భారతీయ న్యాయ సంహితలోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

మహాఘట్‌బంధన్‌లో లుకలుకలు..!

- బిహార్ సీఎం అభ్యర్థిగా ప్రకటించనందుకు కాంగ్రెస్‌పై తేజస్వి గుర్రు
- ఆర్జేడీ 243 స్థానాల్లోనూ పోటీలో ఉంటుందని ప్రకటన
- అవినీతి ఆరోపణలున్న లాలూ కుటుంబాన్ని దూరం పెడుతున్న కాంగ్రెస్
- ఇతర కుల సమీకరణలు కూడా కారణమని విశ్లేషణలు

సాక్షి, న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్ నేతృత్వంలోని మహాఘట్‌బంధన్‌లో లుకలుకలు మొదలయ్యాయి. ఇప్పటికే మహాఘట్‌బంధన్‌ను వేరుపడి ఒంటరి పోరు చేసేందుకు ఆమ్‌ఆద్మీ పార్టీ నిర్ణయించగా, అదే దారిలో ఆర్జేడీ సైతం పయనించే సూచనలు కనిపిస్తున్నాయి. మరికొద్ది వారాల్లో ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశాలున్నా..ఇప్పటి వరకు సీట్ల పంపకాలు ఖరారు కాకపోవడం, ముఖ్యమంత్రి అభ్యర్థిత్వంపై ముఖం చాటేస్తుండటంతో కాంగ్రెస్‌పై గుర్రుగా ఉన్న ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్, తమ పార్టీ రాష్ట్రంలోని అన్ని స్థానాల్లోనూ పోటీ చేస్తుందని చేసిన ప్రకటన ఘట్‌బంధన్ మైత్రిని ప్రశ్నార్థకం చేస్తోంది.

అవినీతి.. కులాల లెక్కలు

బిహార్‌లో 1980 వరకు కాంగ్రెస్ ప్రధాన రాజకీయ శక్తిగా ఉండేది. 1990లో లాలూ ప్రసాద్ యాదవ్, నితీశ్‌కుమార్ వంటి ప్రాంతీయ నేతల ఆవిర్భావంతో కాంగ్రెస్ బలం తగ్గిపోయింది. చేసేది లేక వారి దయాదాక్షిణ్యాలపై కాంగ్రెస్ పార్టీ ఆధారపడుతూ వస్తోంది. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ 70 స్థానాల్లో పోటీ చేసినప్పటికీ కేవలం 19 సీట్లను మాత్రమే గెలుచుకుంది. మిత్రపక్షమైన ఆర్జేడీతో కలిసి ఈ ఎన్నికల్లో బిహార్‌లో తిరిగి అధికారంలోకి రావాలని లక్ష్యంతో మొన్నటివరకు ముందుకెళ్లింది. గత ఎన్నికల్లో ఆర్జేడీ 144 స్థానాలకు గాను 75 స్థానాల్లో గెలిచింది. వచ్చే ఎన్నికల్లోనూ తమ పార్టీకి గరిష్ట స్థానాలు దక్కుతాయని, తానే సీఎం అభ్యర్థిని అవుతాననే ఉత్సాహంతో తేజస్వీ యాదవ్ రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా పర్యటిస్తున్నారు. అయితే ఇటీవలే ఓట్ చోరీపై రెండు వారాల పాటు రాష్ట్రంలో విస్తృతంగా పర్యటించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మహాఘట్‌బంధన్ తరఫున తేజస్విని సీఎం అభ్యర్థిగా ప్రకటించకుండా తప్పించుకున్నారు. తేజస్వి స్వయంగా తనను తాను బిహార్ సీఎంఅభ్యర్థిగా ప్రకటించుకుంటున్నా, కాంగ్రెస్ మాత్రం మిన్నకుండిపోయింది. ఇటీవలే కాంగ్రెస్ బిహార్ ఇన్‌చార్జి కృష్ణ అల్లవేరు మాట్లాడుతూ ప్రజలే సీఎంను నిర్ణయిస్తారని ప్రకటించడంతో గందరగోళం ఇంకాస్త పెరిగింది.

కాంగ్రెస్ అంచనా వేరే..

తేజస్విని ముఖ్యమంత్రి అభ్యర్థిగా కాంగ్రెస్ ప్రకటించకపోవడానికి అనేక కారణాలు ఉన్నాయనే చర్చ జరుగుతోంది. ఇందులో కాంగ్రెస్‌కు బిహార్‌లో తమ పార్టీ అభ్యర్థే ముఖ్యమంత్రిగా ఉండాలన్నది పార్టీ దీర్ఘకాలిక వ్యూహంలా ఉంది. గడిచిన లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ 9 స్థానాలకు గానూ 3 స్థానాలను గెలుచుకోవడం, ఇటీవలి ఓటర్ అధికార్ యాత్రతో కాంగ్రెస్‌పై ప్రజల్లో ఆదరణ పెరగడంతో కాంగ్రెస్ ఆత్మవిశ్వాసంతో ఉంది. ఇదే అదనుగా పార్టీని బలోపేతం చేసుకోవడం సులువని పార్టీ విశ్వసిస్తోంది. ఈ సమయంలో తేజస్విని ముఖ్యమంత్రిగా ప్రకటిస్తే ఆర్జేడీ బలపడి, కాంగ్రెస్ దీర్ఘకాలిక ప్రయోజనాలను దెబ్బతీస్తుందనే భావన ఉంది. గత ఎన్నికల్లో కేవలం 70 సీట్లలో పోటీ చేసిన కాంగ్రెస్ ఈసారి 100కు పైగా స్థానాల్లో పోటీ చేయాలని ప్రణాళికలు వేస్తోంది. తేజస్విని ముఖ్యమంత్రిగా అంగీకరిస్తే సీట్ల బేరసారాల్లో కాంగ్రెస్‌కు నష్టం వాటిల్లుతుంది. అదీగాక లాలూప్రసాద్ యాదవ్‌తో పాటు తేజస్వీయాదవ్ అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. స్వయంగా తేజస్విపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో వివాదాస్పద నేత నుంచి దూరంగా ఉండటం ద్వారా కాంగ్రెస్ తన విశ్వసనీయతను కాపాడుకునే ప్రయత్నం చేస్తోంది. దీనికి తోడు ఆర్జేడీకి యాదవ్, ముస్లిం సామాజిక వర్గాల్లో గట్టి పట్టుంటే, కాంగ్రెస్‌కు అగ్రవర్ణాలతో పాటు ముస్లిం, దళిత ఓట్లు అధికంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో తేజస్విని ముఖ్యమంత్రిగా ప్రకటిస్తే కాంగ్రెస్ ఓటు బ్యాంకు అంతా ఎన్డీఏ పక్షాల వైపు మొగ్గు చూపుతుంది. ఈ అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని తేజస్విని పక్కనపెడుతుండటంతో ఆయన ఆగ్రహంతో ఊగిపోతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన రెండ్రోజుల కిందట 243 స్థానాల్లో తాము పోటీలో ఉంటామనే ప్రకటన చేశారు. అయితే ఈ ప్రకటనపై కాంగ్రెస్ స్పందించలేదు. ప్రస్తుత ఈ పరిణామాలు ఎటువైపు మళ్లుతాయన్నది ఆసక్తికరంగా మారింది.

ఠాణాల్లో సీసీటీవీలు పనిచేయకపోవడం నిర్లక్ష్యమే

దేశవ్యాప్తంగా అన్ని స్టేషన్లలోనూ ఏర్పాటు చేయాలి: సుప్రీం

న్యూఢిల్లీ: పోలీస్ స్టేషన్లలోని సీసీటీవీలు పనిచేయకపోవడం నిర్లక్ష్యమేనని సుప్రీంకోర్టు పేర్కొంది. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్లలోనూ ఇకపై సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, మనుషులతో ప్రమేయం లేని కంట్రోల్ రూం ఫీడ్‌ను పర్యవేక్షిస్తుండాలని పేర్కొంది. పోలీస్‌స్టేషన్లలో సీసీటీవీలు పనిచేయకపోవడంపై సుమోటోగా చేపట్టిన కేసులో తీర్పును ఈ నెల 26వ తేదీన ప్రకటిస్తామని సోమవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం తెలిపింది. 'ప్రతి పోలీస్‌స్టేషన్‌లోనూ మనుషులతో ప్రమేయం లేని కంట్రోల్ రూం ఉండాలి. కంట్రోల్ రూంకే అన్ని కెమెరాల ఫీడింగ్ అందాలి. ఏదైనా కెమెరా పనిచేయకుంటే వెంటనే ఆ పరిధిలోని లీగల్ సెల్ లేదా సంబంధిత విభాగాన్ని అప్రమత్తం చేస్తుంది. సమస్య పరిష్కారమవుతుంది. ఇదంతా ఏఐ ద్వారానే జరిగిపోతుంది. ఇంతకు మినహా మరోదారి లేదు. ఈ విషయంలో ప్రతి పోలీస్ స్టేషన్‌నూ ఓ స్వతంత్ర సంస్థ తనిఖీ చేస్తుంది. ఇందుకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను, ఒక పరిష్కారాన్ని ఏదైనా ఐఐటీ అందజేస్తుందని భావిస్తున్నాం'అని ధర్మాసనం వివరించింది. ఇదే సందర్భంగా మరో కేసును విచారించిన ధర్మాసనం..సీబీఐ, ఈడీ, ఎన్ఐఏ తదితర కేంద్ర దర్యాప్తు సంస్థల కార్యాలయాల్లోనూ సీసీటీవీ కెమెరాలను, రికార్డింగ్ సాధనాలను అమర్చాలని కేంద్రాన్ని ఆదేశించింది.

మొదటి 15 నిమిషాలు.. ఆధార్ ధ్రువీకరణ ఉన్నవారికే

అక్టోబర్ ఒకటో తేదీ నుంచి రైల్వే శాఖ కొత్త రిజర్వేషన్ విధానం

న్యూఢిల్లీ: జనరల్ టిక్కెట్ల రిజర్వేషన్‌కు బుక్కింగ్స్ మొదలైన మొదటి 15 నిమిషాలను ఆధార్ ధ్రువీకరణ ఉన్న యూజర్లను మాత్రమే అనుమతిస్తామని రైల్వే శాఖ తెలిపింది. రైలు ఏదైనా బుక్కింగ్స్ ప్రారంభమైన మొదటి 15 నిమిషాల్లో ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ లేదా యాప్ ద్వారా రిజర్వేషన్ చేయించుకునే టిక్కెట్లకు ఇది వర్తిస్తుందని స్పష్టత నిచ్చింది. పదిహేను నిమిషాల తర్వాత మాత్రమే అధీకృత ఏజెంట్లు టిక్కెట్లు రిజర్వేషన్ తీసుకునేందుకు అవకాశం ఉంటుందని పేర్కొంది. 'ఉదాహరణకు ఒక రైలు ఒకటో తేదీ ఉదయం 10 గంటలకు బయలుదేరనుంది. ఆ రైలుకు రిజర్వేషన్లు సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైతే, మొదటి 15 నిమిషాలు ఆధార్ ధ్రువీకరణ ఉన్న వారికే రిజర్వేషన్ చేసుకునే అవకాశముంటుంది'అని వివరించింది. ఇప్పటి వరకు తత్కాల్ రిజర్వేషన్లకు మాత్రమే ఈ నిబంధన ఉండేది. రిజర్వేషన్ విధానం ప్రయోజనాలు సాధారణ వినియోగదారునికి కూడా అందేందుకు, దుర్వినియోగాన్ని అడ్డుకునేందుకు కొత్త విధానాన్ని తీసుకువచ్చినట్లు రైల్వే శాఖ సోమవారం ఒక సర్క్యులర్‌లో వివరించింది. కౌంటర్‌లో టిక్కెట్లు బుక్ చేసుకునే ఏజెంట్లకు ప్రస్తుతమున్న మొదటి 10 నిమిషాల నియంత్రణ కొనసాగుతుందని కూడా స్పష్టం చేసింది.

నేను ఇకపై ఎన్డీయేను వీడను

బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్

పూర్ణియా: తాను ఇకపై ఎన్డీయే కూటమిని వీడబోనని బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ప్రకటించారు. సోమవారం ఆయన పూర్ణియాలో నిర్వహించిన బీజేపీ–జేడీయూ సంయుక్త ర్యాలీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ సమక్షంలో ఈ ప్రకటన చేశారు. అవసరానికి తగ్గట్టుగా కూటములు మారుస్తారని నితీశ్‌కుమార్‌పై ఆరోపణలు ఉన్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆయన ఈ ప్రకటన చేశారు. '2005లో మొదటిసారి బిహార్‌లో జేడీయూ–బీజేపీ ప్రభుత్వం ఏర్పడింది. అయితే, మా పార్టీలోని కొందరు సహచరుల సలహాతో ఆ తర్వాత ఒకటిరెండు సార్లు నేను వేరే కూటమిలోకి వెళ్లాను. కానీ, అది గతం. వారితో నేను ఎప్పుడూ సౌకర్యవంతంగా ఉండలేదు. మేం అధికారాన్ని పంచుకున్నంతకాలం వారు చిల్లరమల్లరగా ప్రవర్తించేవారు. దీంతో నేను తిరిగొచ్చాను. ఇకపై ఎట్టిపరిస్థితుల్లో ఈ స్నేహాన్ని విడువను' అని పేర్కొన్నారు. నితీశ్ వ్యాఖ్యలతో ప్రధానిమోదీ నవ్వుతూ చప్పట్లు కొట్టారు.

టీచర్ల కొరతపై బాలికల 65 కి.మీ. ర్యాలీ

ఇటానగర్: తమ స్కూల్‌లో టీచర్ల కొరత ఉందని తెలిపేందుకు పదుల సంఖ్యలో బాలికలు 65 కిలోమీటర్ల దూరంలోని జిల్లా కేంద్రానికి కాలి నడకన వెళ్లారు. ఈ ఘటన అరుణాచల్ ప్రదేశ్‌లోని పక్కె కెస్సాంగ్ జిల్లాలో చోటుచేసుకుంది. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ(కేజీబీవీ) బాలికలు సుమారు 90 మంది తమకు జియాగ్రఫీ, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టులు చెప్పే టీచర్లు లేరని అధికారులకు తెలిపేందుకు ఏకంగా 65 కిలోమీటర్లు నడిచారు. ఆదివారం సాయంత్రం న్యాంగ్‌నో గ్రామంలో కేజీబీవీ నుంచి గొడుగులు, బ్యాగేజీలతో బయలుదేరిన బాలికలు నినాదాలు చేస్తూ రాత్రంతా నడుస్తూనే ఉన్నారు. సోమవారం ఉదయం కల్లా వారు జిల్లా కేంద్రం లెమ్మికి చేరుకున్నారు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పాఠశాల యాజమాన్యం గానీ, అధికారులు గానీ స్పందించనందునే తామీ చర్యకు పూనుకున్నట్లు వారు తెలిపారు.

అరుదైన కోరల్ కుక్రి పాము ప్రత్యక్షం

పిలిభిత్: అరుదైన జాతికి చెందిన పాము 1936 తర్వాత మొదటిసారిగా యూపీలోని పిలిభిత్ టైగర్ రిజర్వులో కనిపించింది. ఒలిగొడొన్ ఖెరియన్సిస్‌గా గుర్తించిన ఈ పాముకు రెడ్ కోరల్ కుక్రిగా పేరుంది. విశేషమైన ఎరుపు– నారింజ రంగుతో పదునైన కోరలు కలిగిన విష రహిత పాము మన దేశంలో చాలా అరుదుగా కనిపిస్తుంది. 'ఇది చాలా ముఖ్యమైన విషయం. 1936లో అంటే దాదాపు 89 ఏళ్ల క్రితం దుధ్వా నేషనల్ పార్కులో కనిపించింది. ఆ తర్వాత చాలా అరుదుగా మాత్రమే కనిపించిన దాఖలాలున్నాయి'అని అటవీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మనీశ్ సింగ్ చెప్పారు. రిజర్వులోని మహోఫ్ రేంజ్‌లో వలలో చిక్కిన ఈ పాము ఎంతో అరుదైనదనే విషయాన్ని ఉద్యమకారుడు మహ్మద్ కాసిమ్ గుర్తించి, అధికారులను అప్రమత్తం చేశారు. పట్టుకున్న పామును రిజర్వు ఫారెస్ట్‌లో వదిలేశారు. పిలిభిత్ టైగర్ రిజర్వులో పులులతోపాటు ఎన్నో అరుదైన జీవులతో జీవవైవిధ్యానికి ఆలవాలంగా ఉంటోందని సింగ్ చెప్పారు.

యూపీలో పులిదాడిలో వ్యక్తి మృతి

బహ్రెయిచ్: ఉత్తరప్రదేశ్‌లో బహ్రెయిచ్‌లో పులి దాడిలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. కటర్నియాఘాట్ వన్యప్రాణుల సంరక్షణ కేంద్రంలోని ఓ కాల్వ సమీపంలో ఆదివారం ఘటన చోటుచేసుకుంది. ధర్మాపూర్ రేంజిలోని హర్ఖాపూర్‌కు చెందిన ఇందల్ నిషాద్ కాల్వ వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా పులి దాడి చేసింది. నిషాద్ పెద్దగా కేకలు వేయడంతో, గ్రామస్తులు అక్కడికి పరుగెత్తుకెళ్లారు. అప్పటికే పులి అతడిని సమీపంలోని చెరకు తోటలోకి లాక్కెళ్లింది. గంట తర్వాత నిషాద్ మృతదేహాన్ని వదలి అడవిలోకి తిరిగి వెళ్లిపోయిందని అధికారులు తెలిపారు. అతడి తలకు పడిన గాయాన్ని బట్టి పులి దాడి చేసినట్లు గుర్తించామన్నారు. పులి జాడను కనిపెట్టేందుకు నిపుణులు సహా 100 మందిని రంగంలోకి దింపామన్నారు.

నాగమల్లయ్య గొప్ప వ్యక్తి

బైడెన్ విధానాల వల్లే హత్యకు గురయ్యారు: ట్రంప్

హ్యూస్టన్/న్యూయార్క్: అమెరికాలోని డాలస్‌లో సహచర ఉద్యోగి చేతిలో దారుణ హత్యకు గురైన భారత సంతతి వ్యక్తి చంద్రమౌళి నాగమల్లయ్య గొప్ప వ్యక్తి అని డొనాల్డ్ ట్రంప్ అన్నారు. సంచలనం సృష్టించిన నాగమల్లయ్య హత్యపై ట్రంప్ సోమవారం ట్రూత్ సోషల్‌లో స్పందించారు. 'మనదేశంలో ఉండటానికి అర్హత లేని ఒక క్యూబాకు చెందిన వ్యక్తి చేతిలో తన కుటుంబ సభ్యుల ముందే దారుణ హత్యకు గురైన చంద్ర నాగమల్లయ్య గురించి నాకు తెలిసింది. ఆయన డాలస్‌లో ఎంతో గౌరవనీయమైన వ్యక్తి. నిందితుడిని అత్యంత కఠినంగా శిక్షిస్తాం. అతడిపై మొదటి డిగ్రీ నేరాభియోగాలు మోపుతాం. గత అధ్యక్షుడు జో బైడెన్ ఇమ్మిగ్రేషన్ విధానాల వల్లనే ఇంతటి క్రూరుడైన వ్యక్తి స్వేచ్ఛగా బయట తిరుగుతున్నాడు. ఇలాంటివారిపై సానుభూతి చూపే కాలం ముగిసింది'అని పేర్కొన్నారు.

నేపాల్ ప్రభుత్వంలోకి మరో ముగ్గురు మంత్రులు

కఠ్మాండు: జెన్ జెడ్ తిరుగుబాటు తర్వాత నేపాల్‌లో అధికారం చేపట్టిన తాత్కాలిక ప్రభుత్వంలోకి మరో ముగ్గురు కొత్త మంత్రులు వచ్చి చేరారు. తాత్కాలిక ప్రధాని అవుతారని భావించిన ఎలక్ట్రిసిటీ బోర్డు మాజీ సీఈఓ కుల్మాన్ ఘీషింగ్, ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి రామేశ్వర్ ఖనల్, ప్రముఖ న్యాయవాది ఓంప్రకాశ్ ఆర్యల్‌లు మంత్రులుగా సోమవారం బాధ్యతలు చేపట్టారు.

విద్యావిధానంలో కంఠస్థ పద్ధతిని తొలగించాలని సూచించినవారు?



మాదిరి ప్రశ్నలు

1. రిచర్డ్ ఆర్.స్కెంప్ ప్రకారం ఆకారం, పరిమాణం, రంగు అనే గౌణ భావనల నుంచి ఏర్పడిన లేదా ఉత్పన్నమైన భావన ఏది?
   1) గుణం 2) బరువు
   3) గణన 4) నిర్మాణం
2. విద్యార్థికి దశాంశ భిన్నాల భావనలపై అవగాహన కల్పించడం, సమస్యల సాధనలో క్రమత, కచ్చితత్వం, క్లుప్తత లాంటి అలవాట్లు అభివృద్ధి చేయడం ఏ స్థాయి గణిత బోధనా లక్ష్యాలు?
   1) ప్రాథమిక స్థాయి
   2) ఉన్నత స్థాయి
   3) ప్రాథమికోన్నత స్థాయి
   4) సీనియర్ సెకండరీ స్థాయి
3. ఉపాధ్యాయుడు, రవిని 'మీ ఇంటిని ఇద్దరు వ్యక్తులు కలిసి 26 రోజుల్లో నిర్మిస్తే నలుగురు వ్యక్తులు ఎన్ని రోజుల్లో నిర్మిస్తారు?' అని అడిగిన ప్రశ్నకు రవి సులభంగా ఆలోచించి సమాధానం చెప్పగలగడం ఏ గణిత విలువ?
   1) క్రమశిక్షణ విలువ
   2) ప్రయోజన విలువ
   3) వినోదపు విలువ
   4) సిద్ధపరిచే విలువ
4. వైగాట్‌స్కీ ప్రకారం పరస్పర బోధన వల్ల ఏం సంభవించడంతో విద్యార్థులు పాఠ్య అవబోధనకు క్రమంగా బాధ్యత వహిస్తారు?
   1) ZPD 2) సారువ
   3) ఇన్‌స్ట్రక్షనల్ స్కఫోల్డింగ్
   4) సామాజిక స్కఫోల్డింగ్
5. గణితంలో ఏ సమస్యాసాధన పద్ధతిలో పిల్లలకు ఆలోచనలు రేకెత్తించే సన్నివేశాలు ఉండవు?
   1) నిగమన 2) విశ్లేషణ
   3) ఆగమన 4) సంశ్లేషణ
6. హెర్బార్ట్ సూచించిన పాఠ్యపథక సోపానాల్లో ఏది విద్యార్థికి క్లిష్టమైనదిగా పేర్కొనవచ్చు?
   1) సాధారణీకరణం 2) సమర్పణ
   3) సమన్వయం 4) అన్వయం
7. ఒక సంఖ్యను 2, 5 నిశ్శేషంగా భాగించాలంటే ఆ సంఖ్య ఒకట్ల స్థానంలో ఉండాల్సిన అంకె?
   ఎ) 2 బి) 5 సి) 0 డి) 7
   పై ప్రశ్న ద్వారా సాధించే విద్యా ప్రమాణం 1) అనుసంధానం
   2) కారణాలు తెల్పడం
   3) ప్రాతినిధ్యపరచడం
   4) సమస్యా సాధన
8. అభ్యసన ప్రక్రియలో గుణాత్మక, పరిమాణాత్మక అంశాలను నిర్ధారించేది?
   1) మాపనం 2) మదింపు
   3) మూల్యాంకనం 4) నిర్ధారణ సూచీ
9. కింది వాటిలో ఘనాకార కడ్డీలకు సంబంధించి సరికాని అంశం ఏది?
   ఎ) వేటి సహాయంతో ఆరోహణ, అవరోహణ క్రియలను బోధించలేము.
   బి) పెద్ద, చిన్న సైజులను పోల్చవచ్చు
   సి) సమాంతరరేఖలు, సరళరేఖలు గీయడానికి ఉపయోగించవచ్చు.
   డి) సమబాహు, సమద్విబాహు, విషమబాహు త్రిభుజాలను వాటి ఆకారాలను ఏర్పరచలేము.
   1) ఎ, బి సరైనవి 2) బి, సి సరైనవి
   3) ఎ, డి సరైనవి 4) బి, డి సరైనవి
10. నూతన ప్రాకల్పనలు, న్యాయాలు, అమరికలను అభివృద్ధి చేయడం వంటి అంశాలు ఇమిడి ఉండే లక్ష్యం?
    1) విశ్లేషణ 2) సంశ్లేషణ
    3) వినియోగం 4) అవగాహన
11. గణితం నేర్చుకోవడానికి, సహజమైన, అనుకూలమైన పద్ధతి ఏది?
    1) ప్రతిస్థాపన పద్ధతి
    2) నిగమన పద్ధతి 3) విశ్లేషణ పద్ధతి
    4) సంశ్లేషణ పద్ధతి
12. 'రెండు బిందువుల ద్వారా ఒకే ఒక రేఖాఖండాన్ని గీయవచ్చు' అనే ప్రవచనం గణితం ఏ స్వభావాన్ని సూచిస్తుంది?
    1) గణితం తార్కికమైనది
    2) గణితం అంతర్బుద్ధితో ఏర్పడుతుంది.
    3) గణితం అమూర్త లక్షణం కలిగి ఉంటుంది.
    4) గణితం సహజమైన ఆలోచనా విధానాన్ని కలిగి ఉండటం
13. ప్రధానసంఖ్యలు అనంతమని తెల్పుతూ కరణీయ సంఖ్యలకు సంబంధించిన అనేక సమస్యలను సాధించిన శాస్త్రవేత్త?
    1) భాస్కరాచార్య 2) బ్రహ్మగుప్త
    3) యూక్లిడ్ 4) సెర్మా
14. 'గణితంలో విషయాల మీద అవగాహన యొక్క సాధారణీకరణం' అనేది ఏ విద్యా ప్రమాణంలో ఉంటుంది?
    1) వ్యక్తపరచడం
    2) కారణాలు, నిరూపణలు
    3) అనుసంధానం
    4) ప్రాతినిధ్యం దృశ్యాకరణ
15. డెరక్ హేలర్ సూచించిన గణితనమూనా విధానంలో సోపానాలు ఎన్ని?
    1) 6 2) 8 3) 5 4) 4
16. గణిత సమస్యల సాధన విధానంలో అల్గారిథమ్, అడకోరిథమ్ అనే విధానాల గురించి లేదా 8 – 5 = 3 అనే అంశంలో 8ని మినార్ ఎండ్ అని, 5ని సబ్ట్రాహెండ్ అని అంటారు. ఇలాంటి విషయాలు తెలుసుకునే ప్రదేశం?
    1) గణిత క్లబ్ 2) గణిత సంఘాలు
    3) గణిత ఫోరం 4) గణిత ప్రదర్శనలు
17. ప్రస్తుతం పాఠశాలల్లో అమలు పరుస్తున్న పీరియడ్ ప్రణాళికలో సోపానాల వరుస క్రమాన్ని గుర్తించండి.
    ఎ) బోధనాంశం బి) పాఠంపేరు
    సి) సాధించాల్సిన విద్యాప్రమాణాలు
    డి) పరిచయం ఇ) ప్రదర్శన-చర్చ
    1) ఎ, బి, సి, డి, ఇ 2) బి, సి, ఎ, డి, ఇ
    3) ఎ, సి, బి, డి, ఇ 4) బి, ఎ, సి, డి, ఇ
18. కింది ఏ మూల్యాంకన రకానికి నిర్దిష్ట సమయం ఇవ్వనవసరం లేదు?
    1) లోపనిర్ధారణ 2) నిర్మాణాత్మక
    3) సంగ్రహణాత్మక
    4) ప్రిడెక్టివ్ లేదా ప్రాగుక్తి
19. ప్రాచీనులు పిలిచిన అవ్యక్తగణితం అనే దానిని బీజగణితం అనే పేరుతో వ్యవహార రూపంలోకి తీసుకువచ్చిన మొదటి గణిత శాస్త్రవేత్త?
    1) భాస్కరాచార్య 2) యూక్లిడ్
    3) పృథూధకస్వామి 4) వరాహమిహిరుడు
20. గణిత సంఘ ప్రాథమిక ప్రాధాన్యతలో దేని నిర్వహణ చాలా కీలకమైనది ముఖ్యమైనది?
    1) ఫ్లానల్ బోర్డ్ 2) బులెటిన్ బోర్డ్
    3) జియోబోర్డ్ 4) డిస్‌ప్లే బోర్డ్
21. $\sqrt{625}$ = ? ఈ ప్రశ్న లక్ష్యం?
    1) అవగాహన 2) వినియోగం
    3) జ్ఞానం 4) నైపుణ్యం
22. ప్రాథమికోన్నత స్థాయిలో సమాంతర రేఖల ధర్మాలు బోధించడానికి అనువైన బోధనా పద్ధతి?
    1) విశ్లేషణ 2) ప్రాజెక్ట్
    3) ప్రయోగశాల
    4) సమస్యా పరిష్కారం
23. గొప్పకట్టడాల్లో గణిత సౌష్టవం దాగి ఉంది. ఇవన్నీ గణిత శాస్త్ర సూత్రాల ఆధారంగా నిర్మించబడ్డాయి అని తెలిపే విలువ?
    1) సాంస్కృతిక విలువ
    2) క్రమశిక్షణ విలువ
    3) ప్రయోజన విలువ
    4) సృజనాత్మక విలువ
24. సమాధానం ఇచ్చేటప్పుడు విద్యార్థికి స్వేచ్ఛను ఇచ్చే ప్రశ్నలు?
    1) విషయనిష్ఠ 2) వ్యాసరూప
    3) సంక్షిప్త సమాధాన
    4) పూరక ప్రశ్నలు
25. సాంఘికశాస్త్ర బోధనలో ఏ విధమైన ప్రశ్నల ద్వారా విద్యార్థులు విషయాన్ని స్వయంగా కనిపెట్టి కొత్త సాధారణీకరణాలను రూపొందిస్తారు?
    1) పునర్విమర్శ ప్రశ్నలు
    2) పాఠ్యాభివృద్ధి ప్రశ్నలు
    3) పరీక్షించడానికి ఉపయోగపడే ప్రశ్నలు
    4) నియత ప్రశ్నలు
26. భూమధ్యరేఖా ప్రాంతం గురించి చదివిన తరువాత.. దానికి, ధ్రువ ప్రాంతానికి ఉన్న తేడా ఏమిటి? అనే ప్రశ్న ద్వారా సాధించే విద్యా ప్రమాణం?
    1) ఇచ్చిన పాఠాన్ని చదివి అర్థం చేసుకొని వ్యాఖ్యానించడం
    2) సమాచార నైపుణ్యాలు
    3) సమకాలీన అంశాలపై ప్రతిస్పందన
    4) విషయవగాహన
27. 'సాంఘిక శాస్త్రం అనగా చారిత్రక, భౌగోళిక, సాంఘిక విషయాల అంతర్ సంబంధాల అధ్యయనమే' అని పేర్కొన్నవారు?
    1) జేమ్స్ హేమింగ్స్
    2) జాన్.వి.మైకేల్స్
    3) E.B. వెస్లీ 4) కొఠారి
28. 1986 జాతీయ విద్యా విధానంలోని పేర్కొనని అంశం గుర్తించండి.
    1) స్త్రీ, పురుష సమానత్వం
    2) భారత ప్రజలకు బీమా భద్రత
    3) పరిసరాల సంరక్షణ
    4) శాస్త్రీయ ధోరణి
29. విద్యార్థుల అభ్యసనంలో ఎదురయ్యే అన్ని ప్రశ్నలకు సమాధానాలిస్తూ కొనసాగుతూ, విశ్లేషణాత్మక, నిరంతర పరిశోధనాత్మక ఉపగమం ఏది?
    1) బహుళ విభాగ ఉపగమం
    2) క్రమబద్ధ శిక్షణ ఉపగమం
    3) పరస్పరాధారిత ఉపగమం
    4) సమస్య ఆధారిత ఉపగమం
30. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులు అనే అంశాన్ని చక్కగా అవగాహన కలిగించడానికి ఉపయోగపడే చార్టు?
    1) ఫ్లోచార్ట్ 2) టైమ్‌లైన్ చార్ట్
    3) వంశ వృక్షచార్టు 4) టేబుల్ చార్ట్
31. పాఠశాలలో విద్యార్థి శిక్షణా కార్యక్రమాలైన బోధనాంశాలు, కళలు, సాంకేతికవిద్య, ఆరోగ్య వ్యాయామవిద్య, జీవన ప్రమాణాలు మొదలైన అంశాల గురించి క్షుణ్ణంగా వివరించే రికార్డు?
    1) ప్రోగ్రెస్ రికార్డ్ 2) క్యుములేటివ్ కార్డు
    3) CCE రిజిస్టరు 4) వ్యక్తిగత రికార్డు
32. విద్యార్థుల భాషా సామర్థ్యాలు, వారి నిజాయితీ, అభిరుచులు, ఆసక్తులు మొదలైనవి తెలుసుకోవడానికి ఉపయోగడే సాధనం?
    1) లఘుపరీక్ష 2) పోర్ట్ ఫోలియో
    3) పిల్లలడైరీ 4) ప్రాజెక్ట్ పనులు
33. ఒక సాంఘికశాస్త్ర బోధకుడు మొదట గ్రామం, తరువాత జిల్లా, రాష్ట్రం, దేశం గురించి పరిచయం చేశాడు. అయితే ఈ అంశంలో సరైనటువంటి అనుభవాల స్వరూప లక్షణాలు ఉన్నాయి గుర్తించండి.
    ఎ) తెలిసిన విషయం నుంచి తెలియని విషయం
    బి) సరళత నుంచి సంక్లిష్టత
    సి) కష్టం నుంచి తేలికవైపునకు
    డి) ఊర్ధ్వముఖ ఆలోచన
    1) ఎ, బి, సి సరైనవి 2) బి, సి, డి సరైనవి
    3) ఎ, సి, డి సరైనవి 4) ఎ, బి, డి సరైనవి
34. గ్రీక్ తత్వవేత్తలు తమ శిష్యులతో అనేక విషయాలను చర్చించిన పద్ధతి?
    1) సారూప్య పద్ధతి 2) చర్చా పద్ధతి
    3) సమస్యా పద్ధతి 4) ప్రకల్పనా పద్ధతి
35. NCF-2005 ప్రకారం ఎలిమెంటరీ స్థాయి వరకు సాంఘికశాస్త్ర బోధన ఏ పద్ధతిలో సాగాలి?
    1) విభాగాల పద్ధతి 2) సమ్మిళిత విధానం
    3) అంశాల పద్ధతి 4) ప్రత్యేకశాస్త్ర పద్ధతి
36. 'సాంఘికశాస్త్ర పరిధి చాలా విశాలమైంది. సాంఘికశాస్త్రం ప్రపంచవ్యాప్తంగా మానవుని ప్రస్తుత సమాజానికి సంబంధించింది' అని పేర్కొన్నవారు?
    1) హేమింగ్స్ 2) ఆడమ్స్
    3) వెస్లీ & రాన్‌స్కీ 4) నికోలస్ రైట్
37. మానసిక చలనాత్మక రంగంలో ఏ లక్ష్యంలో చలనేంద్రియాలకు బదులు జ్ఞానేంద్రియాలు ప్రధాన పాత్రను పోషిస్తాయి?
    1) హస్తలాఘవం 2) అనుకరణ
    3) సునిశితత్వం 4) సహజీకరణ
38. విద్యార్థుల ప్రతిభను లేదా వారిలోని అవగాహన లోపాన్ని నమోదు చేసి ప్రత్యామ్నాయ మార్గాలను గుర్తించడానికి ఉపయోగపడేది?
    1) పిల్లల డైరీ 2) టీచర్స్ డైరీ
    3) శోధన సూచిక 4) రేటింగ్ స్కేలు
39. వైగాట్‌స్కీ ZPDకి సంబంధం ఉన్న పద్ధతి?
    1) ప్రయోగశాల 2) సహకార అభ్యసనం
    3) సహయోగ అభ్యసనం
    4) 5E అభ్యసన నమూనా
40. కిందివాటిలో సరైన దానిని గుర్తించండి.
    ఎ) భావనలు సాధారణీకరణంలో భాగం
    బి) సాధారణీకరణాలు భావనలలో భాగం
    సి) మొక్కలు నీటిని పీల్చుకుంటాయి అనేది ఒక యథార్థం
    డి) నియమిత పరిస్థితులలో మాత్రమే యథార్థమై, సప్రమాణత కలిగిఉండేది సూత్రం
    1) ఎ, డి సరైనవి 2) బి, డి సరైనవి
    3) ఎ, సి సరైనవి 4) బి, సి సరైనవి
41. ద్రవ పదార్థాలను వేడిచేసినప్పుడు అవి వ్యాకోచిస్తాయని విద్యార్థి తెల్పగలగడం ఏ విద్యా ప్రమాణం?
    1) పరికల్పన-ప్రశ్నించడం
    2) ప్రయోగాలు క్షేత్రపరిశీలనలు
    3) సమచార సేకరణ 4) విషయావగాహన
42. అభినందించే గుణం అభివృద్ధి చెందే వర్గం?
    1) ప్రతిస్పందన 2) విలువకట్టడం
    3) వ్యవస్థాపన 4) గ్రహించటం
43. అన్వేషణ పద్ధతిలో విషయజ్ఞాన సముపార్జన కన్నా శాస్త్రీయ విధానానికి ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నవారు?
    1) ఆర్మ్ స్ట్రాంగ్ 2) థర్‌స్టన్
    3) ప్రస్టన్ 4) వెస్టవే
44. 5E నమూనాలో ఏ దశలో అభ్యాసకులు తమ అనుభవాల ద్వారా సంపాదించిన జ్ఞానాన్ని నూతన పరిస్థితులలో వినియో గించుకుంటారు?
    1) విస్తరణ 2) విశ్లేషణ
    3) పాల్గొనడం 4) వివరణ
45. ఒక 'అధీకృత నియమం' లేదా మార్గదర్శ కత్వానికి నిర్దిష్ట ప్రమాణంగా ఉండేది ఏది?
    1) రేటింగ్ స్కేలు 2) పరిశీలన పత్రము
    3) రూబ్రిక్స్ 4) సంచిత పత్రావళి
46. థారన్‌డైక్ అభ్యసనా సూత్రమైన సంసిద్ధతా నియమాన్ని తృప్తిపరచే ఎడ్గార్‌డేల్ శంకువులో ఉన్న అంశం ఏది?
    1) నమూనాలు
    2) చలనచిత్రాలు
    3) ప్రయోగాలు పరిశీలనలు
    4) క్షేత్ర పర్యటనలు
47. తరగతి గదిలోని సమస్యకు అవసరమైన పరిష్కారాలను కనుగొనేందుకు పనిచేసే సంస్థ?
    1) ఖాన్ అకాడమీ 2) జోడోజ్ఞాన్
    3) ఏకలవ్య 4) విక్రమ్‌శిలా
48. 15వ శతాబ్దంలోని విద్యావిధానంలో కంఠస్థ పద్ధతిని తొలగించాలని సూచించినవారు?
    1) రూసో 2) ప్రెస్లీ
    3) ఇరాస్‌మిస్ 4) ప్రోబెల్

సమాధానాలు

1) 1	2) 1	3) 2	4) 1	5) 4
6) 1	7) 2	8) 2	9) 3	10) 2
11) 1	12) 2	13) 3	14) 1	15) 4
16) 3	17) 4	18) 1	19) 3	20) 2
21) 4	22) 3	23) 1	24) 2	25) 2
26) 4	27) 1	28) 2	29) 2	30) 2
31) 2	32) 3	33) 4	34) 2	35) 2
36) 4	37) 2	38) 2	39) 3	40) 4
41) 4	42) 2	43) 4	44) 1	45) 3
46) 2	47) 2	48) 3		

మృత్తికలు.. సాగుకు మూలాధారం!

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
భూగోళశాస్త్రం

మృత్తికలు లేదా నేలలు వ్యవసాయ పంటలకు, సహజ ఉద్భిజ సంపదకు మూలాధారం. మృత్తికల ఆవిర్భావ ప్రక్రియ చాలా సంక్లిష్టమైంది. ఈ సహజ సిద్ధ ప్రక్రియను 'పిడోజెనెసిస్' అంటారు. ఒక సెంటీమీటరు మందం ఉన్న మృత్తిక ఏర్పడటానికి అయిదు నుంచి పది వేల సంవత్సరాల వరకు పడుతుంది!

మృత్తికలు

వ్యవసాయానికి కీలకమైన మృత్తికలు క్రమేణా క్రమక్షయం చెందుతున్నాయి. ఇది ఆవరణ వ్యవస్థల సుస్థిరతపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుంది. పర్యావరణ సమతౌల్యం సాధించడానికి మృత్తికా సంరక్షణ అనివార్యం. మనదేశంలోని మృత్తికలు...

1. ఒండ్రుమట్టి నేలలు 2. నల్లరేగడి నేలలు
3. ఎర్ర నేలలు 4. నలుపు-ఎర్ర మిశ్రమ నేలలు
5. లేటరైట్ నేలలు 6. ఎడారి నేలలు
7. అటవీ నేలలు 8. క్షార లేదా ఆమ్ల నేలలు

ఒండ్రుమట్టి నేలలు

ఈ నేలలు గంగా-సింధు-బ్రహ్మపుత్ర మైదానం, తీర మైదానాలు, డెల్టాలు, నదీ హరివాణా ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి. ఈ నేలలు చాలా సారవంతమైనవి. వీటిలో పంట దిగుబడి అధికంగా ఉంటుంది. ఒండ్రుమట్టి నేలలు రవాణా నేలల తరగతికి చెందినవి. మాతృక శిలలు వేర్వేరు ప్రాంతాలకు చెందినవి. దాంతో ఒండ్రుమట్టి నేలల్లో వివిధ స్థూల, సూక్ష్మ పోషకాలు ఉంటాయి. అందువల్ల ఈ నేలలు అనేక రకాల పంటల సాగుకు అనువైనవి.

ఈ నేలలు లోమీ(Loamy) తరగతికి చెందినవి కావడం వల్ల తేమను బాగా పీల్చుకొని నిల్వ ఉంచుకుంటాయి. మృత్తికా కణాలు గోళాకారంలో ఉండటం వల్ల ఈ నేలలు దున్నడానికి చాలా అనువైనవి. ఒండ్రుమట్టి నేలలను తీర ప్రాంత, నదీ, డెల్టా అని మూడు రకాలు విభజించారు. ప్రతి ఏటా శిలా పదార్థాలు నిక్షేపించడం వల్ల డెల్టా నేలలు సారవంతంగా తయారవుతాయి. సాపేక్షంగా పరిశీలిస్తే తీరప్రాంత ఒండ్రుమట్టి నేలల్లో వ్యవసాయ దిగుబడి తక్కువ.

నల్లరేగడి నేలలు

వింధ్యా-సాత్పురా పర్వత శ్రేణుల నుంచి మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వరకు నల్లరేగడి మండలం విస్తరించి ఉంది. ఈ నేలలు ప్రధానంగా గుజరాత్, మధ్యప్రదేశ్‌లలోని మాళ్వా పీఠభూమి, పశ్చిమ మహారాష్ట్ర, ఉత్తర కర్ణాటక, పశ్చిమ తెలంగాణ ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి. దక్కన్ నాపల ప్రాంతంలో బసాల్ట్ తరగతికి చెందిన అగ్నిశిలలు తీవ్ర క్రమక్షయం వల్ల నల్లరేగడి నేలలుగా ఏర్పడ్డాయి. ఇవి తేమను పీల్చుకొని ఎక్కువ కాలం తమలో నిల్వ చేసుకుంటాయి. అందువల్ల ఈ నేలలు వర్షాధార వ్యవసాయానికి అనువైనవి. నీటి ముంపునకు గురైతే ముద్దగా మారి సాగుకు అనువుగా ఉండవు. అందువల్ల నల్లరేగడి నేలల్లో సాగునీటి వ్యవసాయం సాధ్యం కాదు. ఇవి పత్తిసాగుకు చాలా అనువైనవి.

ఎర్రనేలలు

భారత్‌లోని పీఠభూమి ప్రాంతంలో ఈ నేలలు విస్తరించి ఉన్నాయి. ఇవి పోషకాల పరంగా సారవంతమైనవి. అయితే ఎర్ర ఇసుక నేలల్లో పంటల దిగుబడి తక్కువ. తెలంగాణ , రాయలసీమ, ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల్లోని నేలలు ఈ తరగతికి చెందినవి. గులకరాళ్లు, బండ రాళ్లు పరుచుకొని ఉంటాయి. అందువల్ల ఈ నేలలను సాగులోకి తేవడం చాలా వ్యయ ప్రయాసలతో కూడుకున్నది. ఈ నేలలను ఆంధ్ర ప్రదేశ్‌లో స్థానికంగా చెలకలు అంటారు. వీటిలో పంటల దిగుబడి తక్కువ. వరుసగా పంటలను సాగు చేస్తే త్వరగా సారాన్ని కోల్పోతాయి. సాగునీరు, ఎరువులను వాడటం వల్ల దిగుబడిని స్థిరీకరించవచ్చు. ఎర్రనేలలు, నల్లరేగడి మండలాల మధ్య ప్రాంత నేలల్లో ఈ రెండింటి మిశ్రమ లక్షణాలు కనిపిస్తాయి.

లేటరైట్ నేలలు

భారతదేశంలోని కొండలు, పీఠభూమి శిఖర భాగాల్లో లేటరైట్ నేలలు ఏర్పడ్డాయి. అధిక వర్షపాతం, ఉష్ణోగ్రత ఉన్న ప్రాంతాల్లో ఇవి ఏర్పడతాయి. ఖనిజ పోషకాలు ఈ నేలల పైపొరల నుంచి కింది పొరల్లోకి ఇంకిపోతాయి. దీనివల్ల పైపొరల్లో కేవలం ఫెర్రస్ ఆక్సైడ్, అల్యూమినియం హైడ్రాక్సైడ్ లాంటి ఖనిజాలు మాత్రమే మిగులుతాయి. అందువల్ల ఇవి వ్యవసాయానికి అంతగా అనువైనవి కావు. ఈ నేలలు ముదురు జేగురు వర్ణంలో ఉంటాయి. సహ్యాద్రి, అన్నామలై, వింధ్యా పర్వతాలు, తూర్పు కనుమల శిఖరాల్లోని నేలలు ఈ కోవకు చెందినవి.

ఎడారి నేలలు

ఈ నేలలు పశ్చిమ రాజస్థాన్, ఉత్తర గుజరాత్‌లలో విస్తరించి ఉన్నాయి. వీటి పైపొరల్లో కఠిన లవణాలు ఉంటాయి. అందువల్ల ఇవి వ్యవసాయానికి పనికిరావు. సాగు నీటి ద్వారా ఉపరితల కఠిన పొరను తొలగిస్తే పంటలు పండించే అవకాశం ఉంటుంది. పశ్చిమ రాజస్థాన్ లోని ఇందిరాగాంధీ కాలువ ఆయకట్టు ప్రాంతంలో సాగునీటి ద్వారా కఠిన లవణ పొరను తొలగించి పంటలను సాగు చేస్తున్నారు.

ఆమ్ల (క్షార) మృత్తికలు

నిస్సారమైన ఈ మృత్తికలు ఒండ్రుమట్టి నేలల్లో చెదురుమదురుగా కనిపిస్తాయి. ఈ మృత్తికలను స్థానికంగా కల్లార్, రే, ఉసార్, నేలలు అంటారు. ఈ చౌడు నేలలను తటస్థీకరించడానికి సున్నం, జింక్‌లను నేలలకు కలుపుతారు. ఈ మృత్తికల్లో వ్యవసాయ పంటల దిగుబడి తక్కువ. కేరళ తీర ప్రాంతంలోని కొచ్చిన్, అల్లెప్పీల సమీపంలో 'పీట్' తరగతికి చెందిన నేలలు విస్తరించి ఉన్నాయి.

మృత్తికా సంరక్షణ చర్యలు

వేగంగా ప్రవహించే నదుల వల్ల మృత్తికా క్రమక్షయం జరుగుతుంది. కొండల వాలులో చెట్లు నాటడం వల్ల నేలల క్రమక్షయాన్ని తగ్గించవచ్చు. మృత్తికా సంరక్షణ కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోంది. కాంటూర్ బండింగ్, సోపాన వ్యవసాయం, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, వాటర్‌షెడ్ పథకాల నిర్వహణపై దృష్టి కేంద్రీకరిస్తోంది. నేలల క్రమక్షయాన్ని తగ్గించడానికి రైతులు మల్చింగ్, స్ట్రిప్‌క్రాపింగ్ వంటి పద్ధతులను అనుసరిస్తున్నారు. పంట చేతికొచ్చిన తర్వాత మిగిలిన రొట్టను పొలంలోనే ఉంచి దున్నడం ద్వారా నేలల సారాన్ని పెంచొచ్చు. మల్చింగ్ పద్ధతిలో రొట్టను పొలంలో పరిచి, పవనాల వల్ల నేలల క్రమక్షయాన్ని అరికట్టొచ్చు. స్ట్రిప్ క్రాపింగ్ పద్ధతిలో వివిధ కాల వ్యవధుల్లో కోతకు వచ్చే పంటలను వరుసల్లో పెంచుతారు. చంబల్-యమునా లోయ ప్రాంతంలో నేలల తీవ్ర క్రమక్షయం వల్ల గల్లీలు, రావైన్‌లు ఏర్పడి ఆ ప్రాంతమంతా 'బ్యాడ్‌ల్యాండ్' భూస్వరూపాన్ని సంతరించుకుంది. ఈ ప్రాంతంలో భూవనరులను పునరుద్ధరించడానికి ప్రభుత్వం ప్రత్యేక పథకాన్ని అమలు చేస్తోంది. పంటల మార్పిడి పద్ధతి ద్వారా కూడా నేలల సారం పెంచొచ్చు. లెగ్యూమ్ జాతికి చెందిన పంటలను మార్పిడి పంటగా వాడుతున్నారు!!



రాణిగంజ్.. దేశంలోని అతిపెద్ద బొగ్గు క్షేత్రం

భారతదేశంలో విస్తారమైన బొగ్గు నిల్వలు ఉన్నాయి. వీటిలో కోకింగ్ రకం తక్కువగా ఉండటం వల్ల ఆస్ట్రేలియా, చైనాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. నదీ పరీవాహక ప్రాంతాల్లో సహజ వాయువు అపారంగా లభిస్తోంది. సహజ వాయువు రంగంలో స్వయం సమృద్ధి సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

భారతదేశం- ఇంధన వనరులు

ఇంధనాలు ప్రధానంగా రెండు రకాలు అవి
1) శిలాజ ఇంధనాలు
ఉదా: బొగ్గు, చమురు, సహజవాయువు.
2) అణు ఇంధనాలు
ఉదా: యురేనియం, థోరియం, ప్లుటోనియం, రేడియం.

భారతదేశంలో సుమారుగా 220 బిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఇందులో 200 బిలియన్ టన్నులు బిట్యూమినస్, 20 బిలియన్ టన్నులు లిగ్నైట్ రకానికి చెందినవి. ఆంథ్రసైట్, పీట్ తరగతికి చెందిన బొగ్గు నిల్వలకు మనదేశంలో అంతగా ప్రాధాన్యం లేదు.

బొగ్గు నిల్వలు: భారతదేశంలో బొగ్గు నిల్వలు ప్రధానంగా గోండ్వానా యుగానికి చెందినవి. ఇవి సుమారు 200 మిలియన్ సంవత్సరాల క్రితం నదీ హరివాణాల్లో ఏర్పడ్డాయి. భారతదేశపు బొగ్గు నిల్వలు ప్రధానంగా నాన్‌కోకింగ్ రకానికి చెందినవి. కోకింగ్ రకానికి చెందిన నాణ్యమైన బొగ్గును ఉక్కు కర్మాగారాల్లోని బ్లాస్ట్ ఫర్నేస్‌లలో వాడతారు. ఈ కోకింగ్ బొగ్గు నిల్వలు చాలా తక్కువగా ఉన్నాయి.

బొగ్గు క్షేత్రాలు: భారతదేశంలో బొగ్గు క్షేత్రాలు దామోదర్, మహానది, సోన్, గోదావరి, వార్ధా నదీ హరివాణాల్లో కేంద్రీకృతమై ఉన్నాయి. దేశంలో 60 శాతం బొగ్గు దామోదర్ నదీలోయ క్షేత్రాల నుంచే ఉత్పత్తి అవుతోంది. దామోదర్ నదీలోయ జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో విస్తరించి ఉంది. ఝరియా, రాణిగంజ్, గిర్డి, బొకారో, పాతకేరా ఈ ప్రాంతంలోని అతి పెద్ద బొగ్గు క్షేత్రాలు. పశ్చిమబెంగాల్‌లో రాణిగంజ్.. దేశంలోని అతిపెద్ద బొగ్గు క్షేత్రం. మహానది-సోన్ నదీ హరివాణాలు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయి. ఇది గోదావరి-వార్ధా లోయ తెలంగాణ, మహారాష్ట్రల్లో విస్తరించి ఉంది. ఇక్కడ కోర్బా, సింగ్రోలి, టాల్చేర్, ఇబ్‌లోయ, బిలాస్‌పూర్ ముఖ్యమైన బొగ్గు క్షేత్రాలు. మహారాష్ట్రలోని కాంప్టీ, చాందా, బలార్షా బొగ్గు క్షేత్రాలు, తెలంగాణలోని సింగరేణి బొగ్గు క్షేత్రం ఈ లోయలో భాగంగా ఉన్నాయి.

ఈశాన్యంలో బొగ్గు నిల్వలు: ఈశాన్య భారతదేశంలోని బొగ్గు నిల్వలు టెరిషరీ యుగానికి చెందినవి. వీటి బొగ్గులో గంధకం శాతం ఎక్కువ. అందువల్ల ఈ బొగ్గు పారిశ్రామిక విలువ తక్కువ. ఈశాన్య భారతంలో అసోం, అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్ రాష్ట్రాల్లో బొగ్గు నిల్వలున్నాయి. అసోంలోని మాకుమ్, నాగాలాండ్‌లోని నజీరా లోయ ప్రధాన బొగ్గు క్షేత్రాలు.

లిగ్నైట్ బొగ్గు: లిగ్నైటు బొగ్గు మృదువైంది. దీన్ని విద్యుత్ ఉత్పత్తికి మాత్రమే ఉపయోగిస్తారు. తమిళనాడు, డార్జిలింగ్, రాజస్థాన్‌లలో నిల్వలు ఉన్నాయి.


పీట్ బొగ్గు: పీట్ బొగ్గు అపరిపక్వమైంది. ఇందులో సేంద్రియ పదార్థం ఎక్కువగా ఉంటుంది. దీని కెలోరి విలువ చాలా తక్కువ. 'పీట్' తరగతికి చెందిన బొగ్గు నిల్వలు కేరళలోని కొచ్చిన్, అల్లెప్పీలలో విస్తరించి ఉన్నాయి.

అవక్షేప శిలల్లో చమురు: చమురు- సహజవాయువు నిల్వలు అవక్షేప శిలల్లో మాత్రమే లభిస్తాయి. ఖండ భాగాల్నే కాకుండా సముద్ర భూతలంపైన ఖండతీర అంచుల్లో కూడా చమురు సహజ వాయువు నిల్వలు ఉంటాయి. మహారాష్ట్ర తీరంలోని ముంబై హై, బేసిన్ క్షేత్రాలు భారతదేశంలో చమురు, సహజవాయువును ఉత్పత్తి చేసే ముఖ్య ప్రాంతాలు. గుజరాత్ తీరంలోని కంభత్ సింధుశాఖలో గాంధార్, వాస్నా, లూనెజ్ ముఖ్య క్షేత్రాలు. గుజరాత్ ఖండాంతర్భాగంలో మెహసానా, కాలోల్, అంకలేశ్వర్, హాజీరా ఇతర చమురు-సహజవాయువు క్షేత్రాలు.

యురేనియం నిల్వలు: మనదేశంలో యురేనియం నిల్వలు జార్ఖండ్, ఆంధ్రప్రదేశ్, మేఘాలయా, తెలంగాణ రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయి. జార్ఖండ్‌లోని 'జాడుగుడా' ముఖ్యమైన యురేనియం గనుల కేంద్రం. మేఘాలయాలోని డొమియోస్టాట్, ఆంధ్రప్రదేశ్‌లోని కడప, తెలంగాణలో నల్గొండల్లో యురేనియం నిల్వల ఉన్నాయి.

మోనజైట్: కేరళ తీరంలోని ఇసుకలో మోనజైట్ లభిస్తోంది. ఇది ఇసుక, థోరియం, యురేనియం, ప్లుటోనియంల మిశ్రమం. ప్రపంచ మోనజైట్ నిల్వల్లో భారతదేశం మొదటి స్థానంలో ఉంది. ఈ గనులు, వాటి శుద్ధి కేంద్రాలు కేరళలోని క్విలన్, తమిళనాడులోని మనం కురిచ్చి, మహారాష్ట్రలోని రత్నగిరి, ఒడిశాలోని ఛత్రపూర్‌లలో ఉన్నాయి.

దేనికి ఫుట్‌బాల్ లాంటి నిర్మాణం ఉంటుంది?



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

రసాయన శాస్త్రం

మాదిరి ప్రశ్నలు

ఇటీవల డిసెంబర్ 2018లో జరిగిన ఆర్ఆర్‌బీ పరీక్షల ప్రశ్నల సరళిని గమనిస్తే రసాయన శాస్త్రంలో అనువర్తిత అంశాలపై కాకుండా నేరుగా ప్రశ్నలు అడగడాన్ని గమనించవచ్చు. 8-10వ తరగతి పాఠ్యాంశాలపై అవగాహన ఉంటే సరిపోతుంది.

1. మెండలీఫ్ ఆవర్తన పట్టికలోని గ్రూపులు ఎన్ని?
 1) 8 2) 8
 3) 18 4) 14
 జ: 2;

వివరణ: డాబర్‌నీర్, న్యూలాండ్స్, లోథర్‌మేయర్‌ల తర్వాత విస్తృతంగా మూలకాల వర్గీకరణ చేపట్టిన శాస్త్రవేత్త రష్యాకు చెందిన డిమిత్రీ మెండలీఫ్.

మెండలీఫ్ అప్పటికే కనుగొన్న 63 మూలకాలను, వాటి పరమాణు భారాల ఆరోహణ క్రమంలో అమర్చినప్పుడు, నిర్దిష్ట వ్యవధులతో మూలకాల ధర్మాలు పునరావృతం కావడం గమనించాడు. దీని ఆధారంగానే 'మూలకాల ధర్మాలు, వాటి పరమాణు భారాల ఆవర్తన ప్రమేయాలు' అనే ఆవర్తన నియమాన్ని ప్రతిపాదించాడు.


మెండలీఫ్ ఆవర్తన పట్టికలో 7 పీరియడ్‌లు (అడ్డువరసలు), ఎనిమిది గ్రూప్‌లు (నిలువు గడులు) ఉన్నాయి.

2. కింది వాటిలో ఆవర్తన పట్టికలో భాగం కానివేవి?
 1) హాలోజెన్‌లు 2) కార్సినోజెన్‌లు
 3) లాంథనైడ్‌లు 3) ఆక్టినైడ్‌లు
 జ: 2

వివరణ: 1, 3, 4లు ఆధునిక ఆవర్తన పట్టికలోని వివిధ కుటుంబాల పేర్లు. కార్సినోజెన్‌లు అంటే క్యాన్సర్ కారక సమ్మేళనాలు.

ఆవర్తన పట్టికలో వివిధ గ్రూపుల్లోని మూలకాలను, వాటి ధర్మాల ఆధారంగా వివిధ పేర్లతో వ్యవహరిస్తారు.

- మొదటి గ్రూప్ (IA లేదా 1)లోని మూలకాలు (Li, Na, K, Rb, Cs) ఆక్సైడ్‌లు నీటిలో కరిగి బలమైన క్షారాలనిస్తాయి. అందుకే వీటిని క్షార లోహాలు అంటారు.
- రెండో గ్రూపు (IIA లేదా 2) మూలకాలు (Be, Mg, Ca, Sr, Ba) ప్రకృతిలో స్వేచ్ఛా స్థితిలో లభిస్తాయి. వీటి ఆక్సైడ్‌లు ఉష్ణ స్థిరత్వం (వేడి చేసినా విఘటనం చెందని ధర్మం) కలిగి క్షార ధర్మాలను ప్రదర్శిస్తాయి. వీటిని క్షార మృత్తిక లోహాలు అంటారు.
- 15వ గ్రూప్ (15 లేదా VA) మూలకాలైన N, P, As, Sb, Biలను నిక్టోజన్‌లు అంటారు. గ్రీక్ భాషలో Pnico అంటే ఊపిరాడకుండా చేయు అని అర్థం.
- 16వ గ్రూప్ (VIA) మూలకాలైన O, S, Se, Te, Poలను చాల్కోజన్‌లు అంటారు. అనేక మూలకాలు, ధాతువులు ఆక్సిజన్ లేదా సల్ఫర్ సమ్మేళనాలుగా ఉంటాయి. అందుకే వీటిని చాల్కోజన్‌లు (ధాతువులను ఏర్పరచేవి) అంటారు.
- 17వ గ్రూప్ (VIIA) గ్రూప్‌లోని F, Cl, Br, Iలను హాలోజన్‌లు అంటారు. వీటికి లవణాలను ఏర్పరిచే (హాలస్: లవణాలను ఏర్పర్చడం) గుణం ఉండటం వల్ల అలా పిలుస్తారు.
- 18వ గ్రూప్ (O గ్రూప్)నకు చెందిన He, Ne, Ar, Kr, Xe, Rnలకు చర్యాశీలత దాదాపుగా ఉండదు. అందుకే వీటిని జడవాయువులని అంటారు.
- ఆవర్తన పట్టికలో s-బ్లాక్, p-బ్లాకులను కలుపుతూ ఉన్న 10 గ్రూపుల మూలకాలను d-బ్లాక్ మూలకాలంటారు. వీటిలో జింకు గ్రూప్ తప్ప మిగిలిన మూలకాలను పరివర్తన మూలకాలంటారు. f -బ్లాక్ మూలకాలను అంతర పరివర్తన మూలకాలంటారు.
- ఇక జడవాయువులు, పరివర్తన, అంతర పరివర్తన మూలకాలు తప్ప మిగిలిన మూలకాలన్నిటిని ప్రాతినిథ్య మూలకాలని పిలుస్తారు.



3. ఒక మూలకం ఎలక్ట్రాన్ విన్యాసం 2, 8, 2. ఆధునిక ఆవర్తన పట్టికలో అది____వ గ్రూప్‌నకు చెందుతుంది.
 1) 5 2) 8 3) 2 4) 12
 జ: 3;

వివరణ:వివిధ కర్పరాల్లోని ఉపకర్పరాల్లో ఎలక్ట్రాన్ ఏ విధంగా వితరణ చెంది ఉన్నాయో ఎలక్ట్రాన్ విన్యాసం తెలియజేస్తుంది. వివిధ కక్ష్యల్లోని ఎలక్ట్రాన్‌ల సంఖ్యను 'కామా' గుర్తుతో వేరు చేస్తారు. చివరి కర్పరాల్లోని ఎలక్ట్రాన్‌లను వేలన్స్ ఎలక్ట్రాన్‌లు అంటారు. పై ప్రశ్నలో వేలన్స్ ఎలక్ట్రాన్‌ల సంఖ్య 2 కాబట్టి దీని గ్రూప్ సంఖ్య 2. వేలన్స్ ఎలక్ట్రాన్‌ల సంఖ్య ఆధారంగా గ్రూప్‌లను కింది విధంగా గుర్తించవచ్చు.

వేలెన్స్ ఎలక్ట్రాన్‌లు	1	2	3	4	5	6	7	8
గ్రూపు	1 IA	2 IIA	13 IIIA	14 IVA	15 VA	16 VIA	17 VIIA	18 O
మూలకం	Li	Be	B	C	N	O	F	Ne
ఎలక్ట్రాన్ విన్యాసం	2, 1	2, 2	2, 3	2, 4	2, 5	2, 6	2, 7	2, 8
మూలకం	Na	Mg	Al	Si	P	S	Cl	A
ఎలక్ట్రాన్ విన్యాసం	2, 8, 1	2, 8, 2	2, 8, 3	2, 8 ,4	2, 8, 6	2, 8,6	2, 8, 7	2, 8, 8

4. కింది వాటిలో దేని పరమాణుకత ఒకటి?
 1) ఆక్సిజన్ 2) ఆర్గాన్
 3) హైడ్రోజన్ 4) సల్ఫర్
 జ: 2

వివరణ: ఒక అణువులోని పరమాణువుల సంఖ్యను దాని పరమాణుకత అంటారు. వేర్వేరు మూలకాల పరమాణుకత వేర్వేరుగా ఉంటుంది.

- లోహాల పరమాణుకత ఒకటి (ఉదా: లిథియం, సోడియం, ఐరన్)
- జడవాయువుల పరమాణుకత ఒకటి (హీలియం, నియాన్, ఆర్గాన్, క్రిప్టాన్, క్జినాన్, రేడాన్)
- ఆక్సిజన్, నైట్రోజన్, హైడ్రోజన్‌లతోపాటు హాలోజన్‌లు (ఫ్లోరిన్, క్లోరిన్, బ్రోమిన్, అయోడిన్)లు ద్విపరమాణుకాలు.
- ఓజోన్ పరమాణుకత - 3
- ఫాస్ఫరస్ పరమాణుకత - 4.
- సల్ఫర్ పరమాణుకత - 8.

5. 144గ్రా. మెగ్నీషియంలో ఉన్న గ్రామ్ పరమాణువుల సంఖ్య ____
 1) 6 2) 144
 3) 32 4) 64
 జ: 1

వివరణ: మూలకాల పరమాణు భారాన్ని గ్రామ్‌లలో వ్యక్తపరిస్తే దాన్ని ఒక 'గ్రామ్ పరమాణువు'గా పేర్కొంటారు.

ఉదా: Mg పరమాణుభారం 24 యూనిట్‌లు. కాబట్టి ఒక గ్రామ్ పరమాణువు మెగ్నీషియం = 24 గ్రామ్‌లు

24 గ్రా. మెగ్నీషియం = 1 గ్రామ్ పరమాణువు

144 గ్రా. మెగ్నీషియం

$= \frac{144}{24} = 6$ గ్రామ్ పరమాణువులు.

మరికొన్ని మూలకాల పరమాణు భారాలు (గ్రా) కింద ఇచ్చారు.

H	C	N	O	F	Na	Mg
1	12	14	16	17	23	24
Al	P	S	Cl	K	Ca	
23	31	32	35.5	39	40	

6. NaCl ఫార్ములా యూనిట్ భారం?
 1) 5.85 u 2) 58.5 u
 3) 0.585 u 4) 584 u

వివరణ:

సోడియం (Na) పరమాణు భారం= 23
క్లోరిన్ పరమాణు భారం = 35.5
NaCl/ఫార్ములా యూనిట్ భారం =58.5 u

7. కిందివాటిలో క్షార ధర్మం కానిదేది?
 1) ఎరుపు లిట్మస్‌ను నీలిగా మారుస్తుంది.
 2) కొవ్వు పదార్థాలను కరిగించుకుంటుంది.
 3) నీటిలో హైడ్రోజన్ అయాన్‌లను ఇస్తుంది.
 4) సబ్బు వంటి జారుడు గుణం ఉంటుంది.
 జ: 3;

వివరణ: సాధారణంగా రుచికి పుల్లగా ఉన్నవి ఆమ్లాలు, సబ్బులాగా మృదువైన స్పర్శ ఉన్నవి క్షారాలు.

- ఆమ్లాలు నీలి లిట్మస్‌ను ఎరుపుగా, క్షారాలు ఎరుపు లిట్మస్‌ను నీలిగా మారుస్తాయి.
- ఆర్హీనియస్ సిద్ధాంతం ప్రకారం ఆమ్లాలు నీటిలో హైడ్రోజన్ అయాన్లను, క్షారాలు హైడ్రాక్సిల్ అయాన్లను ఇస్తాయి.
- లోహాలు, లోహ ఆక్సైడ్‌లు నీటిలో కరిగి క్షారాలనిస్తాయి.(ఉదా: సోడియం ఆక్సైడ్, కాల్షియం ఆక్సైడ్)
- అలోహ ఆక్సైడ్‌లు నీటిలో కరిగి ఆమ్లాలనిస్తాయి.(ఉదా: సల్ఫర్, నైట్రోజన్, కార్బన్ ఆక్సైడ్‌లు)
- కొవ్వులను గాఢ క్షారాలతో కలిపి వేడిచేస్తే జలవిశ్లేషణ (సపోనిఫికేషన్) జరిగి సబ్బులు ఏర్పడతాయి.
- క్షారాలు ఫినాఫ్తలీన్ సూచికను పింక్ రంగుకు, మిథైల్ ఆరెంజ్ సూచికను పసుపు రంగుకు మారుస్తాయి.
- ఆమ్లాలు మిథైల్ ఆరెంజ్ సూచికను నారింజ రంగుకు మారుస్తాయి. ఫినాఫ్తలీన్ రంగు చూపదు.

8. కింది వాటిలో సరికాని జత ఏది?
 1) రక్తం p^H : 7.4
 2) వెనిగర్ p^H : 2.2
 3) శుద్ధమైన నీరు p^H : 7.5
 4) పాలు p^H : 6.6
 జ: 2;

వివరణ: ఆమ్ల- క్షార బలాలను కొలవడానికి p^H స్కేలును ఉపయోగిస్తారు. దీన్ని సొరెన్‌సెన్ అనే శాస్త్రవేత్త పరిచయం చేశాడు. హైడ్రోజన్ అయాన్ గాఢత రుణ సంవర్గమానాన్నే p^Hగా నిర్వచించారు.

$p^H = -\log[H^+]$

ఆమ్ల ద్రావణం : $p^H < 7$

తటస్థ ద్రావణం : $p^H = 7$

క్షార ద్రావణం : $p^H > 7$

కొన్ని సాధారణ ద్రవాల p^H విలువలు కింది విధంగా ఉంటాయి.

ద్రవం	p^H	ధర్మం
గ్యాస్ట్రిక్ రసం	1 - 2	ఆమ్లం
ఆపిల్ రసం	3.0	ఆమ్లం
నిమ్మరసం	2 - 3	ఆమ్లం
వెనిగర్	2.2- 2.5	ఆమ్లం
మూత్రం	4.8- 7.5	ఆమ్ల-క్షార
సోడా	5.5	ఆమ్లం
లాలాజలం	6.4- 6.9	ఆమ్లం
పాలు	6.6- 6.8	ఆమ్లం
బ్లాక్ కాఫీ	5.0	ఆమ్లం
టోమాటో రసం	4.5	ఆమ్లం
వర్షపు నీరు	6.5- 6.9	ఆమ్లం
స్వచ్ఛమైన నీరు	7	తటస్థం
రక్తం	7.3- 7.4	క్షారం
కన్నీరు	7.4	క్షారం

మాదిరి ప్రశ్నలు

1. ఒక మూలకంలోని పరమాణువులు ఒక దాంతో మరొకటి కలిసి పొడవైన గొలుసులు, వలయాలుగా ఏర్పడే ప్రక్రియను ఏమంటారు?
 1) రూపాంతరత (ఎల్లోట్రోపీ) 2) కాటినేషన్
 3) సాదృశ్యత 4) కార్బొనేషన్
2. కార్బన్ గరిష్ఠంగా ఎన్ని బంధాలను ఏర్పరచగలుగుతుంది?
 1) 4 2) 1 3) 2 4) 3
3. మంటలను ఆర్పివేసే యంత్రాల్లో ఉపయోగించే వాయువేది?
 1) కార్బన్ మోనాక్సైడ్
 2) కార్బన్ డై ఆక్సైడ్
 3) ఎసిటలీన్ 4) ఇథిలీన్
4. తాగే సోడాతో పాటు వివిధ రకాల శీతల పానీయాల్లో ఉపయోగించే వాయువు?
 1) CO 2) CO_2 3) O_2 4) N_2
5. కార్బన్ డై ఆక్సైడ్ నీటిలో కరిగి ఏర్పరిచే ఆమ్లం ఏది?
 1) హైడ్రోక్లోరికామ్లం 2) సల్ఫ్యూరికామ్లం
 3) కార్బోనికామ్లం 4) ఫార్మికామ్లం
6. కింద పేర్కొన్న ఏ ప్రక్రియలో బొగ్గుపులుసు వాయువు (కార్బన్ డై ఆక్సైడ్) ఉత్పత్తి కాదు?
 1) దహన క్రియ 2) శ్వాసక్రియ
 3) కిణ్వప్రక్రియ 4) కిరణజన్యసంయోగక్రియ
7. చక్కెర నుంచి ఆల్కహాల్‌ను తయారుచేసే విధానంలో ఇమిడి ఉన్న ప్రక్రియ ఏది?
 1) కిణ్వప్రక్రియ 2) దహన ప్రక్రియ
 3) జీర్ణక్రియ 4) భర్జనం
8. గ్రాఫైట్‌లో కార్బన్ పరమాణువులు ఏ అమరికలో ఉంటాయి?
 1) టెట్రాహైడ్రల్ 2) షట్కోణాకృతి వలయాలు
 3) పంచకోణాకృతి వలయాలు
 4) పంచ షట్కోణాకృతి వలయాలు
9. కింది వాటిలో దేనికి ఫుట్‌బాల్ లాంటి నిర్మాణం ఉంటుంది?
 1) గ్రాఫైట్ 2) వజ్రం
 3) బక్‌మినిస్టర్ ఫుల్లరీన్ 4) బ్యూటేన్
10. కిందివాటిలో ద్వి బంధం ఉన్న పదార్థం ఏది?
 1) ఎసిటలీన్ 2) ఇథిలీన్
 3) ఈథేన్ 4) ప్రొపేన్
11. కింది వాటిలో త్రిబంధాన్ని కల్గి ఉన్న సమ్మేళనం ఏది?
 1) ఎసిటలీన్ 2) ఈథేన్
 3) బెంజీన్ 4) మీథేన్
12. పెట్రోలియం అనేది ప్రధానంగా దేని మిశ్రమం?
 1) ఆల్కేన్లు 2) ఆల్కీన్లు
 3) ఆల్కైన్లు 4) ఆల్కహాల్
13. అత్యంత పురాతనమైన బొగ్గు రకం ఏది?
 1) ఆంథ్రసైట్ 2) బిట్యుమినస్
 3) లిగ్నైట్ 4) పీట్
14. ఆంథ్రసైట్ బొగ్గులో కార్బన్ శాతమెంత?
 1) 70% 2) 82% 3) 95% 4) 100%
15. సూర్యశక్తి గిద్దంగులు అని వేటికి పేరు?
 1) అణు రియాక్టర్లు 2) థర్మల్ ప్లాంట్లు
 3) సోలార్ ప్యానెల్‌లు 4) బొగ్గు నిక్షేపాలు
16. పారాఫిన్ మైనం అనేది ఒక -
 1) సంతృప్త హైడ్రోకార్బన్ 2) ఫాటీ ఆమ్లం
 3) అసంతృప్త హైడ్రోకార్బన్ 4) ఫాటీ ఆల్కహాల్
17. జతపరచండి.
 ఎ) మీథేన్ 1. C_4H_{10}
 బి) ఈథేన్ 2. CH_4
 సి) ప్రొపేన్ 3. C_2H_6
 డి) బ్యూటేన్ 4. C_3H_8


	ఎ	బి	సి	డి
1)	1	2	3	4
2)	4	2	3	1
3)	2	4	1	3
4)	2	3	4	1

18. కిందివాటిలో సరికాని జత ఏది?
 1) ఇథిలీన్ $-C_2H_4$ 2) ఎసిటలీన్ $-C_2H_2$
 3) బెంజీన్ $-C_6H_6$ 4) మీథేన్ $-C_2H_6$
19. LPG ప్రధానంగా దేన్ని కలిగి ఉంటుంది?
 1) మీథేన్ 2) ఈథేన్
 3) ప్రొపేన్ 4) బ్యూటేన్
20. కిందివాటిలో దేనిలో మీథేన్ ప్రధాన అనుఘటకంగా ఉంటుంది?
 1) సహజవాయువు 2) గోబర్ గ్యాస్
 3) 1, 2 4) ఏదీకాదు

సమాధానాలు

1) 2; 2) 1; 3) 2; 4) 2; 5) 3;
6) 4; 7) 1; 8) 2; 9) 3; 10) 2;
11) 1; 12) 1; 13) 1; 14) 3; 15) 4;
16) 1; 17) 4; 18) 4; 19) 4; 20) 3;

Who is sitting fourth to the right of Kavitha?



Model Questions

Directions (Q.No.1-5): Study the following information and answer the given questions:

Vamsi, Prem, Suma, Kavitha, Ravi, and Kiran are sitting in a single row having eight seats. Three of them are facing towards north and three are facing towards south. Two seats are vacant but neither of the extreme ends is vacant. No person is sitting to the right side of Kiran. Neither Vamsi nor Kiran is the immediate neighbour of the seats that are vacant. Prem is sitting third to the right of Vamsi, who is facing towards north. Those people who are sitting to the either side of the vacant seats are facing in opposite directions. No two consecutive seats are vacant. Neither Suma nor Ravi is sitting at any of the extreme ends. Those who are sitting at the extreme ends are facing in the same direction. Ravi is sitting third to the left of Suma, who is facing towards north. Only two people are sitting between the seats that are vacant and both of them face the same direction.

1. Who among the following sit at the corner?
 a) Kiran b) Vamsi c) Prem
 d) Suma e) Ravi
2. Who is sitting fourth to the right of Kavitha?
 a) Vamsi b) Prem c) Suma
 d) Kiran e) None of these
3. Who is sitting third to the left of Kiran?
 a) Prem b) Ravi c) Suma
 d) No one
 e) None of these
4. Which of the following statement regarding Prem is true?
 a) Prem is facing towards south
 b) Immediate seats neighboring to Prem are vacant
 c) Prem is sitting second to the right of Ravi
 d) Prem is sitting between Ravi and Kiran
 e) Prem is facing towards north.
5. How many person(s) are sitting between Vamsi and Suma?
 a) None b) One c) Two
 d) Three e) None of these

Directions (Q.No.6-10): Study the following information to answer the given questions:

There are 7 pairs of husband-wife among the following A1, A2, A3, A4, A5, A6, A7, A8, A9, A10, A11, A12, A13 and A14. They work in one of the seven Airways namely Indigo, Air India, British Airways, Emirates, Spice jet, Qatar Airways, and Lufthansa. The husband and wife live together in the same city. The following information is known about them:

- A8 is a female who lives in Nagpur and her husband works in Emirates.
- There's only one pair who work in the same Airways and they live in Agra.
- A7 is a male whose wife works in Spice jetAirways.
- A13 is the husband of the one working in Indigo and lives in Indore.
- A3 & A11 are males who live in Coimbatore & Surat respectively and are married to A4&A10 but not necessarily in the same order.
- A9, a male works in Indigo and lives in Ahmedabad and the female who works in Spicejet lives in Hyderabad.
- A2 & A14 are females and A5 is the husband of A12.
- A9's wife and A11 work in Air India.
- A6's husband works in Lufthansa Airways.
- A11's wife and A14's husband work in Qatar Airways.
- A10 works in Emirates.

6. A13 is working in which of the following Airways?
 a) Lufthansa
 b) Qatar Airways
 c) Air India d) Emirates
 e) can't be determined
7. Which of the following is correctly framed?
 a) Surat - A11 - A10 (Emirates)
 b) A3 (Spice jet) - Coimbatore - A10
 c) Hyderabad - A7 (Lufthansa) - A4 (Qatar Airways)
 d) Ahmedabad - A4 (Qatar Airways) - A3 (Spice jet)
 e) None of these
8. A2 lives in which of the following cities?
 a) Ahmedabad b) Hyderabad
 c) Indore d) Agra
 e) can't be determined
9. Who among the following works in Indigo Airways?
 a) A8 b) A14 c) A6
 d) Either (b) or (c)
 e) Either (a) or (b)
10. A9 and A10 are working in which of the Airways respectively?
 a) Emirates & Indigo
 b) British Airways & Spice jet
 c) Indigo & Emirates
 d) Qatar Airways & Air India
 e) None

Directions (Q.No.11-13): Study the following information to answer the given questions:

In a certain code,

'RING BANGLE MUD JAR' is written as '24#G, 12@R, 28$E, 26%D'

'JOKE BAN RADIO MONDAY' is written as ', 26@E, 16$N, 17#O, 8%Y'

'MOUNTAIN BEAR RANDOM JUMP' is written as '21%N, 13$R, 20#M, 15@P'

'JAM ROUND BAT MONEY' is written as '17@M, 28#D, 10$T, 7%Y'

11. What is the Code for 'BELOW'?
 a) 9*B b) 9#W c) 9@W
 d) 23$W e) None of these
12. What is the Code for 'MEETING'?
 a) '27%G' b) '24#T'
 c) '20$N' d) '14@M'
 e) None of these
13. What does '28#D 6@X 21%R' Stand for?
 a) BRAND SIX RETAILER
 b) ROUND BOX MANUFACTURER
 c) WORLD CLIMAX ZIPPER
 d) BOARD ICEBOX ADVANCER
 e) Cannot be determined.

Directions (Q.No.14-15): In each of the questions below are given two statements followed by two conclusions numbered I and II. You have to take the two given statements to be true even if they seem to be at variance with commonly known facts and then decide which of the given conclusions logically follows from the two given statements disregarding commonly known facts.

a) Either conclusion I or II follows.
b) Both conclusions I and II follow.
c) Neither conclusion I nor II follows.
d) Only conclusion II follows.
e) Only conclusion I follow.

14. **Statements:**
 Only worms are bugs
 Only a few worms are moths
 All moth are not fly.
 Conclusions:
 I. No fly is a worm.
 II. All moths being bugs is a possibility.
15. Statements:
 Some stars are planets. No planet is a moon.
 Conclusions:
 I. No star is a moon.
 II. Some stars are moons.

Key with Solutions

(1-5): Kiran ↓ Vamsi ↑ Ravi ↓ Vacant Prem ↑ Suma ↑ Vacant Kavitha ↓

1) a; 2) e; 3) d; 4) e; 5) c;

(6- 10):


Airways	Male	Female	Airways	City
Emirates	A1	A8	Lufthansa	Nagpur
Lufthansa/Qatar	A7	A6 / A14	Spice jet	Hyderabad
Qatar/Lufthansa	A13	A14 / A6	Indigo	Indore
Spice jet	A3	A10	Emirates	Coimbatore
Air India	A11	A4	Qatar	Surat
Indigo	A9	A2	Air India	Ahmadabad
British	A5	A12	British	Agra

6) e; 7) b; 8) a; 9) d; 10) c;


	LETTER	SYMBOL	NUMBER
(11- 13):	Last letter of the word.	If the first letter of the word is R => # B => $ M => % J => @	Sum of the opposite letter value of the last letter in the word from the right end and number of letters in the word.

11) e; 12) a; 13) e;


(14- 15):
14) d;



15) a;



(16- 19):



Step1: 5×3=15, 5×8=40 and then add 15+40=55
4×3=12, 2×6=12 and then add 12+12=24
1×8=8, 6×1=6 and then add 8+6=14

Step 2: Multiply the digits of first box 5×5=25 and multiply the answer with first digit of second box = 25×2=50. Multiply the digits of Third box 4×1=4 and multiply the answer with second digit of second box = 4×4=16.

Step 3: Adding both the digits of first box = 5+0=5 and square of 5 is 25. Adding both the digits of second box = 6+1=7 and square of 7 is 49.

Step 4: Add both 25+49=74.

16) c; 17) e; 18) e; 19) b;

20) e; It is given that Tej is walking facing the sun, but it is not given weather it is morning or evening so it is hard to conclude the direction which he is facing.